సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 84

శనివారం 15-6-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



పెరుగుతో వీటిని కలిపి తినకండి

నవపాకాలతో అన్నం వడ్డించినా, చివరలో పెరుగన్నం తినకుండా ఆ భోజనం పరిపూర్ణం అనిపించుకోదు. ఎందుకంటే పెరుగు తినడం ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తుందో అందరికీ తెలుసు. ముఖ్యంగా పెరుగు పొట్టకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ప్రోటీన్, కాల్షియం, ప్రోబయోటిక్స్ సమృద్ధిగా ఉండటం వల్ల పెరుగు వినియోగం ఆరోగ్యానికి చాలా మంచిది. కొందరు చాలా పదార్థాలను పెరుగుతో కలిపి తింటూ ఉంటారు. అయితే, పెరుగుతో కలిపి తినకూడని కొన్ని పదార్థాలు ఉన్నాయి. అవి తినడం ఆరోగ్య సమస్యలను కలిగిస్తుంది. పెరుగుతో ఎలాంటి ఆహారపదార్థాలు తినకూడదో... ఎందుకు తినకూడదో తెలుసుకుందాం.



పెరుగు, చేపల మిశ్రమం ఆరోగ్యానికి హానికరం. ఆయుర్వేదం ప్రకారం, చేప, పెరుగు వ్యతిరేక ప్రభావాన్ని కలిగి ఉంటాయి. వీటి కలయికతో చేసిన ఆహారాన్ని తీసుకోవడం శరీరంలో అసమతుల్యతను కలిగిస్తుంది. ఇది అలెర్జీలు, దద్దుర్లు, ఇతర సమస్యల వంటి చర్మ సమస్యలను కలిగిస్తుంది.

సిట్రస్ పండ్లు... పెరుగు: ఇప్పటికే కాస్త పుల్లగా ఉండి, నారింజ, నిమ్మ, ద్రాక్ష తదితర పుల్లని పండ్లతో కలిపి పెరుగు తింటే కడుపులో ఎసిడిటీ పెరుగుతుంది. ఇది జీర్ణ సమస్యలు, అసిడిటీ, కడుపు నొప్పిని కలిగిస్తుంది. పెరుగు, ఉడికించిన గుడ్డు కలిపి తీసుకోవడం మంచిది కాదు. ఈ రెండూ ప్రొటీన్‌కు మంచి మూలాధారాలు. అయితే వీటిని కలిపి తింటే జీర్ణవ్యవస్థపై ఒత్తిడి తెచ్చి, పొత్తికడుపులో భారాన్ని, గ్యాస్‌ను కలిగిస్తుంది.

ఉల్లిపాయ, పెరుగు: వీటి కలయిక జీర్ణవ్యవస్థను దెబ్బతీస్తుంది. కడుపులో చికాకు, గ్యాస్, ఇతర సమస్యలను కలిగిస్తుంది. **రాత్రిపూట పెరుగు తినడం ఆరోగ్యానికి మంచిది కాదు.** ఆయుర్వేదం ప్రకారం, రాత్రిపూట పెరుగు తినడం వల్ల కఫ దోషం పెరుగుతుంది. ఇది జలుబు, దగ్గు, కఫం వంటి సమస్యలకు దారితీస్తుంది.

పెరుగు, మామిడికాయల కలయిక రుచికరంగా ఉంటుంది. కానీ ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. మామిడి, పెరుగు కలిపి తీసుకోవడం వల్ల శరీరంలో విషపదార్థాలు ఏర్పడతాయి. ఇది జీర్ణ సమస్యలు, చర్మ సమస్యలకు దారితీస్తుంది.

ఆరోగ్యమే ఆనందం





అందమే ఆనందం... ఆనందమే జీవిత మకరందం అని ఒక సినిమా పాట ఉంది. అదెంత నిజమో ఆరోగ్యమే ఆనందం అనడం కూడా అంతే నిజం. ఇంకా చెప్పాలంటే అందంగా ఉండేవాళ్లు ఆరోగ్యంగా ఉంటారో లేదో చెప్పలేం కానీ, ఆరోగ్యంగా ఉండేవాళ్లు మాత్రం ఆటోమాటిగ్గానే అందంగా కనిపిస్తారు. అందం మన శరీర ఆకృతి మీద ఆధారపడితే, ఆకృతి అనేది శరీర పోషణ మీద, ఆహారపు అలవాట్లమీద, జీవన శైలి మీదా ఆధారపడి ఉంటుంది. శరీర పోషణ మీద తగిన శ్రద్ధ చూపిస్తూ, క్రమబద్ధంగా వ్యాయామాలు చేస్తూ ఉంటే ఎప్పుడూ అందంగా ఆరోగ్యంగా యవ్వనంగా కనిపిస్తారు. అదెలాగో చూద్దాం.





ఆహారం విషయంలో... శరీరాకృతి విషయంలో క్రమశిక్షణను పాటిస్తే దీర్ఘకాలం పాటు ఎవరికి వాళ్లు మేలు చేసుకున్న వాళ్లవుతారు. ముందు నుంచి ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకుంటే వృద్ధాప్యంలో కూడా ఆరోగ్యంగా ఉండగలుగుతారు. జబ్బులేమీ జోలికి రావు. మీరు ఏమి తింటున్నారు, ఎలా జీవిస్తున్నారు అన్నదాని మీద మీరు ఎలా కనిపిస్తున్నారు, ఎలా ఫీలవుతున్నారనేది ఆధారపడి ఉంటుంది. ఆరోగ్యంగా వుంటే ఆనందకరమైన జీవితాన్ని గడపగలుగుతారు.

మీ శరీరపు బ్యాటరీని రీఛార్జ్ చేయటానికి, మీ కండరాలలో శక్తిని పెంపొందించటానికి, జబ్బులన్నింటి దూరంగా ఉండటానికి పెద్దగా కష్టపడి పోవాల్సిన పనేం లేదు. కొద్దిపాటి ఆరోగ్య సూత్రాల్ని పాటిస్తే చాలు. అవేంటో చూద్దామా?

తీసుకునే ఆహారంలో కొన్ని సర్దుబాట్లు చేసుకోవటం, ఎక్సర్‌సైజుల్ని చేయటానికి సమయాన్ని కేటాయించటం, జీవితపు వొత్తిడిల నుంచి రిలాక్స్ కావటానికి ప్రయత్నించటం వంటివి చాలు.



ఆరోగ్యంగా తినాలి

మన శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచటానికి కొవ్వు కూడా అవసరమే. అయితే మనలో చాలామంది శరీరానికి అవసరమైన దాని కంటే 30 శాతం కొవ్వును అధికంగా కలిగి ఉంటున్నారని ఒక అంచనా. అలాంటి హెచ్చు తగ్గుల్ని నివారించటం కోసం ఆహారంలో సమతుల్యాన్ని పాటించటం చాలా అవసరం. ఇందుకోసం...

- రోజూ మీరు తీసుకునే కాయగూరల్లో, ఆకుకూరల్లో వైవిధ్యాన్ని పాటించాలి. కాఫీ, టీ వంటి వాటి విషయంలో మితాన్ని పాటించటం.
- దాహం గలిగినన్ని మంచినీళ్లను తాగాలి.
- రోజుకు 900 కాలరీల లోపు గల ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి.

ఫిట్‌నెస్‌కి ప్రాధాన్యత

శరీరం తగినంత ఫిట్‌నెస్‌లో ఉంటే అనారోగ్యం తొందరగా దరిచేరదు. బాడీ అలా ఫిట్‌నెస్‌తో ఉండాలంటే క్రమం తప్పకుండా వ్యాయామాలు చేయాలి. ఎక్సర్‌సైజుల మూలంగా గుండె కండరాలు బలపడతాయి. శరీరంలో రక్తసరఫరా సాఫీగా జరుగుతుంది. రక్తంలో కొలెస్ట్రాల్ తగ్గుతుంది. శరీరం బరువు ఉండాల్సిన రీతిలో ఉంటుంది. ఇవన్నీ టెన్షన్ తగ్గించే అంశాలు. ఎక్సర్‌సైజులంటే – నడక, సైకిలింగ్, ఈత మొదలైనవి ఏవైనా సరే. దీనిని మాత్రం ప్రోగ్రాముగా నిదానంగా ప్రారంభించాలి. క్రమక్రమంగా పెంచుకుంటూ పోవాలి. అంతే తప్ప తొందరపడి ప్రారంభంలోనే అతిగా చేయకూడదు.



- **పోషకవిలువలు**

శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే 13 ముఖ్య విటమిన్లు, 25 ఖనిజ లవణాలు మనం తీసుకునే ఆహారంలో తగు పరిమాణంలోలభించాలి కాబట్టి సమీకృత ఆహారాన్ని తీసుకోవాలి.

- **ధూమపానం, మద్యపానాలకు స్వస్తి:** పొగ తాగేవాళ్ళకు, మద్యం సేవించే వాళ్లకు గుండెజబ్బులు, కిడ్నీ వ్యాధులు రావటానికి రెట్టింపు అవకాశాలున్నాయి కాబట్టి ఈ రెండు అలవాట్లూ ఉన్న వాళ్ల వాటిని మానుకోవటం మంచిది. ప్రారంభంలో కొంచెం కష్టం కావచ్చు గాని గట్టిగా సంకల్పించుకుంటే అసంభవం మాత్రం కాదు కదా...

- **మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలి**

రోజుకి అరగంట కాలాన్ని మనస్సు ప్రశాంత పరచుకోవటానికి కేటాయించాలి. మంచి పుస్తకాన్ని చదవటం, ధ్యానం, సంగీతం వినడం వంటి వాటి ద్వారా మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలి. గతంలో జరిగిన తప్పులు, పొరపాట్లు, అపజయాల గురించి ఆలోచించకుండా భవిష్యత్తువట్ల ఆశావహ దృక్పథంతో వర్తమానంలో జీవించాలి.

- **శరీరం చెప్పేది వినాలి**

ఆఖరుగా ఆరోగ్యంగా ఉండాలంటే శరీరం చెప్పే దానిని వినాలి. శరీరం ఏ ఇబ్బందికి గురవుతున్నా – అంటే అస్వస్థతలకు గురవుతున్నా మనకు కొన్ని సూచనలను అందిస్తుంది. జ్వరం, నొప్పి, దగ్గు, వాంతులు, విరోచనాలు, ఇలాంటి లక్షణాల ద్వారా శరీరంఅనారోగ్య సూచనలను వెలువరిస్తుంటుంది. అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించి, వారి సూచనల మేరకు శరీరాన్ని కండిషన్‌లోకి తెచ్చుకోవడం ఎవరికి వారు అనుసరించి తీరాల్సిన కర్తవ్యం.

జుట్టు రాలడం... బరువు తగ్గడం
జింక్ లోపం కావచ్చు!

మన శరీరానికి జింక్ చాలా అవసరం. మనం తినే ఆహారంలో చాలా పరిమిత పరిమాణంలో మాత్రమే జింక్ లభిస్తుంది. శరీరం జింక్‌ను నిల్వ చేసుకోదు. అందుకే జింక్ లభించే ఆహారాన్ని రోజూ తినాలి. జింక్ లోపిస్తే శరీరంలో చాలా మార్పులు జరుగుతాయి. రోగనిరోధక శక్తి తగ్గిపోతుంది. జింక్ లోపాన్ని కొన్ని లక్షణాల ద్వారా తెలుసుకోవచ్చు.

గాయాలు నయం కాకపోవడం: చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచేందుకు, గాయాలైనప్పుడు రక్తం త్వరగా గడ్డ కట్టేలా చేసేందుకు జింక్ చాలా అవసరం. జింక్ లోపం ఏర్పడినప్పుడు గాయాలు తగిలినా అవి త్వరగా నయం కావు. అంతేకాదు ముఖంపై మొటిమలు వస్తాయి.

బరువు తగ్గడం: జింక్ లోపం వల్ల జీర్ణక్రియలో మార్పులు వస్తాయి. ఆకలి మందగిస్తుంది. ఆహారం తినాలనిపించదు. ఫలితంగా బరువు తగ్గిపోతారు. ఇలా పోషకాల లోపం వల్ల బరువు తగ్గడంతోపాటు అనేకమైన ఇతర ఆరోగ్యసమస్యలూ ఉత్పన్నమవుతాయి.

జుట్టు రాలడం: జింక్ లోపం వల్ల జుట్టు చిట్లడం, రాలడం అధికమవుతుంది కాబట్టి అకారణంగా జుట్టు రాలుతున్నా, జుట్టు పలుచబడుతున్నా జింక్ లోపమేమో అనుమానించాలి. దానికి సంబంధించిన సప్లిమెంట్స్ తీసుకుని సమస్య సద్దుమణిగితే నిశ్చింతగా ఉండవచ్చు.

తరచూ జలుబు: జింక్ తగ్గితే రోగనిరోధక శక్తి తగ్గిపోతుంది. దానివల్ల తరచూ జలుబు, దగ్గు, ఇన్ఫెక్షన్ల బారిన పడే అవకాశం ఎక్కువ. తరచూ మీకు జలుబు చేస్తున్నా, అనారోగ్యం బారిన పడుతున్నా జింక్ లోపం ఉందేమో చూసుకోవాలి. జింక్ తగినంత అందితే జలుబు త్వరగా తగ్గుతుంది.



అకారణంగా జుట్టు రాలుతున్నా, బరువు తగ్గుతున్నా, గాయాలు త్వరగా నయం కాకపోతున్నా జింక్ లోపంగా అనుమానించాలి. ఇదే కాదు, శరీరంలో జింక్ లోపం ఉన్నప్పుడు ఇంకా ఎలాంటి లక్షణాలు ఉంటాయో, నివారణకు ఏం చేయాలో తెలుసుకుందాం.

చూపు మసక బారడం: ఆరోగ్యకరమైన చూపుకు జింక్ చాలా అవసరం. శరీరానికి తగినంత జింక్ అందనప్పుడు దృష్టి మందగిస్తుంది. చూపు మసకగా కనిపిస్తుంది. అస్పష్టంగా అనిపిస్తుంది. జింక్, విటమిన్ ఎ ఆరోగ్యకరమైన చూపును ఇస్తాయి.

అయోమయం: మీకు మనసు, ఆలోచనలు గందరగోళంగా ఉన్నాయా? అయితే జింక్ లోపం ఉందేమో చూసుకోండి. జింక్ తగినంత అందకపోతే మెదడు సరిగా పనిచేయదు. పనిపై ఏకాగ్రత కుదరదు. జ్ఞాపకశక్తి సమస్యలకు కూడా తలెత్తుతాయి.

సంతానోత్పత్తిపై ప్రభావం: జింక్ లోపం పురుషులకు చాలా ఇబ్బందిని కలిగిస్తుంది. దీని వల్ల పురుషుల సంతానోత్పత్తి ప్రభావితమవుతుంది. మీరు తండ్రి కావాలనుకుంటే తప్పనిసరిగా జింక్ తీసుకోవడంపై శ్రద్ధ వహించాలి. తగినంత పరిమాణంలో జింక్ తీసుకోని పురుషులు తండ్రి కావడానికి చాలా సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది.

రోగనిరోధక శక్తి బలహీనం: శరీరానికి సంబంధించి అనేక విధులకు జింక్ అవసరమవుతుంది. ఇది రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. మళ్లీ మళ్లీ అనారోగ్యం బారిన పడకుండా కాపాడుతుంది. కానీ మీ శరీరంలో జింక్ లోపం ఉంటే అది రోగనిరోధక శక్తిని బలహీనపరుస్తుందని గుర్తుంచుకోండి.

ఇలా నివారించాలి: జింక్ లోప నివారణకు శనగలు, గింజ ధాన్యాలు, పుచ్చగింజలు, జనపనార గింజలు, ఓట్స్, జీడిపప్పు, పెరుగు, డార్క్ చాకొలెట్లలో జింక్ పుష్కలంగా లభిస్తుంది కాబట్టి జింక్ లోపం ఉన్నవారు ఈ ఆహార పదార్థాలు తీసుకోవడం ఉత్తమం.

కన్నప్ప కథని కృష్ణంరాజు ఇచ్చారు - మోహన్‌బాబు



● ప్రీతి, విష్ణు, శరత్ కుమార్, మోహన్‌బాబు, ముఖేష్ కుమార్

''కన్నప్ప' సినిమా ప్రారంభానికి ముందు కృష్ణంరాజుగారిని కలిశాను. విష్ణు కోసం 'కన్నప్ప' మూవీ తీయాలనుకుంటున్నానని చెప్పాను. ప్రభాస్ కోసం రాసుకున్న ఈ కథను ఆయన మాకు ఇచ్చారు'' అని నటుడు, నిర్మాత మంచు మోహన్‌బాబు అన్నారు. విష్ణు మంచు లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్‌బాబు, శరత్ కుమార్, కాజల్ అగర్వాల్, మధుబాల, ప్రీతీ ముకుందన్ కీలక పాత్రల్లో నటించారు. అవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకాలపై డా. మోహన్ బాబు నిర్మించారు. శుక్రవారం ఈ మూవీ టీజర్ రిలీజ్ వేడుకలో మోహన్‌బాబు మాట్లాడుతూ– ''కన్నప్ప' కేవలం భక్తి చిత్రమే కాదు.. అన్ని రకాల అంశాలుంటాయి. పరమేశ్వరుడు ఇచ్చిన ఆజ్ఞతోనే ఈ సినిమా తీశాం. మా టీమ్‌కి అందరి ఆశీస్సులు కావాలి'' అన్నారు. విష్ణు మంచు మాట్లాడుతూ– ''2014లో 'కన్నప్ప' ప్రయాణం ప్రారంభమైంది. మోహన్‌బాబు గారు, విన్ని, వినయ్ ఇచ్చిన ప్రోత్సాహం, శివుడి అనుమతి వల్లే 'కన్నప్ప'ను తెరపైకి తీసుకురాగలిగాను. బడ్జెట్ గురించి ఆలోచించలేదు. చరిత్రలో నిలిచిపోయే సినిమా తీస్తున్నామని ముందుకు వెళ్లాం. ఇకపై ప్రతి సోమవారం ఈ మూవీ నుంచి అప్‌డేట్ వస్తూనే ఉంటుంది'' అన్నారు. ''మనం దేవుడి దగ్గరకు వెళ్లి కోరికలు కోరతాం. కానీ ఏం కోరకుండా దేవుడికే నేత్రాలను సమర్పించారు కన్నప్ప. అలాంటి గొప్ప భక్తుడి కథను చెప్పాం'' అన్నారు ముఖేష్ కుమార్ సింగ్. ''కన్నప్ప' కేవలం సినిమా కాదు... మన చరిత్ర'' అన్నారు శరత్ కుమార్. మధుబాల, ప్రీతీ ముకుందన్ కూడా మాట్లాడారు.

నా ముందు సైలెంట్‌గా ఉండాలి!



● శ్రీలీల

తెలుగు చిత్ర పరిశ్రమలో బిజీగా దూసుకెళుతున్నారు యంగ్ బ్యూటీ శ్రీలీల. ప్రస్తుతం నితిన్‌తో 'రాబిన్‌హుడ్', రవితేజ 'ఆర్‌టీ 75' (వర్కింగ్ టైటిల్) వంటి చిత్రాల్లో నటిస్తున్నారు. కాగా శుక్రవారం (మే 14) శ్రీలీల బర్త్‌డే. ఈ సందర్భంగా పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ 'రాబిన్‌హుడ్'లో ఆమె చేస్తున్న లేడీ బాస్ నీరా వాసుదేవ్ పాత్ర లుక్, టీజర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ''జ్యోతీ... సునామీలో టి సైలెంట్ ఉండాలి... నా ముందు నువ్వు సైలెంట్‌గా ఉండాలి' అంటూ శ్రీలీల చెప్పిన డైలాగ్ టీజర్‌లో ఉంది. 'ఎక్స్‌ట్రాఆర్డినరీ మ్యాన్' (2023) చిత్రం తర్వాత హీరో నితిన్, హీరోయిన్ శ్రీలీల రెండోసారి జోడీగా నటిస్తున్న చిత్రం 'రాబిన్‌హుడ్'. వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రాజేంద్ర ప్రసాద్, 'వెన్నెల' కిశోర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. 'యునిక్ యాక్షన్, ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా 'రాబిన్‌హుడ్' రూపొందుతోంది. ఈ చిత్రంలో నితిన్ పాత్రకు శ్రీలీల పాత్ర పూర్తి భిన్నంగా ఉంటుంది. వారి పాత్రలు రాయడంలో వెంకీ కుడుముల స్పెషల్ కేర్ తీసుకున్నారు. క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 20న మా సినిమా విడుదల కానుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.


మీకు ఏం గుర్తొస్తుంది?



● శ్రీవిష్ణు

'మగాడంటే మీకు ఏం గుర్తొస్తుంది' అని శ్రీవిష్ణు చెప్పే డైలాగ్‌తో 'శ్వాగ్' మూవీ టీజర్ రిలీజ్ అయింది. శ్రీవిష్ణు హీరోగా నటించిన ఈ చిత్రంలో రీతూ వర్మ, మీరా జాస్మిన్, దక్ష నగార్కర్, శరణ్య ప్రదీప్, సునీల్, రవిబాబు కీలక పాత్రల్లో నటించారు. హసిత్ గోలి దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వ ప్రసాద్ ఈ సినిమా నిర్మించారు. ఈ చిత్రంలోని అన్ని ప్రధాన పాత్రలను పరిచయం చేసిన మేకర్స్ శుక్రవారం టీజర్‌ని రిలీజ్ చేశారు. 'ఆడవాళ్లని ఏం అడుక్కోనక్కర్లేదు... మగవాడినే అనుసరించాలి. వంశాలైనా, అన్నలైనా, ఆడవాళ్లయినా..' అంటూ శ్రీవిష్ణు చెప్పే డైలాగులు ఈ టీజర్‌లో ఉన్నాయి. ''వైట్ అండ్ వైట్ ఎంటర్‌టైనర్‌గా 'శ్వాగ్' రూపొందింది. శ్రీవిష్ణు హిలేరియస్ రోల్‌లో కనిపించనున్నారు. త్వరలో సినిమాని విడుదల చేస్తాం'' అన్నారు మేకర్స్.

సింగమ్ వాయిదా



● అజయ్ దేవగన్


ఈ దీపావళికి బాలీవుడ్ సింగమ్‌లా మరోసారి థియేటర్స్‌కు రానున్నారు అజయ్ దేవగన్. హిందీ 'సింగమ్' ఫ్రాంచైజీలో వచ్చిన 'సింగమ్ (2011), సింగమ్ రిటర్న్స్' (2014) తర్వాత హీరో అజయ్ దేవగన్, దర్శకుడు రోహిత్ శెట్టి కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'సింగమ్ ఎగైన్'. అక్షయ్ కుమార్, రణ్‌వీర్ సింగ్, అర్జున్ కపూర్, టైగర్ ష్రాఫ్, జాకీ ష్రాఫ్, కరీనా కపూర్, దీపికా పదుకోన్ ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. అజయ్ దేవగన్, జ్యోతిదేశ్ పాండే, రోహిత్ శెట్టి నిర్మిస్తున్న 'సింగమ్ ఎగైన్' చిత్రాన్ని తొలుత ఆగస్టు 15న విడుదల చేయాలనుకున్నారు. కానీ చిత్రీకరణ ఇంకా పూర్తి కాకపోవడంతో వాయిదా వేశారట. దీపావళికి విడుదల చేయనున్నట్లు మేకర్స్ శుక్రవారం అధికారికంగా ప్రకటించారు.

యువర్ ఫిల్మ్ కాంటెస్ట్ లక్ష్యం అదే - రామ్‌గోపాల్ వర్మ



''చిత్ర పరిశ్రమలోకి రావాలనుకునే యువ ప్రతిభావంతులను ప్రోత్సహించడమే తమ 'ఆర్జీవీ యువర్ ఫిల్మ్ కాంటెస్ట్' లక్ష్యం'' అన్నారు దర్శక–నిర్మాత రామ్‌గోపాల్ వర్మ. శుక్రవారం విలేకరుల సమావేశంలో రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ– ''నా మొదటి సినిమా 'శివ' అప్పుడు నా గురించి ఎవరికీ తెలియదు. ఆ చిత్రం హిట్టవ్వడం వల్లే నేనెవరో అందరికీ తెలిసింది. మా నాన్న అన్నపూర్ణ స్టూడియోలో సౌండ్ ఇంజినీర్ కాబట్టి ఇండస్ట్రీలోకి వచ్చేందుకు నాకు వీలు దొరికింది. కానీ ప్రతిభ ఉండి నాలాగా ఇంకా ప్రపంచానికి తెలియాల్సిన వారు ఎందరో బయట ఉన్నారు. అలాంటి వారికి ఇండస్ట్రీలో ఒక యాక్సెస్ ఇచ్చే ఉద్దేశంతో నిర్వహిస్తున్న కాంటెస్ట్ ఆర్జీవీ యువర్ ఫిల్మ్. ఈ కాంటెస్ట్‌కి వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 400 ఎంట్రీలు వచ్చాయి. వీటిలో 11 షార్ట్ ఫిలింస్‌ని ఎంపిక చేశాం. వీటిని సోషల్ మీడియాలో పోల్‌కు పెట్టి ప్రేక్షకులు ఎక్కువ మంది బెస్ట్ డైరెక్టర్‌గా ఓటు వేసిన వారికి మా సంస్థలో చాన్స్ ఇస్తాం. డైరెక్టర్స్ అనే కాదు కెమెరా, మ్యూజిక్ డైరెక్షన్ ఇలా.. ప్రతి క్రాఫ్ట్‌లో ప్రతిభ ఉన్నవారిని ఎంపిక చేస్తున్నాం. సెలెక్ట్ అయిన వారి ప్రతిభను ముందుగా మా సంస్థలో ఉపయోగించుకోవాలనేది నా, నిర్మాత రవి స్వార్థం'' అన్నారు. నిర్మాత రవి కూడా పాల్గొన్నారు.


విశ్వంభరలో...



● కునాల్ కపూర్

'విశ్వంభర' ప్రపంచంలోకి వచ్చాడు బాలీవుడ్ నటుడు కునాల్ కపూర్. చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో రూపొందుతున్న ఫ్యాంటసీ యాక్షన్ అడ్వెంచరస్ మూవీ 'విశ్వంభర'. యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న చిత్రం ఇది. ఇందులో త్రిష హీరోయిన్‌గా నటిస్తుండగా, ఆషికా రంగనాథన్ మరో లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. అలాగే హిందీలో 'రంగ్ దే బసంతి, డాన్ 2, డియర్ జిందగీ' వంటి సినిమాల్లో నటించిన కునాల్ కపూర్ 'విశ్వంభర'లో ఓ కీలక పాత్రలో నటిస్తున్నట్లుగా చిత్రబృందం శుక్రవారం ప్రకటించింది. ఈ చిత్రం వచ్చే సంక్రాంతి సందర్భంగా జనవరి 10న విడుదల కానున్న సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే... నాగార్జున, నాని కాంబినేషన్‌లో రూపొందిన 'దేవదాస్' (2018)లో కునాల్ నటించారు. నాలుగేళ్లకు తెలుగులో 'విశ్వంభర' కమిట్ అయ్యారు.

స్త్రీ సీక్వెల్ సిద్ధం



● శ్రద్ధా కపూర్, రాజ్‌కుమార్ రావు

బాలీవుడ్ బాక్సాఫీస్ హిట్ ఫిల్మ్ 'స్త్రీ' సీక్వెల్ విడుదలకు సిద్ధమైంది. రాజ్‌కుమార్ రావు, శ్రద్ధా కపూర్ లీడ్ రోల్స్‌లో నటించిన కామెడీ హారర్ ఫిల్మ్ 'స్త్రీ'. అమర్‌కౌశిక్ దర్శకత్వంలో 2018లో విడుదలైన ఈ సినిమా ఘనవిజయం సాధించింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'స్త్రీ 2' రూపొందింది. తొలి భాగంలో నటించిన రాజ్‌కుమార్ రావు, శ్రద్ధా కపూర్, పంకజ్ త్రిపాఠి, అభిషేక్ బెనర్జీ సీక్వెల్‌లోనూ నటించారు. అమర్ కౌశిక్‌యే దర్శకత్వం వహించారు. దినేష్ విజన్, జ్యోతిదేశ్ పాండే ఈ సినిమాను నిర్మించారు. తొలుత 'స్త్రీ 2'ని ఆగస్టు 31న విడుదల చేస్తున్నట్లుగా ప్రకటించారు మేకర్స్. అయితే ఓ 15 రోజుల ముందే ఆగస్టు 15న విడుదల చేయనున్నట్లుగా శుక్రవారం వెల్లడించారు.

స్పీల్‌బర్గ్ డైరెక్షన్‌లో...



● ఎమిలీ బ్లంట్

'ది ఫాబెల్‌మ్యాన్స్' (2022) చిత్రం తర్వాత హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బర్గ్ తదుపరి చిత్రం గురించి ఇంకా ఎలాంటి ప్రకటన రాలేదు. అయితే స్పీల్‌బర్గ్ తర్వాతి సినిమా గురించి అతి త్వరలోనే కొత్త కబురు వినిపించనుందని హాలీవుడ్ టాక్. హాలీవుడ్ ప్రముఖ నటి ఎమిలీ బ్లంట్ లీడ్ రోల్‌లో స్పీల్‌బర్గ్ ఓ సినిమాను ప్లాన్ చేస్తున్నారట. ఈ సినిమా గురించి ఎమిలీతో చర్చించారట కూడా. త్వరలోనే ఈ సినిమా గురించి అధికారిక ప్రకటన రానుందని టాక్. ఓ వాస్తవ ఘటన నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాను 2026 వేసవిలో విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నారట స్పీల్‌బర్గ్.

బాల్యం గొప్పది



నటి, నిర్మాత నిహారిక కొణిదెల సమర్పణలో తెరకెక్కిన చిత్రం 'కమిటీ కుర్రోళ్ళు'. యదు వంశీ దర్శకత్వం వహించిన ఈ మూవీలో సాయికుమార్, సందీప్ సరోజ్, యశ్వంత్ పెండ్యాల, ఈశ్వర్ రాచిరాజు, ప్రసాద్ బెహరా, రాధ్య, తేజస్వి రావు, టీనా శ్రావ్య, విషిక లీడ్ రోల్స్‌లో నటించారు. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్ఎల్‌పీ, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్స్‌పై పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మించారు. ఈ మూవీ టీజర్‌ని హీరో నితిన్ సోషల్ మీడియా వేదికగా విడుదల చేసి, యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ''యువత అయినా, పెద్దవాళ్లైనా ఏదో ఒక సందర్భంలో చిన్నతనమే బాగుందని అనుకుంటుంటారు. ఎలాంటి పొరపాట్లు, అడ్డుగోడలు, బాధలు లేకుండా స్నేహితులతో కలిసి సరదాగా గడిపే బాల్యమే ఎంతో గొప్పది. ఈ పాయింట్ ఆధారంగా చేసుకుని నిర్మించిన చిత్రం 'కమిటీ కుర్రోళ్ళు'. ప్రస్తుతం మా సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే మూవీ విడుదల చేస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది.


'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 22 వెల: ₹ 5.50

బాప్ రే బాప్..

వర్చువల్ కిడ్నాప్



హైదరాబాద్‌లో కొత్త తరహా సైబర్ నేరాలు

సోషల్ మీడియా నుంచి వివరాల సేకరణ..

అధ్యయనం చేశాక 'పని' మొదలు

పిల్లలు అందుబాటులో ఉండని సమయం చూసి తల్లిదండ్రులకు ఫోన్లు

కిడ్నాప్ చేశాం, వెంటనే డబ్బు పంపాలంటూ బెదిరింపులు

భయపడి సొమ్ము ట్రాన్స్‌ఫర్ చేస్తున్న తల్లిదండ్రులు

తర్వాత తమవారు క్షేమంగానే ఉన్నట్టు గుర్తించి అవాక్కవుతున్న తీరు

బోగస్ పేర్లు, ఐడీలతో బ్యాంకు ఖాతాలు, సిమ్‌కార్డులు

కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినా దొరకని సైబర్ దొంగలు


➤ పాతబస్తీకి చెందిన ఓ యువతి ఇంట్లోంచి బయటికి వెళ్లింది. అదే సమయంలో ఆమె తల్లిదండ్రులకు ఓ వ్యక్తి ఫోన్ చేసి.. మీ కుమార్తెను కిడ్నాప్ చేశామని, తక్షణమే డబ్బు ఇవ్వకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని భయపెట్టాడు. దీంతో తల్లిదండ్రులు ఫోన్ చేసిన వ్యక్తి చెప్పిన అకౌంట్‌కు రూ.12 వేలు ట్రాన్స్‌ఫర్ చేశారు. అయితే యువతి కిడ్నాప్ కాలేదని, ఆ ఫోన్ కాల్ తప్పుడుదని తేలింది

➤ హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పశ్చిమ మండలం పరిధిలోని ఓ పోలీసుస్టేషన్‌లో పనిచేసే సబ్-ఇన్‌స్పెక్టర్‌కు గత వారం ఫోన్‌కాల్ వచ్చింది. ఓ వ్యక్తి 'మీ కుమార్తెను కిడ్నాప్ చేశాం' అన్నాడు. అప్రమత్తమైన ఆయన.. తొలుత తమ కుమార్తె వివరాలు ఆరా తీశారు. ఆమె సురక్షితంగా ఉన్నట్లు గుర్తించి, తప్పుడు ఫోన్‌కాల్‌గా తేల్చుకున్నారు.

..సైబర్ నేరగాళ్లకు కొత్త అస్త్రంగా మారుతున్న 'వర్చువల్ కిడ్నాప్' ఉదంతాలకు ఉదాహరణలు ఇవి. బాధితుల అత్యాశ, భయం, బలహీనతలను ఆధారంగా చేసుకుని రెచ్చిపోయే సైబర్ నేరగాళ్లు కొత్తగా మొదలుపెట్టినవే ఈ కిడ్నాప్ కాని కిడ్నాపులు. సోషల్ మీడియాలో పోస్టులను గమనించడం ద్వారా.. ఎదుటి వారి వ్యక్తిగత విషయాలు తెలుసుకుని డబ్బులు దండుకునేందుకు అనుసరిస్తున్న సరికొత్త రూట్ ఇది. ఇలాంటి సైబర్ నేరగాళ్ల పట్ల నగరవాసులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

సాక్షి, హైదరాబాద్

కొన్నాళ్లు అధ్యయనం చేసి రంగంలోకి..



ఇటీవలికాలంలో సోషల్ మీడియా వినియోగం గణనీయంగా పెరిగిపోయింది. స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరికీ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ తదితర ఖాతాలు ఉంటున్నాయి. లైకులు, కామెంట్లు, ఫాలోవర్ల క్రేజ్‌లో చాలా మంది వ్యక్తిగత విషయాలు, ఇతర అంశాలనూ పోస్టు చేస్తున్నారు. తమ కుటుంబం, పిల్లల వివరాలు, అభిరుచులు, విద్య, ఉద్యోగం వంటివీ చెప్పేస్తున్నారు. సైబర్ నేరగాళ్లు ఇవన్నీ నిశితంగా గమనించి ఆయా అంశాల ఆధారంగా 'వర్చువల్ కిడ్నాప్' టార్గెట్స్‌ను ఎంచుకుంటున్నారు. వారిని సంప్రదించడానికి అవసరమైన ఫోన్ నంబర్‌ను సోషల్ మీడియా ద్వారానే సంపాదిస్తున్నారు.

'సరైన సమయం'లో ఫోన్లు చేస్తూ..



వివరాల సేకరణ పూర్తయ్యాక సైబర్ నేరగాళ్లు అసలు పని మొదలుపెడుతున్నారు. టార్గెట్ చేసిన వ్యక్తి సంతానం విద్యార్థులైతే పాఠశాలలు/కళాశాలల పనివేళలు, ఉద్యోగస్తులైతే వర్కింగ్ అవర్స్‌ను ఎంపిక చేసుకుంటున్నారు. టార్గెట్ చేసిన వ్యక్తులకు ఆ సమయాల్లో ఫోన్ చేసి, పిల్లల్ని కిడ్నాప్ చేశామని బెదిరిస్తున్నారు. ఎదుటివాళ్లు తేరుకునేందుకు, వెనుకా ముందు ఆలోచించేందుకు సమయం ఇవ్వకుండా భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. కిడ్నాప్ చేసిన వారిని వదిలిపెట్టాలంటే వెంటనే సొమ్మును బ్యాంక్ ఖాతాలు/యూపీఐ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. చాలా సందర్భాల్లో సైబర్ నేరగాళ్లు డిమాండ్ చేసేది కొంత మొత్తమే కావడంతో బాధితులు తొందరపడి ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారు. ఆపై అసలు విషయం తెలుసుకుని మోసపోయినట్టు గుర్తిస్తున్నారు. ఈ తరహా బాధితుల్లో చాలా వరకు కేసు పెట్టడానికి ముందుకురావడం లేదు కూడా.

బోగస్ పేర్లతో ఖాతాలు, సిమ్‌కార్డులు



వర్చువల్ కిడ్నాప్ నేరాలకు పాల్పడేవారు ఎట్టి పరిస్థితుల్లో తమ ఉనికి బయటపడకుండా జాగ్రత్త పడుతున్నారు. విషయం పోలీసుల వరకు వెళ్లినా దర్యాప్తులో ముందుకు వెళ్లకుండా వ్యవహరిస్తున్నారు. ఇతరుల పేర్లతో లేదా బోగస్ వివరాలతో ఓపెన్ చేసిన బ్యాంకు ఖాతాలు, సెల్‌ఫోన్ నంబర్లను వినియోగిస్తున్నారు.


మన భయమే వాళ్ల పెట్టుబడి..

వర్చువల్ కిడ్నాప్ వ్యవహారంలో బాధితుల భయాందోళనలే సైబర్ నేరగాళ్లకు వరంగా మారుతున్నాయి. పాతబస్తీకి చెందిన దంపతుల విషయమే తీసుకుంటే.. వారి కుమార్తె ఇంటి నుంచి బయటకు వెళ్లిన సమయంలో సైబర్ నేరగాడు ఫోన్ చేసి కిడ్నాప్ చేసినట్టు బెదిరించాడు. వారు భయపడి కుమార్తెను ఫోన్ ద్వారా సంప్రదించే ప్రయత్నం చేశారు. ఆమె నుంచి స్పందన లేకపోవడంతో అపహరణ జరిగిందని భయపడ్డారు. కనీసం ఫోన్ చేసిన వ్యక్తి ఎవరనిగానీ, అమ్మాయి వివరాలేమిటనిగానీ ఆరా తీయలేదు. సైబర్ నేరగాడు డబ్బు డిమాండ్ చేయగా.. తమ బ్యాంకు ఖాతాలో రూ.12 వేలే ఉన్నాయని చెప్పారు. ఆ మొత్తం పంపినా మీ కుమార్తెను వదిలేస్తామనడంతో.. వెంటనే సొమ్ము యూపీఐ చేశారు. ఈ రోజుల్లో కిడ్నాపర్ అంత చిన్న మొత్తానికి ఒప్పుకోవడం ఏమిటని కూడా ఆలోచించలేదు. తర్వాత హడావుడిగా పోలీసులను ఆశ్రయిస్తే.. అధికారులు యువతి లొకేషన్, ఇతర వివరాలు ఆరా తీసి సురక్షితంగానే ఉన్నట్టు తేల్చారు. దీంతో తల్లిదండ్రులు ఫిర్యాదు చేయకుండానే వెళ్లిపోయారు.

సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలు పెట్టొద్దు

"ఇటీవలి కాలంలో సోషల్ మీడియా వినియోగం గణనీయంగా పెరిగింది. వర్చువల్ కిడ్నాప్ తరహా ఉదంతాలకూ అదే కారణం. ఎవరికి వారు తమ వివరాలు, అలవాట్లు, చేస్తున్న పనులను పోస్టు చేస్తున్నారు. ఇది సైబర్ నేరగాళ్లకు కలిసి వస్తోంది. పార్ట్‌టైమ్ జాబ్స్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్‌తో పాటు అనేకరకాల సైబర్ నేరాలకు సోషల్ మీడియా ఖాతాలే ఆధారం అవుతున్నాయి. అందుకే వీలైనంత వరకు 'లీ లెస్ ఇన్ సోషల్ మీడియా' అన్నది పాటించాలి. సైబర్ నేరగాళ్లు ప్రలోభపెట్టినా, భయపెట్టినా వారి ట్రాప్‌లో పడకుండా జాగ్రత్తగా ఉండాలి.."


ఆర్‌జీ శివమారుతి, ఏసీపీ, హైదరాబాద్ సైబర్ క్రైమ్ రాణా



మీరు.. మీ.. క్షణం

డైలీ రొటీన్‌ను ఇలా ప్లాన్ చేయండి

- ఆరోగ్య భరోసానిచ్చే నిత్యకృత్యాలపై దృష్టి సారించండి
- అందుకు తగ్గట్లుగా మీ పని విధానం, అలవాట్లు మార్చుకోండి
- శారీరక, మానసిక, ఆరోగ్య సంరక్షణపై బీ కేర్‌ఫుల్
- పలు అధ్యయనాల పరిశోధనల్లో ఆసక్తికర అంశాలు వెల్లడి



10లో

ఓటీటీల యుగంలో హోమ్ థియేటర్ల నుంచి ఆడియన్స్‌ని సినిమా థియేటర్లకు రప్పించడానికి మల్టీప్లెక్స్‌లు రోజుకో కొత్త ఫెసిలిటీని నగరవాసులకు పరిచయం చేస్తున్నాయి.

'మల్టీ'ఫుల్



7లో



మాదాపూర్‌లోని హైటెక్స్‌లో శుక్రవారం ప్రారంభమైన
జాతీయ, అంతర్జాతీయ వెడ్డింగ్ ప్లానర్ల సమ్మేళనంలో వేరిణి నృత్య ప్రదర్శన

వివరాలు 11లో

GOOD INITIATIVE

20-30% విద్యుత్ ఆదా
30-40% నీరు ఆదా

సిటీ.. గో గ్రీన్

హరితభవనాలుగా నివాస, వాణిజ్య, కార్యాలయాలు

- స్కూళ్లు, ఐటీ టవర్లు, రైల్, మెట్రోస్టేషన్లు కూడా గ్రీన్‌గానే
- ప్రస్తుతం హైదరాబాద్‌లో 114 కోట్ల చదరపు అడుగుల్లో 890 ప్రాజెక్టులు
- పర్యావరణహితమైన నివాసాలకు నగరవాసుల మొగ్గు

స్వచ్ఛమైన గాలి.. ఫుల్ వెంటిలేషన్.. చుట్టూ ఆహ్లాదకరమైన పచ్చదనం.. ఇలా ప్రకృతితో కలిసి జీవించడం అంటే కాంక్రీట్ జంగిల్ లాంటి మహానగరంలో కష్టమే. స్థలాభావం, నిర్మాణ వ్యయం, నిర్వహణ భారం ఇలా కారణాలనేకం. కానీ కరోనా తర్వాత నివాసితుల అభిరుచి మారింది. ఇళ్లు, ఆఫీసు, షాపింగ్‌మాల్, మెట్రోరైల్.. ఇలా ఒకటేమిటి ప్రతిది హరితంగానే ఉండాలని కోరుకుంటున్నారు.

సాక్షి హైదరాబాద్



హరిత భవనాల్లో ఏముంటాయంటే..

సాధారణ భవనాలతో పోలిస్తే గ్రీన్ బిల్డింగ్స్‌తో 20-30 శాతం విద్యుత్, 30-40 శాతం నీరు ఆదా అవుతుంది. నిర్వహణ వ్యయం తగ్గుతుంది. జీవవైవిధ్యం, సహజ వనరుల పరిరక్షణతో మెరుగైన గాలి నాణ్యత, ఆహ్లాదకరమైన వాతావరణంతో నివాసితులు ఆరోగ్యంగా ఉంటారు. ల్యాండ్ స్కేపింగ్, వర్టికల్ గార్డెనింగ్, రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్, ఎస్‌టీపీ, రూఫ్‌టాప్ సౌర విద్యుత్, వర్షపు నీటి వినియోగం, జీవ వైవిధ్య పరిరక్షణ, సహజ సిద్ధమైన గాలి, వెలుతురు వచ్చేలా ఏర్పాట్లు ఉండాలి. షేక్‌పేట, కోకాపేట, నార్సింగి, కొల్లూరు, తెల్లాపూర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, శామీర్‌పేట, పటాన్‌చెరు ఇలా నగరం నలువైపులా ఈ హరిత భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. గ్రీన్ బిల్డింగ్స్ ధరలు విస్తీర్ణాన్ని బట్టి చదరపు అడుగుకు రూ.4,500 నుంచి రూ.10 వేల వరకు ఉన్నాయి. వీటి విస్తీర్ణాలు 1,200 చ.అ. నుంచి 5,000 చ.అ. మధ్య ఉంటున్నాయి.

హైదరాబాద్‌లో 890 ప్రాజెక్టులు

2001లో దేశంలో 20 వేల చదరపు అడుగుల్లో (చ.అ.) కేవలం ఒక్కటంటే ఒక్కటే హరిత భవనం ఉండగా, ప్రస్తుతం 1,175 కోట్ల చ.అ. విస్తీర్ణంలో 13,722 భవనాలు ఉన్నాయి. ఇందులో 120కు పైగా నెట్ జీరో బిల్డింగ్‌లే ఉన్నాయి. హైదరా బాద్‌లో 114 కోట్ల చ.అ.ల్లో 890 ప్రాజెక్టుల పరిధిలో హరిత భవనాలుండగా, ఇందులో నివాస, వాణిజ్య భవనాలే కాదు స్కూళ్లు, ఫ్యాక్టరీలూ ఉన్నాయి. అపర్ణాసరోవర్, రెయిన్‌బో విస్టాస్, మైహోమ్ అవతార్, బీహెచ్‌ఈఎల్ ఎంప్లాయ్ సైబర్ కాలనీ, రహేజా విస్టాస్‌లు గ్రీన్ బిల్డింగ్స్‌గా గుర్తింపు పొందాయి.



తొలిముద్ర నగరానిదే..

హరిత భవనాల్లో హైదరాబాద్‌ది ప్రత్యేకస్థానం. గృహాలు, వాణిజ్య సముదాయాలు, కార్యాలయాలు, రైలు, మెట్రోస్టేషన్లు, ఫ్యాక్టరీలు, ఐటీ టవర్లు, విద్యాసంస్థలు ఇలా 31 విభాగాలలో హరిత భవనాలకు ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ) రేటింగ్ ఇస్తుంది. వీటిల్లో తొలి రేటింగ్ పొందిన భవనాలు హైదరాబాద్‌లోనే ఉన్నాయి.

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ దేశంలోనే తొలి ఐజీబీసీ ప్లాటినం గ్రేడ్ స్టేషన్‌గా గుర్తింపు పొందగా.. ఆసియాలోనే తొలి హరితభవనంగా గచ్చిబౌలిలోని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) సొహ్రాబ్జి గ్రీన్ బిజినెస్ సెంటర్ నిలిచింది.

ప్రపంచంలో మొదటి గ్రీన్ ప్యాసింజర్ టెర్మినల్‌గా రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ఖ్యాతి గడించింది.

తాజాగా తెలంగాణ పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు గ్రీన్ బిల్డింగ్ గుర్తింపు దక్కగా, కొత్తగా నిర్మించిన సచివాలయం, తెలంగాణ అమరవీరుల స్మారక స్తూపం కూడా ఐజీబీసీ రేటింగ్స్ అందుకున్నాయి.

రాయితీలు, ప్రోత్సాహకాలు కూడా..

హరిత భవనాలను ప్రోత్సహించేందుకు దేశంలో 11 రాష్ట్రాలు పలు రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఐజీబీసీ గుర్తింపు పొందిన భవనాలకు పర్మిట్ ఫీజులో 20 శాతం, స్టాంప్ డ్యూటీ సర్‌చార్జ్‌లో 20 శాతం తగ్గుదల ఉంది. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఈ), భారీ పరిశ్రమలకు మూలధన పెట్టుబడి మీద 25 శాతం సబ్సిడీ కూడా ఉంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసీ ప్రమోషన్ (డీఐపీపీ), కేంద్ర పరిశ్రమ శాఖ నుంచి రూ.2 లక్షల వరకు నగదు ప్రోత్సాహకం ఉంది. సిడ్బీ బ్యాంక్ నుంచి వడ్డీ రేట్లలో మినహాయింపు కూడా ఉంది. ఇళ్లు, ఆఫీసులు, విద్యాసంస్థలు, ఐటీ టవర్లు, రైలు, మెట్రోస్టేషన్లు ఇలా 31 విభాగాల్లో తొలి ప్రాజెక్టులు ఉన్నాయి. కానీ మన రాష్ట్రంలో హరితభవనాలకు ప్రభుత్వం నుంచి రాయితీ, ప్రోత్సాహకాలు లేవు.

తెలంగాణలో ఐజీబీసీ ప్రాజెక్టులలో కొన్ని..

- దుర్గంచెరు, పంజగుట్ట, ఎల్బీనగర్ సహా 17 మెట్రోస్టేషన్లు
- సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, రైల్వే నిలయం
- కాచిగూడ రైల్వేస్టేషన్
- గంగదేవిపల్లి గ్రామ పంచాయితీ గ్రీన్ విలేజ్
- ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయం
- సిద్దిపేట, నిజామాబాద్ ఐటీ టవర్లు
- శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం(యాదగిరిగుట్ట)
- ఇనార్బిట్ మాల్, నెక్సస్ షాపింగ్‌మాల్
- ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, జేయూ ఎన్‌టీయూ హెచ్ (సుల్తాన్‌పూర్)
- క్యాప్‌జెమినీ కార్యాలయం
- హెచ్‌ఏఎల్ హెలికాప్టర్ ఫ్యాక్టరీ (తూంకూరు)
- శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం

గ్రీన్ బిల్డింగ్స్ ఉద్యమంలా చేపట్టాలి



శేఖర్‌రెడ్డి, ఐజీబీసీ జాతీయ ఉపాధ్యక్షుడు

ఏ తరహా నిర్మాణాలైనా సరే హరిత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలి. గ్రీన్ బిల్డింగ్స్‌ను బిల్డర్లు ఉద్యమంలా నిర్మించాలి. హరిత భవనాల గురించి నగరంతోపాటు ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లోని ప్రజలకు అవగాహన కల్పించేలా పెద్దఎత్తున ప్రచారం చేపట్టాలి.

హరిత భవనాలను కోరుకుంటున్నారు

హరిత భవనాలకు డిమాండ్ పెరుగుతోంది. ఇంటికి రాగానే చల్లగా, ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుండటంతో గ్రీన్ బిల్డింగ్స్‌లను కోరుకుంటున్నారు. దీంతో బిల్డర్లు కూడా ఈ తరహా ప్రాజెక్టులు చేపట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.



ఇంద్రసేనారెడ్డి, గిరిధారి హోమ్స్ ఎండీ

సత్యమేవ జయతే
సాక్షి


'అభివృద్ధి ఎంత ముఖ్యమో... సంక్షేమమూ అంతే ముఖ్యం'
WWW.SAKSHI.COM
పేజీలు: 22 వెల: ₹ 5.50
సంపుటి: 17 సంచిక: 84
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



గుత్తాధిపత్యానికి తెరపడాలి

టెక్నాలజీలో గుత్తాధిపత్యం పోవాలని, సాంకేతికతను ప్రజాస్వామ్యయుతం చేయాలని ప్రధాని మోదీ జీ7 దేశాల సదస్సులో కోరారు.

- వివరాలు 6లో



పార్లమెంటు సమావేశాలు

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జూలై 22 నుంచి ఆగస్టు 9 దాకా జరుగుతాయని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

- వివరాలు 6లో

ప్రక్షాళన.. సంక్షేమం

పాలన గాడిన పడేలా కీలక అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి



- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్‌లతో విడివిడిగా భేటీ
- అధికార యంత్రాంగాన్ని ప్రక్షాళన చేయాలనే నిర్ణయం
- సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వేగవంతానికి చర్యలు
- బడ్జెట్ రూపకల్పన, రుణమాఫీ, పరిమితులు, ఆర్థిక అంశాలు, నామినేటెడ్ పోస్టులపై భట్టితో సమీక్ష
- స్థానిక సంస్థల ఎన్నికలు, కులగణన, ఏఐసీసీ సమీక్షలపైనా మంత్రులతో మంతనాలు

2లో

పవన్‌కు 'పంచాయతీ'.. లోకేశ్‌కు విద్య, ఐటీ

- ఏపీలో మంత్రులకు శాఖల కేటాయింపు
- జగన్ బాటలో ఎస్సీ మహిళ అనితకు హోంశాఖ.. పయ్యావుల, అనగాని, కొల్లు, నిమ్మల, గొట్టిపాటికి కీలక శాఖలు

- వివరాలు 16లో

విలువలు విశ్వసనీయతతో ముందడుగు



- వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ భేటీలో ఎంపీలకు వైఎస్ జగన్ దిశానిర్దేశం
- మన పాలన, చంద్రబాబు పాలనను ప్రజలు గమనిస్తూనే ఉంటారు
- కచ్చితంగా మనం మళ్లీ ప్రజల విశ్వాసాన్ని పొందుతాం
- ప్రజాహితమే పరమావధిగా పార్లమెంట్‌లో వ్యవహరించాలి

16లో

రెడ్‌బుక్ రాజ్యాంగం

- ఏపీలో హోర్డింగ్‌లకెక్కిన లోకేశ్ 'రెడ్ బుక్' బెదిరింపులు
- బ్లాక్‌మెయిల్‌తో అధికారులను లొంగదీసుకునే యత్నం

13లో

జగన్ ఓడిపోయాడు.. ఇంకా చావలేదు!

- ఆయనను చచ్చేదాకా కొట్టాలి
- టీడీపీ సీనియర్ నేత అయ్యన్నపాత్రుడి విద్వేష వ్యాఖ్యలు
- సోషల్ మీడియాలో వీడియో వైరల్

- వివరాలు 13లో

క్లుప్తంగా...

కాంగ్రెస్ హామీలు నీటిమూటలు
మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నీటి మూటలను తలపిస్తున్నాయని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే హామీలు అమలు చేస్తామని బాండ్ పేపర్ల మీద రాసిచ్చిన కాంగ్రెస్ పార్టీ 191 రోజులు గడిచినా ఆచరణలో పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై హరీశ్‌రావు శుక్రవారం 'ఎక్స్'లో ప్రకటన చేశారు. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన వెంటనే అక్కడి సీఎం అన్ని రకాల పెన్షన్లు పెంచారని, ఒడిశా సీఎం వరి కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ 3,100 పెంచుతూ నిర్ణయం తీసుకున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా వృద్ధులు, వితంతువుల పెన్షన్లు రూ.4వేలకు, దివ్యాంగులకు రూ.6వేలకు పెంచుతూ వెంటనే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. పది శాతం మాత్రమే పండించే సన్న వడ్లకు మాత్రమే రూ.500 బోనస్ ఇస్తామని చేతులు కాంగ్రెస్ చేతులు దులుపుకుందని అయితే పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లుగా అన్ని రకాల వడ్లకు బోనస్ ప్రకటించాలని కోరారు.

కాంగ్రెస్ హామీలు అమలు చేయరే?
సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించిన బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: అధికారంలోకి వచ్చి ఆరు నెలలవుతున్నా.. హామీల అమలు గురించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడటం లేదని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత అమలు చేయకుండా కుంటిసాకులు చెబుతున్నట్లు విమర్శించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మహేశ్వర్‌రెడ్డి శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలు గడుస్తున్నా నేటికీ ఆ హామీల అమలు గురించి మాట్లాడకపోవడం ప్రజల్ని మోసం చేసినట్లేనని విమర్శించారు. పాఠ్యపుస్తకాలపై మాజీ సీఎం కేసీఆర్ ఫొటోలు ఉన్నాయన్న కారణంతో ఆ పుస్తకాల పంపిణీ నిలిపివేశారని గత ముఖ్యమంత్రి ఫొటో పుస్తకాలపై ఉంటే రేవంత్‌కి వచ్చిన నష్టం ఏంటని ప్రశ్నించారు.

గేమింగ్ యాక్ట్‌పై మీ వివరణేంటో చెప్పండి
రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గేమింగ్ యాక్ట్, ఎమ్మెల్యేస్ కాలనీ నివాసితుల సంక్షేమ, సాంస్కృతిక సంఘంలోని రిక్రియేషన్ సెంటర్‌లో కార్డు రూమ్‌ల మూసివేతపై వివరణ ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసు లు జారీ చేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని అధికారులను, పోలీసులను ఆదేశించింది. 13 పేక ముక్కలతో ఆడే రమ్మీ/సిండికేట్ ఆడకుండా ప్రభుత్వం తీసుకొచ్చిన గేమింగ్ యాక్ట్ చట్టవిరుద్ధమని పేర్కొంటూ ఎమ్మెల్యేస్ కాలనీ నివాసితుల సంక్షేమ, సాంస్కృతిక సంఘం కార్యదర్శి రామచంద్రారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. రిక్రియేషన్ సెంటర్ సభ్యుల్లో చాలా మంది మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, ప్రస్తుత ఎంపీలు, ఎమ్మెల్యేలు, పదవీ విరమణ పొందిన జడ్జిలు, ప్రొఫెసర్లు, ఇంజనీర్లు, డాక్టర్లు, చార్టెడ్ అకౌంటెంట్లు, న్యాయవాదులు, బిల్డర్లు, వ్యాపారవేత్తలు ఉన్నారన్నారు. ఇతర క్లబ్‌లతో పోలిస్తే ఇక్కడ 13 ముక్కల ఆట కట్టుదిట్టంగా సాగుతుందని, సభ్యులు, అతిథులకు మాత్రమే అనుమతి ఉంటుందని.. వివరించారు. వారి నుంచి నగదు వసూలు చేయడం జరగదని, ఇది కాసినో లాంటి ఆట కిందకు రాదని పిటిషన్‌లో పేర్కొన్నారు.

ఇలంజేశుత్



నిజమే! ఎలక్షన్లు అయిపోయాయ్! అవసరం లేదన్సార్! అయినా అక్కడ మనమేం గెలవలేదు!

సర్కార్ బడికి క్యూ



161 సీట్లు ఖాళీ.. **630** మంది విద్యార్థుల దరఖాస్తులు | సిద్దిపేట ఇందిరానగర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రవేశాల కోసం అర్హత పరీక్ష

సాక్షి, సిద్దిపేట: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి మీ పిల్లలను మా పాఠశాలలో జాయిన్ చేయించాలని తల్లిదండ్రులను కోరుతుంటారు. కానీ ఈ ప్రభుత్వ పాఠశాలలో సీన్‌రివర్స్‌గా మారింది. తల్లిదండ్రులే తమ పిల్లలను ఈ ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని ప్రవేశాల కోసం క్యూ కడుతున్నారు. అది ఎక్కడ అనుకుంటున్నారా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల. ఈ పాఠశాలను మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు దత్తత తీసుకున్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా విద్యాబోధన అందిస్తుండటంతో ప్రవేశాలకు డిమాండ్ పెరుగుతోంది. ఈ పాఠశాలలో 1,208 మంది విద్యార్థులున్నారు. రాష్ట్రంలోనే మూడో అతి పెద్ద ప్రభుత్వ పాఠశాలగా దీనికి గుర్తింపు వచ్చింది.

6 నుంచి 10వ తరగతి వరకు..

ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలో ఈ విద్యా సంవత్సరానికిగాను 6 నుంచి పదో తరగతి వరకు ప్రవేశాలకు ఈ నెల 12వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. 6వ తరగతిలో 200 సీట్లు ఖాళీగా ఉన్నాయి. అదే పాఠశాల ప్రాంగణంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 5వ తరగతి పూర్తి చేసి.. 6వ తరగతి ప్రవేశం కోసం 61 మంది వచ్చారు. ఇంకా 129 సీట్లకు ఇతర పాఠశాలలకు చెందిన విద్యార్థులను ఎంపిక చేస్తారు. 6 నుంచి 10వ తరగతి వరకు 161 సీట్లు ఖాళీగా ఉండగా 630 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారు. దీంతో ప్రతిభ ఉన్న వారికి అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఈ నెల 13న విద్యార్థులకు ప్రవేశపరీక్ష నిర్వహించారు.

ఇఫ్లూ దత్తత

ఇందిరానగర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను హైదరాబాద్‌కు చెందిన ఇఫ్లూ (ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్) యూనివర్సిటీ దత్తత తీసుకుంది. 9వ తరగతి విద్యార్థులకు స్పానిష్, ఫ్రెంచ్, స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పిస్తున్నారు. 150 మంది విద్యార్థులకు వివిధ భాషలు నేర్పించారు. ఈ ఏడాది మరో 150 మందికి నేర్పించేందుకు ప్రణాళికలు రూపొందించారు. గురు, శుక్ర వారాల్లో ఆన్‌లైన్‌లో బోధిస్తుండగా, తరగతిగదిలో శనివారం ప్రొఫెసర్లు నేరుగా వచ్చి బోధిస్తున్నారు. విద్యార్థులు ధారాళంగా స్పానిష్, ఫ్రెంచ్ భాషల్లో మాట్లాడుతున్నారు. డ్రామా, స్కిట్‌లు, సాంగ్స్ కూడా పాడుతున్నారు.



ప్రవేశం కోసం అర్హత పరీక్ష రాస్తున్న విద్యార్థులు(ఫైల్). ఇన్‌సెట్‌లో ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలో నో అడ్మిషన్స్ బోర్డు ఏర్పాటు

తరగతి	సెక్షన్లు	మొత్తం సీట్లు	ఖాళీలు	దరఖాస్తులు
6వ	4	200	129	297
7వ	4	239	08	98
8వ	5	257	15	140
9వ	5	257	05	80
10వ	5	255	4	15

రోబోటిక్స్...

ఇందిరానగర్ పాఠశాలలో రోబోటిక్స్ విద్యను హైదరాబాద్‌కు చెందిన సోహం అకడమిక్ హ్యూమన్ ఎక్సలెన్స్ అనే స్వచ్ఛంద సంస్థ అందిస్తోంది. మూడు సంవత్సరాలుగా ప్రతీ ఏడాది 100 మంది విద్యార్థులకు నేర్పిస్తున్నారు. వారంలో రెండు రోజులు క్లాసులు నిర్వహిస్తున్నారు.

గర్వపడుతున్నాం..



మెరుగైన విద్య, సౌకర్యాలు కల్పిస్తుండటంతో విద్యార్థులను చేర్పించేందుకు తల్లిదండ్రులు ముందుకు వస్తున్నారు. అందుకు గర్వపడుతున్నాం. విద్యార్థుల తాకిడి పెరగడంతో స్క్రీనింగ్‌కు పరీక్ష పెట్టాం. వీటిలో వచ్చిన మార్కులు, వారి కుటుంబపరిస్థితిని బట్టి అడ్మిషన్లు ఇస్తాం. ఈ నెల 20తేదీలోగా ఎంపిక పూర్తవుతుంది.

– రాజప్రభాకర్‌రెడ్డి, హెచ్‌ఎం, జెడ్పీ హైస్కూల్, ఇందిరానగర్

సీటు కోసం వచ్చాను



మా తమ్ముడి భార్య చనిపోయింది. నా మేనల్లుడిని ఇందిరానగర్ స్కూల్‌లో 6వ తరగతిలో చేర్పించేందుకు వచ్చాను. పరీక్ష రాయించాను. ఇందులో చదివితే విద్యావంతుడు అవుతాడని నమ్మకంతో సీటు కోసం తిరుగుతున్నా.

– బాలలక్ష్మి, సిద్దిపేట

ఈ ఏడాది కొత్తగా ఎన్‌సీసీ

ఈ ఏడాది కొత్తగా ఎన్‌సీసీ ప్రవేశపెట్టారు. కరీంనగర్‌కు చెందిన 9వ బెటాలియన్ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నారు. 8వ తరగతి నుంచి 50 మంది విద్యార్థులను ఎంపిక చేస్తారు.

- ఈ పాఠశాల విద్యార్థులు ట్రిపుల్ ఐటీ, కార్పొరేట్ కళాశాలలో ఉచిత సీట్లకు ఎంపికవుతున్నారు. 2023–2024 విద్యా ఏడాదిలో 231 మంది పదో తరగతి పరీక్ష రాయగా 229 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇటీవల విడుదలైన పాలిసెట్‌లో వెయ్యిలోపు ఐదుగురు విద్యార్థులు ర్యాంకులు సాధించారు.

ప్రక్షాళన.. సంక్షేమం..

పాలన గాడిన పడేలా కీలక అంశాలపై సీఎం రేవంత్ దృష్టి • డిప్యూటీ సీఎం భట్టి, సీనియర్ మంత్రి ఉత్తమ్‌లతో విడివిడిగా భేటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో పాలన గాడినపడేలా కీలక అంశాలపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి దృష్టిపెట్టారు. అధికార యంత్రాంగం ప్రక్షాళన, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడంపై ఫోకస్ చేశారు. వచ్చే నెలలో పూర్తిస్థాయి రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టే నేపథ్యంలో అన్ని శాఖలతో సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు శుక్రవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలతో తన క్యాంపు కార్యాలయంలో విడివిడిగా సమావేశమయ్యారు. సాగునీటి ప్రాజెక్టుల నుంచి పాలన వరకు.. నామినేటెడ్ పోస్టుల నుంచి ఏఐసీసీ సమీక్ష వరకు కీలక అంశాలపై వారు సుదీర్ఘంగా చర్చించినట్టు సమాచారం. ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన రైతు రుణమాఫీని ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు యథాతథంగా అమలు చేయాలా? ఏవైనా పరిమితులు విధిస్తే ఎలా ఉంటుంది? రుణమాఫీ అమలుకు అవసరమైన ఆదాయ వనరుల సమీకరణ ఎలాగన్న అంశాలపై ఈ సందర్భంగా చర్చకు వచ్చినట్టు తెలిసింది. ఈ అంశంపై ఇంతకుముందే రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ రఘురాం రాజన్‌తో చర్చించిన విషయం కూడా ప్రస్తావనకు వచ్చినట్టు సమాచారం. ఇక ఆదాయ వనరులు పెంచుకునే అంశంపై ఇదివరకే కీలక శాఖలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినందున.. లక్ష్యం మేరకు ఆదాయం సమకూరేలా చూడాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ అధికారులు అలసత్వం ప్రదర్శించకుండా చూడాలన్న భావన వ్యక్తమైనట్టు సమాచారం.

ఉదయం ఉత్తమ్‌తో అభివృద్ధిపై..

సీఎం రేవంత్ శుక్రవారం ఉదయం మంత్రి ఉత్తమ్‌తో సమావేశమయ్యారు. సుమారు గంటపాటు ఇద్దరూ మాట్లాడుకున్నట్టు తెలిసింది. మేడిగడ్డ బరాజ్, సీతారామ ప్రాజెక్టులను సందర్శించిన సందర్భంగా పరిశీలనకు వచ్చిన అంశాలు, కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఎన్డీఎస్‌ఏ నివేదిక, జస్టిస్ పినాకి చంద్రఘోష్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ విచారణ, సాగునీటి శాఖ సిబ్బందికి పదోన్నతులు తదితర అంశాలపై వారు చర్చించినట్టు సమాచారం. ఇప్పటివరకు ఎన్నికల కోడ్ కారణంగా అభివృద్ధి పనులు చేపట్టలేకపోయామని రేవంత్, ఉత్తమ్‌ల భేటీలో అభిప్రాయపడినట్టు తెలిసింది. ఇక వీలైనంత త్వరగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేయాలని, తక్కువ సమయంలో ఎక్కువ ఆయకట్టు స్థిరీకరణ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్టు తెలిసింది. దీనికితోడు విద్యార్థులకు సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం అమలు, ఇందుకు అవసరమైన బియ్యం సేకరణపై వారు చర్చించినట్టు సమాచారం.

మధ్యాహ్నం భట్టితో ఆర్థిక అంశాలపై..

మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో డిప్యూటీ సీఎం భట్టితో సీఎం రేవంత్ భేటీ అయ్యారు. దాదాపు రెండు గంటలకుపైగా జరిగిన ఈ సమావేశంలో పూర్తిస్థాయి బడ్జెట్ రూపకల్పనకు అనుసరించాల్సిన విధానం, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, రైతుల రుణమాఫీ, దీని అమల్లో పరిమితులు, కార్పొరేషన్ చైర్మన్ల నియామకం, ఆదాయం పెంపు, వివిధ ప్రభుత్వ శాఖలతో సమీక్షలు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, కులగణన విషయంలో వ్యవహరించాల్సిన తీరు, విద్యుత్ అంశంపై వేసిన జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ పనితీరు, ఐఏఎస్‌ల బదిలీలు, లోక్‌సభ ఎన్నికలపై వచ్చే వారంలో ఏఐసీసీ నిర్వహించనున్న సమీక్షలు తదితర అంశాలపై ఈ ఇద్దరూ సుదీర్ఘంగా చర్చించినట్టు తెలిసింది. పంద్రాగస్టులోపు కచ్చితంగా రైతు రుణమాఫీ చేయాల్సిందేనని.. ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు అందుబాటులో ఉన్న అన్ని ఆర్థిక వెసులుబాట్లను పరిశీలించాలని ఆలోచనకు వచ్చినట్టు సమాచారం. ఈ మేరకు కేబినెట్ భేటీ కంటే ముందు ఆర్థిక శాఖ సూత్రప్రాయంగా ఓ నిర్ణయానికి రావాలనే చర్చ జరిగినట్టు తెలిసింది. ఇక నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయంలో చర్చలు, చేయాలనుకుంటున్న మార్పులు, ఇప్పటికే ప్రకటించిన పోస్టుల ఉత్తర్వుల విడుదల, మిగతా పదవుల భర్తీ తదితర రాజకీయ అంశాలపైనా రేవంత్, భట్టి చర్చించారని సమాచారం.

భౌతికదాడులను ఉపేక్షించేది లేదు
అరాచకాలు, హత్యలను సహించం : సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్ : భౌతికదాడులకు దిగి అరాచకాలు, హత్యలకు పాల్పడేవారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. నారాయణపేట జిల్లా ఉట్కూర్ మండలంలో శుక్రవారం పట్టపగలు గువ్వల సంజీవ్‌ను కొట్టి చంపిన ఘటనపై సీఎం సీరియస్‌గా స్పందించారు. ఈ ఘటనకు సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు తేలితే, బాధ్యులైన పోలీసుపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీకి ఆదేశాలు జారీ చేశారు.

పోక్సో కేసు నమోదు చేయండి

పెద్దపల్లి జిల్లాలో ఆరేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన అమానుష ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. వెంటనే పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తగిన న్యాయం చేస్తుందని భరోసా ఇచ్చారు.

విద్యార్థినుల ఉచిత బస్సు ప్రయాణం.. సీఎం హ్యాపీ

ఆర్టీసీ బస్సులో 'ఉచిత ప్రయాణ పథకం'వల్ల తాము ఉచితంగా బస్సెక్కి పాఠశాలలకు వెళ్లగలుగుతున్నామని సిద్దిపేట జిల్లా నంగనూరు మండలం ముగ్దుంపూర్‌కు చెందిన విద్యార్థినులు ఆధార్‌కార్డులు చూపిస్తూ సంతోషం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి ఒక జర్నలిస్టు సీఎంకు ఫొటో పంపారు. ఆ ఫొటోను సీఎం తన ఎక్స్ ఖాతాలో పోస్టు పెట్టి కామెంట్ చేశారు. ఊరికి కిలోమీటర్ దూరాన ఉన్న పాఠశాలకు ఖర్చు లే కుండా వెళుతున్నామని ఆ బాలికలు చెబుతుంటే అంతకంటే ఆనందం ఏముంటుందని సీఎం వ్యాఖ్యానించారు.

చిన్నారిని చిదిమేసిన మానవ మృగం

పెద్దపల్లి జిల్లాలో ఆరేళ్ల బాలికపై అత్యాచారం, హత్య
- పోలీసుల అదుపులో నిందితుడు.. పోక్సో కేసు నమోదు
- గంజాయి మత్తులో రాక్షసం
- బహిరంగంగా శిక్షించాలని తల్లిదండ్రులు, బంధువుల ధర్నా



రాజీవ్ రహదారిపై ఆందోళనకారుల నిరసన

సాక్షి, పెద్దపల్లి, సుల్తానాబాద్/సుల్తానాబాద్ రూరల్: గంజాయి మత్తులో ఓ మానవ మృగం రెచ్చిపోయింది. ఆరేళ్ల చిన్నారిపై అత్యాచారం చేసి దారుణ హత్యకు ఒడిగట్టింది. జిల్లావాసులను ఉలికిపాటుకు గురిచేసిన ఈ దారుణ ఘటనపై స్థానికులు, పోలీసుల కథనమిలా.. ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలానికి చెందిన దంపతులు పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలోని ఓ రైస్ మిల్లులో నెలరోజులుగా కూలి పనికి కుదిరారు. వీరికి ఇద్దరు కుమార్తెలున్నారు. సమీప మరో మిల్లులో హమాలీగా పనిచేస్తున్న బిహార్‌కు చెందిన వలసకూలీ వినోద్ మాఝి ఆరేళ్ల చిన్నారిపై కన్నేశాడు. ఈ క్రమంలో గురువారం రైస్‌మిల్లు ఆవరణలో కూలీల కోసం నిర్మించిన గదుల ఎదుట బాలిక తల్లిదండ్రులతో కలిసి నిద్రిస్తోంది. గురువారం రాత్రి ఒక్కసారిగా వర్షం కురవడంతో పాపతో కలిసి దంపతులు ఇంట్లోకి వెళ్లారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఉక్కపోత భరించలేక దంపతులు బయటకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన నిందితుడు చీకట్లో పాపను అపహరించాడు. అదే రైస్‌మిల్లు వెనకాల ఉన్న పంట పొలాల్లోకి తీసుకెళ్లి చిన్నారిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. తన బండారం బయటపడుతుందని భావించి పాప గొంతు నలిమి చంపి అక్కడే పొదల్లో పడేశాడు. కాగా, కొద్దిసేపటికి ఇంట్లోకి తల్లిదండ్రులు వచ్చి చూడగా.. ఓ పాప కనిపించలేదు. ఆందోళనతో సమీపంలో వెతికినా.. కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పెట్రోలింగ్ పోలీసులకు చిక్కిన నిందితుడు

ఈ క్రమంలోనే పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు.. గురువారం రాత్రి (శుక్రవారం వేకువజామున) సుమారు 2గంటల సమయంలో నిందితుడు వినోద్ మాఝి మిల్లు వద్ద తన బట్టలకు అంటిన మరకలను శుభ్రం చేస్తూ కనిపించాడు. అనుమానం వచ్చిన పోలీసులు.. అతడిని విచారించగా విషయం మొత్తం చెప్పినట్లు తెలుస్తోంది. వెంటనే అతన్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు పాప మృతదేహాన్ని గుర్తించి పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. నిందితుడు పాపను తీసుకు వెళ్తున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. డాగ్‌స్క్వాడ్ బృందం తనిఖీల్లో మరో ఇద్దరు నిందితులను అనుమానితులుగా గుర్తించగా పోలీసులు వారిని సైతం అదుపులోకి తీసుకొని విచారణ చేశారు. మరోవైపు.. రాత్రి ముగ్గురూ కలిసి మద్యం, గంజాయి తాగామని, ఆ తర్వాత ఎవరి దారిన వారు వెళ్లిపోయామని, ఆ ఘటనతో తమకు సంబంధంలేదని ఇద్దరు అనుమానితులు పోలీసుల విచారణలో చెప్పినట్లు సమాచారం. కాగా, నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దద్దరిల్లిన తెలంగాణ చౌక్

అభం శుభం తెలియని చిన్నారిపై అత్యాచారం చేసి, హతమార్చిన ఘటనలో దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని, మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు, ప్రజాసంఘాల నాయకులు తెలంగాణ చౌక్‌లోని రాజీవ్ రహదారితోపాటు ప్రభుత్వ ఆస్పత్రిలోని పోస్టుమార్టం గది ఎదుట బైఠాయించారు. చిన్నారిపై అఘాయిత్యం చేసిన నిందితుడిని ఎన్‌కౌంటర్ చేయాలని, బహిరంగంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దాదాపు గంటపాటు ధర్నా చేయడంతో రోడ్డుకు ఇరువైపులా వందలాది వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళనకారులను సముదాయించారు.

అధికారులతో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సమీక్ష

సాధించిన విజయాలు, భవిష్యత్ ప్రణాళికలపై చర్చ

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర గనుల శాఖ అధికారులతో కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి కిషన్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. శుక్రవారం ఢిల్లీలోని శాఖ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో గనుల శాఖ సాధించిన విజయాలు, దీర్ఘకాలిక ప్రణాళికలపై చర్చించారు. మైనింగ్ రంగంలో భారత్‌ను ఆత్మనిర్భర్‌గా మార్చేందుకు ఆటోమేషన్, ఇన్నోవేషన్, సుస్థిరత, ఆధునాతన సాంకేతికతలను అమలు చేయడం వంటి కీలకమైన అంశాలపై ప్రధానంగా సమీక్షించారు. అంతకుముందు అధికారులు శాఖకు సంబంధించిన పలు అంశాలను కిషన్‌రెడ్డికి వివరించారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ సహాయ మంత్రి సతీశ్‌చంద్ర దూబే, సీపీఎస్‌ఈలు, అనుబంధ కార్యాలయాల ఉన్నతాధికారులు సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.



రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతిని కలిసిన కిషన్‌రెడ్డి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. కిషన్‌రెడ్డి వెంట కేంద్ర బొగ్గు, గనుల శాఖ సహాయమంత్రి సతీశ్ చంద్ర దూబే ఉన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ కేబినెట్‌లో మంత్రులుగా బాధ్యతలు తీసుకున్న కిషన్ రెడ్డి, సతీశ్‌చంద్ర దూబేలను రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి అభినందించారు.

రాష్ట్రంలో బీజేపీనే ప్రత్యామ్నాయం

- తరుణ్ చుగ్‌తో బండి సంజయ్ భేటీ
- రాష్ట్రంలో పార్టీ బలోపేతంపై చర్చ
- కాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వాసం కోల్పోయింది: తరుణ్ చుగ్
- సంజయ్‌కు పలువురు ప్రజాప్రతినిధుల అభినందనలు

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శుక్రవారం తెలంగాణ బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్, జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంజయ్‌కు చుగ్ శుభాకాంక్షలు తెలిపారు. హోం శాఖకు మంచిపేరు తీసుకురావడంతోపాటు ప్రజలకు మరింత మేలు జరిగేలా పని చేయాలని తరుణ్ చుగ్ ఆకాంక్షించారు. అరగంట పాటు జరిగిన వారిద్దరి భేటీలో రాష్ట్రంలో పార్టీ బలోపేతంపై చర్చించారు. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కేవలం ఐదు నెలల్లోనే విశ్వసనీయతను కోల్పోయిందని, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పనైపోయిందని, కాంగ్రెస్ పార్టీకి బీజేపీ మాత్రమే ప్రత్యామ్నాయమనే విషయం కూడా పార్లమెంట్ ఫలితాలతో రుజువైందని చుగ్ పేర్కొన్నారు.



తరుణ్ చుగ్‌తో భేటీ అయిన కేంద్ర మంత్రి బండి సంజయ్

బండికి శుభాకాంక్షల వెల్లువ

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన బండి సంజయ్‌కి బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీలు సీతారాం నాయక్, బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్యేలు సంకినేని వెంకటేశ్వరరావు, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు, బీసీ కమిషన్ మాజీ సభ్యులు టి.ఆచారి, రాష్ట్ర అధికార ప్రతినిధులు ఎన్వీ సుభాష్, వీరేందర్ గౌడ్, జి.సంగప్పతో పాటు వివిధ మోర్చాలకు చెందిన నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. అలాగే.. కరీంనగర్ తోపాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు బండి సంజయ్‌ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అధైర్యపడొద్దు..మేమంతా ఉన్నాం

- నువ్వు కడిగిన ముత్యంలా బయటకు వస్తావు
- ఎమ్మెల్సీ కవితకు కేటీఆర్ భరోసా
- తీహార్ జైల్లో సోదరితో భేటీ



సాక్షి, న్యూఢిల్లీ: 'కవితమ్మా.. నువ్వేమీ అధైర్యపడొద్దు, మేమంతా అండగా ఉన్నాము. కొద్దిరోజులు ఓపిక పట్టు న్యాయం తప్పకుండా గెలుస్తుంది. నువ్వు కడిగిన ముత్యంలా బయటకు వస్తావు అనే నమ్మకం మాకుంది..' అంటూ ఎమ్మెల్సీ కవితకు ఆమె సోదరుడు, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసా ఇచ్చారు. ఢిల్లీ లిక్కర్ కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటూ తీహార్ జైల్లో జ్యుడీషియల్ కస్టడీపై ఉన్న కవితను శుక్రవారం ఆయన పరామర్శించారు. పలు విషయాలపై చర్చించారు. లిక్కర్ కేసులో ఉద్దేశపూర్వకంగా, రాజకీయ కక్షతోనే ఈ కేసులో ఇరికించారనేది స్పష్టం అవుతోందని చెప్పారు. మోదీ నేతృత్వంలోని ఈడీ, సీబీఐలు లిక్కర్ కేసులో ఎలా వ్యవహరిస్తున్నాయనే విషయాలు ప్రజల్లో చర్చకు దారితీస్తున్నాయని, సామాజిక మాధ్యమాల్లో చర్చ జరుగుతోందని తెలిపారు. ఇప్పటివర కు ఆరోపణల మీదనే కేసు నడిపిస్తున్న తీరును చూస్తూ దేశ ప్రజలు నివ్వెరపోతున్నారన్నారు. తప్పు చేయని వారిని న్యాయస్థానాలు కాపాడతాయంటూ ధైర్యం చెప్పారు.

మాజీ ఎంపీ వినోద్, న్యాయవాది భేటీ

కేటీఆర్ కలిసిన అనంతరం మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో పాటు న్యాయవాది మోహిత్‌రావులు కవితతో సమావేశమయ్యారు. ఈడీ, సీబీఐ కేసులకు సంబంధించి, బెయిలు విషయమై చర్చించారు. కవిత, తదితరులపై ఈడీ దాఖలు చేసిన అనుబంధ చార్జిషీట్‌పై విచారణ జూలై 3కి వాయిదా పడిన సంగతి తెలిసిందే. మరోవైపు కవిత జ్యుడీషియల్ కస్టడీని పొడిగించాలన్న సీబీఐ వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి.. ఈనెల 21వరకు జ్యుడీషియల్ కస్టడీని పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ రెండు అంశాలపై వారు కవితతో చర్చించారు.

మన పనితీరుపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది

- డీసీలు, ఏసీలు ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదు.
- పనిచేయని వారిపై చర్యలుంటాయి
- సమీక్షలో ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్

సాక్షి, హైదరాబాద్: ఎక్సైజ్ శాఖ అధికారులు విధి నిర్వహణలో కనబరుస్తున్న నిర్లిప్తతపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉందని ఆ శాఖ కమిషనర్ ఇ.శ్రీధర్ అన్నారు. ఇదే అంశంపై శుక్రవారం ప్రభుత్వం నిర్వహించాలనుకున్న సమావేశం చివరి నిమిషంలో వాయిదా పడిందని, త్వరలో జరిగే ఉన్నత స్థాయి భేటీకి అన్ని రికార్డులతో హాజరు కావాలని ఆయన తమ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆబ్కారీ భవన్‌లో ఆయన ఎక్సైజ్ శాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, అసిస్టెంట్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లతో పాటు అదనపు కమిషనర్ అజయ్‌రావు, బేవరేజెస్ కార్పొరేషన్ అధికారులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీధర్ మాట్లాడుతూ అసిస్టెంట్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదని, ఇక నుంచి చురుకుగా పనిచేయడంతో పాటు కింది స్థాయి అధికారులు, సిబ్బందితో పనిచేయించాలన్నారు.

ప్రతి జిల్లా కేంద్రంలో బ్లడ్‌బ్యాంక్

- ఏర్పాటుకు కృషి చేస్తా
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి
- ప్రజలు రక్తదానంపై అపోహలు వీడాలని సూచన



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

పంజగుట్ట (హైదరాబాద్): ప్రతీ జిల్లా కేంద్రంలో, 100 పడకలు ఉన్న ప్రతీ ఆస్పత్రిలో ఒక బ్లడ్‌బ్యాంక్ ఉండేలా కృషిచేస్తానని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దీనివల్ల అవసరమైనవారందరికీ రక్తం అందుబాటులో ఉండటంతోపాటు, ప్రజలకు రక్తదానంపై అవగాహన ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో రాజ్‌భవన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఎక్కువసార్లు రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందించారు. అనంతరం పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, రక్తదానం చేస్తే ఏదో జరుగుతుందన్న అపోహ వీడాలని, ప్రతీ మూడు నెలలకు ఒకసారి రక్తం ఇవ్వవచ్చునని వైద్యులే చెపుతున్నారని అన్నారు. అరుదుగా దొరికే రక్తం, రక్తదాతల సమాచారాన్ని రెడ్‌క్రాస్ సొసైటీ తనవద్ద ఉంచుకోవాలని సూచించారు. కాగా, రెడ్‌క్రాస్ వాహనాలకు రవాణాశాఖ తరఫున పన్ను మినహాయింపు ఇవ్వాలని సొసైటీ ప్రతినిధులు వినతిపత్రం ఇవ్వగా.. దీనిపై ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. తలసేమియా వ్యాధిగ్రస్తులు బస్‌పాస్ అడుగుతున్నారని దీనిపై కూడా చర్చిస్తామని హామీ ఇచ్చారు. రాజ్‌భవన్ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, రెడ్‌క్రాస్ తెలంగాణ బ్రాంచ్ చైర్మన్ అజయ్ మిశ్రా, రాజ్‌భవన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశం, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సెక్రెటరీ క్రిస్టినా జెడ్ చొంగ్తు, వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, రెడ్‌క్రాస్ తెలంగాణ బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి, సీఈఓ కె.మదన్‌మోహన్ రావు, గవర్నర్ జాయింట్ సెక్రెటరీ జె.భవానీ శంకర్ పాల్గొన్నారు.

'నగదు'పై ఈడీ ఫోకస్!

గొర్రెల పంపిణీ స్కాంలో నగదు లావాదేవీలపై దర్యాప్తునకు సిద్ధం

మేకలు, గొర్రెల అభివృద్ధి సంస్థ, ఏసీబీల నుంచి మరిన్ని వివరాలు కోరే యోచన

ఆ సమాచారాన్ని విశ్లేషించేందుకు ప్రత్యేక బృందాలు!



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గొర్రెల పంపిణీ కుంభకోణం కేసుపై సమగ్ర దర్యాప్తునకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కసరత్తు చేస్తోంది. ముఖ్యంగా నగదు లావాదేవీలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. గొర్రెల పంపిణీ పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఈ నెల 12వ తేదీ వరకు జరిగిన నిధుల లావాదేవీలు, గొర్రెల పంపిణీ, లబ్ధిదారుల వివరాలు, ఇతర పూర్తి సమాచారం ఇవ్వాలంటూ ఈడీ ఇప్పటికే తెలంగాణ గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సంస్థ ఎండీకి లేఖ రాసింది. దీనిని అత్యవసరంగా పరిగణించి వివరాలు ఇవ్వాలని కోరింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం సెక్షన్ 54 కింద ఈడీ అధికారులు ఈ వివరాలను తీసుకోనున్నారు.

ఈడీ అధికారులు వస్తారనుకున్నా..

గొర్రెల పంపిణీ వ్యవహారం దర్యాప్తు కోసం ఈడీ అధికారులు శుక్రవారం ఉదయం గొర్రెలు, మేకల సహకార అభివృద్ధి సంస్థకు రానున్నట్టు ప్రచారం జరిగింది. ఈడీ అధికారులు వస్తున్నట్టు సంస్థ వర్గాలు ప్రాథమికంగా నిర్ధారించాయి. కానీ కార్యాలయంలో సంస్థ ఎండీ, ఇతర ఉన్నతాధికారులెవరూ అందుబాటులో లేరని, వారు ఈ అంశంపై ప్రభుత్వ పెద్దలకు సమాచారం ఇవ్వడానికి వెళ్లారని పేర్కొన్నాయి. పలు అనివార్య కారణాలతోనే ఈడీ అధికారులు రాలేదని తెలిసింది. అధికారులు ఇచ్చే సమాచారాన్ని విశ్లేషించేందుకు, ఆర్థిక లావాదేవీల్లోని లోపాలను గుర్తించేందుకు ఈడీ ఇప్పటికే ప్రత్యేక బృందాలను సిద్ధం చేసినట్టు తెలిసింది. తగిన సమాచారం అందిన వెంటనే రంగంలోకి దిగి, క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించేందుకు ఈడీ అధికారులు సన్నద్ధమవుతున్నట్టు సమాచారం.

ఏసీబీ కూడా దూకుడుగా..

గొర్రెల పంపిణీ వ్యవహారంపై ఇప్పటికే ఏసీబీ దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. సుమారు రూ.700 కోట్ల మేర అవినీతి జరిగినట్టు ఏసీబీ అధికారులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. కీలక నిందితులుగా భావిస్తున్న రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సీఈఓ, తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సంస్థ మాజీ ఎండీ సబావత్ రాంచందర్, అప్పటి పశుసంవర్ధక శాఖ మంత్రి ఓఎస్డీ కల్యాణ్ కుమార్‌లను మూడు రోజుల పాటు కస్టడీకి తీసుకుని విచారించారు. ప్రస్తుతం ఏసీబీ దర్యాప్తు కీలక దశలో ఉంది. ఈ నేపథ్యంలో ఏసీబీ నుంచి అవసరమైన సమాచారాన్ని కోరాలని ఈడీ అధికారులు భావిస్తున్నట్టు తెలిసింది. ఎంతమేర అవినీతి జరిగింది? సొమ్మును ఎవరెవరి ఖాతాల్లోకి, ఎలా మళ్లించారు? ఏయే బ్యాంకు ఖాతాల్లోకి అక్రమంగా నిధులు మళ్లాయన్న వివరాలను తేల్చాలని యోచిస్తున్నట్టు సమాచారం. నగదు లావాదేవీలపై ఈడీ ముమ్మర దర్యాప్తు చేపడితే.. ఎవరెవరి పేర్లు తెరపైకి వస్తాయోనన్న చర్చ జరుగుతోంది.

ఆ నియామక పత్రాల జాడేది?

- ఎన్నికల కోడ్ ముగిసినా 1,550 మందికి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వని ట్రిబ్
- గురుకుల విద్యాసంస్థల్లో కొత్త టీచర్ల చేరికలపై వీడని ఉత్కంఠ

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యాసంస్థల్లో వివిధ కేటగిరీల్లో కొత్తగా ఉద్యోగాలు దక్కించుకున్న అభ్యర్థులు ఇంకా కొలువుదీర లేదు. ఉద్యోగ నియామక పత్రాలు అందుకొని దాదాపు నాలుగునెలలు కావొస్తున్నా, వారికి పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వలేదు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ, మహాత్మ జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ, తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ, తెలంగాణ గురుకుల విద్యాసంస్థల సొసైటీల పరిధిలో 9వేలకు పైబడి ఉద్యోగాల భర్తీకి అర్హత పరీక్షలు పూర్తి చేసి, ఫలితాలను ప్రకటించిన తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు(టీఆర్ఈఐఆర్‌బీ) 8,600 ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేసింది. ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ), పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ), ఫిజికల్ డైరెక్టర్(పీడీ), లైబ్రేరియన్, జూనియర్ లెక్చరర్ (జేఎల్), డిగ్రీ లెక్చరర్(డీఎల్) కేటగిరీల్లో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఈ ఏడాది ఫిబ్రవరిలో నియామక పత్రాలు ఇచ్చేందుకు గురుకులబోర్డు చర్యలు చేపట్టింది. ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా దాదాపు 7,100 మందికి రెండు దఫాలుగా నియామక పత్రాలు అందజేసింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉండడంతో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల, నారాయణపేట, వనపర్తి, రంగారెడ్డి జిల్లాలకు చెందిన అభ్యర్థులకు నియామక పత్రాలు పంపిణీ చేయలేదు. కోడ్ ముగిసిన తర్వాత ఇవ్వాలని గురుకుల బోర్డు నిర్ణయించింది. ఎన్నికల కోడ్ ముగిసి పది రోజులు కావొస్తున్నా వీటి పంపిణీపై స్పష్టత లేదు.

పోస్టింగ్‌కు లింకు...

రాష్ట్రవ్యాప్తంగా గురుకుల ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు గురుకుల సొసైటీలు పోస్టింగ్ ఇవ్వలేదు. ఇందుకు కారణం ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు పూర్తిస్థాయిలో నియామక పత్రాలు అందించకపోవడమే. నియామకపత్రాలు అందించిన వారికి ముందుగా పోస్టింగ్ ఇవ్వాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నా, సర్వీసులో వ్యత్యాసం నెలకొంటుందనే భావన, మరోవైపు కౌన్సెలింగ్‌లో నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతాయని అధికారులు వెనక్కి తగ్గారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు పూర్తిస్థాయిలో నియామక పత్రాలు ఇచ్చిన తర్వాత పోస్టు కేటగిరీల వారీగా కౌన్సెలింగ్ నిర్వహించి మెరిట్ ప్రాధాన్యత క్రమంలో పోస్టింగ్ ఇచ్చేందుకు సొసైటీలు నిర్ణయించాయి. జూన్ 6వ తేదీ నుంచి ఎన్నికల కోడ్ తొలగిపోవడంతో పాఠశాలలు పునః ప్రారంభం అయ్యే నాటికి ఈ ప్రక్రియ పూర్తవుతుందని అభ్యర్థులు భావించారు. కానీ కోడ్ ముగిసి పదిరోజులు కావొస్తున్నా... గురుకుల బోర్డు నుంచి ఎలాంటి ఉలుకూపలుకూ లేకపోవడంతో అభ్యర్థుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఇప్పటికిప్పుడు ఈ ప్రక్రియ ప్రారంభించినా, పూర్తి చేసేందుకు కనీసం రెండువారాలు పడుతుందని అధికారులు చెబుతున్నారు. కనీసం వచ్చే నెల నుంచైనా కొత్త టీచర్లు విధుల్లో చేరతారో లేదో వేచి చూడాలి.

'గొర్రెల' ఫైళ్లు జాగ్రత్త!

- గొర్రెల పంపిణీలో అవకతవకలపై సీఎం కార్యాలయం ఆరా
- ఈడీ లేఖ, కొనుగోలు వ్యవహారాల ఫైళ్ల గురించి వాకబు
- అన్నీ జాగ్రత్తగా ఉంచాలని, వివరాలన్నీ సేకరించాలని ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గొర్రెల పంపిణీ కుంభకోణంపై ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) దృష్టి పెట్టింది. ఈ వ్యవహారంలో ఏం జరిగిందన్న దానిపై పశుసంవర్థక శాఖ నుంచి వివరాలు సేకరించే పనిలో పడింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన గొర్రెల కొనుగోళ్లకు సంబంధించిన ఫైళ్ల జాగ్రత్తగా ఉంచాలని, ఎలాంటి అవకతవకలు జరిగాయన్న వివరాలను సేకరించి ఉంచాలని పశుసంవర్థక శాఖ ఉన్నతాధికారులను సీఎంవో ఆదేశించినట్టు తెలిసింది. గొర్రెల కొనుగోలు కుంభకోణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగిన నేపథ్యంలో.. ఈడీ రాసిన లేఖ వివరాలను అడిగి తెలుసుకున్నట్టు సమాచారం. ఈ కుంభకోణంలో మాజీ మంత్రి పేషీ పాత్ర, పశు సంవర్థక శాఖ ఉన్నతాధికారుల ప్రమేయం, ఎక్కడెక్కడ కొనుగోళ్లు జరిగాయి? ఎన్ని డబ్బులు చేతులు మారి ఉంటాయన్న వివరాలన్నీ సిద్ధంగా ఉండాలని సీఎంవో నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చాయనే చర్చ పశుసంవర్థక శాఖ అధికారుల్లో జరుగుతోంది.

'గొర్రెల' నిందితులు దేశం దాటకుండా చూడండి

ప్రభుత్వానికి టీపీసీసీ నేత నిరంజన్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: గొర్రెల కుంభకోణం నిందితులెవరూ దేశం విడిచి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గొర్రెల పంపిణీలో కోట్ల రూపాయల కుంభకోణం జరగడం ఆశ్చర్యంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. శుక్రవారం గాంధీభవన్‌లో నిరంజన్ విలేకరులతో మాట్లాడుతూ టూవీలర్లు, ఆటోలు, అంబులెన్స్‌లలో గొర్రెల రవాణా జరిగిందంటే కచ్చితంగా పెద్దల ప్రమేయం ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ కుంభకోణంపై ఈడీ రంగంలోకి దిగిన నేపథ్యంలో అవినీతికి పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని నిరంజన్ విన్నవించారు.

“సాధకుని హృదయంలో ఉండే కామనలు (వాంఛలు, కోరికలు) అన్నీ సమూలంగా నష్టమైపోయినప్పుడు ఈ మర్త్యుడు (మరణశీలుడైన మనిషి) అమరుడౌతాడు.
- కఠోపనిషత్తు (హైందవ ధర్మం)

సాక్షి
శనివారం, 15 జూన్ 2024

జీ-7 అసంబద్ధ నిర్ణయం

పేరుకి సంపన్న దేశాలే. ప్రపంచాన్ని ఇప్పటికీ శాసిస్తున్నవే. స్వయంకృతం కావొచ్చు... అంతర్జాతీయ పరిణామాల పర్యవసానం కావొచ్చు ఆ దేశాలకూ సమస్యలుంటాయి. ఇటలీలో గురువారం ప్రారంభమైన జీ-7 దేశాల మూడురోజుల శిఖరాగ్ర సదస్సు ఈ పరిస్థితిని ప్రతిబింబించింది. చుట్టూ అనిశ్చితి, భవిష్యత్తుపై నిరాశా నిస్పృహలు వాటిని పీడిస్తున్నాయి. ఉన్న సమస్యలు చాల్లేదన్నట్టు అమెరికా అధ్యక్ష పీఠం మళ్లీ డోనాల్డ్ ట్రంప్‌కు దక్కవచ్చన్న అంచనాలు వాటిని వణికిస్తున్నాయి. మూడేళ్ల క్రితం పరిస్థితి వేరు. అప్పటికి ట్రంప్ నిష్క్రమించి జో బైడెన్ అమెరికా అధ్యక్షుడై శిఖరాగ్ర సదస్సుకు హాజరయ్యారు. వస్తూనే అందరికీ అభయమిచ్చారు. మళ్లీ ప్రపంచ సారథ్యాన్ని అమెరికా స్వీకరించి జీ-7కు అన్నివిధాలా అండదండలందిస్తుందని హామీపడ్డారు. అదే బైడెన్ గురువారం సదస్సుకు హాజరైనప్పుడు వాతావరణం పూర్తి భిన్నంగా ఉంది. ఒకపక్క ఉక్రెయిన్‌లో రష్యా దురాక్రమణ యుద్ధం ఎడతెగకుండా సాగుతోంది. గాజాలో ఇజ్రాయెల్ మారణకాండ సరేసరి. పాలస్తీనాపై విచక్షణారహితంగా విరుచుకుపడుతున్న ఇజ్రాయెల్‌కు పాశ్చాత్య దేశాలు, అమెరికా మద్దతిస్తున్నాయన్న ఆగ్రహంతో 1973లో ఒపెక్ దేశాలు చమురు సంక్షోభం సృష్టించినప్పుడు దానికి జవాబుగా జీ-7 ఆవిర్భవించింది. యాభైయ్యేళ్లు గడిచాక ఇప్పటికీ ఇజ్రాయెల్ తీరుతెన్నులు మారలేదు. అమెరికా మాత్రం ఆయుధాలందిస్తూనే గాజాలో దాడులు నిలపాలని ఇజ్రాయెల్‌ను బతిమాలుతోంది. మరోపక్క ఇటీవలే జరిగిన యూరోపియన్ యూనియన్ (ఈయూ) ఎన్నికల్లో యూరొప్ రాజకీయ ముఖచిత్రం మారుతున్న వైనం వెల్లడైంది. ముఖ్యంగా ఫ్రాన్స్, జర్మనీల్లో మితవాద పక్షాలు బలపడుతున్న ఆనవాళ్లు కనబడుతున్నాయి. అసలు జీ-7కు ఆతిథ్యమిస్తున్న ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీయే మితవాద పక్షానికి చెందినవారు. వీటన్నిటికీ అదనంగా ట్రంప్ సమస్య తోడైతే జీ-7 దేశాధినేతలు నిశ్చింతగా ఎలా ఉండగలరు?

ఇలా పీకల్లోతు సమస్యల్లో కూరుకుపోయినా ఈ ఏడాది ఆఖరుకల్లా ఉక్రెయిన్‌కు 5,000 కోట్ల డాలర్ల (రూ. 4లక్షల కోట్లుపైగా) రుణం అందించాలని గురువారం జీ-7 అధినేతలు తీర్మానించక తప్పలేదు. ఇది సాధారణ సాయమైతే రష్యా కూడా ఎప్పటిలా ఇది సరికాదని ఖండించి ఊరుకునేది. కానీ తాజా నిర్ణయంపై తీవ్రంగా స్పందించింది. ఎందుకంటే దురాక్రమణ యుద్ధం తర్వాత అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాల్లో రష్యాకున్న 30,000 కోట్ల డాలర్ల విలువైన స్థిరాస్తులతోపాటు నగదు రూపంలోవున్న సంపదను స్తంభింపజేశారు. ఇప్పుడు ఉక్రెయిన్‌కు ఆ ఆస్తులపై ఆర్జించిన వడ్డీ నుంచే రుణం అందజేయబోతున్నారు. నిజానికి గత రెండేళ్లుగా అమెరికా ఈ ప్రతిపాదన చేస్తున్నా ఈయూ దేశాలు తాత్సారం చేస్తున్నాయి. ఆ పని చేస్తే రష్యాను మరింత రెచ్చగొట్టినట్టు అవుతుందనీ, పొరుగునేవున్న తమపై అది నేరుగా దాడికి దిగే ప్రమాదం ఉంటుందనీ భావించాయి. కానీ అమెరికా ఎలాగైతేనేం నచ్చజెప్పి ఒప్పించింది. ఈయూలో ఎప్పుడూ భిన్న స్వరం వినిపించే ఫ్రాన్స్ బాహాటంగానే అమెరికా ప్రతిపాదనను వ్యతిరేకించింది. జీ-7 దేశాలన్నీ విరాళాలు సమకూర్చి, ప్రపంచ దేశాలనుంచి విరాళాలు సేకరించి ఈ రుణాన్ని అందిద్దామని ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ సూచించారు. కానీ చివరకు అమెరికా ఒత్తిడితో రష్యా ఆస్తులనుంచి వచ్చిన వడ్డీనుంచే ఇవ్వాలని తీర్మానించారు. 'ఇది నేరపూరిత చర్య. మానుంచి దుఃఖాన్ని మిగిల్చే స్పందన చవిచూడాల్సి వస్తుంది సుమా!' అని రష్యా హెచ్చరించింది. ఇప్పుడున్న నిబంధనల ప్రకారం ఏ దేశమైనా వేరే దేశం ఆస్తుల్ని స్తంభింపజేయటం పెద్ద కష్టం కాదు. కానీ వాటిని వినియోగించటానికి ఇప్పటికైతే న్యాయబద్ధమైన ప్రాతిపదికగానీ, విధానంగానీ లేవు. అమెరికా తనవరకూ చట్టపరమైన ఇబ్బందులు రాకుండా ఉక్రెయిన్ పౌరుల ఆర్థిక పునర్నిర్మాణం, అవకాశాల మెరుగుదల పేరిట రెపో చట్టం తీసుకొచ్చింది. ఈయూ ఇలాంటి చట్టమేమీ లేకుండానే రష్యా ఆస్తులనుంచి వచ్చిన లాభార్జనను పక్కనబెట్టింది. ఇప్పుడు జీ-7 అమెరికా మాదిరిగా ఒక చట్టాన్ని రూపొందించే అవకాశం ఉంది. కానీ అంతర్జాతీయ న్యాయసూత్రాల ప్రాతిపదిక లేకుండా, ఐక్యరాజ్య సమితి వంటి సంస్థల ప్రమేయం లేకుండా ఏవో కొన్ని దేశాలు ఈ తరహా చర్యలకు సిద్ధపడటం అనర్థదాయకం. ఇప్పటికే అమెరికా, పాశ్చాత్య దేశాలకు రష్యా ఒక హెచ్చరిక చేసింది. అగ్రరాజ్యాలు సరఫరా చేసిన భారీ విధ్వంసక ఆయుధాలను ఉక్రెయిన్ ఉపయోగిస్తే దాని పర్యవసానాలను ఆ దేశాలు కూడా అనుభవించాల్సి వస్తుందన్నది ప్రకటన సారాంశం. యుద్ధం మొదలైన నాటినుంచీ రష్యా ఆస్తులను చెరబట్టిన అగ్రరాజ్యాలు ఈ రెచ్చగొట్టే చర్యకు కూడా సిద్ధపడ్డాయంటే ఉన్న సంక్షోభాన్ని మరింత పెంచటమే అవుతుంది.

బైడెన్‌కూ, ట్రంప్‌కూ మధ్య ఒక్క చైనా విషయంలో మాత్రమే ఏకాభిప్రాయం ఉంది. దానిపై భారీగా సుంకాలు విధించాలన్నదే ఇద్దరి ఆలోచన. కానీ ఈయూ, నాటో, జీ-7లపై ట్రంప్ గతంలో కారాలూ మిరియాలూ నూరేవారు. 2018లో కెనడాలో జీ-7 సదస్సు జరిగినప్పుడు ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో సభ్యదేశాల మధ్య ఏకాభిప్రాయం కుదిరిందంటూ ప్రకటించిన వెంటనే ట్రంప్ అది అబద్ధమని కొట్టిపారేశారు. సంస్థలో రష్యాను చేర్చుకోవాలని ఒత్తిడి చేశారు. ఇటీవలే ఆయన నాటో దేశాలను తీవ్రంగా హెచ్చరించారు కూడా. తాను అధికారంలోకొచ్చాక నాటోనుంచి తప్పుకుంటామనీ, అటుపై రష్యా ఆ దేశాలను ఏంచేసినా పట్టించుకోబోమనీ తెలిపారు. ఇలాంటి స్థితిలో అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గటం ఎంతవరకూ సబబో జీ-7 ఆలోచించుకోవాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు. జ్యేష్ఠ మాసం, తిథి: శు.నవమి రా.12.52 వరకు, తదుపరి దశమి నక్షత్రం: ఉత్తర ఉ.7.33 వరకు, తదుపరి హస్త, వర్జ్యం: సా.4.51 నుండి 6.37 వరకు, దుర్ముహూర్తం: ఉ.5.36 నుండి 7.13 వరకు అమృతఘడియలు: రా.3.31 నుండి 5.18 వరకు.

సూర్యోదయం : 5.29
సూర్యాస్తమయం : 6.31
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

గొత్తికోయల 'అరణ్య' రోదన

విశ్లేషణ



పి. వేణుగోపాల్ రెడ్డి

వాళ్లకు గూడూ లేదు, నీడా లేదు... భూములూ లేవు, భుక్తీ లేదు... హక్కులు లేవు, అసలు గుర్తింపే లేదు. ఏ పేరుతోనైతే వాళ్లను పిలుస్తున్నామో అది వాళ్ల పేరే కాదు. పక్క రాష్ట్రం నుంచి పొరపాటునో గ్రహపాటునో తెలుగు నేలకు వలస వచ్చి దీనస్థితిలో జీవనపోరాటం సాగిస్తున్నారు. రాజ్యాంగ బద్ధంగా దక్కవలసిన హక్కుల కోసం చేయిచాచి ఆర్ద్రతగా ఆకాశం వైపు చూస్తున్నారు. ఆ వ్యథాభరిత ఆదివాసీలే 'గొత్తికోయలు'. రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలో 60 వేల మంది దాకా వీరు ఉన్నారు. రెండు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నప్పటికీ పలు ప్రాథమిక హక్కులను కూడా పొందలేక పోతున్నారు. ఈ అడవి బిడ్డలను షెడ్యూల్డ్ తెగలుగా గుర్తిస్తే కనీసం రాజ్యాంగం ప్రసాదించిన విద్యా ఉద్యోగ ప్రయోజనాలైనా దక్కుతాయి.

దండకారణ్యంలోని బస్తర్ అటవీ ప్రాంతం మధ్యప్రదేశ్‌లో భాగంగా ఉన్నప్పుడు 1980వ దశకం నుంచీ వామపక్ష తిరుగుబాటు ఉద్యమాలు ఊపందుకున్నాయి. అడవులపై నక్సలైట్ల ఆధిపత్యం పెరిగింది. ఆ తర్వాత రాష్ట్రాల పునర్విభజనలో ఈ ప్రాంతం ఛత్తీస్‌గఢ్‌లో భాగమైంది. నక్సలైట్లకు వ్యతిరేకంగా మహేంద్ర కర్మ అనే కాంగ్రెస్ నాయకుడు 2005లో సల్వా జుడుమ్ (గోండి భాషలో 'పవిత్ర వేట') పేరుతో ఆదివాసులతో సాయుధ పోరాటం మొదలుపెట్టారు. రెండువైపుల తుపాకి గర్జనల మధ్య ఆదివాసుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారింది. ఐతే సల్వా జుడుమ్ శిబిరాలలో తలదాచుకోవాలి, లేదంటే నక్సలైట్ల వేధింపులను భరించలేక ఊరొదిలి పారిపోవాలి.

అలా వేలాది మంది ఆదివాసులు ప్రాణాలు అరచేత పట్టుకొని దండకారణ్యంలోని పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, ఒడిశాలకు వలసపోయారు. తెలుగు రాష్ట్రాలలో వారిని గొత్తికోయలు అని పిలవడం మొదలుపెట్టారు. వాస్తవానికి గొత్తికోయలు అనే పేరు ఏ ఆదివాసీ తెగలకూ లేదు. గొత్తి అంటే కొండలు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అటవీ ప్రాంతంతో పోలిస్తే దండకారణ్యంలోని బీజాపూర్, సుకుమా, దంతేవాడ సముద్రమట్టం నుంచి ఎక్కువ ఎత్తులో ఉంటాయి. కాబట్టి ఎగువ ప్రాంతాల నుంచి వలస వచ్చిన కారణంగా వారిని గొత్తికోయలు అని వ్యవహరించడం మొదలుపెట్టారు. వారిలో ఎక్కువ శాతం గోండులలో ఉపజాతులైన మురియా తెగకు, మిగతావారు దొర్ల తెగకు చెందినవారు. 1980వ దశకం నుంచీ వలసలు సాగినప్పటికీ 2005 నుంచి 2011 మధ్య సల్వా జుడుమ్ కాలంలోనే అధిక శాతం ఆదివాసులు చెల్లాచెదురై ఇతర ప్రాంతాలకు తరలిపోయారు.

ఉన్నచోటి నుంచి దేశంలో మరో ప్రాంతానికి వలసపోయి, ఎటువంటి ఆదరువూ లేనివారిని స్వదేశ విస్థాపితులుగా (ఇంటెర్నల్లీ డిస్‌ప్లేస్డ్ పర్సన్స్–ఐడీపీస్) వ్యవహరిస్తారు. బస్తర్ ప్రాంతం నుంచి వలస వచ్చిన జనాభాకు సంబంధించి ప్రభుత్వాల వద్ద సరైన సమాచారం లేదు. ఆదివాసుల బాగు కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల లెక్కల ప్రకారం రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలో 60 వేల మంది దాకా గొత్తికోయలు ఉన్నారు. అడవి మధ్యలో పోడు చేసుకొని పొట్టపోసుకోవడం తప్ప వారికి మరో ఉపాధి మార్గం తెలియదు.

దేశీయంగా విస్థాపితులైన ఆదివాసుల గుర్తింపునకు, పునరావాసానికి కేంద్ర ప్రభుత్వం 2006లో అటవీ హక్కుల గుర్తింపు చట్టాన్ని (రికగ్నిషన్ ఆఫ్ ఫారెస్ట్ యాక్ట్- ఆర్ఓఎఫ్ఆర్) తీసుకువచ్చింది. 2008లో కొద్దిమంది స్థానిక గిరిజనులకు భూమిపై హక్కు కల్పించి, ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చినవారిని పక్కనపెట్టారు. ఆ చట్టం నిబంధనల ప్రకారం 2005 డిసెంబర్ 13కు ముందు వలస వచ్చి మూడు తరాలుగా 75 ఏళ్లపాటు సాగు చేసుకుంటున్న వాళ్లకే భూములపై హక్కు



దఖలు పడుతుంది. అందులోనూ ఒక్కొక్కరికి గరిష్ఠంగా నాలుగు హెక్టార్ల వరకు భూమిపై హక్కు కల్పిస్తారు. అయితే, ప్రస్తుతం భూమి హక్కుల కోసం ఎదురుచూస్తున్న గొత్తికోయలు 2016 తర్వాత వలస వచ్చారని అటవీ అధికారులు వాదిస్తున్నారు. అంతకు ముందటి ఉపగ్రహ చిత్రాలను తమ వాదనకు మద్దతుగా చూపుతున్నారు. అయితే, నిర్దిష్ట ప్రదేశానికి పరిమితం కాకుండా దట్టమైన అడవులలో పోడు చేసుకుంటూ జీవనం సాగించే ఆదివాసుల ఆచూకీని ఉపగ్రహాలు ఎలా నిర్ధారిస్తాయన్న వాదనను అధికారులు పట్టించుకోవడం లేదు.

రెండు రాష్ట్రాలలోని 28 జిల్లాల నుంచి దాదాపు 13 లక్షల ఎకరాల అటవీ భూములపై హక్కు కోసం నాలుగు లక్షలకు పైగా దరఖాస్తులు చేసుకున్నారు. 2006 నుంచి ఇటీవలి కాలం వరకు వీటిలో అధిక శాతం దరఖాస్తులను తిరస్కరించారు. దరఖాస్తుదారులలో మైదానప్రాంత గిరిజనేతరులు ఉన్నారనీ, అక్రమంగా అటవీ భూములు సొంతం చేసుకోవడానికి కొందరు ప్రయత్నిస్తున్నారనీ అధికారులు వాదిస్తున్నారు. దరఖాస్తుల తిరస్కారాలకే పరిమితమైన అధికారులు నామమాత్రంగానైనా అర్హులకు పట్టాలు అందించడం లేదు.

భూమి హక్కుతో సంబంధం లేకుండా అడవి బిడ్డలను షెడ్యూల్డ్ తెగలుగా గుర్తిస్తే కనీసం రాజ్యాంగం ప్రసాదించిన విద్యా ఉద్యోగ ప్రయోజనాలైనా వీరికి దక్కి ఉండేవి. రెండు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నప్పటికీ పలు ప్రాథమిక హక్కులను కూడా వారు పొందలేకపోతున్నారు. వాళ్ల పిల్లలకు విద్య ఇప్పటికీ ఒక కలగానే మిగిలిపోయింది. గొత్తికోయలు అడవి మధ్యలో ఉండటం వల్ల సుదూర మైదాన ప్రాంతాల్లోని పాఠశాలలకు వెళ్లలేరు. అక్కడక్కడ కొన్ని స్వచ్ఛంద సంస్థలు బ్రిడ్జ్ స్కూళ్లను ప్రారంభించినప్పటికీ, ప్రాథమిక విద్య తర్వాత ముందుకు సాగడం లేదు. బాలికలు తమ ఇళ్లలో పనులకు, చిన్న పిల్లలను చూసుకోవడం వరకే పరిమితమవుతున్నారు. బాలురు అతికష్టంగా హైస్కూలు దాకా వచ్చి అర్ధాంతరంగా ఆపేసి కూలీలుగా మారిపోతున్నారు. షెడ్యూల్డ్ తెగలుగా గుర్తింపు లేకపోవడం వల్ల ఉన్నత విద్యా సంస్థల్లో, వసతి గృహాల్లో ప్రవేశం పొందలేకపోతున్నారు. చదువులే ఇలా ఉన్నాయంటే, ప్రజారోగ్యం మరీ దయనీయంగా ఉంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అడవి బిడ్డలకు అందని చందమామలు. అప్పుడప్పుడు నర్సులు రావడం, గర్భిణులను సమీప ఆరోగ్య కేంద్రాలకు తీసుకుపోవడం మినహా మిగతావాళ్లకు ఎటువంటి వైద్య సౌకర్యాలు అందడం లేదు.

హక్కులు దక్కకపోవడమే కాకుండా పుండు మీద కారం చల్లినట్లు పోలీసు కేసులు గొత్తికోయలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. చాలా గూడేలలో వయసుతో నిమిత్తం లేకుండా పురుషులు సమీప పోలీసు స్టేషన్లకు వెళ్లి హాజరు వేసి రావలసి ఉంటుంది. అలా వెళ్లినవారితో చాకిరీ చేయిస్తుంటారు. అప్పుడప్పుడు తప్పుడు కేసులతో నిరుత్సాహ పరుస్తుంటారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ అధికారులు గిరిజన గూడేలను రెవెన్యూ గ్రామాలుగా గానీ, అటవీ గ్రామాలుగా గానీ గుర్తించరు. కాబట్టి, ప్రభుత్వ లెక్కల ప్రకారం గొత్తికోయల ఆవాసాలు మనుగడలో ఉండవు. తరచుగా అటవీ అధికారులు వారిని ఖాళీ చేయించడం, వారు మరో చోట గూడు చూసుకోవడం పరిపాటిగా మారింది.

గొత్తికోయలకు గుర్తింపు ఇవ్వాలనే విషయంలో రెండు రాష్ట్రాలలోని పాలక, ప్రతిపక్షాలకు అభ్యంతరాలు లేవు. కానీ తగిన చొరవ కరవైనందున సమస్య పరిష్కారం కావడం లేదు. ఇప్పటికైనా ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించి కాదువడిన అడవిబిడ్డలకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను అందించాలి. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామికులు, స్పందించే మనసున్న వ్యక్తులు కూడా దగా పడిన అడవి బిడ్డలకు ఊతమివ్వాలి. విద్య, వైద్యం వారికి అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేయాలి.

త్రిపురలో దశాబ్దాలుగా నలుగుతున్న ఇలాంటి సమస్యను కేంద్ర ప్రభుత్వం ఇటీవల పరిష్కరించింది. 1990వ దశకంలో మిజోరంలో జాతుల పోరాటం తీవ్రరూపం దాల్చింది. బ్రూ– రియాంగ్ తెగకు చెందిన ఆదివాసులు పెద్దఎత్తున త్రిపురకు వలస వెళ్లారు. మన గొత్తికోయల మాదిరిగానే వాళ్లు కూడా స్వదేశంలో శరణార్థులై గుర్తింపు, హక్కులు లేకుండా రెండు దశాబ్దాలు దయనీయమైన పరిస్థితుల్లో జీవించారు. 2020లో కేంద్ర ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించింది. వలస వచ్చిన 43 వేల మంది బ్రూ– రియాంగ్ ఆదివాసులకు త్రిపురలో పునరావాసం కల్పించింది. వాళ్లకు గుర్తింపునిచ్చి ఇళ్లు కట్టించింది. వాళ్ల జీవితాలలో వెలుగు నింపేందుకు తగిన ఏర్పాట్లు చేసింది. తెలుగు రాష్ట్రాల గొత్తికోయలు కూడా సరిగ్గా బ్రూ– రియాంగ్ ఆదివాసుల మాదిరిగానే ఇబ్బందులు పడుతున్నారు. రెండు రాష్ట్రాలు సత్వరం స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలి.

వ్యాసకర్త ఏకలవ్య ఫౌండేషన్ ఛైర్మన్ । pvg@ekalavya.net

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాటలు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

జైలు విడిది

అత్యాచార కేసులో నిందితుడైన గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ (డేరా సచ్చా సౌదా అధిపతి) పది నెలల్లో తన ఎనిమిదో పెరోల్‌కు దరఖాస్తు చేసుకున్నారు. చూస్తుంటే ఆయన శిక్ష అనుభవిస్తున్నట్లు లేదు: 'జైల్ టుఎస్‌టికి వెళ్తున్నట్టున్నారు.
- కాశోర్ శ్రీనివాసన్, స్టాండప్ కమెడియన్

వారిదే గెలుపు

ఒక పందెం కాస్తాను: జరుగుతున్న విషయాలను గమనిస్తే మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలను శరద్ పవార్, ఉద్ధవ్ ఠాకరే ఊడ్చేయనున్నారు. ఊడ్చేస్తారంతే!
- సుహేల్ సేఠ్, నట రచయిత

ఎలా లెక్కేస్తారు?

ఇండియాలో వేసేది రహస్య ఓటు. ఎవరు ఎవరికి వేశారో ఎవరికీ తెలీదు. అలాంటిది దళితులు, ముస్లింలు అంటూ వర్గీకరించే ఓట్ల సంఖ్యలు ఎలా వస్తాయి? సాధారణంగా ఎగ్జిట్ పోల్స్ నుంచి ఇవి తీసుకుంటారు. కానీ విశ్వసనీయత లేని ఎగ్జిట్ పోల్స్ నుంచి ఈ సంఖ్యలను తీసుకోవచ్చా? తీసుకోకూడదు. అందుకే చాలామంది తమ అంకెల సోర్సులను వెల్లడించరు.
- వీర్ సంఘ్వీ, జర్నలిస్ట్

పెరిగిన బడ్జెట్

పాకిస్తాన్ పన్ను రెవెన్యూ సాపేక్షంగా తక్కువే. కానీ దాని రక్షణ వ్యయం చాలా ఎక్కువ. సైన్యమే దేశానికి అసలు పాలిక అయి నందువల్ల కావొచ్చు. దివాళా తీసిన పాకిస్తాన్ ఇప్పటికే ఐఎంఎఫ్ (అంతర్జాతీయ ద్రవ్య నిధి) నుంచి ఆర్థిక సహాయం (బెయిల్ అవుట్) తీసుకుంది. మళ్లీ కోరుతోంది. అయినప్పటికీ తన భారీ రక్షణ బడ్జెట్‌ను 17.6 శాతం పెంచింది.
- బ్రహ్మ చెల్లానీ, వ్యూహాత్మక అంశాల వ్యాఖ్యాత

నీచమైన మీమ్స్

ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, ఇండియా ప్రధాని మోదీలను ఉద్దేశించి చేస్తున్న మీమ్స్‌కు అదుపు లేకుండా పోయింది. అవి నీచంగా ఉండటమే కాదు, ఇండియాలో ఉన్న హాస్యానికి అధమ స్థాయి ప్రతిబింబాలు.
- ప్రియాంక చతుర్వేది, రాజ్యసభ ఎంపీ

అడగనేకూడదా?

వేసవి సెలవులను పిల్లలు అమ్మమ్మ దగ్గర గడుపుతున్నారు. ఆమె పిల్లల అపభాషను (స్లాంగ్), తనలోని సహనపు విల్వలను కొత్తగా గుర్తిస్తోంది. పొద్దున్నే ఆమె నుంచి ఆందోళనతో కూడిన మెసేజ్: "స్నానం చేయమని అడిగితే వాడు నన్ను 'క్యాజువల్ ఇన్‌సల్ట్' చేశానని నిందిస్తున్నాడు. ఇంతకీ అదేమిటది?"
- శమితా రవి, ఆర్థికవేత్త

జాతీయ గీతంతో...

మొదటిసారి జమ్ము, కశ్మీర్ విద్యాశాఖ అన్ని పాఠశాలల్లో ఉదయపు అసెంబ్లీని జాతీయ గీతం 'జన గణ మన'తో ప్రారంభించాలని ఆదేశించింది. 1950ల నుంచి 80ల వరకు పాఠశాలలు 'లబ్ పే ఆతీ హై దువా' లాంటి భిన్న ప్రార్థనలతో మొదలుపెట్టేవి. కొన్ని 'సారే జహా సే అచ్ఛా', 'జన గణ మన'ను కూడా కలిపేవి. 1990ల్లో మిలిటెన్సీ తర్వాత చాలా పాఠశాలలు దేశభక్తి గీతాలను వదిలేసి, 'యా రబ్ దిల్-ఎ-ముస్లిం కోను' స్వీకరించాయి. కొత్త ఆదేశం 'జన గణ మన'ను తప్పనిసరి చేసింది.
- అహ్మద్ అలీ ఫయాజ్, జర్నలిస్ట్

ఇన్ బాక్స్

రాజకీయాలకు చట్టం బలి

ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరించిన తరువాత సంతకం చేసిన ఫైళ్లలో ఒకటి ల్యాండ్ 'టైటిల్ గ్యారంటీ చట్టం రద్దు' ఫైల్. అభివృద్ధి చెందిన దేశాల్లో అమలవుతున్న టైటిల్ గ్యారెంటీ చట్టాన్ని భూ సంస్కరణలలో భాగంగా భారత దేశంలో మొట్టమొదటిసారి అమలు చేసిన రాష్ట్రం ఆంధ్ర ప్రదేశ్. ఒక్కో గ్రామంలో భూ సమస్య పరిష్కారం కావడానికి తరతరాలు పడుతోంది. దీన్ని నివారించడానికి తెచ్చినదే 'టైటిల్ గ్యారంటీ చట్టం.' అప్పుడెప్పుడో శతాబ్దాల క్రితం చేసిన సర్వే తప్ప ఇటీవలి కాలంలో భూసర్వే జరగనే లేదు. అందుకే ఈ కొత్త చట్టం ప్రకారం సమగ్ర భూ సర్వే, డిజిటల్ ల్యాండ్ సర్వే చేసి ఏమైనా సమస్యలు ఉంటే సర్వే సెటిల్మెంట్ ఆఫీసర్ ఆధ్వర్యంలో అక్కడికక్కడే పరిష్కరించి పట్టా పాస్ బుక్కులు ఇచ్చారు. అయినా ఎన్నికల్లో దీన్ని ఎందుకు ప్రచారాస్త్రం చేశారు? 'సింగిల్ సెటిల్మెంట్‌తో భూ సమస్య పరిష్కారం అయితే మేమేం కావాలి? మా పూట ఎలా గడవాలి' అని గ్రామాల్లో పూట గడుపుకునే పెద్ద మనుషుల నుండి రైతులను చెప్పులు అరిగేలా కోర్టుల చుట్టూ తిప్పుతూ ఉన్న న్యాయవాదుల వరకు వ్యతిరేకించారు. అందుకే ఈ చట్టం ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచార అస్త్రంగా మారింది.

తెలంగాణలో గొప్పలకు పోయి తెచ్చిన పట్టాదార్ పాస్ బుక్ చట్టం – 2020, 'ధరణి' పోర్టల్ వంటివి పెద్ద అక్రమాలకు తావిచ్చాయి. అందుకే ఆంధ్ర ప్రదేశ్‌లో చేసిన టైటిల్ గ్యారంటీ చట్టాన్ని ఆదర్శంగా తీసుకుని తెలంగాణలో కూడా ఈ చట్టాన్ని ఉదాహరణగా తీసుకుని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తుంటే నలభై సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ అనుభవం, గుడ్ గవర్నెన్స్, గుడ్ అడ్మినిస్ట్రేషన్ లాంటి సర్టిఫికెట్లు ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ చట్టాన్ని ఎన్నికల ప్రచార అస్త్రంగా ఎందుకు మలిచారు? అధికారం చేపట్టగానే రెండో సంతకం ఈ ఫైల్ మీదే ఎందుకు చేసినట్టు? ఈ సందర్భంగా భూ చట్టాల న్యాయ నిపుణులు 'మంచి చట్టాన్ని చెత్త రాజకీయాలు చంపేశాయ'ని అంటున్నారు.
- బండెల సురేందర్ రెడ్డి, మాజీ సైనికుడు

దాయాది శత్రుత్వం

అభిప్రాయం



సంగిరెడ్డి హనుమంత రెడ్డి

భారత యుద్ధం దాయాదుల పోరే. అయితే ఒకరిని ధర్ములని, మరొకరిని అధర్ములని అంటాం. సామ్రాజ్యవాద యుద్ధోన్మాదులెవరు? ప్రజాకంటకులెవరు? స్త్రీలను విధవలను, పిల్లలను అనాథలను చేసిందెవరు? ఈ దృష్టితో రాజకీయనాయకులను విశ్లేషించాలి. బంధుమిత్ర, రాజకీయాధికార దాయాదులుంటారు. కొన్నిసార్లు రెండు దాయాదిత్వాలు కలుస్తాయి.

కాంగ్రెస్‌కు పిల్ల కాంగ్రెస్‌లు కొంత నష్టంచేశాయి. ఇందిర చతురత, అవసర వామపక్ష సమర్థక చర్యలు కాంగ్రెస్‌ను బలోపేతం చేశాయి. ఆమెకు పాతతరం కాంగ్రెస్‌వాళ్ల వలన జరిగిన నష్టం కంటే, వారికి ఆమెతో నష్టం ఎక్కువ జరిగింది. మోదీ దాయాదిత్వంతో ఆడ్వాణీ, మురళీ మనోహర్ జోషి, జస్వంత్ సింగ్, యశ్వంత్ సిన్హా, అరుణ్ శౌరి వగైరాల రాజకీయ జీవితాలు మాయమయ్యాయి. బీజేపీ అగ్రనాయక ద్వయం గడ్కరీ ఓటమికి విఫలయత్నం చేసిందట. మహారాష్ట్ర శివసేన, నేషనల్ కాంగ్రెస్‌లు దాయాదిత్వంతో చీలాయి. తెలుగు దేశంలో ఎన్టీఆర్ –చంద్రబాబు, చంద్ర బాబు–కేసీఆర్‌ల రాజకీయ దాయాది ద్వేషాలు తెలుగు రాష్ట్రాలకూ, దేశానికీ నష్టం చేశాయి. ఆంధ్ర తాజా పూర్వ ముఖ్యమంత్రికి బంధుమిత్ర దాయాదులతో నష్టం జరిగింది. ప్రతిపక్ష కూటమికి ఊహించని విజయం దక్కింది. వామపక్షాల నుండి పెట్టుబడిదారీ పార్టీలకు మారినవారి దాయాదిత్వం వామపక్ష వ్యతిరేక విమర్శలకు తావిచ్చింది. వారికి భావజాల నష్టం కలిగించింది. ప్రతి పార్టీలో కుల మత లింగ వివక్షతలున్నాయి. మహిళా రిజర్వేషన్‌కు పెట్టుబడిదారీ పార్టీల మగ దాయాదిత్వమే అడ్డంకి.



సంకీర్ణ పక్షాలే నేడు మోదీకి దాయాదులు. మిత్రులుగా విడిపోగానే, పాత పొత్తును మర్చి ఉక్రోషంతో తిట్టుకున్నారు. పలుమార్లు కలిసి విడిపోయి కలిసిన మోదీ, అమిత్, నితీశ్, బాబు తీవ్రంగా తిట్టుకున్నారు. అధికార కాంక్షతో కలిసినపుడు పాత తిట్లు గుర్తుకురావా?

సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రజలకు నేరుగా చేరాలి. దళారీలకు, కార్పొరేట్లకు లాభం చేయరాదు. అర్హులందరికీ కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ప్రయోజనాలు అందాలి. సమాజాన్ని వర్గ, వర్ణ రహితానికి చేర్చాలి. ఈ ఉన్నత దశకు చేరిన పౌరులు రెండు తరాల వరకు ఆ పాలకులను మరువరు.

ఓట్ల కోసమే ఐనా సంక్షేమ పథకాలను తరతమ భేదాలతో అన్ని పార్టీలు ప్రకటిస్తాయి. బెంగాల్‌లో వామపక్ష ప్రభుత్వం కల్పించిన ప్రజా సౌకర్యాలను తృణాముల్ కాంగ్రెస్ రద్దుచేయలేదు. మరింత మెరుగుపరచింది. స్కాండినేవియన్ దేశాల్లో గత వామపక్ష, సోషలిస్టు ప్రభుత్వాల సంక్షేమ రాజ్య పథకాలను నిన్నటి మధ్యేమార్గ పాలకులు కాని, నేటి మతవాద పాలకులు కాని రద్దు చేయలేకున్నారు. సామ్రాజ్యవాద అమెరికా ఉచ్చులో పడి ప్రపంచీకరణ పథకాలను అనుమతించారు. బహుళజాతి సంస్థలకు సాయపడుతున్నారు. కాని, ప్రజాసంక్షేమాన్ని తగ్గించలేదు.

మన రాజకీయులు పోటీపడి అవసరాలను, అమలు అవకాశాలను పరిశీలించకుండా, ఎన్నికల ఎత్తుగడతో కొత్త పథకాలను, పాత పథకాల లబ్ధిని పెంచుతున్నారు. కాని మరో రూపాల్లో ప్రజల నుండి డబ్బు వసూలు చేస్తున్నారు. ఆస్తులు, అధికారాలు వెంటరావు. గుణగణాలు చరిత్రలో నిలుస్తాయి. విభేదాలకు, కలహాలకు... కలిసి మాట్లాడుకోడం, చర్చలే ఏ సమస్యకైనా పరిష్కారం చూపుతాయి.

వ్యాసకర్త ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి, నాగపూర్ నుండి । 94902 04545

శాంతాత్ముల సహనం

సీతమ్మను లంకాధిపతియైన రావణుడు అపహరించి తీసుకువెళ్ళి లంకలోని అశోకవనంలో దాచాడు. అది తెలుసుకున్న శ్రీరాముడు వెంటనే సముద్రాన్ని దాటి లంకకు చేరే ప్రయత్నం మొదలుపెట్టాడు. తెప్పలు కట్టుకుని దాటడానికి ఎదురుగా ఉన్నది చిన్న నది కాదు కాబట్టి, సముద్రుడిని ప్రసన్నం చేసుకోవడం ఒక్కటే మార్గం అని విభీషణుడు సలహా ఇచ్చాడు. దాన్ని అంగీకరించాడు శ్రీరాముడు. సముద్రుడిని దారి వదలమని ప్రార్థించడానికి పూనుకున్నాడు. సముద్ర తీరంలోని ఇసుకపై దర్భలతో తయారుచేయబడిన చాపమీద తన కుడిభుజాన్ని తలగడగా చేసుకుని శయనించి ఏకాగ్ర చిత్తంతో సాగరుడిని ప్రసన్నం కమ్మని ప్రార్థించాడు. అలా ప్రార్థిస్తూ ఉండగా విభావరులొక మూడు గడిచాయట! అనగా మూడు రాత్రులు గడిచాయి శ్రీరాముడి జీవితంలో! మూడురోజులు ప్రార్థించినప్పటికీ సముద్రుడి నుండి సమాధానం రాకపోవడంతో సహనం కోల్పోయాడు శ్రీరాముడు. పక్కనే ఉన్న లక్ష్మణుడితో 'తమ్ముడా, ఈ సముద్రుడు నన్ను అసమర్థుడిగా జమకట్టాడు. ఇతడితో సహనం పాటించడం వివేకంతో కూడుకున్న పని కాదు. ఇతడు దారికి రావాలంటే దండన ఒక్కటే ఇప్పుడు మిగిలున్న మార్గం. బాణాగ్ని చేత ఈ సాగరుడిని శోషింపజేసి, మన సైన్యం నడిచి వెళ్ళడానికి దారి కల్పిస్తాను!' అని శక్తిమంతమైన ఒక బాణాన్ని సంధించి సముద్రుడి మీదికి వదిలాడు శ్రీరాముడు. దశదిశలలో దారుణ అగ్నిశిఖలను విరజిమ్ముతూ ఆ బాణం సముద్రంలో ప్రవేశించగానే, నిలువెల్లా వణికిపోతూ సముద్రుడు పరుగున వచ్చి శ్రీరాముడి ముందు నిలిచాడు. సముద్రుడి అప్పటి అవస్థను ఏనుగు లక్ష్మణకవి తన 'రామేశ్వర మాహాత్మ్యము', ప్రథమాశ్వాసంలోని ఈ క్రింది కంద పద్యంలో అలతి మాటలలో వర్ణించాడు.



జ్యోతిర్మయం

కోపంబు సంహరింపుము
నీ పదకమలములు గొలిచి నిల్చిన నన్నుం
జేపట్టుము మైమ్మెద, నా
చాపలము సహింపు రామ సద్గుణధామా!

'కోపాన్ని ఉపసంహరించుకో శ్రీరామా! నీ పాదములపై వాలి వేడుకుంటున్న నన్ను సేవకుడిగా భావించి ఆదరించు! సద్గుణాలకు నెలవైన ఓ స్వామీ, నా తెలివితక్కువ చేష్టకు నన్ను దయతో మన్నించు!' అని సముద్రుడు వేడుకున్నాడు. ధీరులు, శాంతాత్ములు, పరమాత్మ స్వరూపులుగా ఉండేవారి సహనాన్ని పరీక్షించే చాపల్యపు పనికి పూనుకుంటే, సముద్రుడంతటి వాడికైనా భంగపాటు తప్పదని పై సన్నివేశం బోధిస్తుంది.
- భట్టు వెంకటరావు

కేటీఆర్, ఈసీకి నోటీసులు

• పిటిషనర్ అభ్యంతరాలపై కౌంటర్ దాఖలుకు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో సిరిసిల్ల నుంచి గెలిచిన కేటీఆర్ ఎన్నిక చెల్లదంటూ దాఖలైన పిటిషన్‌లో ఆయనతో పాటు ఎన్నికల కమిషన్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పిటిషనర్ అభ్యంతరాలపై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సిరిసిల్ల నుంచి బీఆర్ఎస్ తరఫున కేటీఆర్, కాంగ్రెస్ తరఫున కేకే మహేందర్‌రెడ్డి పోటీ చేశారు. 29,687 ఓట్ల మెజారిటీతో కేటీఆర్ విజయం సాధించారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో 32 ఎకరాల భూమి, శివారు వెంకటాపూర్‌లో మరో 4 ఎకరాలు కేటీఆర్ కొడుకు హిమాన్షు పేరు మీద ఉందని, కానీ ఎన్నికల అఫిడవిట్‌లో ఆ ఆస్తులను ప్రస్తావించలేదని, పూర్తి సమాచారం ఇవ్వలేదు కనుక ఆయన ఎన్నిక చెల్లదని మహేందర్‌రెడ్డి హైకోర్టులో ఎన్నికల పిటిషన్(ఈపీ) దాఖలు చేశారు. లక్షల రూపాయల విలువైన ఈ భూములను హిమాన్షు సొంత డబ్బుతో కొనే అవకాశం లేదన్నారు. కేటీఆర్ ఎన్నికను సవాల్ చేస్తూ సిరిసిల్లకు చెందిన న్యాయవాది శ్రీనివాస్ అనే వ్యక్తి మరో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు శుక్రవారం విచారణ చేపట్టారు. వాటిని పరిశీలించిన న్యాయమూర్తి.. పిటిషనర్ అభ్యంతరాలపై వాదనలతో కౌంటర్ దాఖలు చేయాలని కేటీఆర్‌తో పాటు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, రిటర్నింగ్ అధికారి(ఆర్వో)కి నోటీసులు జారీ చేశారు.

పుస్తకాల్లో తప్పుల ఎఫెక్ట్

• విద్యాశాఖలో అధికారుల బదిలీ • బాధ్యులపై సర్కార్‌కు నివేదిక

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో 1-10 తరగతులకు పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాల్లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహా మాజీ మంత్రులు పేర్లతో పీఠిక రూపొందించిన వ్యవహారంపై ప్రభుత్వం సీరియస్ అయింది. ఇద్దరు అధికారులపై బదిలీ వేటు వేసింది. ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ రాధారెడ్డి, ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణ సంస్థ డైరెక్టర్ ఎస్ శ్రీనివాసచారిని బదిలీచేస్తూ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. రాధారెడ్డిని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. ఈ స్థానంలో ఉన్న గాజుర్ల రమేష్‌ను ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. ఇక శ్రీనివాసచారికి మోడల్ స్కూల్ డైరెక్టర్‌గా పూర్తిస్థాయి బాధ్యతలప్పగించగా, ఆయన స్థానంలో తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (టీఆర్ఈఐ) కార్యదర్శి సీహెచ్ రమణకుమార్‌కు పాఠ్యపుస్తక ముద్రణ సంస్థ డైరెక్టర్‌గా బాధ్యతలు అప్పగించారు.

ఆ ఇద్దరి నిర్లక్ష్యం వల్లనే..

రాధారెడ్డి, శ్రీనివాసచారి నిర్లక్ష్యం వల్లే తప్పిదం జరిగిందని భావించిన అధికారులు ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్టు తెలిసింది. పుస్తకాల్లో పేర్లున్న విషయం బయటకి పొక్కగానే తొలుత ఆయా పేజీని చింపివేయాలని తొలుత మౌఖిక ఆదేశాలిచ్చారు. ఆ మేరకు పలు జిల్లాల్లో ఆయా పేజీలను చింపివేశారు. ఆ తర్వాత గురువారం నాడు తెలుగుభాషా పుస్తకాలను ఎమ్మార్సీలకు, జిల్లా గోడౌన్‌లకు రిటర్న్‌చేయాలని డీఈవోలకు ఆదేశాలిచ్చారు. శుక్రవారం పేర్లున్న పేజీని కత్తిరించి కవర్ పేజీ వెనుకవైపు గమ్‌తో లేదా ఫెవికాల్‌లతో అతికించాలని ఆదేశాలిచ్చారు. తొలుత చింపిపారేసిన స్కూళ్లలో ఆయా పేజీలు దొరక్కపోవడంతో ఒక పేజీని జిరాక్స్ తీసి టీచర్లు అతికించాల్సి వచ్చింది. మొత్తంగా ముందు చింపివేయాలని, ఆ తర్వాత వెనక్కి ఇవ్వాలని, మళ్లీ అతికించాలని ఆదేశాలివ్వడం గందరగోళానికి దారి తీసింది.

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సర్వీసుల సిబ్బంది గడువు పొడిగింపు

• జూలై 31 వరకు కొనసాగించాలని ఆర్థికశాఖ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, గౌరవ వేతన ప్రాతిపదికన పనిచేస్తున్న సిబ్బంది సర్వీసులను మరో నాలుగు నెలల పాటు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అన్ని ప్రభుత్వ శాఖలకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శుక్రవారం మెమో జారీ చేశారు. ఈ ఏడాది మార్చి 31తో గడువు ముగిసిన సదరు సిబ్బంది సేవలను జూలై 31వ తేదీ వరకు అనుమతిస్తున్నామని, ఈ సిబ్బందికి సకాలంలో వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆ మెమోలో కోరారు. ఈ ఉత్తర్వులు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, గౌరవ వేతనం, ఎంటీఎస్, దినసరి కార్మికులు, పార్ట్‌టైం, ఫుల్‌టైం, గెస్ట్, గంటల ప్రాతిపదికన పనిచేసే సిబ్బందికి వర్తిస్తుందని పేర్కొన్నారు.

పోలీస్ సిబ్బంది పిల్లలకు పరివర్తన్ స్కాలర్‌షిప్‌లు

సాక్షి, హైదరాబాద్ : మృతి చెందిన పోలీస్ సిబ్బంది పిల్లలకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు 'పరివర్తన్' స్కాలర్‌షిప్‌లను అందిస్తోంది. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి 58 మందికి పోలీస్ అకాడమీ డైరెక్టర్, ఇన్‌చార్జ్ వెల్ఫేర్ అడిషనల్ డీజీ అభిలాష బిష్త్ శుక్రవారం డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో స్కాలర్‌షిప్‌లు అందించారు. ఈ మేరకు రూ.14.87 లక్షల చెక్కులను విద్యార్థులకు పంపిణీ చేశారు. చనిపోయిన పోలీస్ సిబ్బంది కుటుంబాలలోని ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు చదువుతున్నవారికి హెచ్‌డీఎఫ్‌సీ పరివర్తన స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నారు. గత మూడేళ్లలో 151 మందికి పరివర్తన్ స్కాలర్‌షిప్ అందించారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో అకౌంట్ కలిగి ఉండి ప్రమాదవశాత్తూ మరణించిన 11 మంది హోంగార్డుల కుటుంబాలకు రూ.3.75కోట్లు, హెచ్‌డీఎఫ్ బ్యాంకు ఖాతా ఉండి మరణించిన 16 మంది పోలీసు సిబ్బందికి రూ.4.44 కోట్లు గతంలో పంపిణీ చేసినట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌డీఎఫ్‌సీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ విశాల్ భాటియా, డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణ రావు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

జేఈఈ ర్యాంకర్ వినతిపై ఏ నిర్ణయం తీసుకున్నారు?

• కేంద్రాన్ని అడిగి చెప్పాలన్న హైకోర్టు
• ఇంటర్‌లో ఫెయిలవడంతో సర్టిఫికెట్ వెరిఫికేషన్ వాయిదాకు విద్యార్థి వినతి

సాక్షి, హైదరాబాద్: జేఈఈ కౌన్సెలింగ్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు సంబంధించి పిటిషనర్ అధికారులకు ఇచ్చిన వినతిపత్రంపై ఏం నిర్ణయం తీసుకున్నారో వివరాలు తెలుసుకుని చెప్పాలని కేంద్ర ప్రభుత్వ న్యాయవాదిని హైకోర్టు ఆదేశించింది. ఈ నెల 18 వరకు గడువు విధించింది. జేఈఈలో ర్యాంక్ వచ్చినా ఇంటర్‌లో ఫెయిల్ అయ్యానని, అందువల్ల అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు వచ్చిన తర్వాతే తన సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరిగేలా అవకాశం ఇవ్వాలని కోరుతూ విద్యార్థి భూక్యా లోహిత్ ఈ నెల 7న ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ)కు వినతిపత్రం సమర్పించారు. దీనిపై ఏఐసీటీఈ నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో విద్యార్థి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి శుక్రవారం విచారించారు. కేంద్ర ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి, ఏఐసీటీఈ చైర్మన్, నేషనల్ టెస్ట్ ఏజెన్సీ సీనియర్ డైరెక్టర్‌కు నోటీసులు జారీ చేశారు.

గ్రూప్-2 దరఖాస్తులో సవరణకు అవకాశం

సాక్షి, హైదరాబాద్: గ్రూప్-2 ఆన్‌లైన్ దరఖాస్తులో పొరపాట్ల సవరణకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అవకాశం కల్పించింది. ఈనెల 16 ఉదయం 10 గంటల నుంచి 20వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అభ్యర్థులు కమిషన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు పత్రాన్ని తెరిచి వివరాలను సవరించుకోవచ్చని సూచించింది. ఈమేరకు కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

క్రిస్టినా వర్సెస్ రవీందర్‌నాయక్

• వైద్య,ఆరోగ్యశాఖ కార్యదర్శిపై మంత్రికి డీహెచ్ ఫిర్యాదు
• తనను అవమానించారని ఆరోపణ

సాక్షి, హైదరాబాద్: వైద్య,ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. చివరకు మంత్రి దామోదర రాజనర్సింహకు ఫిర్యాదు చేసేవరకూ పరిస్థితి వెళ్లింది. వైద్య,ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూ తరచు తనను అవమానిస్తున్నారంటూ మంత్రికి ప్రజారోగ్యసంచాలకులు రవీందర్ నాయక్ ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమైంది. బ్లడ్ బ్యాంకుల పనితీరు, బ్లడ్ బ్యాంకుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌పై గురువారం సెక్రటేరియట్‌లో మంత్రి సమీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ సమీక్షకు ముందు వైద్య,ఆరోగ్యశాఖలో పలు విభాగాల హెచ్ఓడీలు కార్యదర్శి క్రిస్టినాను కలిశారు. ఈ క్రమంలో బ్లడ్ బ్యాంకుల పనితీరు గురించి ఆమె ఆరా తీశారు. తన వద్ద బ్లడ్ బ్యాంకుల సమాచారం ఏదీ లేదని డీహెచ్ రవీందర్‌నాయక్ చెప్పడంతో ఆమె అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. సమాచారం లేకుండా సమీక్షకు ఎందుకు వచ్చారని ఆగ్రహం వ్యక్తం చేసింది. సమీక్షకు హాజరుకావాల్సిన అవసరం లేదని, తిరిగి ఆఫీసుకు వెళ్లి ఇతర పనులు చూసుకోవాలని డీహెచ్‌ను ఆమె పంపినట్టు తెలిసింది. అవమానంగా భావించిన రవీందర్‌నాయక్ అక్కడి నుంచి నేరుగా మంత్రి చాంబర్‌కు వెళ్లారు. జరిగిన వ్యవహారం మొత్తాన్ని మంత్రికి ఫిర్యాదు చేశారు. చివరకు ఆయన లేకుండానే సమీక్ష జరిగింది.

ఐసెట్‌లో 71,647 మంది పాస్

• అమ్మాయిలదే పైచేయి
• ఫలితాలు విడుదల చేసిన వాకాటి కరుణ



టాప్ ర్యాంకర్లు వీరే..



1 హుస్సేన్ హైదరాబాద్ | 2 జల్లా భరత్ రంగారెడ్డి | 3 కందాల లాస్య రంగారెడ్డి | 4 రిషికారెడ్డి నిజామాబాద్ | 5 శివకుమార్ విజయవాడ
6 బి.లక్షిత్ మల్కాజిగిరి | 7 బొమ్మన రాణి విజయనగరం | 8 గంగా షిండే హైదరాబాద్ | 9 అరుణ్ సింగ్ రంగారెడ్డి | 10 రవళి ఖమ్మం

సాక్షి, హైదరాబాద్ : మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్, మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 5, 6 తేదీల్లో నిర్వహించిన ఉమ్మడి ప్రవేశపరీక్ష (టీజీఐసెట్) ఫలితాలను కాకతీయ విశ్వవిద్యాలయ వీసీ వాకాటి కరుణ శుక్రవారం విడుదల చేశారు. ఈ సెట్‌లో 91.92 శాతంమంది అర్హత సాధించారు. ఇందులోనూ మహిళలే పైచేయి సాధించారు. పురుషులు 33,928 మంది పాసయితే, మహిళలు 37,718 మంది ఉత్తీర్ణులయ్యాయి. ఒక ట్రాన్స్‌జెండర్ కూడా అర్హత సాధించింది. ఉన్నత విద్యామండలి కార్యాలయంలో జరిగిన ఫలితాల విడుదల కార్యక్రమంలో మండలిచైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, వైస్ చైర్మన్లు వి.వెంకటరమణ, ఎస్‌కే.మహ్మమూద్, సెట్ కన్వీనర్ ఎస్.నర్సింహాచారి పాల్గొన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది ఐసెట్‌కు 11 వేల మంది అదనంగా హాజరైనట్లు లింబాద్రి తెలిపారు. రాష్ట్రంలో 272 ఎంబీఏ కాలేజీల్లో 35,949 సీట్లు, 64 ఎంసీఏ కాలేజీల్లో 6990 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

	పరీక్ష రాసిన వారు	అర్హత సాధించిన వారు
పురుషులు	36,806	33,928
మహిళలు	41,135	37,718
ట్రాన్స్‌జెండర్	1	1

ఏ యూనివర్సిటీ పరిధిలో ఎంతమంది?

యూనివర్సిటీ	రాసిన వారు	అర్హులు
ఉస్మానియా	72,043	66,104 (91.76%)
ఆంధ్ర వర్సిటీ	1,508	1,439 (95.42%)
శ్రీ వెంకటేశ్వర	610	578 (94.75 %)
ఇతర వర్సిటీలు	3,781	3,526 (93.26 %)
మొత్తం	77,942	71,647

ఏ పాము కరిచిందని అడుగుతారని..

ఆ పామును చంపి ఆస్పత్రికి తీసుకెళ్లాడు

• వరంగల్ జిల్లాలో వృద్ధురాలికి పాముకాటు
• ఆ పామును చంపిన కొడుకు వరుసైన వ్యక్తి



రాయపర్తి(వరంగల్): తన పెద్దమ్మ పాముకాటుకు గురికాగా, ఆస్పత్రికి వెళితే వైద్యులు ఏ పాము కరిచిందనే ప్రశ్నలు వేస్తారని ముందుగానే ఊహించిన వరుసకు కుమారుడయ్యే వ్యక్తి ఆ పామును చంపి మరీ ప్లాస్టిక్ సంచిలో వేసుకొచ్చాడు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం దమ్మన్నపేటకు చెందిన వృద్ధురాలు మేరుగు ఎల్లమ్మ వరండాలో కూర్చోగా, వీపుపై పాము కాటువేసింది. దీంతో ఆమె కేకలువేయడంతో రమేశ్ అక్కడికి చేరుకుని పామును చంపేశాడు. వెంటనే ఎల్లమ్మను చికిత్స నిమిత్తం వర్ధన్నపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చాడు. అనంతరం వైద్యులు ఎల్లమ్మకు వైద్యం అందించారు. ప్రస్తుతం ఎల్లమ్మ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు చెప్పారు.

త్వరలో 13 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తాం

• రోడ్లు, భవనాల శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లంల గ్రామంలో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ హరిచందన, ఎస్పీ చందనాదీప్తి

నార్కట్‌పల్లి: త్వరలోనే 13,000 కొత్త టీచర్ పోస్టులను భర్తీ చేస్తామని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణవెల్లంల గ్రామంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు నోట్‌బుక్స్, యూనిఫాం అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేశారు. అంతకు ముందు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. బాత్‌రూమ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రూ.600 కోట్లు విడుదల చేసి ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. నాలుగు నెలల్లో బ్రాహ్మణ వెల్లంల-ఉదయ సముద్రం ప్రాజెక్టులో నీళ్ల నింపి డిసెంబర్‌లోపు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నీటి విడుదలను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, నల్లగొండ కలెక్టర్ హరిచందన, ఎస్పీ చందనాదీప్తి, డీఈఓ భిక్షపతి, పంచాయతీరాజ్ ఈఈ భీమన్న, డీఈ మహేశ్, ఉదయ సముద్రం ప్రాజెక్టు సీఈ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

లైఫ్ సైన్సెస్‌లో విద్యాకేంద్రంగా హైదరాబాద్

• సీపీఫ్‌పై ప్రతినిధులతో మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి భేటీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో లైఫ్ సైన్సెస్ రంగంలో శిక్షణ, వృత్తినైపుణ్య సర్టిఫికేషన్‌కు సెంటర్ ఫర్‌ప్రొఫెషనల్ ఇన్నోవేషన్, ఎడ్యుకేషన్ (సీఎఫ్‌పై)తో తాజాగా కుదిరిన భాగస్వామ్య ఒప్పందం దోహదం చేస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి అమెరికా పర్యటనలో ఉన్న శ్రీధర్‌బాబు.. గురువారం న్యూయార్క్‌లో 'సీఎఫ్‌పై' సీఈఓ మార్క్ మజ్జీ, కార్యనిర్వాహక డైరెక్టర్ నాతన్ క్రాజిక్‌తో భేటీ అయ్యారు. లైఫ్‌సైన్సెస్ రంగంలో తెలంగాణను అగ్రగామి నైపుణ్య కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో అంతర్జాతీయ స్థాయిలో ఉన్న అవకాశాలపై ఈ భేటీలో చర్చించారు. ఈ భాగస్వామ్యం ద్వారా ప్రొఫెషనల్ సర్టిఫికేషన్ కోర్సులు, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా శిక్షణ కార్యక్రమాలు చేపడతారు. లైఫ్‌సైన్సెస్ రంగంలో పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతారు.

జీ7 ప్యాకేజీ ఎప్పుడు? ఎలా?

యుద్ధంలో నష్టపోయిన ఉక్రెయిన్‌కు రూ.4.17 లక్షల కోట్ల రుణ ప్యాకేజీ

- స్తంభింపజేసిన రష్యా ఆస్తులపై వచ్చే వడ్డీ, ఆదాయంతో రుణం చెల్లింపు
- నిర్ణయం తీసుకున్న జీ7 దేశాలు..
- రుణసాయంలో ఇబ్బందులు ఉన్నాయంటున్న నిపుణులు
- చట్టపరంగా సమస్యలు ఎదురవుతాయని వెల్లడి
- పశ్చిమ దేశాల నిర్ణయంపై రష్యా ఆగ్రహం
- ప్రతీకారం తప్పదని హెచ్చరిక


జీ7 వర్కింగ్ సెషన్‌లో అధినేతల చర్చలు

28 నెలలుగా కొనసాగుతున్న రష్యా దండయాత్రతో ఉక్రెయిన్ చాలావరకు ధ్వంసమైంది. యుద్ధం ఆగేదెన్నడో, ఉక్రెయిన్ పునర్నిర్మాణం మొదలయ్యేదెప్పుడో ఎవరూ చెప్పలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో జీ7 దేశాల కూటమి 50 బిలియన్ డాలర్ల (రూ.4.17 లక్షల కోట్లు) రుణ ప్యాకేజీని ప్రకటించడం ఉక్రెయిన్‌కు ఎంతగానో ఊరట కలిగించే పరిణామం అనే చెప్పాలి. వివిధ దేశాల్లో ఉన్న రష్యా ఆస్తులపై వచ్చే వడ్డీ, ఆదాయం నుంచే ఈ ప్యాకేజీని ఉక్రెయిన్‌కు ఇవ్వనున్నట్లు జీ7 దేశాలు వెల్లడించాయి. దీనిపై ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీ హర్షం వ్యక్తం చేశారు. రష్యాపై యుద్ధంలో ఉక్రెయిన్ విజేతగా నిలవడానికి ఈ సాయం ఒక గొప్ప ముందడుగు అని అభివర్ణించారు. ఈ నేపథ్యంలో జీ7 ప్రకటించిన రుణ ప్యాకేజీ, ఉక్రెయిన్‌కు కలిగే లబ్ధి, ఇందులో ఇమిడి ఉన్న ఇబ్బందులు, వివిధ దేశాలు స్తంభింపజేసిన రష్యా ఆస్తుల గురించి తెలుసుకుందాం.

2022 ఫిబ్రవరిలో రష్యా సైన్యం ఉక్రెయిన్‌పై హఠాత్తుగా దాడికి దిగింది. క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. ఉక్రెయిన్ సైతం ఎదురుదాడి ప్రారంభించింది. ఇరు దేశాల మధ్య యుద్ధం కొనసాగుతూనే ఉంది. వేలాది మంది సామాన్య ప్రజలు, సైనికులు మరణించారు. ఉక్రెయిన్‌పై దాడులు ఆపాలంటూ పశ్చిమ దేశాలు హెచ్చరించినా రష్యా లెక్కచేయడం లేదు. దీంతో రష్యాను ఆర్థికంగా దెబ్బకొట్టడానికి తమ దేశంలో ఉన్న రష్యన్ సెంట్రల్ బ్యాంక్ ఆస్తులను పశ్చిమ దేశాలు స్తంభింపజేశాయి. ఈ ఆస్తుల విలువ 300 బిలియన్ డాలర్ల (రూ.25.06 లక్షల కోట్లు) వరకు ఉంటుంది. వీటిపై ప్రతి సంవత్సరం 3 బిలియన్ డాలర్ల (రూ.25 వేల కోట్లు) వడ్డీ, ఆదాయం లభిస్తోంది. రష్యా ఆస్తులు చాలావరకు యూరోప్ దేశాల్లో ఉన్నాయి. ఉక్రెయిన్‌పై దాడులు చేస్తున్నందుకు రష్యా పరిహారం చెల్లించాల్సిందేనని అమెరికా సహా పశ్చిమ దేశాలు డిమాండ్ చేస్తున్నాయి. అందుకు రష్యా ఒప్పుకోవడం లేదు. దాంతో రష్యా ఆస్తులపై వస్తున్న వడ్డీని, ఆదాయాన్ని పరిహారం కింద ఉక్రెయిన్‌కు ఇవ్వాలని తాజాగా జీ7 దేశాలు నిర్ణయించాయి.

\- సాక్షి, నేషనల్ డెస్క్

ఇబ్బందులు ఏమిటి?

విదేశాల్లో ఉన్న ఆస్తులు ఒకవేళ మళ్లీ రష్యా నియంత్రణలోకి వస్తే రుణాన్ని తిరిగి చెల్లించడం కష్టమే. స్తంభింపజేసిన రష్యా ఆస్తులను శాంతి చర్చల్లో భాగంగా విడుదల చేయాల్సి వస్తే రుణాన్ని చెల్లించడానికి జీ7 దేశాలు మరో మార్గం వెతుక్కోవాలి. మార్కెట్ హెచ్చుతగ్గుల వల్ల రష్యా ఆస్తులపై కొన్నిసార్లు అనుకున్నంత వడ్డీ గానీ, ఆదాయం గానీ రాకపోవచ్చు. అలాంటి సందర్భాల్లో రుణం తిరిగి చెల్లించడంలో ఇబ్బందులెదురవుతాయి. అలాగే రుణ భారాన్ని జీ7 దేశాలన్నీ పంచుకోవాల్సి ఉంటుంది. దీనిపై ఇంకా స్పష్టత రాలేదు. మరో వారం రోజుల్లో తుది ప్రణాళికను ఖరారు చేయనున్నారు. యూరప్‌లోని రష్యా ఆస్తులపై ఆంక్షలను కొనసాగించడానికి ప్రతిఏటా యూరోపియన్ యూనియన్(ఈయూ)లో ఓటింగ్ జరుగుతోంది. ఈయూలోని ఏ ఒక్క సభ్యదేశం వీటో చేసినా ఆంక్షలు రద్దవుతాయి. ఆస్తులు రష్యా అధీనంలోకి వెళ్లిపోతాయి. ఈయూలోని హంగేరీ దేశం ఇప్పటికే రష్యా అధ్యక్షుడు పుతిన్ పట్ల సానుకూలంగా వ్యవహరిస్తోంది. ఒకవేళ హంగేరీ వీటో చేస్తే ఉక్రెయిన్ రుణ ప్యాకేజీ ప్రణాళికలు మొత్తం తలకిందులవుతాయి. తమ ఆస్తులపై వచ్చే వడ్డీని, ఆదాయాన్ని పశ్చిమ దేశాలు మింగేస్తామంటే రష్యా చూస్తూ కూర్చోదు కదా! కచ్చితంగా ప్రతీకార చర్యలకు దిగుతుంది. రష్యాలోనూ పశ్చిమ దేశాల ఆస్తులున్నాయి. వాటిని రష్యా ప్రభుత్వం గతంలోనే స్తంభింపజేసింది. తమ ఆస్తులపై వడ్డీని కాజేసినందుకు ప్రతిచర్యగా పశ్చిమదేశాల ఆస్తులపై వడ్డీని సైతం రష్యా లాక్కొనే అవకాశం లేకపోలేదు.

ఏ దేశంలో రష్యాకు ఎన్ని ఆస్తులు?

దేశం	రష్యా ఆస్తులు(రూ.లలో)
ఫ్రాన్స్	5.93 లక్షల కోట్లు
జపాన్	4.84 లక్షల కోట్లు
జర్మనీ	4.59 లక్షల కోట్లు
అమెరికా	3.17 లక్షల కోట్లు
యూకే	2.17 లక్షల కోట్లు
ఆస్ట్రేలియా	1.42 లక్షల కోట్లు
కెనడా	1.33 లక్షల కోట్లు

ఇది ముమ్మాటికీ దొంగతనమే: పుతిన్



రష్యా ఆస్తులపై వచ్చే ఆదాయంతో ఉక్రెయిన్‌కు ప్యాకేజీ ఇవ్వాలన్న జీ7 దేశాల నిర్ణయంపై రష్యా అధ్యక్షుడు పుతిన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ దొంగతనమేనని చెప్పారు. చోరులకు శిక్ష తప్పదని హెచ్చరించారు. తమ ఆస్తుల జోలికి వస్తే ప్రతీకారం తీర్చుకుంటామని, తగిన బుద్ధి చెప్తామని పేర్కొన్నారు. పుతిన్ శుక్రవారం రష్యా విదేశాంగ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. జీ7 దేశాల నిర్ణయంపై చర్చించారు. ఎవరు ఎన్ని ట్రిక్కులు ప్లే చేసినా దొంగతనం కచ్చితంగా దొంగతనమే అవుతుందన్నారు. జీ7 దేశాల నిర్ణయాన్ని రష్యా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా శుక్రవారం ఖండించారు. ఈ నిర్ణయం చట్టపరంగా చెల్లదని తేల్చిచెప్పారు.

హక్కులు బదిలీ చేయడం సాధ్యమేనా?

రష్యా ఆస్తులపై వచ్చే వడ్డీ, ఆదాయాన్ని నష్టపరిహారంగా ఉక్రెయిన్‌కు ఇవ్వాలనుకోవడం బాగానే ఉన్నప్పటికీ ఇందులో చట్టపరమైన అవరోధాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. రష్యా అంగీకారం లేకుండా ఇలా చేయడం అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొంటున్నారు. మొండిగా ముందుకెళ్తే తీవ్ర వివాదానికి దారితీసే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. తొలుత న్యాయస్థానాల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని సూచిస్తున్నారు. ఒక దేశానికి సంబంధించిన ఆస్తులను స్తంభింపజేసినప్పటికీ వాటిపై హక్కులను ఇతర దేశాలకు బదిలీ చేయడం సాధ్యం కాదు. అవి ఎప్పటికైనా సొంత దేశానికే చెందుతాయి. భౌగోళికంగా తమ దేశంలో ఉన్న ఇతర దేశాల ఆస్తులను ఆయా దేశాల అనుమతి లేకుండా స్వాధీనం చేసుకొని అనుభవిస్తామంటే కుదరదు.

రష్యా ఆస్తులను ఎలా వాడుకోవచ్చు?

రష్యా ఆస్తులపై వచ్చే వడ్డీ, ఆదాయాన్ని నేరుగా ఉక్రెయిన్‌కు ఇచ్చేసే అవకాశం లేదు. జీ7లోని ఏ దేశమైనా అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి రుణం తీసుకొని ఆ సొమ్మును ఉక్రెయిన్‌కు ఇవ్వొచ్చు. రుణాన్ని తీర్చేయడానికి రష్యా ఆస్తులపై వస్తున్న వడ్డీ, ఆదాయాన్ని చెల్లించవచ్చు. తమకు అందే సొమ్మును ఆయుధాలు కొనుగోలు చేయడానికి, దేశ పునర్నిర్మాణానికి ఉక్రెయిన్ ఉపయోగించుకొనేందుకు ఆస్కారం ఉంది. జీ7 నుంచి రుణ ప్యాకేజీ ఇప్పటికిప్పుడు ఉక్రెయిన్‌కు చేరే పరిస్థితి కనిపించడం లేదు. కనీసం ఆరు నెలల సమయం పడుతుంది. ప్రపంచ బ్యాంకు ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదల చేసిన ఓ నివేదిక ప్రకారం.. ఉక్రెయిన్ పునర్నిర్మాణానికి రాబోయే పదేళ్లలో 486 బిలియన్ డాలర్లు (రూ.40.58 లక్షల కోట్లు) అవసరం.

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జూలై 22 నుంచి!

- ఆగస్టు 9 దాకా సమావేశాలు
- పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ: పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జూలై 22 నుంచి ఆగస్టు 9వ తేదీ దాకా జరుగుతాయని విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. ఈ సమావేశాల్లో తొలిరోజే ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ 2024–25 ఆర్థిక సంవత్సరానికి పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడతారని తెలిపాయి. బడ్జెట్‌కు ముందు వివిధ శాఖలతో జరిపే సంప్రదింపులను ఆర్థిక శాఖ ఈనెల 17 నుంచి ప్రారంభించనుంది. ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటో తేదీన నిర్మలా సీతారామన్ మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. గడిచిన పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం సాధించిన ఆర్థిక విజయాలను, ప్రపంచంలో వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్ ఎదిగిన క్రమాన్ని ఆమె ఆనాడు వివరించారు. కాగా 18వ లోక్‌సభ తొలి సమావేశాలు జూన్ 24 నుంచి జూలై 3 దాకా జరగనున్నాయి. 24, 25 తేదీల్లో నూతన సభ్యుల ప్రమాణ స్వీకారం, జూన్ 26న లోక్‌సభ స్పీకర్ ఎన్నిక ఉంటాయి. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు దీన్ని ధ్రువీకరించారు.



వయనాడ్ నుంచి ప్రియాంక?

రాయ్‌బరేలీ వైపే రాహుల్ మొగ్గు

సాక్షి, న్యూఢిల్లీ: ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన రెండు స్థానాల్లో గెలిచిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కేరళలోని వయనాడ్ స్థానాన్ని వదులుకొని, ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నుంచి కొనసాగేందుకు మొగ్గు చూపుతున్నారని ఏఐసీసీ వర్గాల ద్వారా తెలుస్తోంది. రాహుల్ రాజీనామా చేసిన వెంటనే ఆయన సోదరి ప్రియాంకగాంధీ వయనాడ్ నుంచి రాజకీయ అరంగేట్రం చేసే అవకాశం ఉందని సమాచారం. నియోజకవర్గంలో ప్రియాంక రాకను స్వాగతిస్తూ ఇప్పటికే పోస్టర్లు వెలిశాయి. ఏ స్థానాన్ని వదులుకోవాలన్న దానిపై కొంత డైలమా ఉందని స్వయంగా రాహుల్ గాంధీ పేర్కొన్నప్పటికీ, రాయ్‌బరేలీతో గాంధీ కుటుంబానికి ఉన్న అనుబంధం, ఉత్తరప్రదేశ్ క్రియాశీల రాజకీయాల్లో రాహుల్ అవసరం దృష్ట్యా ఆయన అక్కడే కొనసాగాలని పార్టీ పెద్దల నుంచి భారీగా వస్తున్న వినతులపై రాహుల్ సానుకూలత వ్యక్తం చేసినట్లుగా తెలిసింది. తన రాజీనామా ఆమోదం పొందిన వెంటనే వయనాడ్‌లో భారీ బహిరంగ సభ ద్వారా ప్రియాంకను నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించడంతో పాటు ప్రచారాన్ని రాహుల్ మొదలుపెడతారని ఏఐసీసీ వర్గాలు అంటున్నాయి.

టెక్నాలజీలో గుత్తాధిపత్యానికి తెరపడాలి

- సమ్మిళిత సమాజానికి టెక్నాలజీ బాటలు వేయాలి
- జీ7 శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ ఉద్బోధ

బరీ(ఇటలీ): సాంకేతికత అనేది కేవలం అతి కొద్ది సంస్థలు, దేశాల చేతుల్లో ఉండకూడదని, ఇలాంటి గుత్తాధిపత్యానికి తెరపడాలని ప్రధాని నరేంద్ర మోదీ అభిలషించారు. ఇటలీలోని బోర్గో ఎగ్నాజియా రిసార్ట్‌లో జరుగుతున్న జీ7 దేశాల 50వ శిఖరాగ్ర సదస్సులో శుక్రవారం ప్రధాని మోదీ సాంకేతికత అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. '' మనం వినూత్న టెక్నాలజీని సృష్టించాలేగానీ విధ్వంసకర సాంకేతికతను కాదు. సాంకేతికతతో గుత్తాధిపత్యం పోవాలి. సాంకేతికతను ప్రజాస్వామ్యయుతంచేయాలి. అప్పుడే సమాజంలోని అన్ని వర్గాలకు దానిని చేరువ చేయగలం. సాంకేతికత ఫలాలు అందరికీ అందాలి. అప్పుడే సమ్మిళిత సమాజాభివృద్ధికి బాటలు వేసిన వారమవుతాం. మానవీయ విలువలున్న సాంకేతికత ద్వారా మెరుగైన భవిష్యత్తు కోసం భారత్ కలలు కంటోంది. కృత్రిమ మేధపై జాతీయ విధానాన్ని రూపొందించి అమలుచేస్తున్న అతి కొద్ది దేశాల్లో భారత్ కూడా ఒకటి. ఈ వ్యూహంలో భాగంగానే ఈ ఏడాది భారత్‌లో 'ఏఐ మిషన్'కు అంకురార్పణ చేశాం. అందరికీ ఏఐ అనేది దీని మంత్రం. 'గ్లోబల్ పార్ట్‌నర్‌షిప్ ఫర్ ఏఐ'లో వ్యవస్థాపక సభ్యునిగా, ఈ కూటమి ప్రస్తుత సారథిగా అన్ని దేశాల మధ్య సహకారాన్ని ఆశిస్తున్నా'' అని మోదీ అన్నారు.

ఏఐపై అంతర్జాతీయ నియమావళి ఉండాల్సిందే

''విస్తృతమవుతున్న ఏఐ రంగంపై అంతర్జాతీయంగా ఏకరూప నియమావళి ఉండాల్సిందే. గత ఏడాది ఢిల్లీ వేదికగా జరిగిన జీ20 శిఖరాగ్ర సదస్సులోనూ భారత్ ఇదే అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించింది. భవిష్యత్తులోనూ పారదర్శక, స్వేచ్ఛా, సురక్షిత, సులభతర వినియోగ, బాధ్యతాయుత ఏఐ కోసం అన్ని దేశాలతో భారత్ కలిసి పనిచేస్తుంది. ఇంధనం పైనా భారత వైఖరి మారదు. ఇంధనం అందరికీ అందుబాటులో ఉండాలి. అందరూ వినియోగించుకోగలగాలి. అందరికీ ఆ స్తోమత ఉండాలి. ఇందుకు అందరి ఆమోదం కూడా ఉండాలి'' అని అన్నారు.

గ్లోబల్ సౌత్ దేశాలపై భారం

''అంతర్జాతీయంగా నెలకొన్న అస్థిర, ఉద్రిక్త పరిస్థితుల దుష్ప్రభావాలు ఏ పాపం చేయని గ్లోబల్ సౌత్ దేశాలపై పడుతున్నాయి. అందుకే మా సమస్యలు, ప్రాధాన్యాలను ఇలాంటి ప్రపంచ వేదిక సాక్షిగా చాటేందుకు భారత్ తన వంతు బాధ్యతగా ముందుకొచ్చింది. అందులో భాగంగానే ఆఫ్రికాకు అధిక ప్రాధాన్యతనిస్తున్నాం. గత ఏడాది జీ20 సారథిగా భారత్ ఆఫ్రికా యూనియన్‌కు జీ20లో శాశ్వత సభ్యత్వం ఇప్పించినందుకు గర్వపడుతోంది. ఆఫ్రికా దేశాల ఆర్థిక, సామాజిక, భద్రత, సుస్థిరాభివృద్ధికి భారత్ తన వంతు సాయం అందిస్తోంది. ఇక మీదటా ఈ సాయం కొనసాగుతోంది'' అని అన్నారు.

'లైఫ్'ను పట్టించుకోండి

''పర్యావరణహిత జీవితశైలి(ఎల్‌ఐఎఫ్‌ఈ– లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్)ని అలవర్చుకోండి. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా భారత్‌లో ప్రారంభించిన 'మట్టి మాతృమూర్తికోసం మొక్క' కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటండి. అందరూ ఇందులో భాగస్వాములు కావాలని కోరుకుంటున్నా. ఈ ప్రజాఉద్యమాన్ని అంతర్జాతీయ బాధ్యతను భావించి ప్రపంచ దేశాలు మొక్కలు నాటే కార్యక్రమాన్ని విస్తృతం చేయాలి. మొక్కల పెంపకం భూమిపై పచ్చదనాన్ని పెంచుతుంది. నిర్దేశించుకున్న లక్ష్యం ప్రకారం 2070 ఏడాదికల్లా కర్బన తటస్థత(కార్బన్ నెట్‌జీరో) సాధించేందుకు భారత్ శతథా కృషిచేస్తోంది. హరిత యుగం మళ్లీ సాకారమయ్యేలా మనందరి కలిసి కృషిచేద్దాం'' అని మోదీ పిలుపునిచ్చారు.

'నీట్'పై కేంద్రం, ఎన్‌టీఏకు సుప్రీం నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: నీట్–యూజీలో చోటుచేసుకున్న అవకతవకలపై సీబీఐ విచారణ జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది. కేంద్ర ప్రభుత్వానికి, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)కి నోటీసులు జారీ చేసింది. హాతే నేసింగ్ కాశ్యప్‌తోపాటు ఇతరులు దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన సుప్రీంకోర్టు వెకేషన్ బెంచ్ శుక్రవారం విచారణ చేపట్టింది. రెండు వారాల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ కేంద్రానికి, ఎన్‌టీఏకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూలై 8వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. రాజస్తాన్‌లోని కోటాలో విద్యార్థుల ఆత్మహత్యలు జరిగాయని ప్రస్తావించారు. దీనిపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. అనవసరమైన భావోద్వేగపూరిత వాదనలు చేయొద్దని హితవు పలికింది.

యడ్యూరప్పకు హైకోర్టులో ఊరట

బెంగళూరు: మైనర్ బాలికపై లైంగిక వేధింపుల కేసులో కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి బి.ఎస్.యడ్యూరప్పకు శుక్రవారం హైకోర్టులో ఊరట లభించింది. యడ్యూరప్పను అరెస్టు చేయవద్దని కర్నాటక హైకోర్టు సీఐడీ పోలీసులను ఆదేశించింది. పోక్సో చట్టం కింద నమోదైన కేసును విచారిస్తున్న సీఐడీ ఎదుట ఈనెల 17న హాజరుకావాలని బీజేపీ సీనియర్ నేత, 81 ఏళ్ల యడ్యూరప్పను హైకోర్టు ఆదేశించింది.

అరుంధతి రాయ్‌పై ఉపా కేసు



న్యూఢిల్లీ: 2010లో రెచ్చగొట్టే ప్రసంగం చేశారనే అభియోగాలపై అత్యంత కఠినమైన 'చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా)' కింద రచయిత్రి అరుంధతి రాయ్‌పై విచారణ జరపడానికి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా శుక్రవారం అనుమతి మంజూరు చేశారు. ఢిల్లీలో 2010 అక్టోబరు 21న 'ఆజాదీ.. ది ఓన్లీ వే' పేరిట జరిగిన సదస్సులో అరుంధతి రాయ్, కశ్మీర్ సెంట్రల్ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ షేక్ షౌకత్ హుస్సేన్‌లు రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని అభియోగం.

భారత్‌కు చేరుకున్న 'కువైట్' బాధితుల మృతదేహాలు


కొచ్చిలో మృతులకు నివాళులర్పిస్తున్న కేరళ సీఎం విజయన్ తదితరులు

కొచ్చి: మూడు రోజుల క్రితం ఎడారి దేశం కువైట్‌లో వలసకార్మికులు ఉంటున్న భవంతిలో సంభవించిన అగ్నిప్రమాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన 31 మంది భారతీయుల మృతదేహాలు స్వదేశానికి చేరుకున్నాయి. వీరిలో అత్యధికంగా 23 మంది కేరళీయులు ఉన్నారు. మృతుల్లో కర్ణాటక సంబంధించి ఒకరు, తమిళనాడుకు చెందిన ఏడుగురి మృతదేహాలనూ తీసుకొచ్చారు. మృతదేహాలను తొలుత శుక్రవారం ఉదయం కేరళలోని కొచ్చి అంతర్జాతీయ విమానాశ్రయానికి తీసుకొచ్చారు. ఎయిర్‌పోర్ట్‌లోనే రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ వారికి నివాళులర్పించారు. '' జీవనోపాధి కోసం విదేశం వెళ్లి విగతజీవులైన బడుగుజీవుల కష్టాలను కేంద్రప్రభుత్వం పట్టించుకోవాలి. మృతుల కుటుంబాలకు ఇచ్చే ఆర్థికసాయం సరిపోదు' అని సీఎం అన్నారు. కువైట్ నుంచి మృతదేహాల తరలింపు ప్రక్రియను దగ్గరుంచి చూసుకున్న విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్‌తోపాటు తమిళనాడు మైనారిటీ సంక్షేమ మంత్రి కేఎస్ మస్తాన్‌లు సైతం పార్థివదేహాల వద్ద నివాళులర్పించారు.

మృతుల్లో ముగ్గురు తెలుగువారు

అగ్నిప్రమాదంలో ముగ్గురు తెలుగువ్యక్తులు సైతం చనిపోయారని ఆంధ్రప్రదేశ్ నాన్–రెసిడెంట్ తెలుగు సొసైటీ(ఏపీఎన్‌ఆర్‌టీఎస్) ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన టి. లోకనాథం, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఎం.సత్యనారాయణ, ఎం.ఈశ్వరుడు ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారని ఏపీఎన్‌ఆర్‌టీఎస్ పేర్కొంది. '' సొంత పనిమీద స్వదేశానికి వచ్చిన లోకనాథం తిరిగి కువైట్ బయల్దేరారు. స్వస్థలం నుంచి తొలుత జూన్ 5న హైదరాబాద్‌కు వచ్చి నాలుగు రోజులు ఉండి తర్వాత జూన్ 11న కువైట్ చేరుకున్నారు. ఆయన భవంతికి వచ్చి బసచేసిన అదే రోజున అగ్నిప్రమాదం జరిగి తుదిశ్వాస విడిచారు'' అని లోకనాథం బంధువు శాంతారావు చెప్పారు.

నాటో యత్నం ఆపండి

- రష్యా ఆక్రమిత ప్రాంతాలను వదిలేయండి
- అలా అయితే తక్షణం కాల్పుల విరమణ ప్రకటిస్తాం
- ఉక్రెయిన్‌కు రష్యా తాజా ఆఫర్

మాస్కో: భీకరదాడులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఉక్రెయిన్ పట్ల దయ చూపుతామని మొట్టమొదటిసారిగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్వయంగా వ్యాఖ్యానించారు. తమ షరతులకు ఉక్రెయిన్ ఒప్పుకుంటే తక్షణం కాల్పుల విరమణ అమలుచేస్తానని ప్రకటించారు. శుక్రవారం మాస్కోలోని రష్యా విదేశాంగ శాఖ కార్యాలయంలో పుతిన్ ప్రసంగించారు. ఉక్రెయిన్ సమస్యపై జీ7 దేశాలు ఇటలీలో భేటీ అయిన వేళ పుతిన్ ప్రకటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. '' 2022లో ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్య తర్వాత మా అధీనంలోకి వచ్చిన నాలుగు ప్రాంతాలపై ఉక్రెయిన్ ఆశ వదులుకోవాలి. ఉత్తర అట్లాంటిక్ సైనిక కూటమి(నాటో)లో చేరే ప్రయత్నాలను ఉక్రెయిన్ తక్షణం ఉపసంహరించుకోవాలి. ఈ షరతులకు ఉక్రెయిన్ ఒప్పుకుంటే వెంటనే తమ సైనిక చర్య ఆపేసి తక్షణం కాల్పుల విరమణ ప్రకటిస్తా'' అని పుతిన్ వ్యాఖ్యానించారు. ''ఉక్రెయిన్‌తో ఘర్షణాత్మక ప్రతిష్టంభనకు చరమగీతం పాడేందుకు రష్యా సిద్ధంగా ఉంది. ఇక ఆలస్యం చేయకుండా చర్చలు జరిపేందుకు రెడీగా ఉన్నాం. అయితే మాకు కొన్ని షరతులు ఉన్నాయి. అణ్వస్త్రదేశంగా ఉక్రెయిన్ అవతరించకూడదు. రష్యాపై అన్ని పశ్చిమదేశాలు విధించిన ఆంక్షలను ఎత్తేయాలి'' అని పుతిన్ స్పష్టం చేశారు.


శుక్రవారం జీ7 సదస్సు ప్రాంగణంలో పోప్ ఫ్రాన్సిస్‌తో మోదీ ఆత్మీయ ఆలింగనం

కృత్రిమ మేధపై పోప్ ఆందోళన

బరీ(ఇటలీ): రోజురోజుకూ విశ్వవ్యాప్తంగా విస్తృతమవుతున్న కృత్రిమ మేధపై పోప్ ఫ్రాన్సిస్ ఒకింత ఆందోళన వ్యక్తంచేశారు. కృత్రిమ మేధ అభివృద్ధి, వినియోగంలో మనిషి గౌరవానికి భంగం కలుగకుండా చూసుకోవాలని జీ7 శిఖరాగ్ర సదస్సు వేదికగా పోప్ పిలుపునిచ్చారు. ఇంతటి అత్యాధునిక సాంకేతికతలు మితిమీరితే మానవ సంబంధాలు సైతం కృత్రిమంగా మారే ప్రమాదముందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. 'మానవ భవిష్యత్తుకు కృత్రిమ మేధ(ఏఐ) భరోసా, బెంగ' అంశంపై పోప్ మాట్లాడారు. అంతర్జాతీయ సమావేశాలు, ప్రభుత్వాల విధానపర నిర్ణయాలు, కార్పొరేట్ బోర్డుల వంటి అంశాలే ఎజెండాగా సాగే జీ7 వంటి అగ్రస్థాయి కూటమి భేటీలో పోప్ మాట్లాడటం చరిత్రలో ఇదే తొలిసారికావడం విశేషం. '' ఏఐ అనేది మానవ కేంద్రీకృతంగా ఎదిగేలా రాజకీయ నేతలు ఓ కంట కనిపెట్టాలి. మనుషులకు సంబంధించిన అంశాలపై నిర్ణయాలను మనుషులే తీసుకోవాలిగానీ మెషీన్లు కాదు. మెషీన్ల నిర్ణయాలపై ఆధారపడి, కనీసం మన జీవితాల గురించి కూడా సొంతంగా ఆలోచించలేని పరిస్థితిని మనం కోరుకోవద్దు' అని అన్నారు. ఓపెన్‌ఏఐ వారి చాట్‌జీపీటీ చాట్‌బోట్ తరహా ఏఐ వినియోగం విస్తృతమవుతున్న తరుణంలో ఏఐకు పూర్తిగా దాసోహమవడంపై ప్రపంచదేశాలు, అంతర్జాతీయ సంస్థలు అప్రమత్తంగా ఉండాలని ఆయన హితవు పలికారు.

భారత్‌లో పర్యటించండి: పోప్‌కు ఆహ్వానం

జీ7 సదస్సుకు విచ్చేసిన పోప్ ఫ్రాన్సిస్‌ను మోదీ కలిశారు. వీల్‌చైర్‌లో కూర్చున్న పోప్‌ను మోదీ ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. కొద్దిసేపు మాట్లాడారు. భారత్‌లో పర్యటించాలని పోప్‌ను మోదీ ఆహ్వానించారు.

చర్చలు, దౌత్యంతోనే ఉక్రెయిన్‌లో శాంతి

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీ సందర్భంగా మోదీ వ్యాఖ్య



బరీ(ఇటలీ): ఉక్రెయిన్‌లో సాధ్యమైనంత త్వరగా శాంతియుత పరిస్థితులు నెలకొనాలని భారత ప్రధాని మోదీ ఆకాంక్షించారు. చర్చలు, దౌత్య మార్గాలతోనే ఉక్రెయిన్‌లో శాంతి సాధ్యమని పేర్కొన్నారు. జీ7 శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ఇటలీలోని అపూలియో ప్రాంతంలోని విలాసవంత బోర్గో ఎగ్నాజియా రిసార్ట్‌కు మోదీ శుక్రవారం చేరుకున్నారు. జీ7లో పాల్గొనేందుకు వచ్చిన ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీతో మోదీ అక్కడే ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఉక్రెయిన్ తాజా పరిణామాలపై నేతలిద్దరూ అభిప్రాయాలు పంచుకున్నారు. ఉక్రెయిన్‌తో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని తాము కోరుకుంటున్నట్లు మోదీ తెలిపారు. ఉక్రెయిన్‌లో శాంతికి చొరవ చూపాలని మోదీని జెలెన్‌స్కీ కోరారు. ' ఉక్రెయిన్‌లో శాంతిస్థాపన కోసం 15, 16 తేదీల్లో స్విట్జర్లాండ్‌లో జరుగుతున్న శాంతి సదస్సుకు భారత్ అత్యున్నత దౌత్యబృందాన్ని పంపుతున్నందుకు మోదీకి కృతజ్ఞతలు. నల్లసముద్రం మీదుగా ఎగుమతుల కారిడార్‌పైనా చర్చించాం. వ్యవసాయంలో నూతన సాంకేతికతల వినియోగం అనుభవాలను మాతో పంచుకోవాలని కోరాం' అని జెలెన్‌స్కీ చెప్పారు. జెలెన్‌స్కీతో భేటీ వివరాలను తర్వాత మోదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'జెలెన్‌స్కీతో చర్చ ఫలవంతంగా సాగింది. భారత్–ఉక్రెయిన్ మధ్య సంబంధాలు మరింత బలపడాల్సిన అవసరం ఉంది. ఉక్రెయిన్‌లో సంక్షోభం సమసిపోవాలంటే మానవ కేంద్రిత పరిష్కార మార్గమే శరణ్యం. చర్చలు, దౌత్యమార్గంలోనే శాంతి వెల్లివిరిసేలా చేయగలం. శాంతియుత పరిష్కారం కోసం ఎంతటి సాయమైనా చేసేందుకు భారత్ సదా సిద్ధంగా ఉంది' అని మోదీ వ్యాఖ్యానించారు. మూడోసారి ప్రధాని అయినందుకు మోదీకి జెలెన్‌స్కీ అభినందనలు తెలిపారు.

స్వేచ్ఛా వాణిజ్యంపై మోదీ, రిషీ సమీక్ష




జీ7 భేటీ కోసం వచ్చిన బ్రిటన్ ప్రధాని రిషి సునాక్‌తోనూ మోదీ భేటీ అయ్యారు. భారత్–యూకే వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పటిష్టంచేస్తామని ప్రధాని మోదీ అన్నారు. బ్రిటన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలో పురోగతిపై సునాక్‌తో కలిసి మోదీ సమీక్ష చేశారు. మూడోసారి ప్రధాని అయ్యారంటూ మోదీని సునాక్ అభినందనలు తెలపగా త్వరలో జరగబోయే బ్రిటన్ పార్లమెంట్ ఎన్నికల్లో ఘన విజయం సాధించాలంటూ సునాక్‌కు మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ద్వైపాక్షిక సంబంధాల పటిష్టతకు చేయాల్సిన కృషిపై కూలంకషంగా చర్చించారు. '' రక్షణ, భద్రత, వాణిజ్యం, ఆర్థిక లావాదేవీలు, కీలక, అధునాతన సాంకేతిక రంగాలతోపాటు ప్రజాసంబంధాల్లోనూ ఇరుదేశాల మధ్య భాగస్వామం మరింత బలపడటంపై ఇరు నేతలు చర్చించారు'' అని భేటీ తర్వాత భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదలచేసింది.

ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్‌తో చర్చలు



జీ7 సమావేశం కోసం విచ్చేసిన ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్‌తోనూ మోదీ చర్చలు జరిపారు. 'మా ఇద్దరి మధ్య ఏడాదికాలంలో జరిగిన నాలుగో భేటీ ఇది. అద్భుతంగా జరిగింది. ఇండో–పసిఫిక్ రోడ్‌మ్యాప్, హారిజాన్ 2047 సహా రక్షణ, అణు, అంతరిక్షం, సముద్రమార్గంలో వాణిజ్యం, విద్య, వాతావరణ మార్పులు, డిజిటల్ మౌలిక వసతులు, కనెక్టివిటీ, కృత్రిమ మేధ రంగాల్లో పరస్పర తోడ్పాటుపై చర్చలు జరిపాం. యువతలో ఆవిష్కరణలు, పరిశోధనలపై మరింత మక్కువ పెంచేలా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలనేదీ మాట్లాడుకున్నాం' అని మోదీ చెప్పారు. శుక్రవారం ఇటలీకి చేరుకున్నాక మోదీ తొలుత మేక్రాన్‌ను కలిశారు. మూడోసారి ప్రధాని అయ్యాక ఒక అంతర్జాతీయ నేతతో మోదీ సమావేశంకావడం ఇదే తొలిసారి. జూలై 26 నుంచి ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో సమ్మర్ ఒలంపిక్స్ ప్రారంభం కానున్న నేపథ్యంలో మేక్రాన్‌కు మోదీ శుభాకాంక్షలు తెలిపారు.

మోదీకి మెలోనీ సాదర స్వాగతం



భేటీకి వస్తున్న మోదీకి ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఎదురెళ్లిమరీ సాదర స్వాగతం పలికారు. మోదీ ఆమెకు నమస్కారం చేశారు. తర్వాత ఇద్దరూ పలు అంశాలపై ద్వైపాక్షిక చర్చలు జరిపారు. జీ7 భేటీకి వచ్చిన అగ్రనేతలనూ మోదీ కలిశారు. అమెరికా అధ్యక్షుడు బైడెన్, కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో, టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్, బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వా, యూఏఈ అధ్యక్షుడు మొహమ్మద్ బిన్, జోర్డాన్ రాజు అబ్దుల్లా, జపాన్ ప్రధాని ఫుమియో కిషిడా, ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్‌తోనూ మోదీ మాట్లాడారు.

సాక్షి హైదరాబాద్

శనివారం ◆ 15 ◆ జూన్ ◆ 2024





రైల్ @130

వెంట వాలిపోతున్నారు. 11లో

గరిష్టం/కనిష్టం 32.0/24.0

వాతావరణం

నగరంలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. రానున్న 24 గంటల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఉపరితల గాలులు గంటకు 8 నుంచి 10 కి.మీ వేగంతో పశ్చిమ దిశగా వీచే అవకాశం ఉంది.



‘మల్టీ’పుల్

సినీ వీక్షణం.. కొత్త పుంతలు

అత్యాధునిక సాంకేతికత..

సీట్ వద్దకే ఫుడ్.. మొబైల్ చార్జింగ్

అతిపెద్ద తెరలు.. అదిరే సౌండ్

నగరంలోని మాల్స్‌లో బిగ్ స్క్రీన్స్.. బిగ్ జోష్

టికెట్స్ ఉన్నాయా? ఇప్పుడెళ్తే దొరుకుతాయా? తీరా థియేటర్ దగ్గరకు వెళ్లాక టికెట్లు లేకపోతే.. సమయం, ట్రాన్స్‌పోర్ట్ ఖర్చు అంతా వృథా.. ఇలాంటి సందేహాలు... ఇది ఒకప్పటి పాత జనరేషన్. ప్రస్తుత జనరేషన్ ఉన్నచోట నుంచే అంతా ప్లాన్ చేసుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకోవడంతో మొదలుపెట్టి అన్నీ తామున్న చోటికే రావాలనేది ఆధునికుల బాట. అంతేకాదు థియేటర్ తెర సైజ్ దగ్గర నుంచి ఆడియో సౌండ్ క్వాలిటీ దాకా ప్రతిదీ అద్భుతంగా ఉండాలని వారు ఆశిస్తున్నారు. ఓటీటీల యుగంలో హోమ్ థియేటర్ల నుంచి ఆడియన్స్‌ని సినిమా థియేటర్లకు రప్పించడానికి మల్టీప్లెక్స్‌లు వారి ఆకాంక్షల్ని తీర్చడానికి కాదేదీ మార్పునకు అనర్హం అన్నట్టుగా రోజుకో కొత్త ఫెసిలిటీని పరిచయం చేస్తున్నాయి. దేశంలోని ప్రధాన మల్టీప్లెక్స్ సంస్థలన్నీ ఇప్పటికే పెద్ద సంఖ్యలో సిటీకి రాగా మేము సైతం అంటూ స్థానిక సంస్థలు కూడా పోటీకి తెరలేపాయి. ఈ నేపథ్యంలో మహా నగరంలో 2 దశాబ్దాల మల్టీప్లెక్స్ జర్నీపై ప్రత్యేక కథనం..

సాక్షి, సిటీబ్యూరో

జొమాటోతో భాగస్వామ్యం...

- త్వరలో జొమాటోతో భాగస్వామ్యం ద్వారా థియేటర్లలో ఉండే ఫుడ్ ఆర్డర్ చేసుకునే సౌలభ్యాన్నీ కొన్ని మల్టీప్లెక్స్‌లు కల్పించనున్నట్లు సమాచారం.
- మరింత లగ్జరీ సీటింగ్, లేజర్ ప్రొజెక్షన్, 4డీఎక్స్ ఫార్మేట్స్ వంటివి జోడించనున్నారు
- 4డీఎక్స్, స్క్రీన్ ఎక్స్‌ఈ..లతో పాటు ఐసీఈ థియేటర్ కాన్సెప్ట్‌ను పరిచయం చేయనున్నట్టు ఓ ప్రముఖ మల్టీప్లెక్స్ గ్రూప్‌కు చెందిన దేవాంగ్ సంపత్ అంటున్నారు
- పాకశాస్త్రంలో చేయి తిరిగిన చెఫ్స్‌తో పీవీఆర్-ఐనాక్స్ చేతులు కలిపాయి.



భాగ్యనగరంలో మల్టీప్లెక్స్ ట్రెండ్ నడుస్తోంది. ఎప్పటికప్పుడు నగరవాసులను ఆకర్షించేందుకు కొత్త మార్పులు చేస్తున్నారు. వినోదం, షాపింగ్, గేమింగ్, ఫుడ్‌కోర్ట్స్ వంటి అనేక హంగులను ఒక చోటే కల్పిస్తున్నారు..ఓటీటీల రాకతో వెలవెలబోతున్న వెండితెరలకు పూర్వ వైభవాన్ని తీసుకొస్తున్నారు. అనేక పోటీలను తట్టుకుని అత్యాధునిక హంగులతో ప్రేక్షకులకు అపురూప అనుభూతిని కల్పిస్తున్నారు.

తొలి మల్టీప్లెక్స్...

దేశంలో తొలి మల్టీప్లెక్స్‌ను 1997లో పీవీఆర్ సినిమాస్ ఆధ్వర్యంలో సౌత్ ఢిల్లీలో నెలకొల్పారు కాగా దేశంలో మూడో అతిపెద్ద ఐమ్యాక్స్ థియేటర్‌ను నగరంలో ప్రసాద్స్ మల్టీప్లెక్స్ పేరిట 2003లో నెలకొల్పారు. ఎయిర్‌పోర్ట్స్‌లో తొలి మల్టీప్లెక్స్‌ను చెన్నైలో గతేడాది పీవీఆర్ ఏర్పాటు చేయగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లోనూ అందుబాటులోకి తేనున్నట్టు సమాచారం

113 నగరాల్లో..

దేశపు అతిపెద్ద మల్టీప్లెక్స్ గ్రూప్స్ అయిన పీవీఆర్, ఐనాక్స్ 2022లో చేతులు కలిపి పీవీఆర్ ఐనాక్స్ లిమిటెడ్‌గా మారాయి. వీరికి దేశవ్యాప్తంగా 113 నగరాల్లో 1,715 స్క్రీన్స్ ఉన్నాయి. ఇందులో దక్షిణాదిలో 550, కేవలం తెలంగాణలో 106 ఉన్నాయి. నగరంలో 11 చోట్ల 62 స్క్రీన్స్ ఉన్నాయి. దేశపు తొలి అంతర్జాతీయ, ప్రపంచపు అతిపెద్ద మూవీ థియేటర్ సర్క్యూట్‌గా పేరొందిన సినీపోలిస్‌కి అత్తాపూర్‌లోని మంత్ర మాల్‌లో ఆరు స్క్రీన్ల మల్టీప్లెక్స్ మంజీరా ట్రినిటీ మాల్‌లో ఐదు. సీసీపీఎల్ మాల్లో ఐదు చొప్పున స్క్రీన్స్ ఉన్నాయి

నెలవారీ సబ్‌స్క్రిప్షన్‌తో...

ఓటీటీ తరహాలో మల్టీప్లెక్స్‌కూ నెలవారీ సబ్‌స్క్రిప్షన్ ప్రవేశపెడుతున్నారు నిర్వాహకులు. ప్రస్తుతం రూ.699 చెల్లించి 10 సినిమాలు చూసే స్కీమ్‌ను పీవీఆర్ ప్రవేశపెట్టింది

‘భారీ’ మార్పులు...

దాదాపు రెండు దశాబ్దాల ప్రయాణంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. ఎప్పటికప్పుడు కొత్త విశేషాలు జతచేస్తూ నూతన ఒరవడికి శ్రీకారం చుడుతున్నాయి. ప్రసాద్స్ మల్టీప్లెక్స్‌లో తొలి స్క్రీన్ 29 మీటర్ల వెడల్పు, 21.93 మీటర్ల ఎత్తు కాగా స్క్రీన్ 6లో గత డిసెంబర్‌లో 64 అడుగుల ఎత్తు, 101.6 అడుగుల వెడల్పుతో అతిపెద్ద స్క్రీన్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈ ఎండీఎక్స్ స్క్రీన్ దేశంలోనే పెద్దదిగా సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. మల్టీప్లెక్స్ మార్పుల్లో ఇదో ‘భారీ’ ఉదాహరణ

సరికొత్త టెక్నాలజీ...

స్క్రీన్ల దగ్గర నుంచి ప్రొజెక్టర్ల వరకూ చివరికి సీటింగ్‌లోనూ సరికొత్త రూపును సంతరించుకుంటున్నాయి. సీట్ల మధ్య స్పేస్ పెంచి రిక్లెయినర్స్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. 4కే-60 ఎల్ స్క్రీన్స్ 3డీ ప్రొజెక్టర్, డాల్బీ క్యూఎస్‌సీ ఆడియో, 53 స్పీకర్ల డాల్బీ సీపీ 950 వంటి ఎన్నో సౌకర్యాలు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచుతున్నాయి. ఇక 7.1 సరౌండ్ సౌండ్ పేరిట కొత్త సాంకేతికతను త్వరలోనే పరిచయం చేయనుంది. ప్రతీ చిన్న శబ్దాన్ని ప్రేక్షకుల వీనులకు విందు చేసేలా ఈ ఆడియో పనిచేస్తుంది. మరికొన్ని రోజుల్లో ఈ అప్‌గ్రేడేషన్ పూర్తవనుంది. గచ్చిబౌలిలోని అట్రియమ్ మాల్‌లో ఏర్పాటు చేసిన పీవీఆర్ స్క్రీన్స్‌లో 4కె ప్రొజెక్టర్స్, డాల్బీ అట్మోస్ సౌండ్ ప్రత్యేకత

[illegible]

అపర్ణ మల్టీప్లెక్స్‌లో సరికొత్తగా ఎంట్రీని ఏర్పాటు చేశారు. ఇందులో మొత్తం 1208 సీటింగ్ కాగా ఇందులో 135 గోల్డ్ క్లాస్ సీట్స్ ఏర్పాటు చేశారు. వేరే మల్టీప్లెక్స్‌లో లేని విధంగా సీట్‌కే ఛార్జింగ్ పోర్ట్ ఏర్పాటు చేశారు. ఇక ఐటీసీ నొక్కితే సొంత కిచెన్లో వండిన ఫుడ్ సర్వ్ చేసే సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. ప్రపంచంలోనే అడ్వాన్స్‌డ్ లేజర్ ప్రొజెక్టర్ బార్కో సిరీస్ 4ను జత చేశారు. లెగ్ స్పేస్ కూడా మిగిలిన మల్టీప్లెక్స్‌లతో పోలిస్తే చాలా ఎక్కువగా ఉండేలా సెట్ చేశారు

కాఫీ షాప్స్...

తొలి అంతర్జాతీయ, ప్రపంచపు అతిపెద్ద మూవీ థియేటర్ సర్క్యూట్‌గా పేరొందిన సినీపోలిస్‌కి అత్తాపూర్ మంత్ర మాల్‌లో 6, మంజీరా ట్రినిటీ మాల్‌లో 5 సీసీపీఎల్ మాల్లో 5 చొప్పున స్క్రీన్స్ ఉన్నాయి. నగరంలో మొత్తం 16 స్క్రీన్స్ కలిగిన సినీపోలిస్ డిజిటల్ ప్రొజెక్షన్స్, డీటీడీ టెక్నాలజీ అందిస్తోంది. కాఫీషాప్స్, కాఫీ ట్రీ వంటివి ఈ గ్రూప్స్ ప్రత్యేకత అని డైరెక్టర్ ఆశిష్ శుక్లా తెలిపారు. కాగా మల్టీప్లెక్స్ టిక్కెట్ ధరలు అత్యాధునిక టెక్నాలజీ, విలాసవంతమైన అనుభవాలను అందుబాటులోకి తేవడంలో అధికంగా మారాయని మిరాజ్ సినిమాస్ ప్రతినిధి అమిత్ శర్మ చెబుతున్నారు


బ్రాండ్ ఇమేజ్‌కి తగ్గట్టుగా..

నిర్మాణ రంగంలో అగ్రగామి సంస్థ అపర్ణ తొలిసారిగా మల్టీప్లెక్స్‌లో అడుగుపెట్టింది. నల్లగండ్లలోని అపర్ణ మాల్‌లో ఏడు స్క్రీన్స్ అందుబాటులోకి తెచ్చాం. సంస్థ బ్రాండ్ ఇమేజ్ దృష్టిలో పెట్టుకుని థియేటర్స్‌లో అత్యాధునిక హంగులకు పెద్ద పీట వేశాం. అత్యుత్తమమైన స్క్రీన్స్, ఆడియో సిస్టమ్స్.. వీటితో పాటు విశాలమైన సీటింగ్‌కు ప్రాధాన్యం ఇచ్చాం. రిక్లైయినర్ సీట్లలో మొబైల్ ఛార్జింగ్, సీట్ వద్దకే ఫుడ్ ఆర్డర్, డెలివరీ తీసుకొచ్చాం. దీని కోసం చేయి తిరిగిన చెఫ్స్‌తో ఓ అత్యాధునిక కిచెన్ ఏర్పాటు చేశాం. మరిన్ని మల్టీప్లెక్స్‌లను రాష్ట్రవ్యాప్తంగా సంస్థ ఏర్పాటు చేయనుంది. – మధుకర్, మేనేజర్, అపర్ణ సినిమాస్ మల్టీప్లెక్స్

ఫ్యాషన్ మెరుపుల్

యువ ఫ్యాషన్ డిజైనర్ల సృజనాత్మకతకు నోవాటెల్ కన్వెన్షన్ సెంటర్ వేదికగా నిలిచింది. జేడీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ‘ది జేడీ డిజైన్ అవార్డ్స్ 2024’ కార్యక్రమంలో టాప్ మోడల్స్ క్యాట్ వాక్‌తో అలరించారు. నిర్వాహకులు అత్యుత్తమ సృజనాత్మకతకు బెస్ట్ డిజైన్, బెస్ట్ కమర్షియల్ కలెక్షన్ తదితర అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా జేడీ స్కూల్ ఆఫ్ డిజైన్ వ్యవస్థాపకుడు నీలేష్ దలాల్ మాట్లాడుతూ.. అవార్డులతో ఔత్సాహిక డిజైనర్ల ప్రతిభకు, నైపుణ్యాలకు పెద్దపీట వేస్తున్నామన్నారు. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారంగా కొందరు విద్యార్థులు డిజైన్లను ఆవిష్కరించడం ఆకట్టుకుందన్నారు. ప్రస్తుతం కృత్రిమ మేధ ఫ్యాషన్ రంగంలో వినూత్న సాధనంగా మారిందని ఆయన పేర్కొన్నారు. నమూనా ఉత్పత్తి, మెటీరియల్ ఎంపిక, వ్యూహాత్మక అంశాలపై దృష్టి సారించేందుకు ఏఐ టెక్నాలజీ దోహదం చేస్తుందన్నారు. – సాక్షి, సిటీబ్యూరో





ఆ బడికి బదిలీల శాపం!

948 మంది విద్యార్థులు.. ఇద్దరే టీచర్లు



ఫిలింనగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు

ఒకేసారి 22 మంది ఉపాధ్యాయులకు స్థానచలనం

- ఇదీ ఫిలింనగర్ ప్రభుత్వ పాఠశాల పరిస్థితి

అది ఫిలింనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల. ఇక్కడ మొత్తం 948 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 24 మంది టీచర్లు ఉన్నారు. విషయమేమిటంటే రెండురోజులుగా జరుగుతున్న బదిలీల్లో భాగంగా 22 మంది టీచర్లు స్థాన చలనం పొందడంతో ప్రస్తుతం ప్రధానోపాధ్యాయుడితో సహా ఇద్దరే మిగిలారు. ఫలితంగా తరగతి గదులన్నీ శుక్రవారం విద్యార్థులతో కళకళలాడగా.. టీచర్లు లేక బోధన మూలన పడింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసానికి కూతవేటు దూరంలో ఉన్న ఫిలింనగర్‌ ఉన్నత పాఠశాలలో ఈ పరిస్థితి నెలకొనడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

– ఫిలింనగర్

సూడో పోలీసుకు అరదండాలు

- స్టార్ హోటల్స్‌కు వచ్చే విటులే ఇతడి టార్గెట్
- బెదిరిస్తూ అందినకాడికి దండుకుంటున్న వైనం
- నిందితుడిని అరెస్టు చేసిన నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్



సన్నీ జాదవ్



సాక్షి, సిటీబ్యూరో: స్టార్ హోటళ్లకు వచ్చే విటులనే టార్గెట్‌గా చేసుకుని దాదాపు ఏడేళ్లుగా బెదిరింపు వసూళ్లకు పాల్పడుతున్న సూడో పోలీసు సన్నీ జాదవ్‌ను ఉత్తర మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఇతడిని 2017లో ఇదే తరహా నేరంపై మాదాపూర్ పోలీసులు అరెస్టు చేసినట్లు డీసీపీ సాధన రష్మి పెరుమాల్ శుక్రవారం పేర్కొన్నారు. ఈ నిందితుడి నుంచి రూ.4 లక్షల నగదు, ద్విచక్ర వాహనం తదితరాలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. పార్సిగుట్టకు చెందిన సన్నీ సోమాజిగూడలోని ఓ ఇన్సూరెన్స్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఆన్‌లైన్ గాంబ్లింగ్‌తో పాటు గుర్రపు పందాలకు అలవాటుపడిన ఇతడికి నెల నెలా వచ్చే జీతం సరిపోలేదు. దీంతో తేలిగ్గా డబ్బు సంపాదించడం కోసం పోలీసు అవతారం ఎత్తాడు. ఇంటర్‌నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న ఓ ఎస్సై గుర్తింపు కార్డులో మార్పుచేర్పులు చేసి తన ఫొటో, పేరు పొందుపరిచాడు. దీన్ని తన ఫోన్‌లో సేవ్ చేసుకున్న ఇతగాడు అసలు కథ మొదలెట్టాడు. ఆన్‌లైన్‌తో పాటు వివిధ డేటింగ్ యాప్స్ ద్వారా యువతులను బుక్ చేసుకునే అలవాటు ఉన్న ఇతగాడు వారిని కలవడానికి, సన్నిహితంగా గడపడానికి కొన్ని స్టార్ హోటల్స్‌లోని రూమ్స్‌కు వెళ్లేవాడు. ఇలా ఇతడికి ఏఏ హోటల్‌లో ఏఏ రూమ్స్‌లో వ్యభిచార కార్యకలాపాలు జరుగుతాయనే విషయం తెలిసింది. దీంతో ఆయా గదులకు వెళ్లి వచ్చిన తర్వాత లేదా సమీపంలో కాపు కాయడం ద్వారా వాటిలోకి ఎవరు వెళ్లి వస్తున్నారో గుర్తించే వాడు. వాళ్లను అడ్డగించి పోలీసునంటూ బెదిరించే వాడు. ఆపై హోటల్ టెర్రస్ లేదా సమీపంలోని ప్రాంతానికి తీసుకువెళ్లి అరెస్టు చేస్తానంటూ భయపెట్టేవాడు. ఆ గదిలో తాను ఏర్పాటు చేసిన రహస్య కెమెరాలో తతంగం మొత్తం రికార్డు అయిందని, దాన్ని కుటుంబీకులకు పంపుతానని తీవ్రంగా భయపెట్టేవాడు. ఇలా వారి నుంచి అందినకాడికి అందుకుని పంపేవాడు. 2017లో మాదాపూర్ పోలీసులు అరెస్టు చేసిన తర్వాత బెయిల్‌పై వచ్చి తన పంథా కొనసాగించాడు. ఇతడి బారినపడిన వాళ్లు కూడా తాము కూడా తప్పు చేశామని, బయటపడితే పరువుపోతుందని మిన్నకుండిపోయే వారు. దీంతో ఇతడిపై ఎక్కడా కేసులు నమోదు కాలేదు. అయితే ఈ ఏడాది ఫిబ్రవరిలో సికింద్రాబాద్‌లో ఉన్న ఓ స్టార్ హోటల్‌లో ఓ వ్యక్తిని సన్నీ పట్టుకున్నాడు. అతడిని తన స్టైల్‌లో బెదిరించి రూ.4 లక్షలతో పాటు 2 తులాల బంగారం గొలుసు తీసుకుని విడిచిపెట్టాడు. ఆపై మరోసారి అతడికి ఫోన్ చేసి భయపెట్టిన సన్నీ మరో రూ.4 లక్షలు బదిలీ చేయించుకున్నాడు. అయినప్పటికీ వదలకుండా బెదిరింపులకు పాల్పడటంతో ఎట్టకేలకు ధైర్యం చేసిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఎస్సైలు శ్రీనివాసులు దాసు, పి.గగన్‌దీప్, బి.అశోక్ రెడ్డి వలపన్ని సన్నీని అరెస్టు చేశారు. తదుపరి చర్యల నిమిత్తం నిందితుడిని గాంధీనగర్ పోలీసులకు అప్పగించారు.

14వ అంతస్తునుంచి దూకి మహిళ ఆత్మహత్య

రాజేంద్రనగర్: అనుమానాస్పదస్థితిలో ఓ మహిళ భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. నార్సింగి మై హోమ్ అవతార్ అపార్ట్‌మెంట్‌లో అనూరాధ (35), జనార్దన్ రెడ్డి దంపతులు నివసిస్తున్నారు. అనూరాధ హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా, భర్త ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. శుక్రవారం భర్త విధులకు వెళ్లాడు. 14వ అంతస్తుకు వెళ్లిన అనూరాధ అక్కడి నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. దీంతో అపార్ట్‌మెంట్ వాసులు నార్సింగి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి అనూరాధ మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాల విషయమై కుటుంబ సభ్యులను విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అవినీతికి అడ్డాగా సీసీఎస్!

- ఇటీవలే ఆస్తుల కేసులో అరెస్టైన ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు
- తాజాగా రూ.3 లక్షలు లంచం తీసుకుంటూ చిక్కిన ఇన్‌స్పెక్టర్
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపమే వీటికి ప్రధాన కారణం



ఏసీపీ ఉమామహేశ్వర్ రావు, ఇన్‌స్పెక్టర్ సుధాకర్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ పోలీసు విభాగానికి గుండెకాయ వంటి నగర నేర పరిశోధన విభాగం (సీసీఎస్) అవినీతికి అడ్డాగా మారిపోయింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో గత నెల 21న ఏసీపీ టీఎస్ ఉమామహేశ్వరరావును ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. తాజాగా గురువారం ఈఓడబ్ల్యూ టీమ్–7 ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రూ.3 లక్షల లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే ప్రతిష్టాత్మకమైన ఈ విభాగం ప్రతిష్ట దిగజారుతోందనే ఆరోపణ వినిపిస్తోంది. సంచలనాత్మక నేరాలతో పాటు భారీ స్కాములను సీసీఎస్ అధికారులు దర్యాప్తు చేస్తారు. రూ.25 లక్షల కంటే ఎక్కువ మొత్తంతో ముడిపడి ఉన్న సొత్తు సంబంధిత నేరాలు, రూ.75 లక్షలకు మించిన మొత్తంతో కూడిన మోసాల కేసులు సీసీఎస్ పరిధిలోని వస్తాయి. ఈ విభాగమే నేరుగా కొన్ని కేసులు నమోదు చేస్తుంది. నగరంలోని ఇతర పోలీసుస్టేషన్లలో నమోదైన వాటిని సిటీ పోలీసు కమిషనర్ దర్యాప్తు నిమిత్తం ఈ విభాగానికి బదిలీ చేస్తుంటారు. సీసీఎస్ దర్యాప్తు చేసే కేసుల్లో అత్యధికం రూ.కోట్లతో ముడిపడి ఉంటాయి.

ప్రతి అంశంలోనూ కాసుల పంటే...

ఈ నేపథ్యంలోనే సీసీఎస్‌లో పని చేసే అధికారులకు ఆ ఆలోచన ఉండాలే కానీ ప్రతి అంశంలోనూ కాసులు దండుకునే అవకాశం ఉంటుంది. ఒకప్పుడు సీసీఎస్ పోలీసులు తమకు వచ్చిన ప్రతి ఫిర్యాదునూ కేసుగా నమోదు చేసే వాళ్లు. ఈ విధానం దుర్వినియోగం అవుతోందని భావించిన అధికారులు ఆర్థిక నేరాల్లో కేసు నమోదుకు ముందు ప్రాథమిక విచారణ (పీఈ) తప్పనిసరి చేశారు. ఇక్కడ నుంచే సీసీఎస్ అధికారుల అవినీతి దందా మొదలవుతోంది. పీఈలో భాగంగా విచారణాధికారి ఫిర్యాదుదారుడిని పిలిచి వివరాలు సేకరిస్తారు. ఫిర్యాదులోని వివరాలకు సంబంధించిన ఆధారాలు, ఇతర అంశాలను తమకు అందజేయాల్సిందిగా కోరతారు. ఇక్కడ బాధితుల నుంచి డబ్బు డిమాండ్ చేయడంతో మొదలయ్యే కథ కేసు నమోదు, దర్యాప్తు, నిందితుల అరెస్టు, సీఆర్పీసీ 41–ఏ నోటీసుల జారీ, ఆస్తుల జప్తు, చార్జ్‌షీట్ దాఖలు... ఇలా ప్రతి దశలోనూ కొందరు అధికారులు రేటు కట్టి మరీ వసూలు చేస్తున్నారు.

'సివిల్–క్రిమినల్' మధ్య చిన్న గీతే...

ప్రస్తుతం అమలులో ఉన్న చట్టం ప్రకారం సివిల్ వివాదాల్లోకి పోలీసులు తలదూర్చ కూడదు. కేవలం క్రిమినల్ కేసులు మాత్రమే నమోదు చేసుకుని దర్యాప్తు చేయాల్సి ఉంటుంది. ఈ అంశం కూడా సీసీఎస్ అధికారులకు కలిసి వస్తోంది. సీసీఎస్‌లో నమోదయ్యే, ఫిర్యాదులుగా వచ్చే ఆర్థిక నేరాల్లో చాలా వాటిని సివిల్–క్రిమినల్ అని విడదీయడానికి మధ్యలో చాలా చిన్న సాంకేతిక గీత మాత్రమే ఉంటుంది. ఇది కూడా కొందరు అవినీతి అధికారులకు కలిసి వస్తోంది. సివిల్ కేసును క్రిమినల్‌గా మార్చి అరెస్టు చేస్తానంటూ నిందితుల నుంచి, క్రిమినల్ కేసులు అయినప్పటికీ సివిల్‌గా తేలుస్తానంటూ బెదిరించి ఫిర్యాదుదారుల నుంచి అందినకాడికి దండుకుంటున్న వాళ్లు కోకొల్లలు. 'సాహితీ' కేసులకు దర్యాప్తు అధికారిగా వ్యవహరించిన ఏసీపీ ఉమామహేశ్వరరావు రెండు పక్షాలను బెదిరించి దండుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తాజాగా ఇన్‌స్పెక్టర్ సుధాకర్ నిందితుడి నుంచి డబ్బు డిమాండ్ చేసి, తీసుకుని, తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు.

విఫలమైన పర్యవేక్షణ

నగర నేర పరిశోధన విభాగంలో వరుస వివాదాలు చోటు చేసుకోవడం వెనుక సీసీఎస్ ఉన్నతాధికారుల వైఫల్యం ఉందనే ఆరోపణ వినిపిస్తున్నాయి. వేల మంది జీవితాలతో ముడిపడి ఉన్న 'సాహితీ' కేసులను దర్యాప్తు చేస్తున్న ఏసీపీ ఉమామహేశ్వరరావును ఏసీబీ అధికారులు అరెస్టు చేసిన తర్వాత కూడా అధికారులు మేల్కోలేదు. ప్రక్షాళన చేసి, పర్యవేక్షణ పెంచడం ద్వారా అవినీతిని నిర్మూలించే చర్యలు తీసుకోలేదు. ఈ కారణంగానే ఇన్‌స్పెక్టర్ సుధాకర్ ధైర్యంగా సీసీఎస్ కార్యాలయం ఎదురుగానే లంచం తీసుకోవడానికి సిద్ధమై రెడ్ హ్యాండెడ్‌గా చిక్కాడు. ఇప్పటికైనా నగర ఉన్నతాధికారులు మేల్కొని సీసీఎస్‌ను అన్ని స్థాయిల్లోనూ ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. అలాకాకుంటే ఈ అవినీతి తిమింగలాల కారణంగా అటు ఫిర్యాదుదారులు–ఇటు నిందితులు ఇరువురూ బాధితులుగా మారే ప్రమాదం ఉంది.

నకిలీ పేటీఎం ద్వారా చీటింగ్ చేస్తున్న వ్యక్తి రిమాండ్

బంజారాహిల్స్: నకిలీ పేటీఎం యాప్‌తో డబ్బులు పంపినట్లు మెసేజ్ చూపించి అవతలి వారి నుంచి డబ్బులు తీసుకుని పరారవుతూ చీటింగ్‌కు పాల్పడుతున్న నిందితుడిని జూబ్లీహిల్స్ క్రైం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జూబ్లీహిల్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సైదాబాద్ సంతోష్‌నగర్‌కు చెందిన నర్రా సందీప్‌కుమార్ అనే యువకుడు ఏటీఎంలు, పెట్రోల్ బంకులు, హోటల్స్ వద్ద సంచరిస్తూ అక్కడికి వచ్చేవారిని తనకు నగదు అవసరం ఉందని, మీకు పేటీఎంలో అమౌంట్ పంపిస్తానంటూ దీనంగా మొహం పెట్టి అడుగుతుంటాడు. ఇటీవలనే జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–45లో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో క్యాష్ డిపాజిట్ మిషన్‌లో డబ్బులు డిపాజిట్ చేయడానికి వచ్చిన వ్యక్తి వద్దకు వెళ్లిన సందీప్‌కుమార్ తనకు డబ్బులు అవసరం ఉన్నాయని చెప్పి నమ్మించి ఒక నకిలీ పేటీఎం యాప్ ద్వారా డబ్బు పంపినట్లు మెసేజ్ చూపించి రూ. 35 వేలు తీసుకుని వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తర్వాత తన ఖాతాలో డబ్బు జమ కాలేదని తెలుసుకున్న బాధితుడు రాజు తనను నకిలీ పేటీఎంతో మోసం చేసిన సందీప్‌కుమార్‌పై ఫిర్యాదు చేశాడు. ఆ తర్వాత రెండు రోజులకే పెట్రోల్ బంకు వద్ద శ్రీను అనే వ్యక్తి వద్ద ఇలాగే నకిలీ పేటీఎంతో మెసేజ్ పంపి రూ. 12 వేలు తీసుకుని పరారయ్యాడు. ఈ రెండు ఫిర్యాదులను సవాల్‌గా తీసుకున్న జూబ్లీహిల్స్ క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగి నిందితుడి కోసం ఉచ్చు బిగించారు. ఘటన జరిగిన ప్రాంతాల్లో సీసీ ఫుటేజీలను పరిశీలించారు. మొబైల్ ఫోన్ కాలేడేటా, టవర్ డంప్‌తో నిందితుడి ఆచూకీ తెలుసుకున్నారు. సందీప్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పెట్రోల్‌బంకులు, హోటళ్లు, ఏటీఎం సెంటర్ల వద్ద ఇలాంటి ఘటనలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని, తెలియని వ్యక్తులు వచ్చి డబ్బులు కావాలని కోరితే ఎవరూ ఇవ్వవద్దని, పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

15 రోజుల్లో 147 మంది పోకిరీల అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో మహిళలను వేధిస్తున్న ఆకతాయిల ఆటకట్టించారు రాచకొండ షీ టీమ్ పోలీసులు. 15 రోజుల్లో 147 మంది పోకిరీలను అరెస్టు చేశారు. వీరందరికీ వారి కుటుంబ సభ్యుల సమక్షంలో ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. పట్టుబడిన వారిలో 87 మంది మేజర్లు, 60 మంది మైనర్లు ఉన్నారని ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ టీ ఉషా విశ్వనాథ్ తెలిపారు. ఆయా ఫిర్యాదుల్లో 11 మంది పోకిరీలపై క్రిమినల్ కేసులు పెట్టగా.. 88 మందిపై పెట్టీ కేసులు, 59 మందికి కౌన్సిలింగ్ నిర్వహించామని చెప్పారు.

రాజీ చేసి లంచం డిమాండ్!

- ఆ సొమ్మునూ వాయిదాల్లో చెల్లించమన్నాడు
- సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ వ్యవహారం ఇది
- 14 రోజుల రిమాండ్ విధించిన ప్రత్యేక కోర్టు
- చంచల్ గూడ జైలుకు తరలించిన అధికారులు



ఏసీబీ అధికారులకు చిక్కిన ఇన్‌స్పెక్టర్ సుధాకర్

సాక్షి, సిటీబ్యూరో: ఓ కేసులో బాధితుడికి–నిందితుడికి మధ్య రాజీ చేశాడు... అప్పటికే నమోదైన కేసుకు ముగింపు పలకడానికి నిందితుడి నుంచి లంచం డిమాండ్ చేశాడు.. అంగీకరించిన మొత్తం వాయిదాల్లో చెల్లించే అవకాశమూ ఇచ్చాడు... ఐదో విడత చెల్లింపు ఆలస్యం కావడంతో వేధింపులు మొదలెట్టాడు... ఫిర్యాదుదారుడిగా మారిన నిందితుడు అవినీతి నిరోధక శాఖను (ఏసీబీ) ఆశ్రయించడంతో చిక్కాడు... నగర నేర పరిశోధన విభాగం (సీసీఎస్) పార్కింగ్‌లో రూ.3 లక్షలు లంచం తీసుకుని, ఏసీబీ అధికారులను చూసి పరుగులు పెట్టి మరీ చిక్కిన ఇన్‌స్పెక్టర్ చామకూరి సుధాకర్ వ్యవహారమిది. గురువారం అరెస్టు చేసిన ఇతడిని ఏసీబీ అధికారులు శుక్రవారం ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచారు. కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు. నగరానికి చెందిన సత్యప్రసాద్ అనే వ్యక్తికి యాప్రాల్‌లో ఓ విల్లా ఉంది. దీన్ని రంగస్వామి ద్వారా అమెరికాలో ఉంటున్న ఎన్నారై హేమసుందర్‌రెడ్డికి రూ.1.5 కోట్లకు విక్రయించారు. దీని నిమిత్తం సదరు ఎన్నారైకి నగరంలోని ఓ బ్యాంక్‌లో లోన్ కూడా ఇప్పించారు. ఇలా వచ్చిన మొత్తం నుంచి రూ.50 లక్షలతో అప్పటికే ఆ ఇంటిపై ఉన్న గృహరుణాన్ని క్లియర్ చేశాడు. మిగిలిన రూ.కోటి వెచ్చించి స్థలం కొందామని, దాన్ని అభివృద్ధి చేసి లాభాలు పొందుదామంటూ రంగస్వామి ఇచ్చిన సలహా సత్య ప్రసాద్‌కు నచ్చింది. దీంతో అతడితో ఒప్పందం చేసుకున్న సత్య ప్రసాద్ ఆ మొత్తం అందించాడు. దీన్ని వెచ్చించిన రంగస్వామి నాచారం ప్రాంతంలో 1600 స్థలం ఖరీదు చేశాడు. అయితే అనివార్య కారణాల నేపథ్యంలో దాన్ని అభివృద్ధి చేయడం, విక్రయించడం సాధ్యపడలేదు. దీంతో సత్య ప్రసాద్ సీసీఎస్ పోలీసులను ఆశ్రయించి రంగస్వామి తనను రూ.కోటి మేర మోసం చేశారంటూ ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి నమోదైన కేసును సీసీఎస్‌లోని ఎకనమికల్ అఫెన్సెస్ వింగ్ టీమ్–7 ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న సీహెచ్ సుధాకర్ దర్యాప్తు చేశారు. ప్రాథమిక ఆధారాలు సేకరించిన తర్వాత నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఆపై అరెస్టు చేయడమో, నోటీసులు ఇవ్వడమో చేయాలి. దీనికి భిన్నంగా వ్యవహరించిన సుధాకర్ ఫిర్యాదుదారుడిగా ఉన్న సత్య ప్రసాద్, రంగస్వామి మధ్య రాజీ చేశాడు. రూ.కోటి వాయిదాల పద్ధతిలో చెల్లించే ఒప్పందం చేసి ఈ మేరకు ఎంఓయూ కూడా రాయించాడు. చట్ట ప్రకారం ఇలా రాజీపడిన కేసుల్లో ఇరు పక్షాలను కోర్టులో హాజరుపరిచి, లోక్ అదాలత్ ద్వారా క్లోజ్ చేయాలి. అయితే ఈ కేసులో కాసులు ఏరుకోవాలని భావించిన సుధాకర్ కేసు క్లోజ్ చేయడానికి రూ.15 లక్షల లంచం డిమాండ్ చేశాడు. ఈ మొత్తం నిందితుడిగా ఉన్న రంగస్వామి చెల్లించేలా ఆదేశించాడు. ఒకేసారి అంత మొత్తం ఇచ్చుకోలేనంటూ రంగస్వామి వేడుకోగా... వాయిదాలో చెల్లించే అవకాశమూ ఇచ్చాడు. ఇప్పటికే రూ.50 వేలు, రూ.50 వేలు, రూ.2 లక్షలు, రూ.2 లక్షలు చొప్పున నాలుగు వాయిదాల్లో రూ.5 లక్షలు తీసుకున్నాడు. ఆఖరి వాయిదా ముట్టి 20 రోజులు గడిచిన తర్వాత మరో రూ.5 లక్షలు ఇవ్వాలంటూ ఒత్తిడి చేయడం మొదలెట్టాడు. దీంతో రంగస్వామి ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి సూచనల మేరకు సుధాకర్‌తో బేరసారాలు మొదలెట్టారు. ప్రస్తుతానికి తాను రూ.5 లక్షలు ఇచ్చుకోలేనని, తన వద్ద కేవలం రూ.2.5 లక్షలే ఉన్నాయంటూ చెప్పిన రంగస్వామి ఆ మొత్తం తీసుకుని రెండు రోజుల క్రితం సీసీఎస్ వద్దకు వెళ్లారు. అయితే తాను కూడా పై అధికారులకు ఇవ్వాల్సి వస్తుందంటూ పేర్కొన్న సుధాకర్ ఆ మొత్తం తీసుకోవడానికి నిరాకరించాడు. ఎట్టి పరిస్థితుల్లోనూ తనకు రూ.5 లక్షలు ఇవ్వాల్సిందే అంటూ పట్టుబట్టాడు. దీంతో ఆ రోజు ఏసీబీ ట్రాప్‌లో పడకుండా తప్పించుకున్నాడు. ఆపై మరోసారి బేరసారాల తర్వాత గురువారం రూ.3 లక్షలు తీసుకోవడానికి అంగీకరించి, తీసుకుని ఏసీబీ అధికారులకు చిక్కి జైలుకు వెళ్లాడు. గురువారం రాత్రి ఏసీబీ అధికారులు సుధాకర్‌ను పర్యవేక్షించే అధికారుల వాంగ్మూలాలు నమోదు చేశారు.

5 వేల కిలోల డ్రగ్స్ ధ్వంసం

సాక్షి, సిటీబ్యూరో: సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 5,006 కిలోల మాదక ద్రవ్యాలను సైబరాబాద్ పోలీస్ డ్రగ్ డిస్పోజల్ కమిటీ ధ్వంసం చేసింది. రంగారెడ్డి జిల్లా ఏదులపల్లి గ్రామంలోని జీజే మల్టీక్లేవ్ ఇండియా సంస్థకు చెందిన కామన్ బయో–మెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్ అండ్ డిస్పోజల్ ఫెసిలిటీలో శుక్రవారం ధ్వంసం చేశారు. వీటిలో గంజాయి, హష్ ఆయిల్, కొకైన్, చరస్, హెరాయిన్, ఎక్స్‌టసీ మాత్రలు, ఎల్‌ఎస్‌డీ పేపర్లు వంటి 15 రకాల మాదక ద్రవ్యాలున్నాయి. గత మూడేళ్లలో సైబరాబాద్‌లోని 30 స్టేషన్ల పరిధిలో 122 కేసుల్లో ఈ డ్రగ్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అత్యధికంగా రాజేంద్రనగర్ జోన్‌లో 37 కేసుల్లో 2,079 కిలోలు, మేడ్చల్‌లో 18 కేసుల్లో 825 కేజీలు, బాలానగర్‌లో 31 కేసుల్లో 797 కిలోలు, శంషాబాద్‌లో 13 కేసుల్లో 712 కేజీలు, మాదాపూర్‌లో 23 కేసుల్లో 591 కిలోల డ్రగ్స్‌ను పట్టుకున్నారు.

రూ.75 కోట్ల భూమి కోటిన్నరకే తనఖా!

సాక్షి, సిటీబ్యూరో: రూ.75 కోట్ల విలువైన భూమిని కోటిన్నరకే తనఖా పెట్టారు ఇద్దరు ఘనాపాటీలు. సంఘం సభ్యులకు తెలియకుండా ఏకంగా ప్రధాన కార్యదర్శి పక్కా పథకం ప్రకారం అధ్యక్షుడికే స్థలాన్ని తాకట్టు పెట్టారు. ఈ మేరకు నమోదైన కేసులో సైబరాబాద్ ఎకనామిక్ అఫెన్స్ వింగ్ (ఈఓడబ్ల్యూ) పోలీసులు ఇద్దరు నిందితులను శుక్రవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు బృందంగా ఏర్పడి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్ ఎంప్లాయిస్ హౌసింగ్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఎస్ఈఈహెచ్‌డబ్ల్యూఏ)ను ఏర్పాటు చేసుకున్నారు. ఈ సంఘం సభ్యులు కలిసి సంగారెడ్డిలోని ఉస్మాన్‌నగర్ గ్రామంలో మూడెకరాల చొప్పున రెండుసార్లు మొత్తం ఆరు ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. కొంతకాలం తర్వాత దీని పక్కనే ఉన్న మరో ఐదెకరాల స్థలాన్ని కూడా కొన్నారు. ఈ ఐదెకరాల స్థలంలో 240 అపార్ట్‌మెంట్లు, 15 విల్లాలను నిర్మించి 2016లో సభ్యులకు అప్పగించారు. మిగిలిన 345 మంది సభ్యులు ఆరెకరాల స్థలంలో వాటాదారులుగా మిగిలిపోయారు.

- అయితే 2018 తర్వాత ఈ సొసైటీకి ఎన్నికలు జరగలేదు. జనరల్ బాడీ మీటింగూ నిర్వహించలేదు. దీన్ని ఎస్ఈఈహెచ్‌డబ్ల్యూఏ అధ్యక్షుడు జూబ్లీహిల్స్‌కు చెందిన గుజ్జారి అశోక్ రావు, ప్రధాన కార్యదర్శి గచ్చిబౌలికి చెందిన చావా ఉదయ్ కుమార్‌లు అవకాశంగా మలుచుకున్నారు. సంఘం సభ్యులకు తెలియకుండా, సొసైటీ అనుమతి లేకుండా మూడు ఎకరాల స్థలాన్ని ఉదయ్ కుమార్ అశోక్ రావుకు 2019 ఆగస్టు 21న తనఖా పెట్టాడు. ఈ ఏడాది ఏప్రిల్ 16న సభ్యుల్లో ఒకరు ఈ భూమికి సంబంధించి ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ (ఈసీ) తీసుకున్నారు. దీంతో ఈ తాకట్టు విషయం వెలుగులోకి వచ్చింది. సొసైటీ సభ్యుల అనుమతి లేకుండా అక్రమంగా రూ.75 కోట్ల విలువైన ఆస్తిని కేవలం రూ.1.5 కోట్లకు తనఖా పెట్టడంపై సభ్యులు షాక్‌కు గురయ్యారు. దీంతో సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు తగిన ఆధారాలతో ఇద్దరు నిందితులు అశోక్ రావు, ఉదయ్ కుమార్‌లను అరెస్టు చేశారు.

బ్యాంకులు తక్షణమే విద్యా రుణాలు విడుదల చేయాలి

సాక్షి, సిటీబ్యూరో: విద్యా రుణ శిబిరాలను నిర్వహించి, తక్షణమే నిరుపేదలకు రుణాలు అందించాలని బ్యాంకర్లను హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ..2023–24 ఆర్థిక సంవత్సరంలో విద్యా రుణాలు రూ.1203 84 ఓట్లు లక్ష్యం కాగా.. రూ.131.95 కోట్లు మా త్రమే విడుదల చేశారని, 10.96 శాతం మాత్రమే అందించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే విద్యా రుణాలు అందించాలన్నారు.

అద్దెకు కార్లు కావాలి: ఐసీడీఎస్

బంజారాహిల్స్: ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఖైరతాబాద్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పనిచేసేందుకు కార్లు అద్దెకు కావాలని ఖైరతాబాద్ ఐసీడీఎస్ సీడీపీఓ పుష్ప వెల్లడించారు. కారు, డ్రైవర్, డీజిల్‌తో కలిపి నెలకు రూ. 33 వేలు చెల్లించడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. ప్రాజెక్టు పరిధిలో కార్లు అద్దెకు ఇచ్చేవారు ఫోన్: 88866 66058లో సంప్రదించాలని కోరారు.

కేంద్ర మంత్రులకు చింతల సన్మానం



బంజారాహిల్స్: కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను శుక్రవారం న్యూఢిల్లీలోని వారి ఛాంబర్‌లలో ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి కలిసి అభినందించారు. ఖైరతాబాద్ నియోజకవర్గ ప్రజల తరుపున ఈ ఇద్దరి మంత్రులకు శాలువాతో ఘన సత్కారం చేశారు. ఇటీవలి ఎన్నికల్లో సికింద్రాబాద్, కరీంనగర్‌ల నుంచి వీరు ఘన విజయం సాధించి కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి

శ్రీనగర్‌కాలనీ: రక్తదానం ప్రాణదానమని, ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని కన్స్యూమర్స్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్ పి.వి.రవిశేఖర్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ రక్తదానాన్ని పురస్కరించుకొని రాజ్‌భవన్ రోడ్‌లోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో రక్తదానం చేశారు.

ఖాళీ జాగా.. వేసెయ్ పాగా!



ఆక్రమిత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్

ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలు కబ్జాదారులకు కాసుల వర్షాన్ని కురిపిస్తున్నాయి. ఖాళీగా ఉన్న స్థలం కన్పిస్తే చాలా ఆర్థిక, అంగబలం ఉన్న కొందరు రాజకీయ, అధికార అండదండలతో ఆ స్థలంపై దేగల్లా వాలిపోతున్నారు. ఎవరైనా ప్రతిఘటిస్తే సరి.. లేదంటే ఆ స్థలాన్ని తమ ఖాతాలోకి వేసేసుకుంటున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

- సర్కారు స్థలం కబ్జాకు యత్నం
- స్థలాన్ని పరిశీలించిన రెవెన్యూ అధికారులు
- కబ్జా చెరనుంచి విడిపించేందుకు చర్యలు

బంజారాహిల్స్: ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నిర్మాణం కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని కబ్జాదారులు అడ్డదారుల్లో ఆక్రమించి నకిలీ దస్తావేజులతో ప్రయత్నాలు చేస్తూ రెవెన్యూ అధికారులు నిర్మించిన ప్రహరీని కూల్చివేసిన ఘటన షేక్‌పేట మండల పరిధిలో చోటుచేసుకుంది. షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... టోలిచౌకి సెవన్ టూంబ్స్ రోడ్డులో ఎస్‌ఏకాలనీకి ఎదురుగా టీఎస్ నెంబర్ 15/2, బ్లాక్-ఎం, వార్డు 13 షేక్‌పేట విలేజ్‌లో 1335 గజాల ప్రభుత్వ స్థలం ఉండగా ఈ స్థలాన్ని టోలిచౌకి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి కేటాయించారు. రెవెన్యూ రికార్డుల్లో ఇది పక్కా ప్రభుత్వ స్థలంగా గుర్తించి ల్యాండ్ బ్యాంక్‌లో కూడా చేర్చారు అయితే ఫ్రెడ్ ఇండియా లే అవుట్ ప్లాట్ ఓనర్స్ ఈ స్థలాన్ని ఆక్రమించి ప్రభుత్వ స్థలం చుట్టూ నిర్మించిన ప్రహరీగోడను కూల్చివేశారు. ఇదే విషయంపై తాము ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 6న ఫిర్యాదు కూడా చేయడం జరిగిందని సయ్యద్ హైమద్ అహ్మద్, సయ్యద్ ఫాద్ అహ్మద్ ఇద్దరూ కలిసి ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నట్లుగా, వారిపై చర్యలు తీసుకోవాలని, అరెస్టు చేయాలని ఫిర్యాదు చేశామన్నారు. ఒకవైపు కబ్జాదారులను అరెస్టు చేసేందుకు పోలీసులు యత్నిస్తుండగానే, ఇంకోవైపు ప్రహరీని కూల్చి కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు.

- ఇదిలాఉండగా కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ స్థలాన్ని శుక్రవారం హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ హేమంతకేశవపాటిల్, సికింద్రాబాద్ ఆర్డీఓ దశరథ్‌సింగ్, షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సంపత్, ఫిలింనగర్ డీఐ జయరాంలు పరిశీలించారు. తిరిగి ప్రహరీ నిర్మించే పనులు మొదలుపెట్టారు. కబ్జాదారులను వెంటనే అరెస్టు చేయాలని పోలీసులను కోరారు.

ప్రతి చిన్నారినీ బడికి పంపాలి

వెంగళరావునగర్: బడి ఈడు వచ్చిన ప్రతి చిన్నారినీ తప్పనిసరిగా సర్కారు బడికి పంపాలని వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ పిలుపునిచ్చారు వెంగళరావునగర్, జవహర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం ఆమె చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... పిల్లలకు అక్షరాలు నేర్పించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వారికి బుక్స్, యూనిఫారం పంపిణీ చేశారు. హెచ్ఎం ఫామియా రాథోడ్, టీచర్లు వాణి, సుజాత, బీఆర్ఎస్ సీనియర్ నేతలు విజయ్‌కుమార్, నర్సింగ్‌రావు, శ్యాంరావు, అర్జున్, మెహబూబ్, జనార్ధన్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు

పోరాట యోధుడు చేగువేరా

హిమాయత్‌నగర్: గెరిల్లా పోరాట యోధుడు, ధైర్యశాలి, మూర్తీభవించిన మానవత్వం వంటి విలువలు కలిగిన మహనీయుడు ఎర్నెస్టో చేగువేరా అని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర అన్నారు. చేగువేరా జయంతిని ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో శుక్రవారం నిర్వహించారు. చేగువేరా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ... క్యూబాలో జన్మించిన చేగువేరా తన దేశానికే కాక అనేక దేశాలలో పర్యటించి పెట్టుబడిదారీ వ్యవస్థపై అలుపెరుగని పోరాటాలు నిర్వహించిన గొప్ప యోధుడు అని అన్నారు ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఆర్. బాలకృష్ణ, నెర్లకంటి శ్రీకాంత్, షేక్ మహమూద్, ఉపాధ్యక్షుడు మజీద్ అలీ ఖాన్, కళ్యాణ్, జగన్, వినోద్, లతీఫ్, హసీమ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జాపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బస్తీవాసులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-13లోని శ్రీరామ్‌నగర్ బస్తీలో ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది కబ్జాదారులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, ఆ స్థలాన్ని కాపాడి బస్తీ దవాఖానా నిర్మించాలంటూ బస్తీవాసులు శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు, జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. బస్తీలోని నెమత్ హార్మోని బిల్డింగ్ ఎదురుగా ఉన్న ఈ ప్రభుత్వ స్థలంలో కమ్యూనిటీ హాల్, బస్తీ దవాఖానా నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా పరిశీలనలో ఉందన్నారు. ఖాళీగా ఉన్నందున కబ్జాదారులు భవనం నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. రెండు రోజుల క్రితం జేసీబీలతో ఈ ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నించగా తామంతా జేసీబీకి అడ్డుపడి అడ్డుకున్నామన్నారు. ఈ స్థలాన్ని జీఓ 58 కింద గుర్తుతెలియని వ్యక్తులు క్రమబద్ధీకరించుకునేందుకు యత్నించారని, దానిని రద్దు చేయాలని కోరారు.

విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన

బంజారాహిల్స్: నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల కోసం శుక్రవారం వర్చువల్ ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. పాఠశాల నిర్వహణలో ఉపాధ్యాయులు, యాజమాన్యంతో పాటు విద్యార్థులు వారి తల్లిదండ్రులను భాగస్వాములుగా చేయడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ప్రిన్సిపాల్ పి.కాంచన వల్లి తెలిపారు. అనంతరం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పాఠశాల నిర్మాణం, సౌకర్యాలు, విధి విధానాలపై అవగాహన కల్పించారు. నిబంధనలు, వారు అనుసరించాల్సిన నియమాలు విద్యార్థులు, తల్లిదండ్రులు తెలుసుకోవాల్సిన పాఠశాల విద్యా ప్రణాళిక, పరీక్షా విధానాల గురించి వివరించారు డైరెక్టర్ ఎం.వరలక్ష్మి మాట్లాడుతూ... తల్లిదండ్రులే పిల్లలకు తొలి రోల్‌మోడల్స్ అన్నారు. తల్లిదండ్రుల తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.



విద్యార్థుల తల్లిదండ్రుల వర్చువల్ ఓరియంటేషన్ ప్రోగ్రాం

ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు




పుస్తకాలను అందిస్తున్న కార్పొరేటర్ సంగీత

శ్రీనగర్‌కాలనీ: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని తద్వారా ఎందరికో ఆదర్శంగా నిలవాలని సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతయాదవ్ అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డిగూడ ప్రభుత్వ పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు స్కూల్ యూనిఫారమ్స్, బుక్స్ అందజేశారు. పాఠశాలలో సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. స్కూల్ హెచ్ఎం మేరి, నేతలు వనం శ్రీనివాసయాదవ్, మనోజ్‌యాదవ్, సాయినాథ్‌యాదవ్, విక్రమ్‌యాదవ్, జాఫర్, వాటర్ వర్క్స్ మేనేజర్ శ్యామ్, స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభోగం.. శ్రీవారి బ్రహ్మోత్సవం

- నేత్రపర్వంగా సాగిన శ్రీవారి సూర్యప్రభ వాహన సేవ
- అంగరంగ వైభవంగా టీటీడీ బ్రహ్మోత్సవాలు



సూర్యప్రభ వాహనంపై దర్శనమిస్తున్న స్వామి, అమ్మవార్లు

హిమాయత్‌నగర్: హిమాయత్‌నగర్ లిబర్టీలోని తిరుమల తిరుపతి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. అందులోభాగంగా రెండవ రోజు శుక్రవారం స్నపన తిరుమంజనం శోభాయమానంగా జరిగింది. ఇందులో భాగంగా స్వామి అమ్మవార్లకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, చందనములతో విశేషంగా అభిషేకం చేశారు. అనంతరం ఉదయం స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా సూర్యనారాయణుడు సూర్యప్రభామధ్యస్థుడై దివ్యకిరణ కాంతుల్లో ప్రకాశిస్తూ సూర్యప్రభ వాహనంలో దర్శనమిచ్చారు. సూర్యప్రభ వాహనంలో ఉండే సూర్యనారాయణుడిని దర్శిస్తే ఇతోధిక భోగభాగ్యాలు, సత్సంతాన సంపదలు, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకంగా పేర్కొన్నారు. సాయంత్రం చంద్రప్రభ వాహనంపై స్వామి అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి వచ్చి స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యార్థులకు మెరుగైన వసతులు: దానం



పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న దానం

వెంకటేశ్వరకాలనీ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ప్రభుత్వం మెరుగైన వసతులు కల్పిస్తున్నదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. శుక్రవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 5లోని దేవరకొండ బస్తీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆయన కార్పొరేటర్ మన్నె కవితారెడ్డితో కలిసి పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులకు వసతులు కల్పిస్తున్నామని.. విద్యార్థులు బాగా చదువుకోవాలని ఆకాంక్షించారు. పాఠశాల హెచ్ఎం రామకృష్ణ, ఎస్ఎల్ఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మసీదుల వద్ద శుభ్రంగా ఉంచాలి



సమీక్షలో పాల్గొన్న కార్పొరేటర్ కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని మసీదుల వద్ద ఎలాంటి పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చూసుకోవాలని. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో మసీదు పరిసరాలను ఆన్నింటినీ ఊడ్చి చెత్తా చెదారం పేరుకుపోకుండా చూడాలని వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి సూచించారు. శుక్రవారం డివిజన్ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో సర్కిల్-18 ఏఎంహెచ్ఓ, ఎస్ఎస్ఏలు, శానిటేషన్ సూపర్‌వైజర్లతో ఆమె బక్రీద్ పండుగ సందర్భంగా సమీక్షా సమావేశం నిర్వహించారు. చెత్తను, వ్యర్థాలను ఎత్తేందుకు గార్బేజ్ కవర్లను పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్టు

రహమత్‌నగర్: బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని బోరబండ పోలీసులు అరెస్టు చేశారు. సెక్టార్ ఎస్ఐ నాగూల్‌మీరా సమాచారం మేరకు... బోరబండ డివిజన్ పెద్దమ్మనగర్‌కు చెందిన బాబురావు కొంత కాలంగా బెల్ట్ షాపును నిర్వహిస్తున్నాడు. బోరబండ పోలీసులు శుక్రవారం తెల్లవారుఝామున బాబురావు ఇంటిపై దాడి చేశారు. ఈ సందర్భంగా అతని ఇంట్లో ఉన్న 35 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అయనను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బాబురావుపై గతంలోనూ అక్రమ మద్యం విక్రయంపై కేసులు ఉన్నాయని సెక్టార్ ఎస్ఐ నాగూల్‌మీరా తెలిపారు.

ఆకృతి ఎలైట్ ఎగ్జిబిషన్ ప్రారంభం



బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో మూడు రోజులపాటు నిర్వహించే ఆకృతి ఎలైట్ ఎగ్జిబిషన్ శుక్రవారం ప్రారంభమైంది. ఎగ్జిబిషన్‌ను శశినాథ ప్రారంభించారు. శని, ఆదివారాల్లో ఈ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

మున్సిపల్ కార్మికులను పర్మనెంట్ చేయాలి

లిబర్టీ: మున్సిపాలిటీలో నిరంతరం పరిశుభ్రత కోసం పని చేస్తున్న మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ. 28 వేలు ఇవ్వాలని తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏసురత్నం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా పొందుతున్న వేతనం ఏమాత్రం సరిపోవడం లేదని అన్నారు. లిబర్టీ వద్ద ఉన్న మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ... ప్రస్తుతం అమల్లో ఉన్న వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్ ఇతర కటింగ్ మున్సిపల్ కార్మికులకి చేతికి వచ్చేది రూ. 14 వేలు మాత్రమే అన్నారు. ఈ వేతనంలో పట్టణాలు, మున్సిపాలిటీల్లో ఎలా జీవనం సాగిస్తారని అయన ప్రశ్నించారు. అయినా వారిని పర్మనెంట్ చేయకుండా వారి శ్రమను దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా వారి సేవలను గుర్తించి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకుడు రాములు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థుల 'స్వచ్ఛ భారత్'

వెంగళరావునగర్: యూసుఫ్‌గూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు శుక్రవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణ, లోపల, కారిడార్, టెర్రస్, క్లాస్ రూములను శుభ్రం చేశారు. వానాకాలం ప్రారంభం అయినందున పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. మొక్కలను జంతువులు, పిల్లలు పీకేయకుండా చుట్టూ ట్రీ గార్డులను ఏర్పాటు చేశారు. స్కూల్ ఎన్‌సీసీ ఇన్‌చార్జి వి.ప్రభాకర్ మాట్లాడుతూ... ఎన్‌సీసీ విద్యార్థులు పలు సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకుంటున్నారని తెలియజేశారు. అంతకుముందు పచ్చదనం, పరిశుభ్రత ఆవశ్యకతను వివరిస్తూ పలు ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు.

కులం పేరుతో దూషించిన మహిళలపై అట్రాసిటీ కేసు

వెంగళరావునగర్: అకారణంగా ఓ వ్యక్తిపై దాడి చేయడమే కాకుండా కులం పేరుతో దూషించిన మహిళలపై మధురానగర్ పీఎస్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... వెంగళరావునగర్‌లో ఉండే కె.పురుషోత్తం ఈ నెల 11న తన కారును ఇంటి ముందు పార్క్ చేస్తున్నాడు ఈ సమయంలో పక్కన అద్దెకు ఉంటున్న వెంకటరెడ్డి, లలిత ఆమె కుమార్తె రజితలు గొడవ పడుతున్నారు. వెంకటరెడ్డి జరిగిన విషయాన్ని పురుషోత్తంకు వివరిస్తుండగా హఠాత్తుగా రజిత వచ్చి పురుషోత్తంను రెండుసార్లు చెప్పుతో కొట్టింది. తనకేమీ తెలియదని చెబుతుండగానే మరోసారి చెప్పును విసిరి కులంపేరుతో దూషిస్తూ దుర్భాషలాడింది. అంతేగాకుండా పురుషోత్తం భార్యను, వదినను కూడా కులం పేరుతో దూషించి, కొట్టింది. ఇదంతా సీసీ టీవీలో రికార్డు అయింది. అకారణంగా దాడి చేయడమే కాకుండా కులం పేరుతో దూషించిన లలిత ఆమె కుమార్తె రజితలపై మధురానగర్ పీఎస్‌లో పురుషోత్తం ఫిర్యాదు చేశారు.

ప్రమాదకర విద్యుత్ స్తంభం తొలగింపు

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్ ఇందిరానగర్ ఫేజ్-2 బస్తీలో ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాన్ని ఎట్టకేలకు శుక్రవారం తొలగించారు. ఇటీవలి భారీ వర్షాలు, ఈదురు గాలులకు ఎల్లమ్మ ఆలయం మూల మలుపు వద్ద ఉన్న విద్యుత్ స్తంభం ఒక వైపునకు ఒరిగింది. ప్రమాదాన్ని గమనించిన బస్తీవాసులు స్తంభం పడిపోకుండా తాళ్లతో కట్టారు. సమస్యను బస్తీ అధ్యక్షుడు వేముల యాదయ్య కార్పొరేటర్ సీఎన్ రెడ్డికి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అయన ఆదేశం మేరకు విద్యుత్ అధికారులు స్తంభాన్ని తొలగించారు.

నేత్రపర్వం.. అక్షరాభ్యాసం

- సర్కారు బడుల్లో సందడిగా బడిబాట
- చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించిన ఉపాధ్యాయులు
- పెద్ద ఎత్తున హాజరైన చిన్నారుల తల్లిదండ్రులు



ఫిలింనగర్ అంబేద్కర్‌నగర్‌లో అక్షరాభ్యాసం చేయిస్తున్న టీచర్లు



ఇందిరానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

ఫిలింనగర్: బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాస వేడుకను శుక్రవారం కనులపండువగా నిర్వహించారు. కొత్తగా పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో ఉపాధ్యాయులు సంప్రదాయబద్ధంగా ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో జరిపారు

- అన్ని పాఠశాలల్లోనూ ఉదయం చిన్నారులు, వారి తల్లిదండ్రులతో సందడిగా కనిపించాయి ప్రతి పాఠశాలలో టీచర్లు సరస్వతి పటాన్ని టేబుల్‌పై ఉంచి శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా మరికొన్ని పాఠశాలల్లో వేద పండితులు, అర్చకుల సమక్షంలో ఈ తంతును నిర్వహించారు.
- ఫిలింనగర్ ఎంఆర్‌సీ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో అక్షరాభ్యాసం ఘనంగా జరిగింది. ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన వేడుకకు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో విచ్చేసి సంతోషంగా వ్యక్తం చేశారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 41, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 50, పచ్చిమిర్చి 65, బజ్జీమిర్చి 60, క్యాప్సికమ్ 61, పచ్చికాకర 45, పందిరి బీర 65, క్యాబేజీ 21, క్యారెట్ 40, దొండ 26, గుండుబీన్స్ 115, గింజ చిక్కుడు 45, గోకరకాయ 45, కీర 23, దోసకాయ 25, రూట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 35, చామగడ్డ 40, మొరంగడ్డ 25, కందగడ్డ 45, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి రూ. 4–5 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

బీసీ జనగణనపై ఎన్‌డీఏ వైఖరి ప్రకటించాలి

లిబర్టీ: బీసీ జనగణనపై కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం స్పష్టమైన విధాన ప్రకటన చేయాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి కోరారు. ఇప్పటికే బీసీ కులగణనపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర జాప్యం చేసిందని ఆరోపించారు. దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దాదాపు పదేళ్ల పాటు బీసీలను చిన్న చూపు చూసిన కేంద్ర ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టిన నేపథ్యంలో బీసీ కులగణనపై ప్రధానమంత్రి స్వయంగా స్పష్టమైన ప్రకటన చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. పదేళ్ల కాలంలో బీసీల కోసం ఏం చేశారు..వచ్చే ఐదేళ్లు బీసీల ఆర్థిక ప్రగతి, సంక్షేమం కోసం ఏం చేస్తారో స్పష్టమైన లెక్కలు, కాలవ్యవధితో శ్వేత పత్రం విడుదల చేయాలని అన్నారు.

మహిళ అదృశ్యం

రహమత్‌నగర్: ఓ ప్రైవేటు కంపెనీలో సేల్స్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న ఓ మహిళ అదృశ్యమైన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకుంది. సెక్టార్ ఎస్ఐ నాగూల్ మీరా సమాచారం మేరకు... శ్రీరాంనగర్ కూరగాయల మార్కెట్ వద్ద నివాసముండే సోఫియాబేగంకు నలుగురు కూమార్తెలు, ఒక కొడుకు ఉన్నారు. పెద్ద కూతురు సనాఅఫ్రోజ్(30) మల్లేపల్లిలోని ఓ ప్రైవేటు కంపెనీలో సేల్స్ కో ఆర్డినేటర్‌గా పనిచేస్తుంది. రోజూలానే ఈ నెల 13 ఉదయం ఆఫీస్‌లో మీటింగ్ ఉంది అని చెప్పి టిఫిన్ బాక్సు తీసుకెళ్లకుండా వెళ్లింది. సాయంత్రం అయినా సనాఅఫ్రోజ్ ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఆమెకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో వారు బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

కేలరీలు కరగాలి...

రోజుకు కనీసం 30 నిమిషాల వ్యాయామం శరీరాన్ని చురుగ్గా మార్చుతుంది. ఇందులో భాగం ... మేహం వచ్చే ప్రమాదం 40 శాతం తక్కువని ఫిన్‌లాండ్ పరిశోధనలో తేలింది.



మీరు.. మీ.. క్షణం

డైలీ రొటీన్‌ను ఇలా ప్లాన్ చేయండి

ఆర్థిక విషయాలను పకడ్బందీగా నిర్వహించడం ఎంత అవసరమో ఆరోగ్య భరోసానిచ్చే దైనందిన కృత్యాలు నిర్వహించడమూ అంతే అవసరం. ఆర్ఎన్ఏ–డీఎన్ఏ మొదలు గుండె–మెదడు వరకూ ప్రతీ అణువు, కణము శరీరంలో కీలకమే. ఒక్క అణువు విచ్ఛిన్నమైనా అనారోగ్యమే. సుమారుగా 37.2 ట్రిలియన్ కణాల సమూహంతో నిర్మితమైన మానవ దేహం నిద్ర లేచింది మొదలు మళ్లీ నిద్రకు ఉపక్రమించే వరకూ.. అంతవరకూ ఎందుకు నిద్రలో సైతం నిత్య జీవ క్రియలను కొనసాగిస్తుంది. మరి అంతటి అమూల్యమైన శరీరం తన విధులను తాను సక్రమంగా నిర్వర్తించాలంటే అందుకు తగినట్లుగా మన పని విధానం ఉండాలి? అలా ఉండాలంటే మనం ఏం చేయాలి..ఏమిటా పనులు? ఎలా చేయాలి? ఇలాంటి అంశాలపై హైదరాబాదీల కోసం ప్రత్యేక కథనం...

హనుమాద్రి శ్రీకాంత్

నిద్ర లేచింది మొదలు... ఏమేం పనులు చేయాలి? ఏ టైమ్‌కి ఎక్కడ ఉండాలి? ఎవర్ని కలవాలి? తదితర పనుల జాబితాను ముందు రోజే సిద్ధం చేసుకునే అలవాటుందా? ఈ ప్రశ్నకు చాలా మంది సిటిజనుల నుంచి అవును అనే సమాధానం వస్తుంది. మరి అదే విధంగా రోజూ ఎన్ని లీటర్ల నీరు తాగాలి? ఎన్ని గంటలు నిద్ర పోవాలి? ఎన్ని కేలరీల ఆహారం తీసుకోవాలి? ఎన్ని కేలరీలు ఖర్చు చేయాలి? ఎన్ని గంటలు మొబైల్ చూడాలి?.. వగైరా లిస్ట్ ప్రిపేర్ చేసుకుంటున్నారా? అని ప్రశ్నిస్తే మాత్రం అవును అని బదులిచ్చేవారు అరుదే.

ఆరోగ్య భరోసానిచ్చే నిత్యకృత్యాలపై దృష్టి సారించండి

అందుకు తగ్గట్లుగా మీ పని విధానం, అలవాట్లు మార్చుకోండి

శారీరక, మానసిక, ఆరోగ్య సంరక్షణపై బీ కేర్ ఫుల్

పలు అధ్యయనాల పరిశోధనల్లో ఆసక్తికర అంశాలు వెల్లడి

బీ అలర్ట్ సిటీజన్స్

ఆహారం ఇలా...



పెద్దలకు రోజుకు 1,600–3,000 కేలరీల ఆహారం అవసరం. 19–30 ఏళ్ల మధ్య వయసున్న స్త్రీలకు 1,800–2,400 కేలరీలు, పురుషులకు 2,400–3,000 కేలరీలు. 31–59 ఏళ్ల వయసున్న స్త్రీలకు 1,600–2,200 కేలరీలు, పురుషులకు 2,200–3,000 కేలరీలు అవసరం. అయితే ఒక వ్యక్తి రోజుకు ఎన్ని కేలరీలు తినాలి అనేది ఆ వ్యక్తి జెండర్, వయస్సు, ఎత్తు, జీవనశైలిని బట్టి మారుతుంది. ఆహారంలో క్యాల్షియం రోజుకు 1గ్రా, ఫైబర్ రోజుకు 40 గ్రా.–మెగ్నీషియం రోజుకు 410 మి.గ్రా, విటమిన్ ఇ రోజుకు 15 మి.గ్రా, విటమిన్ సి రోజుకు 75–90 మి.గ్రా, విటమిన్ ఎ రోజుకు 600–900 గ్రా, విటమిన్ డి రోజుకు 600 ఐయూ, పొటాషియం రోజుకు 4.7 గ్రా, ప్రొటీన్ రోజుకు 46–56 గ్రా, ఐరన్ రోజుకు 15–18 గ్రాల వరకూ కావాలి. జాతీయ పరిశోధనా సంస్థ ఐసీఎంఆర్–ఎన్ఐఎన్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్) సూచనల ప్రకారం ప్రతి రోజూ తీసుకునే ఆహారంలో ధాన్యాలు చిరు ధాన్యాలు 250 గ్రా, పప్పులు 85 గ్రా, పాలు పెరుగు 300గ్రా, కూరగాయలు ఆకు కూరలు 400 గ్రా, పండ్లు 100 గ్రా, నూనెగింజలు 35 గ్రా, కొవ్వులు–నూనెలు 27 గ్రా ఉండాలి.


తాగునీరు...ఇదే తీరు...



మనిషి మనుగడకు ప్రామాణికం నీరు. శరీరంలో దాదాపు 60 శాతం నీరే ఉంటుంది. ఆరోగ్యకరమైన జీవనానికి ప్రతీరోజు పురుషులు రోజూ 3.7 లీటర్లు, మహిళలు 2.7 లీటర్ల నీరు తాగాలని ఆరోగ్య నిపుణుల సూచన. ఉష్ణోగ్రత, ఆరోగ్య పరిస్థితులను బట్టి హెచ్చుతగ్గులు అవసరం. సరైన మోతాదులో శరీరానికి నీరు అందకపోవడం రోగకారకంగా మారుతుంది.



మెదడుకు మేత కావాలి...



విజ్ఞానమే కాకుండా మానసిక స్పందనలపై పుస్తక పఠనం అత్యంత ప్రభావం చూపించేది. రోజుకు 30 నిమిషాల పుస్తక పఠనం లేదా పజిల్స్ సాల్వింగ్ మెదడును యాక్టివ్‌గా ఉంచుతుంది. హైస్కూల్, కాలేజ్ విద్యార్థులకు రోజుకు 2–3 గంటల చదువు సరిపోతుందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. విరామం లేకుండా ఏకధాటిగా చదవడం ఒత్తిడిని పెంచుతుంది. ఉద్యోగాలకు సన్నద్ధమయ్యే వారి విషయంలో పఠన సమయం వేరుగా ఉంటుంది.

నిద్రే ఆరోగ్యం...



అనేక రకాల శారీరక, మానసిక రుగ్మతలకు నిద్రలేమే ప్రధాన కారణమని పలు అంతర్జాతీయ పరిశోధనలు వెల్లడించాయి. నిద్ర అలవాట్లు, పర్యవసానాలపై మ్యాట్రెస్ మేకర్ వేక్‌ఫిట్ నిర్వహించిన సర్వేలో భాగంగా నగరంలో 56 శాతం మంది వారి పని వేళల్లో నిద్ర మత్తుతో అవస్థలు పడుతున్నారని తేల్చింది. అంతేకాకుండా నిద్ర లేవగానే రిఫ్రెష్ ఫీలింగ్ అనిపించట్లేదని నగరవాసులు పేర్కొన్నారు.

‘ది గ్రేట్ ఇండియన్ స్లీప్ స్కోర్‌కార్డ్’గా పిలువబడే ఈ సర్వేలో నగరంలో దాదాపు 33 శాతం మంది తమ నిద్రలేమికి కేవలం అర్ధరాత్రి వరకూ డిజిటల్ స్క్రీన్‌లు వీక్షించడమే కారణమని, తద్వారా 32 శాతం మంది ఉద్యోగాలకు ఆలస్యంగా వెళ్తున్నారని తేల్చారు. ఆరోగ్యకర జీవనానికి రోజూ 7–8 గంటల నిద్ర అవసరం. అయితే వయస్సులను బట్టి కొద్దిగా వ్యత్యాసం ఉంటుంది. 4 నుంచి 12 నెలల చిన్నారులకు 12 నుంచి 16 గంటల పాటు, 1–2 ఏళ్లు... 11–14 గంటలు, 3–5 ఏళ్లు 10–13 గంటలు, 6–12 ఏళ్లు 9–12 గంటల నిద్ర, 13–18 ఏళ్లు.. 8–10 గంటలు, ఆపై వయసు వారికి 7–8గంటలు, పీరియడ్స్‌లో ఉన్న ఆడవారికి కనీసం 8 గంటల నిద్ర అవసరమని వైద్యులు చెబుతున్నారు.

‘స్మార్ట్’గా వాడాలి...



మొబైల్, ల్యాప్‌టాప్ వంటి స్క్రీన్‌లను రోజులో 2 గంటల కన్నా ఎక్కువ సమయం చూడటం హానికరం. ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపిన సూచనల ప్రకారం..సంవత్సరం కంటే తక్కువ వయస్సున్న పిల్లలు మొబైల్ ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లకు దూరంగా ఉండాలి. ఐదేళ్లలోపు చిన్నారులు గంటకు మించి ఫోన్ వాడకూడదు. 10 మిలియన్ల రంగులను వేరు చేయగల శక్తి గల మనిషి కన్నుకు ఫోన్ హానికరమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఉప్పు.. ఎక్కువైతే ముప్పు...



శరీర క్రియల కోసం ప్రతిరోజూ 500మి.గ్రా సోడియం (ఉప్పు) అవసరం. ఇది నరాలను ప్రేరేపించడంతో పాటు కండర సంకోచానికీ సహాయం చేస్తుంది. ముఖ్యంగా దేహంలోని నీరు–ఖనిజాల సమతుల్యతను కాపాడుతుంది. అతిగా వాడితే బ్లడ్ ప్రెషర్, గుండె సమస్యలకు దారితీస్తుంది.

ప్రాణవాయువు ప్రాముఖ్యత...

మనిషి రోజుకు 550 లీటర్ల స్వచ్ఛమైన ఆక్సిజన్ తీసుకోవాలి. పీల్చే గాలిలో 15 శాతం ఆక్సిజన్ ఉంటుంది. కాలుష్య రహిత పరిసరాల్లో రోజూ కొంత సమయం గడపడం ద్వారా తగినంత ఆక్సిజన్ పొందవచ్చు.

నవ్వు...కరిగే కొవ్వు...




ఓ అధ్యయనం ప్రకారం రోజుకు 10 నుంచి 15 నిమిషాలు నవ్వడం వల్ల దాదాపు 40 కేలరీలు బర్న్ అవుతాయి. నవ్వు తర్వాత 45 నిమిషాల వరకూ కండరాలు రిలాక్స్‌గా ఉంటాయి. రోగనిరోధక శక్తిని పెంచడం, ఒత్తిడి హార్మోన్లను తగ్గించడం, సహజమైన ఎండార్ఫిన్స్ విడుదల చేయడం, గుండెపోటు నివారణ తదితర విషయాల్లో మేలు చేస్తుంది. నవ్వడం వల్ల జీవిత కాలం పెరుగుతుందని నార్వే అధ్యయనం వెల్లడించింది.

మ్యూజిక్.. మ్యాజిక్..



బ్రిటిష్ అకాడమీ ఆఫ్ సౌండ్ థెరపీ చేసిన అధ్యయనం ప్రకారం మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి రోజూ 78 నిమిషాల సంగీతాన్ని వినడం అవసరమని పేర్కొంది. సగటున 5 నిమిషాల సంగీతం ఆరోగ్యదాయకం. సైన్స్ ప్రకారం..14 నిమిషాల సంగీతం సంతోషానికి, 16 నిమిషాల సంగీతం విశ్రాంతిని, దుఃఖాన్ని అధిగమించే శక్తిని, 15 నిమిషాల సంగీతం ఏకాగ్రతకు, 17 నిమిషాల సంగీతం కోపాన్ని అదుపు చేయడంలో సహాయపడుతుందట.

కప్పు కాఫీ..



శరీరానికి కెఫీన్‌లు ప్రమాదకరమే అయినా రోజుకు 400 మిల్లీగ్రాముల వరకూ సురక్షితమని పలు అధ్యయనాలు వెల్లడించాయి. ఇది దాదాపు నాలుగు కప్పుల బ్రూ కాఫీ, 10 క్యాన్ల కోలా, రెండు ఎనర్జీ షాట్ డ్రింక్స్‌లతో లభిస్తుంది. ఈ కెఫీన్ మెదడు నరాల పనితీరును మెరుగు పరుస్తుంది. అయితే ఎనర్జీ డ్రింక్స్‌లో కెఫీన్ కంటెంట్‌లో చాలా తేడా ఉంటుందని గుర్తుంచుకోవాలి.

ఇది రొటీన్..



రోజుకు సగటున 3 నుంచి 5 కప్పుల చాయ్ ఆరోగ్యకరమే. సాధారణ టీలో ఉండే సమ్మేళనాలకు శరీరం ప్రతిస్పందించే విధానంపై ఆధారపడి ఉంటుంది. అలాగే క్రమం తప్పకుండా గ్రీన్ టీ తాగడం వల్ల బరువు తగ్గడం, మధుమేహం, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రమాదాలను తగ్గించుకోవచ్చు.

తాగు...ఆగు...



రోజుకు 15–30 మి.లీ మించి ఆల్కహాల్ ప్రమాదకరం. బీర్, వైన్, జిన్, విస్కీ వంటి ఆల్కహాల్స్‌లో ఏదో ఒకటి మాత్రమే సేవించాలని నిపుణులు సూచిస్తున్నారు. వీటిలో ఆల్కహాల్ పరిమాణాల్లో తేడాలుంటాయి. మహిళలకు రోజుకు ఒక పానీయం, పురుషులకు రోజుకు రెండు పానీయాల పరిమితి మించకూడదు.

వేడి.. రెడీ..

శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం మానవ శరీరం 36 నుంచి 37.5 సె. వరకూ వేడిని తట్టుకుంటుంది. ఇది 40సె మించితే ప్రమాదకరం. అతి వేడి డీహైడ్రేషన్‌తో పాటు ప్రాణాపాయ స్థితికి చేరుకునే అవకాశముంది. అలాగే 21 సె డిగ్రీల వరకూ చల్లదనాన్ని తట్టుకుంటుంది.

సిట్..రైట్

రోజులో 4 గంటల కన్నా మించి కూర్చుంటే ఆరోగ్య సమస్యలు ప్రారంభమై, ఇది 8 గంటలకు చేరితే తీవ్ర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని జస్ట్ స్టాండ్ స్వచ్ఛంద సంస్థ వెల్లడించింది. ఉద్యోగ రీత్యా 8 నుంచి 11 గంటల వరకూ కదలకుండా కూర్చోడం వల్ల ఒబెసిటీ సహా అనేక అనారోగ్యాలు దాడి చేస్తున్నాయి.

ఆరోగ్యానికి...పండుగ




రోజువారీ ఆహారంలో 25 నుంచి 30 శాతం పండ్లు ఉండాలనేది ఆరోగ్య నిపుణుల మాట. ద్రవ రూపంలో తీసుకోవాలనుకుంటే.. రోజూ 150 మి.లీ లోపు పండ్ల రసాలు తీసుకోవాలి. అతిగా పండ్ల రసాలు సేవించడం వల్ల శరీరంలో గ్లూకోజ్, చక్కెర స్థాయిలు పెరిగే అవకాశముంది.


ఎంగేజ్ విత్ సిటీ



ప్రముఖ రంగస్థల సంస్థ సూత్రధార్ ఆధ్వర్యంలో తొలి మరాఠీ నాటకం పాస్వాలా ప్రదర్శిస్తున్నారు.
తేదీ జూన్ 15న వేదిక: లామకాన్, బంజారాహిల్స్. సమయం రాత్రి 8గంటల నుంచి



పరస్పరం కథలు వినిపించుకునే స్టోరీ టెల్లింగ్ థియేటర్ ఫర్ చిల్డ్రన్ ఈవెంట్ ‘అనగనగా’ పేరిట నిర్వహిస్తున్నారు. చిన్నారులకు వినోదాన్ని విజ్ఞానాన్ని పంచే కార్యక్రమం ఇది.
తేదీ జూన్ 16న వేదిక అవర్ సేక్రెడ్ స్పేస్, సికింద్రాబాద్ సమయం ఉదయం 10గంటల నుంచి




ప్రముఖ స్టాండప్ కమెడియన్ గౌరవ్ కపూర్ కామెడీ ఈవెంట్ చమన్ చటోరా నగరంలో జరగనుంది. గంట సేపు నాన్‌స్టాప్‌గా ఈ ప్రదర్శన నవ్వుల్లో ముంచెత్తుందని నిర్వాహకులు హామీ ఇస్తున్నారు.
తేదీ జూన్ 15 వేదిక కేఎల్ఎన్ ప్రసాద్ ఆడిటోరియం ఫిక్కీ సమయం రాత్రి 8 గంటల నుంచి

ట్రిబ్యూట్ టు పింక్ ఫ్లాయిడ్ ఫీట్ డెజావూ...



లండన్‌కు చెందిన పురాతన రాక్ బ్యాండ్ పింక్ ఫ్లాయిడ్‌కు నివాళిగా నిర్వహిస్తున్న పాశ్చాత్య సంగీత ప్రదర్శన తేదీ..జూన్ 15, వేదిక హార్డ్ రాక్ కేఫ్, బంజారాహిల్స్, సమయం రాత్రి 8.30 గంటల నుంచి..



కొత్త కొత్త స్నేహాలు చిగురించేలా చేసే కార్యక్రమం ఇది. అపరిచితులు తేనీరు సేవిస్తూ పరిచయాలతో పాటు అనుభవాలు కూడా పంచుకునే వైవిధ్యభరిత వేదిక.
తేదీ జూన్ 15, వేదిక ట్రెల్లింగ్ ఐపీ కేఫ్ మాదాపూర్ సమయం సాయంత్రం 4గంటల నుంచి



ఆహారం, పానీయాల పరిశ్రమకు చెందిన ఉత్పత్తిదారుల కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. తేదీ జూన్ 15, వేదిక హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్, మాదాపూర్ సమయం ఉదయం 10 గంటల నుంచి

సంగీత ప్రదర్శన

గాయని గాయకులు పూర్ణిమా దాస్, అంకుర్ బోరా సమర్పిస్తున్న సంగీత ప్రదర్శన సంగీతాభిమానుల్ని అలరిస్తుంది.
తేదీ జూన్ 15 వేదిక ... సమయం రాత్రి 8 గంటల నుంచి

సమయ్ రైనా, అన్‌ఫిల్టర్డ్..


ప్రముఖ కమెడియన్ సమయ్ రైనా తన చివరి ప్రదర్శనకు నగరాన్ని ఎంచుకున్నారు. హాస్యం పండించడంలో దిట్ట అయిన రైనా.. ఇండియా టూర్‌లో భాగంగా నగరానికి వస్తున్నారు.
తేదీ జూన్ 15 వేదిక హార్ట్ కప్ కాఫీ గచ్చిబౌలి, సమయం సాయంత్రం 5గంటల నుంచి


క్వెస్ట్ ఆఫ్ టెన్.. చిత్రకళా ప్రదర్శన

పది మంది ప్రముఖ చిత్రకారుల చిత్రాలతో క్వెస్ట్ ఆఫ్ టెన్ పేరిట చిత్రప్రదర్శన నిర్వహిస్తున్నారు. వైవిధ్యభరిత చిత్రాలు గీసిన చిత్రకారుల సృజన ఆకట్టుకుంటోంది.
ప్రదర్శన జూన్ 22 వరకు. వేదిక చిత్రమయి ఆర్ట్ గ్యాలరీ కావూరి హిల్స్

కరావోకే సైట్


పాటలు విని ఆనందించడంతో గళం కలిపి పాడి ఆనందించే సరదా ఉన్నవారి కోసం ఈ కార్యక్రమం.
తేదీ జూన్ 16 వేదిక ... స్టూడియో అంజయ్యనగర్ గచ్చిబౌలి


అత్తాపూర్ పిల్లర్ నెం.104 వద్ద...


ట్యాంక్‌బండ్ రోడ్‌లో...


బంజారాహిల్స్ తాజ్‌కృష్ణా చౌరస్తాలో...


ఎల్బీనగర్ చౌరస్తాలో...



ఎస్సార్ నగర్‌లో...


దీఎస్‌రెడ్డి-హస్తినాపురం సిగ్నల్ వద్ద..


ఆరాంఘర్ ఎక్స్‌రోడ్ వద్ద...

విధులకు 'సెల్లు' చేటీ

సిటీలో అసలే ట్రాఫిక్ ఇబ్బందులు ఎక్కువ. పీక్ టైంలో ఇక చెప్పాల్సిన పనే లేదు. ఈ పరిస్థితుల్లో ట్రాఫిక్ పోలీసుల విధులు కత్తిమీద సామే. వీరు ఏ మాత్రం ఆదమరచినా...విధుల్లో నిర్లక్ష్యం వహించినా ఇక ఆ రూటంతా ట్రాఫిక్ అస్తవ్యస్తమే. మరి మన ట్రాఫిక్ పోలీసులు ఏం చేస్తున్నారో ఓసారి చూదండి. ప్రధాన కూడళ్లలో విధుల్లో ఉన్న వారంతా సెల్‌ఫోన్లలో నిమగ్నమై ఉంటున్నారు. ట్రాఫిక్‌ను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో వాహనదారులు దీన్ని అసరాగా తీసుకుని సిగ్నల్స్ పడకున్నా రయ్‌న దూసుకెళ్తున్నారు. మరికొందరు రాంగ్‌రూట్లను ఎంచుకుంటున్నారు. పీక్ టైంలలోనూ చాలా మంది ట్రాఫిక్ పోలీసులు గంటల తరబడి ఫోన్లలోనే గడుపుతున్నారని, విధులను పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెద్ద సార్లు..ఓ లుక్కేసి ట్రాఫిక్ విధుల్లో ఉన్న పోలీసులకు సెల్‌ఫోన్ జాఢ్యాన్ని వదిలించాలని నగర వాహనదారులు కోరుతున్నారు. - సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు


సన్నాహక కార్యక్రమంలో పాల్గొన్న నటి దివి, మోడల్స్

21 నుంచి హైలైఫ్ జ్యువెల్స్ ఎక్స్‌పో


బంజారాహిల్స్: ఈ నెల 21, 22, 23వ తేదీల్లో హెచ్ఐసీసీ నోవాటెల్ హోటల్‌లో హైలైఫ్ జ్యువెల్స్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన సన్నాహక కార్యక్రమం బంజారాహిల్స్ రోడ్ నెం.10లో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో నటీమణులు దివితో పాటు అమిక్షా పవార్, ఇతర మోడల్స్ పాల్గొని ఎక్స్‌పోలో లభించనున్న వస్త్రాభరణాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి ప్రసిద్ధిగాంచిన డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలను ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించబోతున్నట్లు వారు తెలిపారు.

ట్రాఫిక్ నిర్వహణలో డ్రోన్ల వినియోగం

ఎస్సీఎస్సీతో సైబరాబాద్ పోలీసుల భాగస్వామ్యం

సాక్షి, సిటీబ్యూరో: ఇక నుంచి సైబరాబాద్‌లో ట్రాఫిక్ పోలీసుగా డ్రోన్లు కూడా వ్యవహరించనున్నాయి. ఆకాశంలో రయ్ రయ్‌మంటూ ఎగురుతూ రోడ్డు మీదున్న ట్రాఫిక్ నిర్వహణలో పాలుపంచుకోనున్నాయి. ఈమేరకు సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్సీఎస్సీ)తో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసుల భాగస్వామ్యమయ్యారు. మానవరహిత వైమానిక నిఘా విభాగం డ్రోన్లతో రహదారి భద్రత, ట్రాఫిక్ నిర్వహణ చేపట్టనున్నట్లు సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి తెలిపారు. రోడ్లపై ట్రాఫిక్ జాంలు, వాహనాల రద్దీ ఎక్కడున్నాయి? వాహనాల వేగం ఎలా ఉంది? రోడ్డు ప్రమాదాలు వంటి అంశాలను ఎప్పటికప్పుడు పసిగట్టి క్షేత్ర స్థాయిలో ట్రాఫిక్ పోలీసులకు చేరవేస్తాయి. దీంతో ట్రాఫిక్ పోలీసు బృందాలు ఆయా సమస్యలను వేగంగా పరిష్కరిస్తారని పేర్కొన్నారు. దీంతో వాహనదారులు సులభతర, వేగవంతమైన ప్రయాణానికి వీలు కలుగుతుందని చెప్పారు.

ఉల్లి ధరలు పైపైకి..


మలక్‌పేట మార్కెట్‌లో ఉల్లి నిల్వలు(ఇన్‌సెట్‌లో) నో ఆనియన్ బోర్డు

దాదర్‌ఘాట్: ఉల్లిగడ్డల ధరలు మరోసారి మోత మోగిస్తున్నాయి నెల రోజుల వ్యవధిలోనే ధర రెట్టింపు కావడంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. గత నెల మొదటి వారంలో కిలో ఉల్లిగడ్డ రూ.20 నుంచి 25 రూపాయలు ఉండగా..ఇప్పుడు రూ.45 నుంచి 50 వరకు చేరింది. మలక్‌పేటలోని వ్యవసాయ మార్కెట్‌కి మహారాష్ట్ర నుంచి 52 లారీల ఉల్లిగడ్డ దిగుమతి అయింది. క్వింటా రూ.33000 కాగా, రిటైల్‌గా కిలో రూ.45కు విక్రయించారు. మహారాష్ట్ర నుంచి ఎక్స్‌పోర్ట్ పర్మిషన్ నిలిపివేయడం, వర్షాల ప్రభావంతో ఉల్లి దిగుమతులు తగ్గడం, మహారాష్ట్ర వ్యాపారులు, రైతులు గోదాములలో నిల్వ చేయడం ధరల పెరుగుదలకు కారణమని స్థానిక వ్యాపారులు పేర్కొంటున్నారు. కాగా ఉల్లిగడ్డ ధరలు పెరిగిన మాట వాస్తవమేనని, మరో రెండు రోజుల్లో ధరలు అదుపులోకి వస్తాయని మార్కెట్ ఎస్జీఎస్ దామోదర్ పేర్కొన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌పోర్ట్ పర్మిషన్ ఇవ్వడం లేదని, దీంతో దిగుబడి తగ్గినట్లు ఆయన తెలిపారు. ఇక్కడి వ్యాపారులు దీనిపై మహారాష్ట్ర వ్యాపారులతో మాట్లాడుతున్నారని, రెండు, మూడు రోజుల్లో ఉల్లి ధరలు తగ్గుతాయని తెలిపారు.

'నో ఆనియన్స్' బోర్డు

పెరిగిన ఉల్లి ధరలతో హోటళ్లు, చిరువిక్ర వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ధర ఒకేసారి డబుల్ కావడంతో కొన్ని హోటళ్ల ముందు 'నో ఆనియన్స్' అని బోర్డులు పెట్టారు

నిమ్స్‌లో ప్రపంచ రక్తదాతల దినోత్సవం


నిమ్స్ బ్లడ్ బ్యాంక్ సిబ్బందితో డైరెక్టర్ బీరప్ప

లక్డీకాపూల్: నిమ్స్‌లో శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్త దాన శిబిరం నిర్వహించారు. నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, బ్లడ్ బ్యాంక్ హెచ్ఓడి కాంతి పర్యవేక్షించారు. రక్తదానం ప్రాముఖ్యత గురించి వివరించారు. అత్యవసర సమయాల్లో రక్తదానం చేసిన వారు భగవంతుడితో సమానమన్నారు. నిమ్స్ ఉద్యోగులు, వైద్య విద్యార్థులు, బ్లడ్‌బ్యాంక్ వైద్యులు మహేష్, సుధీర్, మురళీ కృష్ణ, మీడియా రిలేషన్ ఆఫీసర్ సత్య గౌడ్ తదితరులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా దాదాపు 150 మంది రక్తదాతలను సత్కరించారు.

ఏజీ వర్సిటీలో ప్రొబెషనరీ ఐపీఎస్‌లు


వ్యవసాయ వర్సిటీలో ప్రొబెషనరీ ఐపీఎస్ అధికారులు

ఏజీవర్సిటీ: తెలంగాణ రాష్ట్ర కేడర్‌కు కేటాయించిన ప్రొబెషనరీ ఐపీఎస్ అధికారులు శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. రిజిస్ట్రార్ రఘురామిరారెడ్డితో పాటు ఉన్నతాధికారులతో వారు సమావేశమయ్యారు. విశ్వవిద్యాలయంలో బోధన, పరిశోధన, విస్తరణ విభాగాలలోని కార్యక్రమాలు, కోర్సులు తదితర అంశాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణలో వ్యవసాయానికి సంబంధించిన పలు వివరాలు, శాస్త్రవేత్తలు కొత్తగా చేస్తున్న పరిశోధనలు, కొత్త వంగడాలు..వాటి దిగుబడులు, వాతావరణ మార్పుల ద్వారా వ్యవసాయంలో సంభవిస్తున్న నష్టాల గురించి అధికారులు వారికి వివరించారు

ఫిట్‌లెస్' బస్సులపై దాడులు

సాక్షి, సిటీబ్యూరో: నిబంధనలకు విరుద్ధంగా తిరిగే స్కూల్ బస్సులపైన రవాణాశాఖ శుక్రవారం మూడో రోజు కూడా దాడులను కొనసాగించింది. గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో విస్తృతమైన తనిఖీలు నిర్వహించి 54 బస్సులపైన కేసులు నమోదు చేశారు. ఫిట్‌నెస్ లేని బస్సులను అధికారులు జప్తు చేశారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఫిట్‌నెస్ లేని, పన్నులు చెల్లించని 34 బస్సులపై కేసులు నమోదు చేసినట్లు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్ర శేఖర్ గౌడ్ తెలిపారు. 4 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఫిట్‌నెస్ లేని,15 సంవత్సరాలు దాటిన విద్యాసంస్థల బస్సులు ఎట్టి పరిస్థితులలో రోడ్ల పైకి తిప్పరాదని హెచ్చరించారు. అనుభవం గల, 60 సంవత్సరాలు మించని డ్రైవర్లను నియమించాలని చెప్పారు.

డయల్ యువర్ ఎండీ

జలమండలి కార్యక్రమం పునఃప్రారంభం

- శనివారం సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు
- ఫిర్యాదు చేయాల్సిన నంబర్లు 040- 23442881/2/3
- ఇకపై ప్రతి 15 రోజులకోసారి నిర్వహణ
- సమస్యల పరిష్కారానికి జలమండలి చర్యలు
- త్వరలోనే 'మీట్ యువర్ ఎండీ' సైతం..

సాక్షి, సిటీబ్యూరో: జలమండలి వినియోగదారుల నుంచి నేరుగా సమస్యలు తెలుసుకునేందుకు చేపట్టిన 'డయల్ యువర్ ఎండీ' కార్యక్రమం పునః ప్రారంభం కానుంది. ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో ఎండీ సుదర్శన్ రెడ్డి.. శనివారం మళ్లీ ప్రారంభించనున్నారు. సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు కార్యక్రమం కొనసాగనుంది.

కోవిడ్‌తో బ్రేక్..

కరోనాకు ముందు.. ప్రతి నెలా మూడో శనివారం ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగేది. కోవిడ్ తర్వాత కొన్ని కారణాల రీత్యా నిలిచిపోయింది. తాజాగా ఈ కార్యక్రమాన్ని మళ్లీ పునఃప్రారంభిస్తున్నట్లు ఎండీ సుదర్శన్ రెడ్డి తెలిపారు. అయితే.. గతంలో వలే ప్రతి నెలా మూడో శనివారం కాకుండా.. 15 రోజులకోసారి ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇదే కాకుండా.. వినియోగదారులు నేరుగా జలమండలి మేనేజింగ్ డైరెక్టర్‌ను కలిసే 'మీట్ యువర్ ఎండీ' కార్యక్రమాన్ని కూడా త్వరలోనే ప్రారంభిస్తామని వెల్లడించారు.

ఈ నంబర్లకు ఫోన్ చేయొచ్చు..

సమస్యల్ని ఎండీ దృష్టికి తీసుకురావడానికి.. 040- 23442881 లేదా 23442882 లేదా 23442883 నంబర్లకు ఫోన్ చేసి.. తమ క్యాన్ నంబరుతో పాటు ఇంటి నంబరు చెప్పడం ద్వారా సమస్యల్ని నివేదించవచ్చు. వినియోగదారులు.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు.

దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి..

వినియోగదారులు తాగునీరు, మురుగునీటి సమస్యలతో పాటు చాలా కాలంగా అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ, బిల్లింగ్, మీటరింగ్, ఇతర సమస్యల్ని పరిష్కరించడానికి ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. జలమండలిలోని పలు సెక్షన్లు, డివిజన్, సర్కిల్ కార్యాలయాల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు, ఫిర్యాదులను .. వినియోగదారులు నేరుగా ఎండీకి ఫోన్ చేసి వివరించవచ్చు. డయల్ యువర్ ఎండీ ప్రోగ్రాంలో సంబంధిత డైరెక్టర్లు, సీజీఎంలు, జీఎంలు పాల్గొంటారు కాబట్టి.. దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న సమస్యలు పరిష్కారమవుతాయి.

ప్రజావాణి సైతం..

స్థానిక ఓ అండ్ ఎం డివిజన్ జనరల్ మేనేజర్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రామాన్ని సైతం పునః ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. తాగునీరు, మురుగు నీటి నిర్వహణ, బిల్లింగ్, రెవెన్యూ, ఇతర సమస్యల ఫిర్యాదులు చేయడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు

వర్షాకాలంలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అన్ని ఏర్పాట్లూ చేసినట్లు జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి తెలిపారు. వర్షాకాలంలో వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు, పర్యవేక్షించేందుకు జలమండలి కమాండ్ కంట్రోల్ రూమ్ 24 గంటలూ పని చేస్తోందన్నారు. దీని కోసం 3 షిఫ్టుల్లో సిబ్బంది పని చేస్తారని వివరించారు. రహదారులపై ఉన్న మ్యాన్ హోళ్లు, డీప్ మ్యాన్ హోళ్లను సులభంగా గుర్తించే విధంగా.. వాటికి ఎరుపు రంగు వేశామని తెలిపారు. అంతే కాకుండా.. డీప్ మ్యాన్ హోల్ ఉన్న ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు వివరించారు

రైల్ @139



సమస్య ఏదైనా తక్షణ సహాయం
- ఒక్క ఫోన్‌తో ప్రయాణికుల చెంతకు
- భద్రతపై రైల్వే అధికారుల దృష్టి

నాంపల్లి:

- ఇటీవల తిరుపతి నుంచి కాచిగూడకు వచ్చిన రైల్లో ఓ కుటుంబం ప్రయాణించింది. అందులో ఓ యువతి అప్పర్ బెర్త్‌పై నిద్రిస్తుంది. అన్నమయ్య జిల్లాకు చెందిన ఓ హోంగార్డు ఆ యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. విషయం తెలుసుకున్న ఆమె కుటుంబ సభ్యులు 139కు ఫిర్యాదు చేయడంతో హోంగార్డును కాచిగూడ పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. సకాలంలో వారు ఫిర్యాదు చేయడంతో నిందితుడిని వెంటనే పట్టుకోగలిగారు.
- హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే రైల్లో విజయవాడకు చెందిన ఓ కుటుంబం ఎక్కారు. ఉన్నట్లుండి ఆ కుటుంబంలోని ఓ పెద్దాయనకు ఆరోగ్య సమస్య తలెత్తింది. తోటి ప్రయాణికుడి సలహా మేరకు 139కి ఫిర్యాదు చేశారు. తక్షణమే స్పందించిన అధికారులు మార్గమధ్యలో అందుబాటులో ఉన్న రైల్వే ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

......ఇలా చెప్పుకుంటే ఎన్నో ఘటనలను ఇటీవల రైల్వే అధికారులు పరిష్కరిస్తున్నారు. అదెలా అనుకుంటున్నారా..? అదే టోల్ ఫ్రీ నెంబర్ 139. ప్రయాణికుల అవసరాలను, ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ అత్యవసర సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. సమస్య ఏదైనా.. తక్షణ సహాయం అందిస్తున్నారు. ఒక్క ఫోన్‌తో ప్రయాణికుల చెంత వాలిపోతున్నారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని వీలైనంత త్వరగా వారికి సేవలను అందిస్తున్నారు.

సమస్య ఏదైనా..!

రైల్వే ప్రయాణమంటేనే అనేక సమస్యలు ఉంటాయి. ఇదంతా మనకు తెలిసిన విషయమే. అయితే వాటిని పరిష్కరించేందుకు రైల్వే అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఆరోగ్య సమస్య, చోరీలు, ఈవ్‌టీజింగ్, అసభ్యకర ప్రవర్తన, రైలు బోగీల్లో నీరు, మురుగుదొడ్లు, శుభ్రత, ఫ్యాన్లు, లైట్లు పనిచేయకపోవడం, కేటాయించిన బెర్త్‌లో వేరే వ్యక్తులు కూర్చోవడం, అనుమానాస్పద వ్యక్తుల సంచారం.. ఇలా ఎలాంటి సమస్య అయినా.. ఒకే ఒక్క పరిష్కారం.. 139 టోల్ ఫ్రీ. సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోకి వచ్చే లక్డీకాపూల్, ఖైరతాబాదు, నెక్లెస్ రోడ్డు, బేగంపేట, భరత్‌నగర్, ఫతేనగర్, బోరబండ, హైటెక్‌సిటీ, చందానగర్ రైల్వే స్టేషన్ల మీదుగా ముంబైకి. అలాగే హైదరాబాద్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ల మీదుగా తిరుపతి, చెన్నయ్, విశాఖపట్నం, విజయవాడ, ఢిల్లీ ప్రాంతాలకు నిత్యం పదుల సంఖ్యలో రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. వీటిలో ఏ సమస్య ఎదురైనా అధికారులు తక్షణమే స్పందిస్తున్నారు.

భద్రత దిశగా...

రైలులో కిటకీల వద్ద నిద్రిస్తున్న సమయంలో విలువైన వస్తువులు చోరీకి పాల్పడటం, బోగీల్లోనూ దొంగలు విలువైన వస్తువులు చోరీ చేయడం చూస్తుంటాం. లేదా ఒంటరిగా ప్రయాణిస్తున్న మహిళలను, యూత్‌ను టార్గెట్ చేసి ఈవ్‌టీజింగ్‌కు పాల్పడటం వంటి సమస్యకూ 139 ఫోన్ కాల్ ద్వారా తక్షణ సహాయం అందజేస్తున్నారు.

వివరాలు ఇవ్వాలి..

రైల్లో ప్రయాణిస్తున్న తరుణంలో ప్రమాదవశాత్తు ఫోన్లు, బ్యాగులు, ఇతరత్రా విలువైన వస్తువులు జారిపోవడం, మర్చిపోవడం సర్వసాధారణం. అలాంటి సమయంలోనూ రైలు పేరు, బెర్త్ నంబరు, బయలుదేరిన సమయం, మరిచిపోయిన వస్తువుల వివరాలు ఇలా అన్నీ 139కి ఫోన్ ద్వారా సరైన ల్యాండ్ మార్క్, లేదా విద్యుత్ స్తంభాల నెంబర్ల ఆధారంగా తెలియజేయవచ్చు. ఆర్పీఎఫ్, జీఆర్పీ సహకారంతో తిరిగి వాటిని రైల్వే సిబ్బంది అందజేస్తారు.

24 గంటల్లో...


ఎవరైతే రైలులో ప్రయాణిస్తూ సమస్య ఎదురైందని టోల్‌ఫ్రీకి కాల్ చేస్తారో.. ఆ రైల్లో ప్రయాణించే మార్గంలోని రైల్వే డివిజన్ కార్యాలయానికి ఈ కాల్ వెళ్తుంది. అక్కడ 24 గంటల పాటు అప్రమత్తంగా ఉండే సిబ్బంది ఆ వివరాలను తెలుసుకుని రైలు ఆ తర్వాత చేరే స్టేషన్‌కు సమాచారం అందిస్తారు. ఆయా రైల్వే స్టేషన్‌లోని అధికారులు, సిబ్బంది వెంటనే అప్రమత్తమై ఫోన్‌కాల్స్ ద్వారా వచ్చిన ఫిర్యాదు ఆధారంగా అక్కడికి చేరుకుని వారు ప్రయాణించే బోగీలోకి వెళ్లి బాధితుల సమస్యను పరిష్కరిస్తారు.

ఆత్మీయ వేడుకలకు తెలంగాణ మంచి వేదిక


స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు

- మంత్రి జూపల్లి కృష్ణారావు
- హైటెక్స్‌లో జాతీయ, అంతర్జాతీయ వెడ్డింగ్ ప్లానర్ల సమ్మేళనం ప్రారంభం

మాదాపూర్: ఆత్మీయ వేడుకలకు తెలంగాణ మంచి వేదిక అని..ఇక్కడ అద్భుతమైన సాంస్కృతిక, సంప్రదాయ వేడుకలు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో శుక్రవారం జాతీయ, అంతర్జాతీయ వెడ్డింగ్ ప్లానర్ల సమ్మేళనాన్ని ఆయన ప్రారంభించారు. తెలంగాణ టూరిజం, తెలంగాణచాంబర్స్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ తదితర సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్‌లో మంత్రి మాట్లాడుతూ సౌత్ ఇండియన్ వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్ 3వ ఎడిషన్‌కు హైదరాబాద్ నగరం ఆతిథ్యం ఇవ్వడం తెలంగాణకు గర్వకారణమన్నారు. తెలంగాణలో ఆకర్షణీయమైన వివాహ గమ్యస్థానాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. తెలంగాణలోని మూసీ నదిని లండన్ థేమ్స్ నది తరహాలో రూ.70 వేల కోట్లతో అభివృద్ధి చేయనున్నామని తెలిపారు. టీసీఈఐ అధ్యక్షుడు ఆళ్ల బలరాం బాబు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సిడ్నీ నుంచి వెండి ఈఎల్ ఖౌరీ సహా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన నిపుణులు హాజరవుతున్నారన్నారు. వెడ్డింగ్ ప్లానర్లు, డిజైనర్లు, స్టైలిస్టులు, డెకరేటర్‌లు, ఈవెంట్ మేనేజర్‌లతో పాటు రాజస్థాన్ నుంచి 80 మంది, ఏపీ నుంచి 50 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టూరిజం శాఖ డైరెక్టర్ కె.నిఖిల, జనరల్ సెక్రటరీ రవి, కన్వీనర్ సాయిశ్రావణ్ తదితరులు పాల్గొన్నారు


సాంస్కృతిక ప్రదర్శనలు..

ప్రయాణికుల భద్రతకు పెద్దపీట

- అసాంఘిక శక్తులపై రైల్వేరక్షణ దళం ఉక్కుపాదం
- మహిళలు, పిల్లల రక్షణకు ప్రత్యేక బృందాలు
- ఆస్తుల పరిరక్షణపై నిరంతర నిఘా

సాక్షి, సిటీబ్యూరో: ప్రయాణికుల భద్రత, రైల్వే ఆస్తుల పరిరక్షణే లక్ష్యంగా దక్షిణమధ్య రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపింది. ఈ మేరకు మహిళలు, పిల్లల రక్షణ కోసం ప్రత్యేక భద్రతా బృందాలను ఏర్పాటు చేశారు. ఆపరేషన్ యాత్రి సురక్ష, ఆపరేషన్ సత్కార్, ఆపరేషన్ నాన్ హే ఫారిస్టే వంటి వివిధ రకాల కార్యక్రమాల ద్వారా భద్రతా చర్యలను కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

సొత్తు స్వాధీనం..
నిందితుల అరెస్టు ఇలా...

- ఆపరేషన్ యాత్రి సురక్ష ద్వారా గత నెలలో 37 మందిని అరెస్టు చేసి చోరీకి గురైన రూ.29.58 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపైన 53 కేసులు నమోదు చేశారు
- 'ఆపరేషన్ అమానత్' అనే కార్యక్రమంలో భాగంగా 243 మంది ప్రయాణికులు పోగొట్టుకున్న సుమారు రూ. 57లక్షల విలువగల వస్తువులను సురక్షితంగా తిరిగి అప్పగించారు
- మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఆర్పీఎఫ్ 'ఆపరేషన్ నార్కోస్' చేపట్టింది. 8 మంది వ్యక్తులను అరెస్ట్ చేసి రూ.38 లక్షల విలువైన గంజాయిని జప్తు చేశారు.
- 'ఆపరేషన్ నాన్ హే ఫారిస్టే'లో భాగంగా వివిధ కారణాలతో బాధింపబడిన 133 మంది పిల్లలకు భద్రత కల్పించారు.
- మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ఆపరేషన్ ఆహ్హ చేపట్టారు. అక్రమరవాణాకు పాల్పడుతున్న 18 మంది నిందితులను అరెస్ట్ చేసి, 52 మంది బాలురు, 8గురు బాలికలను రక్షించారు
- 'ఆపరేషన్ సటార్క్' కార్యక్రమంలో అక్రమంగా రవాణా చేస్తున్న రూ.3,94,092 విలువైన మద్యాన్ని సీజ్ చేసి 11 మందిని అరెస్టు చేశారు.
- రైల్వే టికెట్ దళారుల కార్యకలాపాలను అరికట్టేందుకు, సామాన్యులకు టిక్కెట్లను అందుబాటులో ఉంచడానికి 'ఆపరేషన్ ఉపలబ్ధ్' చేపట్టారు. 27 మంది దళారులను అరెస్టు చేసి రూ.2,30,779 విలువైన టిక్కెట్లను స్వాధీనం చేసుకున్నారు.
- రైల్వే ఆస్తుల ధ్వంసానికి పాల్పడిన వారిపైన కేసులు నమోదు చేసి రూ.1,62,170 విలువ చేసే రైల్వే సొత్తును రికవరీ చేసినట్లు అధికారులు తెలిపారు

ఆస్పత్రుల్లో తనిఖీలు చేస్తున్నాం



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లు, నర్సింగ్ హోమ్‌ల్లో తనిఖీలు చేపడుతున్నట్లు వైద్యారోగ్యశాఖ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. గుర్తింపు లేని ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ప్రకటించింది. 'ఆస్పత్రుల్లో భద్రత డొల్ల' శీర్షికన రెండు రోజుల క్రితం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల వైద్యారోగ్యశాఖ అధికారులు స్పందించారు. అల్లోపతి వైద్యులుగా చలామణి అవుతున్న ఆయుర్వేద వైద్యులపై చర్యలు తీసుకుంటున్నట్లు, ఎప్పటికప్పుడు ఆస్పత్రుల్లో తనిఖీలు నిర్వహించి, నిబంధనలు పాటించేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అగ్ని ప్రమాదాలు తలెత్తినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్ జిల్లాలో గుర్తింపు లేని 241 ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని, అత్యవసర విభాగాల్లో పని చేస్తున్న ఆరుగురు బీఏఎంఎస్ వైద్యులను గుర్తించి వారికి సైతం నోటీసులు జారీ చేసినట్లు అధికారులు చెప్పారు.

నాలాల పనులకు రూ.582 కోట్లు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీలో వర్షాకాల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన వరద కాలువల ఆధునికీకరణ, విస్తరణ తదితర పనులకు నిధుల కొరత తీరనుంది. జీహెచ్‌ఎంసీలో వర్షాకాల సమస్యల పరిష్కారానికి చేస్తున్న వ్యూహాత్మక నాలా అభివృద్ధి పథకం (ఎస్ఎన్‌డీపీ) పనులు తదితరమైనవి కుంటుతున్నాయి. జీహెచ్‌ఎంసీ ఖజానాలో నిధుల లేమితో కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపుల్లో ఆలస్యమవుతుండటంతో పనులు మందకొడిగా సాగుతున్నాయి. జీహెచ్‌ఎంసీలో నాలాల పనుల కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి స్పెషల్ ఫైనాన్స్ అసిస్టెన్స్‌గా రూ.582.42 కోట్లు మంజూరైనట్లు జీహెచ్‌ఎంసీ ఈఎన్‌సీ జియావుద్దీన్ తెలిపారు ఈ నిధులతో నాలాలకు సంబంధించిన పనులు చేయనున్నారు.

పొలం కోసం కొట్టి.. చంపేశారు!

- దయలేని దాయాదులు
- రెండెకరాల భూమి కోసం అన్నదమ్ముల పిల్లల ఘాతుకం
- యువకుడిపై సోదరుడిపైనే విచక్షణారహితంగా దాడి..
- చికిత్సకు తరలిస్తుండగా మృతి
- 100కు సమాచారం ఇచ్చినా స్పందించని పోలీసులు
- నారాయణపేట జిల్లా చిన్నపొర్లలో అమానుష ఘటన



చిన్నపొర్లలో పొలం దగ్గర గువ్వల సంజీవ్‌పై కర్రలతో దాడి చేస్తున్న దాయాదులు



సంజీవ్ (ఫైల్)

రెండెకరాల పొలం కోసం రక్తసంబంధీకుడిపైనే కర్రలతో విరుచుకుపడ్డారు. కన్నవాళ్ల కాళ్లా.. వేళ్లా పడ్డా కనికరం చలేదు.. కన్నూ.. మిన్నూ కానక.. ఎక్కడపడితే అక్కడ పది మందికిపైగా మూకుమ్మడిగా విచక్షణారహితంగా దాడి చేయడంతో చెవులు, నోట్లో నుంచి రక్తం కారి.. నిస్సహాయ స్థితిలో స్పృహ కోల్పోవడంతో వదిలేశారు. చివరికి ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆయువు కోల్పోయాడు.

మక్తల్/ ఊట్కూర్/ నారాయణపేట: నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలం చిన్నపొర్లలో అమానుష ఘటన చోటుచేసుకుంది. రెండెకరాల భూమి కోసం.. ఒక్కడిని చేసి దాయాదులు కర్రలతో విచక్షణారహితంగా దాడి చేయడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం చిన్నపొర్ల గ్రామానికి చెందిన లక్ష్మణ్‌కు ఇద్దరు భార్యలు బాలమ్మ, తిప్పమ్మ. వీరు గతంలోనే మృతి చెందారు. మొదటి భార్య బాలమ్మకు ఒక కొడుకు గువ్వల ఎర్రగండ్ల సంజప్ప కాగా.. రెండో భార్య తిప్పమ్మకు ఇద్దరు కుమారులు పెద్ద సవారప్ప, చిన్న సవారప్ప. లక్ష్మణ్‌కు 9 ఎకరాల భూమి ఉండగా.. మూడు భాగాలుగా విభజించి ముగ్గురు కుమారులపై మూడు ఎకరాల చొప్పున పట్టా చేయించారు. దీనిపై కొంత కాలంగా మొదటి భార్య కుమారుడు ఎర్రగండ్ల సంజప్ప తొమ్మిది ఎకరాలను ఇద్దరి భార్యల పిల్లలకు రెండు భాగాలుగా విభజించి.. నాలుగున్నర ఎకరాల చొప్పున భాగ పరిష్కారం చేయాలని వాదిస్తూ వస్తున్నాడు. ఆ లెక్కన తనకు నాలుగున్నర ఎకరాలు, రెండో భార్య ఇద్దరు కుమారులకు కలిపి నాలుగున్నర ఎకరాలు దక్కాలని వాదిస్తూ వచ్చిన ఎర్రగండ్ల సంజప్ప ఆ మధ్యన మృతిచెందాడు. అప్పటి నుంచి సమస్య పరిష్కారం కాకుండా పోయింది.

విత్తనాలు చల్లేందుకు రాగా..

ఈ క్రమంలోనే భూ సమస్య ఉందని 20 రోజుల క్రితం ఇరువర్గాల వారు ఊట్కూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. రెండు రోజుల క్రితం విత్తనాలు వేసుకుంటామని పెద్ద సవారప్ప, చిన్న సవారప్ప మక్తల్ సీఐ, ఊట్కూర్ ఎస్‌ఐలను అడగగా.. ఎవరి పేరు మీద పట్టా ఉంటే వారు వేసుకోండని సూచించారు. దీంతో గురువారం సాయంత్రం పొలంలో విత్తనాలు వేసేందుకు పెద్ద సవారప్ప, ఆయన కుమారుడు సంజీవ్(28), చిన్న సవారప్ప కలిసి ట్రాక్టర్ తీసుకువెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న ఎర్రగండ్ల సంజప్ప కుమారులు గుట్టప్ప, అటో సంజప్ప కుటుంబసభ్యులు గువ్వల శేఖర్, పెద్ద సంజప్ప, చిన్న సంజప్ప, ఆశప్ప, మారుతి, పెద్ద సవారప్ప, కిష్టప్ప, శ్రీను, రేణుక సుజాత, బుజ్జమ్మ, అర్చన, అంజమ్మ, మౌనిక, వెంకటమ్మ, లక్ష్మి పొలం దగ్గరికి వచ్చారు. విత్తనాలు ఎందుకు వేస్తున్నావని సంజీవ్‌ను ప్రశ్నించారు. దీంతో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ చోటుచేసుకుంది. ఈ క్రమంలోనే సంజీవ్‌పై అవతలి వర్గం వారు కట్టెలతో విచక్షణా రహితంగా దాడి చేయడంతో స్పృహ తప్పి పడిపోయాడు. అక్కడే ఉన్న గువ్వల ఎర్రగండ్ల సంజప్ప చిన్నమ్మ కవిత మనుమడిని కొట్టొద్దని కాళ్లపై పడినా పట్టించుకోలేదు. వెంటనే తమకు పరిచయం ఉన్న పెద్దజట్రం గ్రామ ఎంపీటీసీ సభ్యుడు కిరణ్‌కు సమాచారం అందించగా.. ఆయన ఊట్కూర్ ఎస్‌ఐకి ఫోన్ చేసి చెప్పగా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చినట్లు తెలుస్తోంది.

'100'కి డయల్ చేసినా స్పందించలే..

చిన్నపొర్లలో పొలం దగ్గర ఘర్షణ జరుగుతుందని సమీపంలోని వారు డయల్ 100కు సమాచారం ఇచ్చినా, పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కాగా సంజీవ్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు 108 వాహనానికి సమాచారం ఇవ్వగా ఆలస్యంగా వచ్చింది. అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్‌కు తీసుకెళ్లారు పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. సంజీవ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గ్రామంలో ఉద్రిక్తత

హత్య ఘటన దరిమిలా గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. ఈ ఘటనపై బంధువు కవిత పోలీసులకు ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఊట్కూర్ ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. కాగా, పోస్టుమార్టం అనంతరం సంజీవ్ మృతదేహం గ్రామానికి తీసుకురాగా, ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. పోలీసుల నిర్లక్ష్యం వల్లనే సంజీవ్ మృతిచెందాడని గ్రామస్తులు ఆరోపిస్తూ ఎస్‌ఐని సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు

ఎస్‌ఐపై సస్పెన్షన్ వేటు

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఊట్కూర్ ఎస్‌ఐ బిజ్జ శ్రీనివాసులును సస్పెండ్ చేస్తూ హైదరాబాద్ మల్టీ జోన్-2 ఐజీ జి.సుధీర్‌బాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఘటనపై ఫిర్యాదు అందినా తక్షణమే స్పందించకుండా తీవ్ర నిర్లక్ష్యం, దురుసుగా ప్రవర్తించినట్లు ఐజీపీ దృష్టికి వచ్చినట్లు ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు.

నలుగురి అరెస్టు.. ముగ్గురు పరారీలో

ఊట్కూరు ఘటనకు సంబంధించి ఏడుగురు నిందితులపై కేసు నమోదు కాగా శుక్రవారం నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఏ4 చిన్న సంజప్ప, ఏ5 గుడి ఆశప్ప, ఏ6 గువ్వల శ్రీను, ఏ7 గువ్వల కిష్టప్పను అరెస్టు చేసినట్లు ఐజీపీ సుధీర్‌బాబు తెలిపారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని చెప్పారు

తెలంగాణ ప్రభుత్వం
రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్
డోర్ నం. 8-2-293/82/A/AHCT లోట్ నం. 46, జూబ్లీహిల్స్,
హైదరాబాద్ - 500033, ఫోన్ నం: 040-23547107

Tender No.RAHCT/Admn/639/2024 తేది: 15.06.2024

[illegible] RAHCT [illegible] 01.07.2024, 17.00 గం. [illegible] https://tender.telangana.gov.in లో మరియు www.rajivaarogyasri.telangana.gov.in లో లభిస్తుంది.

సం/- [illegible]

DIPR RO No 641-PP/CL/Advt/1/2024-25, Dt 14.06.2024

కొంపల్లి మున్సిపాలిటీ కార్యాలయం
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

టెండరు ప్రకటన నం. 15/E1/KMC/2024, Dt. 15.06.2024

మున్సిపల్ కమిషనర్, కొంపల్లి మున్సిపాలిటీ వారు MGF/15వ FC ఫండ్స్ క్రింద ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్‌లో టెండరు కోరుతున్నారు. పనుల వివరాలు దిగువ విధంగా ఉన్నాయి : మొత్తం పనుల సంఖ్య : 17. మొత్తం పనుల విలువ : రూ.223.00 లక్షలు. బిడ్ డాక్యుమెంట్ల డౌన్‌లోడ్ ప్రారంభ తేది : 15.06.2024 ఉ.11.30 గం. బిడ్ డాక్యుమెంట్ల డౌన్‌లోడ్ ముగింపు తేది : 24.06.2024 మ.3.30 గం. బిడ్ తెరుచు తేది : 24.06.2024 సా.4.30 గం. అధికారి పేరు & చిరునామా: మున్సిపల్ కమిషనర్, కొంపల్లి మున్సిపాలిటీ. సెల్ నం. 9491388409/ 7997994234

సం/- కమిషనర్, కొంపల్లి మున్సిపాలిటీ

DIPR RO No 602-PP/CL/Advt/1/2024-25, Dt. 14.06.2024

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ
హైదరాబాద్
లాంగ్ టర్మ్ NEET - 2025 శిక్షణ కొరకు ప్రకటన

Rc.No.2785/SW/COE/2021 తేది: 14.06.2024

2024-25 విద్యా సంవత్సరమునకు గాను తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నడుపబడుతున్న లాంగ్ టర్మ్ NEET శిక్షణ (OPBC) కొరకు ఆసక్తి మరియు అర్హులైన షెడ్యూల్ కులాల విద్యార్థినీ, విద్యార్థుల నుండి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు కోరబడుచున్నవి. హైదరాబాద్‌లో గల TGSWR COE గౌలిదొడ్డి, నార్సింగి, చిలుకూరు మరియు మహేంద్ర హిల్స్ గురుకులాల యందు ఉచిత శిక్షణ ఇవ్వబడును. సీట్ల వివరాలు: SC-334, BC-8, OC-8. దరఖాస్తు చేసుకొను విద్యార్థులు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై, NEET 2024 పరీక్షను విధిగా రాసి ఉండవలెను. అర్హులైన విద్యార్థులు www.tgswreis.telangana.gov.in అను వెబ్‌సైట్‌ను సందర్శించి నోటిఫికేషన్ పూర్తి వివరాలు పొందగలరు. దరఖాస్తు రుసుం: రూ.200/- దరఖాస్తు చేసుకొనుటకు చివరి తేది: 24.06.2024

సం/- జాయింట్ సెక్రటరీ (Acad-III), TGSWREIS సం/- ఇ.సీతాలక్ష్మి, IAS, సెక్రటరీ

DIPR Ro.No.678-PP/CL/Advt/1/2024-25, Dt: 14.06.2024

నోటిఫైడ్ ఏరియా కమిటీ కార్యాలయం
హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ఏరియా
శంషాబాద్, తెలంగాణ రాష్ట్రం. టెలిఫోన్ 040 24008250

ప్రకటన

[illegible] No. SO NAC/2022-23 తేది: 14.06.2024

[illegible]

[illegible]	[illegible]	[illegible]	[illegible]
	600 mm [illegible]	[illegible]	1
	ii) 600 mm నుండి 1400mm వరకు [illegible]	[illegible]	20
	iii) 1400mm [illegible]	[illegible]	30

[illegible] 29.06.2024 [illegible] NAC [illegible] 14615 [illegible]

సం/- [illegible], NAC

DIPR RO No. 615-PP/CL/Advt/1/2024-25, Dt 14.06.2024

దక్షిణ మధ్య రైల్వే
మమ్మల్ని అనుసరించండి: @SCRailwayIndia ద.మ. రైల్వే టెండరు ప్రకటన
వివరాలకు మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.in లో చూడవచ్చును

ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన (రేట్ కాంట్రాక్ట్)

పని పేరు: దిగువ తెలిపిన ఐటమ్స్ సరఫరా కోసం ఎంప్యానెల్‌మెంట్ కొరకు సెంట్రల్ హాస్పిటల్/ లాలాగూడ/ సికింద్రాబాద్ నుండి 5 కి.మీ. వ్యాసార్ధంలో ఉన్న లైసెన్స్ కలిగిన సంస్థలు/ కెమిస్ట్స్/ డిస్ట్రిబ్యూటర్స్/ సరఫరాదారుల నుండి నిర్ణీత రేట్ కాంట్రాక్ట్ కోసం ఆసక్తి వ్యక్తీకరణ (EOI) కోరుతూ ప్రకటన.

1) రెండు సంవత్సరాల కొరకు MRPపై యూనిఫామ్ డిస్కౌంట్ రేట్‌పై రేట్ కాంట్రాక్ట్ క్రింద డ్రగ్స్/ మెడిసిన్స్ మరియు అనుబంధ ఐటమ్స్.

టెండరు నం: SCRLGD24LP1. బిడ్ దాఖలుకు చివరి తేది 01.07.2024 సమయం: 15:30 గం. కు లేదా అలోగా.

2) రెండు సంవత్సరాల కొరకు MRPపై యూనిఫామ్ డిస్కౌంట్ రేట్‌పై రేట్ కాంట్రాక్ట్ క్రింద సర్జికల్స్/ కన్స్యూమబుల్స్/ పాథాలజీ (ల్యాబ్ ఐటమ్స్) మరియు ఇతర అనుబంధ ఐటమ్స్.

టెండరు నం: SCRLGD24LP2. బిడ్ దాఖలుకు చివరి తేది 01.07.2024 సమయం: 15:30 గం. కు లేదా అలోగా.

నియమ నిబంధనలు, అర్హతా ప్రమాణాలు మరియు ఇతర వివరాలు అధికారిక వెబ్‌సైట్ www.ireps.gov.in లో లభిస్తాయి.

A0725 మెడికల్ డైరెక్టర్, సెంట్రల్ హాస్పిటల్, లాలాగూడ, సికింద్రాబాద్

తెలంగాణ హౌసింగ్ బోర్డ్
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (హౌసింగ్) కార్యాలయం, సెంట్రల్ డివిజన్, హైదరాబాద్

నోటిఫికేషన్ నం. 92/SRT/RHMP/E1/EE/CD/2024 తేది: 04-06-2024

తెల్లకాగితంపై గాని లేదా స్టాంప్ పేపర్‌పై గాని అమ్మకం ఒప్పందం ద్వారా లేదా సేల్ డీడ్ ద్వారా అసలు కేటాయింపుదారుల నుండి ఇల్లు కొనుగోలు చేసిన మూడవ పార్టీ/ కొనుగోలుదారు పేరున దిగువ షెడ్యూల్‌లో తెలిపిన ఇంటిని G.O.Ms. No.67, Housing (HB.II) శాఖ తేది: 08.08.2001లోని నియమాల ప్రకారం బదిలీ చేయడానికి తెలంగాణ హౌసింగ్ బోర్డ్ ప్రతిపాదిస్తోంది.

షెడ్యూలు

క్ర.సం.	ఇంటి/ఫ్లాట్ నం.	ప్రదేశం	కేటాయింపుదారు పేరు	మూడవ పార్టీ పేరు మరియు వివిధ పేర్లు	
1.	2	3	4	5	
మూడవ పార్టీ వ్యవహారం					
హైదరాబాద్ జిల్లా					
				శ్రీమతి/శ్రీ	శ్రీమతి/శ్రీ
1	92	ఎస్.ఆర్.టి	[illegible]	[illegible]	1) [illegible]
				[illegible]	2) [illegible]

మూడవ పార్టీ/ కొనుగోలుదారు పేరున షెడ్యూలులో పైన తెలిపిన ఇంటిని ప్రతిపాదిత బదిలీ మరియు నమోదుకు ఏ వ్యక్తికి లేదా వ్యక్తులకు ఏదేని అభ్యంతరం ఉన్నట్లయితే వారు ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి 15 రోజుల్లోగా డాక్యుమెంటరీ రుజువుతో దిగువ సంతకందారును సంప్రదించవచ్చును. ఎలాంటి అభ్యంతరాలు అందకపోతే, తెలంగాణ హౌసింగ్ బోర్డ్ అలాట్‌మెంట్ రెగ్యులేషన్స్ 1997లోని రెగ్యులేషన్ 27(ii) ప్రకారం అమ్మక ఒప్పందం / సేల్ డీడ్ ఆధారంగా మూడవ పార్టీ/ కొనుగోలుదారు పేరున ఇల్లు బదిలీ చేయబడుతుంది మరియు నమోదు చేయబడుతుంది. నిర్ణీత సమయం ముగిసిన తరువాత ఎలాంటి అభ్యర్థన పరిశీలించబడదు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (హౌసింగ్),
సెంట్రల్ డివిజన్, THB, హైదరాబాద్

DIPR RO No.613-PP/CL/Advt/1/2024-25, Dt: 14-06-2024

ఆర్టీసీ బస్సు, డీసీఎం వ్యాన్ ఢీ

- ఐదుగురికి గాయాలు
- రాజన్నసిరిసిల్ల జిల్లా నేరెళ్ల శివారులో ఘటన



నేరెళ్ల శివారులో ఢీకొన్న ఆర్టీసీ బస్సు, డీసీఎం వ్యాన్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామ శివారులో శుక్రవారం ఆర్టీసీ బస్సు, డీసీఎం వ్యాన్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. వేములవాడ ఆర్టీసీ డిపోకు చెందిన డీలక్స్ బస్సు సికింద్రాబాద్ నుంచి వేములవాడకు బయలుదేరింది. వేములవాడకు చెందిన డీసీఎం వ్యాన్ సిద్దిపేట వైపు వెళ్తుండగా.. తంగళ్లపల్లి మండలం నేరెళ్ల శివారుకు చేరుకోగానే ఎదురెదురుగా రెండు ఢీకొట్టుకున్నాయి. డీసీఎం వ్యాన్‌ను బస్సు 20 అడుగుల దూరం లాక్కుపోయింది. మితిమీరిన వేగం, మూలమలుపునకు వర్షం తోడవడంతోనే ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. ప్రమాదంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఏదుల్లా ఇంద్రసేనారెడ్డి, డీసీఎం వ్యాన్ డ్రైవర్ మహ్మద్ మక్బూల్‌తోపాటు బస్సులో ప్రయాణిస్తున్న వేములవాడకు చెందిన పుల్కం లక్ష్మి, హైదరాబాద్ అంబర్‌పేటకు చెందిన గజపాక వైష్ణవి, గంభీరావుపేటకు చెందిన గాదంశెట్టి శశాంక్‌లు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమయంలో బస్సులో 10 మంది ప్రయాణికులు మాత్రమే ఉన్నారు. క్షతగాత్రులను సిరిసిల్ల జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అందరూ క్షేమంగానే ఉన్నారని వైద్యులు చెప్పారు. కాగా ప్రమాద సమయంలో అటుగా వెళ్తున్న సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి గమనించి వెంటనే పోలీసులను అప్రమత్తం చేశారు. క్షతగాత్రులను ఆస్పత్రికి త్వరగా తరలించడంలో సహాయం చేశారు.

అటవీశాఖ అధికారులపై దాడి

ఎఫ్ఆర్‌వో, సెక్షన్, బీట్ అధికారులకు గాయాలు




అధికారులను పరామర్శిస్తున్న ఎఫ్‌డీవో సుధాకర్‌రావు

మోపాల్ (నిజామాబాద్ రూరల్): నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం కాల్పోల్ గ్రామశివారులో శుక్రవారం అటవీశాఖ అధికారులపై గిరిజనులు మట్టిపెళ్లలు, కర్రలు విసిరి దాడికి పాల్పడ్డారు. దాడిలో ఎఫ్ఆర్‌వో రాధిక, సెక్షన్, బీట్ అధికారులకు గాయాలయ్యాయి. మోతీలాల్ కుటుంబం అటవీ భూమిలో చదును చేస్తున్నట్లు సమాచారం రావడంతో ఎఫ్ఆర్‌వో రాధిక, సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లారు. చదును చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకునేందుకు అటవీశాఖ అధికారులు ప్రయత్నించగా, మహిళలు, యువకులు 30 మంది వరకు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. దీంతో అటవీశాఖ అధికారులు పోలీసులకు ఫోన్ చేశారు. దాడి చేస్తున్న ఘటనను వీడియో తీస్తుండగా మహిళలు, యువకులు వచ్చి ఫోన్లు లాక్కుని వారిపై పిడిగుద్దులు, కర్రలతో దాడి చేశారు. అప్పటికే పోలీసులు రావడాన్ని గమనించి వారంతా అక్కడి నుంచి పారిపోయారు. గాయపడ్డ అటవీ అధికారులను చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిని ఎఫ్‌డీవో సుధాకర్‌రావు పరామర్శించారు ఎఫ్ఆర్‌వో రాధిక ఫిర్యాదు మేరకు మోతీలాల్ సహా మరో 30 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు

రాష్ట్రంలో శాంతి భద్రతలు విఫలం

ఎంపీ రఘునందన్‌రావు




ఎంపీ రఘునందన్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

సాక్షి, సిద్దిపేట: రాష్ట్రంలో శాంతి భద్రతలు విఫలమయ్యాయని, ఇందుకు సుల్తానాబాద్‌లో ఆరేళ్ల చిన్నారిపై హత్యాచారం చేసిన ఘటనే నిదర్శనమని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మండిపడ్డారు. శుక్రవారం సిద్దిపేటలో రఘునందన్‌రావు విజయోత్సవ సభను నిర్వహించారు. అంతకు ముందు పట్టణంలో బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతి జరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని, అలాగే ఫోన్ ట్యాపింగ్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నీళ్ల మంత్రిగా పని చేసిన హరీశ్‌రావు, కాంట్రాక్టర్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. మెదక్ ఎంపీగా వెంకట్రామిరెడ్డి గెలిస్తే రూ.100 కోట్లు ఖర్చు చేస్తానని ప్రకటించిన డబ్బులు ఎలా సంపాదించారో చెప్పాలని డిమాండ్ చేశారు. వెంకట్రామిరెడ్డి సిద్దిపేట కలెక్టర్‌గా ఉన్నప్పుడు ములుగు, వర్గల్, క్షీరసాగర్‌లో ధరణిని బ్లాక్ చేసి వందల ఎకరాల పేదలు, దళితుల భూములను లాక్కున్నారని రఘునందన్‌రావు ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీనివాస్‌రెడ్డిలకు నిజాయితీ ఉంటే విచారణ జరిపించి పేదలకు వెంటనే పంచిపెట్టాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ ఫామ్‌హౌస్ దగ్గర డ్రోన్‌లను వదిలిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.

అక్క కోసం కదులుతున్న బస్సు దిగుతూ..

- బస్సు కింద పడి యువతి దుర్మరణం
- యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ వద్ద దుర్ఘటన



మెహ్రీన్

వెంగళరావునగర్: అక్క కోసం కదులుతున్న బస్సు దిగిన చెల్లెలు ప్రమాదవశాత్తూ అదే బస్సు చక్రాల కింద నలిగి మృత్యువాత పడిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. మసీరా మెహ్రీన్(16) యూసుఫ్‌గూడలోని మాస్టర్స్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతుండగా, ఆమె సోదరి జవేరియా మెహెక్ సెకండియర్ చదువుతోంది. మధ్యాహ్నం కళాశాల అయిపోగానే ఇంటికి వెళ్ళడానికి అక్కాచెల్లెళ్ళు యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ వద్ద ఉన్నారు. సికింద్రాబాద్ నుంచి బోరబండ వెళ్తున్న బస్సు రాగానే రద్దీ ఎక్కువగా ఉండటంతో ముందుగా మెహ్రీన్ బస్సు ఎక్కింది. మెహెక్ మాత్రం ఫుట్ బోర్డు వరకు ప్రయాణికులు ఎక్కువగా ఉండటంతో బస్సు ఎక్కలేక రోడ్డు మీదనే నిలబడిపోయింది. ఇంతలో బస్సు బయలుదేరడంతో అక్క కోసం మెహ్రీన్ కదులుతున్న బస్సులో నుంచి కిందకు దిగేందుకు ప్రయత్నించింది. దాంతో ఆమె ప్రమాదవశాత్తు బస్సు చక్రాల కింద పడి నలిగి మృతి చెందింది. అక్క మెహెక్‌తో పాటు ఈ ప్రమాదాన్ని ప్రత్యక్షంగా చూసిన స్థానికులు సైతం విలవిలలాడిపోయారు. ఇటీవల పదో తరగతి పూర్తి చేసుకున్న మెహ్రీన్ వారం కిందటే కాలేజీలో చేరింది. మధురానగర్ ఇన్‌స్పెక్టర్ మధుసూధన్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు

సుప్రీం తీర్పుపై పండిత్ పరిషత్ హర్షం

సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు పదోన్నతులకు సానుకూలంగా ఇచ్చిన తీర్పును రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ స్వాగతించింది. ఈ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి గుళ్లపల్లి తిరుమల కాంతి కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. భాషాపండితులతో కలిపి ఉమ్మడిగా పదోన్నతులు ఇవ్వాలని ఎస్జీటీ టీచర్లు వేసిన కేసును అత్యున్నత న్యాయస్థానం కొట్టి వేసినట్లు వారు తెలిపారు.

ओएनजीसी ONGC

[illegible] కాకినాడ (ఆంధ్రప్రదేశ్)

అంతర్జాతీయ ఆసక్తి వ్యక్తీకరణ (EOI)

[illegible] 2001/30 [illegible]

https://tenders.ongc.co.in [illegible]

---

hmda హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ

[illegible]

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

NIT No. HMDA/DE/CE/01/2024-25 తేది: 11.06.2024

1	[illegible]	[illegible]	[illegible]
2	[illegible]	[illegible]	[illegible]
3	[illegible]	[illegible]	[illegible]
4	[illegible]	[illegible]	[illegible]
5	[illegible]	[illegible]	[illegible]

[illegible] https://tender.telangana.gov.in [illegible]

DIPR RO No 607-PP/CL/Advt/1/2024-25, Dt. 14.06.2024 సం/- [illegible], HMDA

WALK IN INTERVIEW / SKILL TEST

Walk-in-interview for the post of **PRT(EMS) PRT (Telugu), TGT (English, Maths / Physics, Hindi / Sanskrit, Bio/Chemistry, Social Science and Special Educator)** on contract basis will be held at **8.00** am on **20.06.2024** at **Atomic Energy Central School,** Manuguru, HWP(M) Colony, Aswapuram, Bhadradri - Kothagudem.

For more details.

Website : **http://aecsmanuguru.edu.in**

Contact e-mail : aecsmanuguru@yahoo.co.in

Contact : **08746 - 232423, 08746 - 232420.**

WP(M)/Admn(G)/NIT/19/2024/379 Dt. 13/06/2024

भारत सरकार GOVERNMENT OF INDIA
परमाणु ऊर्जा विभाग DEPARTMENT OF ATOMIC ENERGY
भारी पानी संयंत्र (मणुगूरु) HEAVY WATER PLANT (MANUGURU)

ई - टेंडर आमंत्रित करते नोटिस Notice Inviting e-Tenders

भारत के राष्ट्रपति के लिए और की ओर से महाप्रबंधक, HWP(M) निम्नलिखित कार्य के लिए ऑनलाइन आइटम दर बोलियों को आमंत्रित करते है।

The General Manager, HWP (M) for and on behalf of President of India, invites online item rate bids, for following work(s).

एनआईटी नंबर **HWP/PU/201/24/W13** NIT.No. **HWP/PU/201/24/W13.**

Name of work (s) : Upkeep & support in dry and wet fly ash disposal system & ash disposal system drains cleaning - 2024 - 25.

अनुमानित लागत : रु **38,27,000/-** (जीएसटी को मिलाके) Estimated cost . **Rs. 38,27,000/-** (Including GST)

बयाना जमा राशि : बोली सुरक्षा प्रपत्र Earnest Money Deposit : **2%** of the estimated cost अनुमानित लागत की **2%** अनुबंध की अवधि: 15 महीने Period of Contract : 15 Months

बोली जमा करने की अंतिम तिथि और समय : Last Date and Time for submission of bid . **26.06.2024.** upto **16:30** hrs

बोली फॉर्म और अन्य विवरण वेबसाइट **https://eprocure.gov.in/eprocure/app** से प्राप्त किए जा सकते हैं। नोटिस **www.hwb.gov.in** पर भी उपलब्ध है

The bid form and other details can be obtained from the website **https://eprocure.gov.in/eprocure/app.**

The notice is also available on **www.hwb.gov.in**

Sd/-
(Signature of Tender inviting authority)

HWP(M)/Admn(G)/NIT/19/2024/378 Dt. 13/06/2024

भारत सरकार GOVERNMENT OF INDIA
परमाणु ऊर्जा विभाग DEPARTMENT OF ATOMIC ENERGY
भारी पानी संयंत्र (मणुगूरु) HEAVY WATER PLANT (MANUGURU)

ई - निविदाएं आमंत्रित करने हेतु सूचना Notice Inviting e-Tenders

महाप्रबंधक, एचडब्ल्यूपी (एम) भारत के राष्ट्रपति की ओर से निम्नलिखित कार्यों के लिए दो बोली प्रणाली पर ऑनलाइन आइटम दर आमंत्रित करते है।

The General Manager, HWP (M) invites on behalf of President of India online item rate on two bid system for following work(s)

एनआईटी नंबर एचडब्ल्यूपीएम/एमयू/टीजी/2403

NIT.No. **HWPM/MU/TG/2403.**

कार्य का नाम : कार्यशाला में खराद और विभिन्न अन्य मशीनों के संचालन और सीपीपी में 02 वर्षों के लिए रिगिंग कार्य में संचालन और सहायता

Name of work : Operation & Assistance is operation of Lathe and various other machines in workship and Rigging work in CPP, HWPM for 02 years

अनुमानित लागत Estimated cost : **Rs. 33,61,000/-**,

बयाना राशि Earnest Money : **Rs. 67,220/-**,

पूर्ण होने की अवधि: कार्य आदेश जारी होने की तिथि से दो वर्ष.

Period of completion : **Two Years** from date of issue of work order.

बोली जमा करने की अंतिम समय और तारीख (ऑनलाइन): **23.06.2024.** को **17:00** बजे तक.

Last time and date of submission of bid (Online) : **Up to 17:00 hrs on 23.06.2024.**

The bid forms and other details can be obtained from the website **https://eprocure.gov.in/eprocure/app.**

The NIT is also available on **www.hwb.gov.in**

बोली प्रपत्र और अन्य विवरण वेबसाइट **https://eprocure.gov.in/eprocure/app** से प्राप्त किए जा सकते हैं।

एनआईटी **www.hwb.gov.in** पर भी उपलब्ध है

Sd/-
(Signature of Tender inviting authority)

HWP(M)/Admn(G)/NIT/19/2024/377 Dt. 13/06/2024.

రెడ్‌బుక్ రాజ్యాంగం

ఏపీలో హోర్డింగులకెక్కిన లోకేశ్ 'రెడ్ బుక్' బెదిరింపులు

బ్లాక్‌మెయిల్‌తో అధికారులను లొంగదీసుకునే యత్నం

మరోవైపు రెచ్చిపోతున్న టీడీపీ, జనసేన శ్రేణులు
రాష్ట్రమంతటా కొనసాగుతున్న విధ్వంసం, ఆటవిక దాడులు
తమకు ఓటేయనివారు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలే లక్ష్యం
నూతన సీఎంను కలవడానికి వెళ్లిన అధికారులకు అవమానాలు.. పనితీరు మదింపు పేరిట అధికారులకు 'రాజకీయ' బ్రాండింగ్
వారంతా గతంలో బాబు హయాంలో పనిచేసిన వారే
గత ఐదేళ్లుగా కొందరి తీరు అన్యాయంగా ఉందంటూ నిందలు
కక్ష సాధింపులుండవంటూనే... కొందరు టార్గెట్‌గా చంద్రబాబు వ్యాఖ్యలు
ఐఏఎస్, ఐపీఎస్‌ల ఆత్మ స్థైర్యాన్ని దెబ్బతీసేలా ప్రభుత్వ పెద్దల వైఖరి



గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణంలో ఏర్పాటు చేసిన రెడ్‌బుక్ హోర్డింగ్

సాక్షి, అమరావతి: రాజకీయ ప్రత్యర్థులపై ఇటు ఆటవిక దాడులు కొనసాగిస్తూ అటు రాజ్యాంగాన్ని కాలరాసి నారా లోకేశ్ రాసుకున్న 'రెడ్ బుక్ రాజ్యాంగం' అమలుకు రంగం సిద్ధమవుతోంది! రాష్ట్రవ్యాప్తంగా రెడ్‌బుక్ హోర్డింగ్‌ల ఏర్పాటుతో తాము మరింతగా కొనసాగించబోయే విధ్వంసకాండ, రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనను టీడీపీ నిర్భీతిగా చాటింపు వేస్తోంది. రాజ్యాంగ హక్కులు కాలరాస్తూ ఆ కుట్రకు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు స్వయంగా తెర తీయడం విస్తుగొలుపుతోంది. అఖిల భారత సర్వీసు అధికారులే లక్ష్యంగా బ్లాక్ మెయిలింగ్, వేధింపులకు ఆయన శ్రీకారం చుట్టారు. రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ విధాన నిర్ణయాలను అమలు చేసే అధికారులను పనితీరు మదింపు నివేదికల పేరుతో లొంగదీసుకోవడం, అనంతరం తమ అక్రమాలకు వారిని సాధనంగా చేసుకోవడమే లక్ష్యంగా ఈ కుట్రకు అంకురార్పణ చేశారు. రాష్ట్రంలో రానున్న రోజుల్లో చోటు చేసుకోనున్న విపరిణామాలు, అక్రమాలు, బీభత్సకాండకు అధికార యంత్రాంగంతో నిర్వహించిన మొదటి సమావేశంలోనే చంద్రబాబు ఈమేరకు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ఒకవైపు తమకు ఓటేయనివారు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని దాడులను కొనసాగిస్తూ మరోవైపు అధికార యంత్రాంగాన్ని సొంత అజెండా అమలుకు వాడుకునేందుకు సన్నద్ధమైనట్లు స్పష్టమవుతోంది.

అటు వ్యాఖ్యాలు.. ఇటు వార్నింగ్‌లు

రెడ్ బుక్ రాజ్యాంగం అమలుకు మంత్రి నారా లోకేశ్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తుండటం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా లోకేశ్ ఫొటోలతో రెడ్‌బుక్ హోర్డింగ్‌లు ఏర్పాటు చేసి టీడీపీ సర్కారు భయోత్పాతం సృష్టిస్తోంది. ఎన్నికల్లో విజయం సాధిస్తే ఆ నాయకుడి ఫొటోలతో హోర్డింగ్‌లు ఏర్పాటు చేసి శుభాకాంక్షలు తెలపడం ఆనవాయితీ. టీడీపీ మాత్రం 'రెడ్ బుక్' పేరుతో హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడం వారి హింసాత్మక ప్రవృత్తిని బట్టబయలు చేస్తోంది. మంగళగిరి, విజయవాడ, గుంటూరుతోపాటు రాష్ట్రంలో పలు నగరాలు, పట్టణాల్లో ఈ హోర్డింగులు వెలిశాయి. ఎన్నికలకు ముందే 'రెడ్‌బుక్' పేరుతో అధికారులపై లోకేశ్ బెదిరింపులకు పాల్పడ్డారు. నిబంధనల మేరకు వ్యవహరించిన ఐఏఎస్, ఐపీఎస్, ఇతర అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు. అందరి పేర్లు రెడ్‌బుక్‌లో రాస్తున్నానని, టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వారి సంగతి తేలుస్తానని హెచ్చరించారు.

పోలింగ్ నుంచి విధ్వంసకాండ

బీజేపీతో పొత్తును ఆసరాగా చేసుకుని టీడీపీ రౌడీమూకలు ఎన్నికలకు ముందే రాష్ట్రవ్యాప్తంగా విధ్వంసకాండకు తెరతీశాయి. సమర్థంగా పని చేస్తున్న పోలీసు అధికారులను ఎన్నికల కమిషన్(ఈసీ) ద్వారా బదిలీ చేయించి మరీ గూండాగిరీకి పాల్పడ్డాయి. పోలింగ్ ముందు రోజు, అనంతరం దాడులు, దౌర్జన్యాలతో రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేశాయి. ఎన్నికల్లో విజయం సాధించిన తరువాత టీడీపీ సాగిస్తున్న దౌర్జన్యకాండ యావత్ దేశాన్ని విభ్రాంతికి గురి చేస్తోంది. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులకు తెగబడి ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఇంటింటికి రేషన్ సరఫరా చేసే వాహనాలను ధ్వంసం చేస్తున్నారు. దివంగత సీఎం వైఎస్ విగ్రహాలను నేలమట్టం చేస్తున్నారు. టీడీపీ గూండాల విధ్వంసకాండతో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు గ్రామాలను విడిచి వెళ్లిపోతున్నారు.

రాజకీయ ముద్ర అంటగట్టి వేధించే పన్నాగం..

అఖిలభారత సర్వీసు అధికారులపై రాజకీయ ముద్ర వేసి వేధించాలని ఎన్నికల ముందే రూపొందించిన కుట్ర అమలుకు సన్నద్ధం కావడం ప్రభుత్వ పెద్దల దురుద్దేశాన్ని వెల్లడిస్తోంది. చంద్రబాబు రాజకీయ కక్షతోనే కొందరు అధికారులను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు తెగబడేందుకు సిద్ధమవుతుండటం విస్మయపరుస్తోంది. ఎన్నికల ఫలితాల తరువాత తనకు అభినందనలు తెలిపేందుకు వచ్చిన కొందరు అధికారులను కలవకుండా వెనక్కి పంపివేశారు. కొందరు అధికారులు ఇచ్చిన పూల బొకేలను సైతం తీసుకునేందుకు తిరస్కరించారు. ఇక తనను గురువారం మర్యాదపూర్వకంగా కలిసిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు సీఎం స్థాయికి తగినట్టుగా లేవని పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు. గత ఐదేళ్లలో కొందరు అధికారుల తీరు అన్యాయంగా ఉందని సీఎం నిందలు వేశారు. తనకు జరిగిన అన్యాయం గురించి మాట్లాడటం లేదంటూనే తన అక్కసునంతా వెళ్లగక్కి వ్యక్తిగత అజెండాను బయటపెట్టారు. కక్ష సాధింపులుండవంటూనే కొందరు అధికారులు టార్గెట్‌గా ఆత్మ స్థైర్యాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారు.

సమాచార సేకరణలో బాబు బృందం

అఖిల భారత సర్వీసు అధికారులను వేధించే కుట్రకు చంద్రబాబు తెరతీశారు. తమవారు ఎవరు? పరాయి వారు ఎవరు? అనే సమాచారం సేకరించాలని తన బృందాన్ని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీల నుంచి రాష్ట్ర స్థాయిలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల వరకు సమాచారాన్ని సేకరించే పనిలో చంద్రబాబు బృందం నిమగ్నమైంది. ఆ విషయాన్ని టీడీపీ వర్గాలు బహిరంగంగానే వెల్లడిస్తున్నాయి. తద్వారా అధికారులను బ్లాక్‌మెయిల్ చేయాలన్నది అసలు ఉద్దేశం. నిబంధనలకు విరుద్ధంగా తాము పురమాయించే పనులు చేసేలా లొంగదీసుకునే కుట్రతో ఈ తతంగాన్ని సాగిస్తున్నట్లు స్పష్టమవుతోంది. రానున్న ఐదేళ్లూ తాము ఏం చెబితే అదే చేయాలి! నిబంధనలు ఉటంకిస్తూ అభ్యంతరాలు చెప్పకూడదు! అనే సందేశాన్ని దీని ద్వారా ఇవ్వనున్నారు. అందుకు సమ్మతించే అధికారులకే పోస్టింగులు ఇస్తామని, లేదంటే వేధిస్తామని కరాఖండీగా చెబుతుండటం చంద్రబాబు కుట్రను బట్టబయలు చేస్తోంది.

ఇదేనా పెద్దరికం?

ప్రభుత్వ పెద్దననే విషయాన్ని మరచిపోయి సీఎం చంద్రబాబు కక్ష పూరితంగా వ్యవహరిస్తుండటం విస్మయపరుస్తోంది. 2014 నుంచి 2019 మధ్య చంద్రబాబు ప్రభుత్వంలో నారా లోకేశ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్నారు. ఆ సమయంలో సీనియర్ ఐఏఎస్ అధికారి కె.ఎస్.జవహర్‌రెడ్డి ఆ శాఖ అధిపతిగా వ్యవహరించారు. ఇటీవల ఎన్నికల సమయంలో ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలోనూ అనంతరం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనూ ఆయన నిబంధనల మేరకే విధులు నిర్వర్తించారు. అయితే చంద్రబాబు రాజకీయ కారణాలతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్న కేఎస్ జవహర్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని అవాస్తవ ఆరోపణలు చేశారు. ఆయన్ను బదిలీ చేయాలని కేంద్ర ఎన్నికల కమిషన్(ఈసీ)కు ఫిర్యాదులపై ఫిర్యాదులు చేశారు. టీడీపీ ఆరోపణల్లో వాస్తవాలు లేకపోవడంతో ఈసీ ఆయన్ను బదిలీ చేయలేదు. ఎన్నికల ముందు సామాజిక పెన్షన్ల పంపిణీలోనూ ఈసీ ఆదేశాలనే ఆయన పాటించారు. అయినా సరే చంద్రబాబు ఆయనపై చిందులు తొక్కారు. ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించిన తరువాత ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించకముందే జవహర్‌రెడ్డిని సెలవుపై వెళ్లిపోవాలని ఒత్తిడి తేవడం గమనార్హం. ఈ నెలాఖరున జవహర్‌రెడ్డి ఉద్యోగ విరమణ చేయనున్నారు. తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించే నాటికి జవహర్‌రెడ్డి విధుల్లో ఉండకూడదని చంద్రబాబు పట్టుబట్టి మరీ వేధించడం గమనార్హం.

జగన్ ఓడిపోయాడు.. ఇంకా చావలేదు!

అయ్యన్న విద్వేష వ్యాఖ్యలు

"జగన్ ఓడిపోయాడు కానీ ఇంకా చావలేదు" అంటూ టీడీపీ సీనియర్ నాయకుడు చింతకాయల అయ్యన్నపాత్రుడు చేసిన విద్వేషపూరిత వ్యాఖ్యల వీడియో తాజాగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'వాడు ఓడిపోయాడు కానీ చావలా..! అపారమైన ధన బలం ఉంది.. కుల బలం ఉంది.. పక్కన తెలంగాణ ప్రభుత్వంలో వీడి మనుషులు ఉన్నారు' అని ఓ వ్యక్తి అందులో అయ్యన్నతో వ్యాఖ్యానించాడు. దీనిపై అయ్యన్న ప్రతిస్పందిస్తూ.. 'చచ్చేదాక కొట్టాల! ఈయన చెప్పింది కరెక్టే. ఓడిపోయాడు కానీ చావలేదు. చాలా మంచి డైలాగ్ ఇది' అని పేర్కొన్నారు. ఓడిపోయాడు కానీ చావలేదనే డైలాగ్ తనకు బాగా నచ్చిందంటూ అయ్యన్న వ్యాఖ్యానించారు. పామును చచ్చేవరకు కొట్టాలనే డైలాగ్‌ను తాను బయట మాట్లాడేటప్పుడు వాడతానంటూ తన నైజాన్ని చాటుకున్నారు.


సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న అయ్యన్నపాత్రుడు వీడియో ఇదే..



అందరికీ అందుబాటులో ధరణి..

త్వరలోనే పోర్టల్ ప్రక్షాళన: పొంగులేటి

ధరణి పోర్టల్ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు కోదండరెడ్డి, సునీల్, మధుసూదన్‌తో భేటీ

సాక్షి, హైదరాబాద్

గతంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం హడావుడిగా తీసుకువచ్చిన ధరణి పోర్టల్ కారణంగా రాష్ట్ర ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార ప్రజాసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ధరణి ప్రక్షాళన చేపట్టామని, త్వరలోనే ఈ పోర్టల్‌ను అందరికీ అర్థమయ్యే రీతిలో అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. ధరణి పోర్టల్ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు ఎం.కోదండరెడ్డి, ఎం. సునీల్‌కుమార్, మధుసూదన్‌తో శుక్రవారం మంత్రి పొంగులేటి సచివాలయంలో భేటీ అయ్యారు.

గత సర్కారు తీరుతో ఎన్నో కుటుంబాలు ఛిన్నాభిన్నం

భేటీ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ ధరణి పోర్టల్ కారణంగా లక్షలాది కుటుంబాలు భూసంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నాయని, ఎన్నో కుటుంబాలు ఛిన్నాభిన్నం అయ్యాయని చెప్పారు. తాను ఖమ్మంలో క్షేత్రస్థాయిలో పర్యటించిన సందర్భంలో ప్రతి గ్రామంలో రెండు వందలకు పైగా కుటుంబాలు భూసంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్నాయని అర్థమైందని, ఈ సమస్యల నుంచి ఉపశమనం కలిగించేందుకే ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి ధరణి ప్రక్షాళనకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ కమిటీ త్వరలోనే తుది నివేదికను ప్రభుత్వానికి ఇస్తుందని, అంతకంటే ముందు అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశం అవుతుందని చెప్పారు. ఇప్పటికే భూసంబంధిత నిపుణులు, అధికారులతో చర్చించిన కమిటీ 18 రాష్ట్రాల్లోని రెవెన్యూ చట్టాలను పరిశీలించిందని వెల్లడించారు. భూవివాదాల పరిష్కారం కోసం రెవెన్యూ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని, భూచట్టాలన్నింటినీ కలిపి రెవెన్యూ కోడ్ తేవాలని సూచించిందని తెలిపారు.

పార్ట్-బిలోని భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

గత ప్రభుత్వం పార్ట్-బి లో ఉంచిన భూ సమస్యలను పరిష్కరించడానికి ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని, ఈ సమస్యల పరిష్కారానికి మరింత వేగంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించినట్టు మంత్రి పొంగులేటి వెల్లడించారు.

ఇందిరమ్మ పథకం అంతా ఇక కేంద్రం కనుసన్నల్లోనే..

కేంద్రం సూచించిన అంశాల ఆధారంగానే దరఖాస్తుల పరిశీలన

లబ్ధిదారులను ఆటోమేటిక్‌గా ఎంపిక చేయనున్న సాంకేతిక వ్యవస్థ

నిబంధనలకు అంగీకరిస్తేనే రాష్ట్రానికి పీఎంఏవై నిధులు!

ప్రభుత్వ రాజకీయ ప్రయోజనాలకు గండి పడే చాన్స్

రాష్ట్ర ప్రభుత్వానికి ఇబ్బందికరంగా తాజా పరిస్థితి



లబ్ధిదారులెవరు?

సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల కోసం ఏయే ఊళ్లను ఎంపిక చేయాలి.. అయా ఊళ్లలో లబ్ధిదారులుగా ఎవరిని గుర్తించాలి అన్న విషయాలను తామే చూసుకుంటామని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ సాధారణంగా.. ఏ పథకమైనా రాజకీయంగా తమకెలా ఉపయోగపడు తుందన్న కోణంలోనే ముందుకెళ్తుంది. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ సాంకేతికంగా పూర్తిగా అధికారులకు సంబంధించినదే అయినా.. అలా కాకుండా జిల్లా మంత్రులు, అధికార పక్ష శాసనసభ్యుల కనుసన్నల్లో జరుగుతుంటుంది. ఇప్పుడు దీనికి భిన్నంగా కేంద్ర ప్రభుత్వం నిబంధనలు తీసుకువచ్చింది. ఈ నిబంధన లకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపా ల్సిన పరిస్థితి నెలకొంది. ఎందుకంటే పేదలకు ఇళ్లను నిర్మించి ఇచ్చే పథకం భారీ ఖర్చుతో కూడుకున్నది. దీని వ్యయాన్ని పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ సొంత ఖజానాతో నెట్టుకురావటం అంత సుల భం కాదు. కచ్చితంగా కేంద్ర ప్రభుత్వ నిధులపై కూడా ఆధారపడాల్సి ఉంటుంది. అలా కేంద్రం నిధులు కావాలంటే తప్పనిసరిగా అది విధించే నిబంధనలకు అంగీకరించాల్సి ఉంటుంది. ఇది రాష్ట్ర ప్రభుత్వానికి కొంత ఇబ్బందికరమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అనుసరించే వైఖరిపై ఆసక్తి నెలకొంది.

ఇప్పటికే రాష్ట్రం నుంచి ప్రతిపాదనలు..

- ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పునరుద్ధరించిన విషయం తెలిసిందే. ఉమ్మడి రాష్ట్రంలో రాజశేఖరరెడ్డి సీఎంగా ఉండగా ఈ పథకం యావత్ దేశం దృష్టిని ఆకర్షించింది. తాజాగా యూనిట్ కాస్ట్‌ను రూ.5 లక్షలకు పెంచి పథకాన్ని అమలు చేయాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరంలో నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇళ్లను మంజూరు చేసింది. ప్రజాపాలనలో వీటి కోసం 82 లక్షలకు పైగా దరఖాస్తులు రాగా, వాటిల్లో 14లక్షలు అనర్హమైనవిగా అప్పట్లోనే తేల్చి 68 లక్షల దరఖాస్తులను పరిశీలనకు సిద్ధం చేశారు. కేంద్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీర గానే, ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద రాష్ట్రానికి భారీగా ఇళ్లను మంజూరు చేయించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఎదురుచూస్తోంది. ఈ మేరకు ఇటీవలే అధికారులు ప్రతిపాదనలు పంపారు.

కేంద్రం కొత్త నిబంధనలు ఏమిటి?

గతంలో కేంద్ర ప్రభుత్వం పీఎంఏవై కింద రాష్ట్రానికి ఇళ్లను మంజూరు చేసి, యూనిట్లకు తగ్గట్టుగా నిధులు అందించేది. అవి రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకానికి చేసే ఖర్చుకు వేడి నీళ్లకు చన్నీళ్లలా తోడయ్యేవి. కానీ ఇప్పుడు కేంద్రం ప్రత్యేక నిబంధనలను తెరపైకి తెచ్చింది.

- రాష్ట్ర ప్రభుత్వం స్వీకరించిన దరఖాస్తుల పరిశీలన కేంద్రం సూచించిన అంశాల ఆధారంగా జరగాలి. దరఖాస్తుదారుకు సంబంధించిన సమగ్ర సమాచారం ఉండాలి. సామాజిక ఆర్థిక సర్వేతో ఇది పోలి ఉంటుంది.
- పూర్తి వివరాలు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కంప్యూటరీకరిస్తారు. ఆ వివరాలు, యూనిట్ల సంఖ్య ఆధారంగా సాంకేతిక వ్యవస్థ తనంతట తానుగా లబ్ధిదారులను ఎంపిక చేస్తుంది.
- ఏయే ఊళ్లను ఎంపిక చేయాలి, ఆయా ఊళ్లలో లబ్ధిదారుల ఎవరో కూడా పూర్తిగా ఆ వ్యవస్థనే ఎంపిక చేస్తుంది

దీనివల్ల ఇబ్బంది ఏంటి?

- ఏయే ఊళ్లు, వాటిల్లో ఎవరెవరు లబ్ధిదారులు ఉండాలో సొంతంగా నిర్ణయించే స్వేచ్ఛ రాష్ట్రానికి పోతుంది. ఇది రాజకీయంగా లబ్ధి పొందే అవకాశాలకు గండి కొడుతుంది.
- ఇటీవల వచ్చినవట్ల లక్షల దరఖాస్తులకు సంబంధించి మళ్లీ సర్వే చేయాల్సి వస్తుంది. కేంద్రం అడిగిన వివరాలను సేకరించటం కోసం భారీ కసరత్తు చేయాలి.

నిబంధనలకు అంగీకరిస్తే ఉపయోగమేంటి..?

- దేశ వ్యాప్తంగా పేదలకు భారీ సంఖ్యలో ఇళ్లను నిర్మించి ఇవ్వాలన్నది మోదీ ప్రభుత్వ ఆలోచన. మూడో విడత ప్రభుత్వం దీనికి ప్రాధాన్యం ఇస్తోంది.
- ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి అంత మెరుగ్గా లేదు. ఇందిరమ్మ పథకంలో ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు మంజూరు చేయాల్సి ఉంది. ఎస్సీ, ఎస్టీలకు మరో లక్ష అదనంగా ఇవ్వాలి. మొదటి విడత ఇళ్లకే రూ.20 వేల కోట్లకుపైగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో కేంద్రం నుంచి నిధులు వస్తే భారం చాలా వరకు తగ్గుతుంది. ఆ నిధులు తిరిగి కట్టాల్సిన పని లేదు.
- రాష్ట్ర ప్రభుత్వం మొదటి సంవత్సరం ప్రతిపాదించిన 4.16 లక్షల ఇళ్లకు సరిసమానంగా యూనిట్లను పీఎంఏవై కింద మంజూరు చేసే అవకాశం ఉంది
- గతంలో ఉన్న యూనిట్ కాస్ట్‌ను ఈసారి పెంచి ఇచ్చే వీలుంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఆ పథకం యూనిట్ కాస్ట్ గతంలో రూ.1.50 లక్షల చొప్పున రాష్ట్ర ప్రభుత్వానికి అందేది. ఈసారి రూ.2.10 లక్షల మేర అందనుంది.
- గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించే ఇళ్ల యూనిట్ కాస్ట్ కూడా పెరగనుంది.

ఇప్పటికిప్పుడు తెచ్చిన నిబంధనలు కాదు..!

కేంద్రం నిబంధనలు ఇప్పటికిప్పుడు కొత్తగా తెచ్చినవి కాదు. గత విడతలోనే అమలు చేసింది. కానీ అప్పట్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి, కేంద్రానికి మధ్య సరైన సంబంధాలు లేకపోవడంతో దీనిపై స్పష్టత లేకుండా పోయింది. అప్పట్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకానికి కేంద్రం భారీగా యూనిట్లు మంజూరు చేసింది. కానీ ఆ పథకానికి లబ్ధిదారులపే గుర్తించకుండానే రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లను నిర్మించింది. ఇది నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటూ కేంద్రం నిధులు నిరాకరించింది. అలా దాదాపు రూ.1,000 కోట్లు ఆగిపోయాయి.

ప్రజాభవన్ వద్ద ఆందోళన చేస్తున్న వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్య, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి



రెవెన్యూ సమస్యలే అధికం

ప్రజావాణిలో కొనసాగుతున్న నిరసనల పర్వం..

లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో శుక్రవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో అత్యధికంగా రెవెన్యూ సంబంధిత సమస్యలపైనే ఫిర్యాదులందాయి. గతంలో అర్జీ ఇచ్చి.. ఎలాంటి పరిష్కారం లభించక మళ్లీ వచ్చి దరఖాస్తులు ఇస్తున్న వారి సంఖ్యే అధికంగా ఉంటోంది. చేసిన ఫిర్యాదుకు అధికారుల నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో మళ్లీ మళ్లీ ఇవ్వాల్సి వస్తోందని పలువురు నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా.చిన్నారెడ్డి హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తంగా శుక్రవారం నాటి ప్రజావాణిలో అన్ని విభాగాలకు సంబంధించి 702 దరఖాస్తులు సమోదయ్యాయి. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 175, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 60 దరఖాస్తులు, పౌరసరఫరాల శాఖకు సంబంధించి 54, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి శాఖకు సంబంధించి 51, హోం శాఖకు సంబంధించి 38 దరఖాస్తులు, ఇతర శాఖలకు సంబంధించి 374 అందినట్లు అధికారులు తెలిపారు.

హిమోఫీలియా బాధితుల నిరసన

హిమోఫీలియా బాధిత కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో ప్లే కార్డులతో నిరసన తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్య మాట్లాడుతూ.. వికలాంగుల సర్టిఫికెట్ జారీలో సాంకేతికపరమైన సమస్య నెలకొందని, త్వరలోనే పరిష్కరించి ఆయా సర్టిఫికెట్ల జారీకి చర్యలు తీసుకుంటామని హామీనివ్వడంతో నిరసన విరమించారు.

సహకార బ్యాంకుల తీరుపై తుమ్మల ఆగ్రహం

'సాక్షి'కథనంపై స్పందించిన వ్యవసాయమంత్రి

సాక్షి, హైదరాబాద్: కామారెడ్డి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) తీరుపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. 'సాక్షి'లో శుక్రవారం 'రైతు భూమిలో బ్యాంకు ఫ్లెక్సీ!'శీర్షికతో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. కామారెడ్డి జిల్లా లింగంపేటలో డీసీసీబీ అధికారులు ఒక రైతు పొలంలో ఫ్లెక్సీలు కట్టడంపై తుమ్మల ఆరాతీశారు. ఈమేరకు బ్యాంకు అధికారులు ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. సదరు రైతుకు 2010లో దీర్ఘకాలిక రుణం మంజూరు చేశామని, గడువు పూర్తయ్యాక పలుమార్లు రుణాన్ని చెల్లించాలని విజ్ఞప్తి చేశామని తెలిపారు. బ్యాంకుకు తనఖా పెట్టిన భూమిని కూడా ఇతరులకు విక్రయిస్తున్నాడని వివరించారు. దీంతో మంత్రి తుమ్మల బ్యాంకు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఇలా ఫ్లెక్సీలు పెట్టడం లాంటి పద్ధతులను తమ ప్రభుత్వం ఉపేక్షించబోదని హెచ్చరించారు.

ధరణి, ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచొద్దు

దరఖాస్తులు ఎక్కువగా ఉన్న మండలాలకు అదనపు సిబ్బందిని ఇవ్వండి

భూముల విలువల సవరణ నివేదికలు పంపండి.

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లకు సీసీఎల్ఏ మిత్తల్ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: ధరణితోపాటు ప్రజావాణి ద్వారా వచ్చే దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచొద్దని, అయా దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) నవీన్‌మిత్తల్ ఆదేశించారు. ధరణి పోర్టల్ దరఖాస్తుల పరిష్కారంపై శుక్రవారం ఆయన సీసీఎల్ఏ కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో విడతలవారీగా వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. మిత్తల్ మాట్లాడుతూ ధరణి దరఖాస్తుల పరిష్కారం విషయంలో తక్షణచర్యలు తీసుకోవాలని, వారసత్వం, పెండింగ్ మ్యుటేషన్ దరఖాస్తుల రికార్డులను పరిశీలించాలని, పాస్‌పుస్తకంలోని వివరాల సవరణకు క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలని సూచించారు. మండలాలవారీగా ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్న దానిపై కలెక్టర్లు సమీక్షించాలని, పెండింగ్ దరఖాస్తులు ఎక్కువగా ఉన్న మండలాలకు అవసరమైతే అదనపు సిబ్బందిని కేటాయించాలని వెల్లడించారు. ధరణి పోర్టల్ డిజిటల్ సంతకాల విషయంలో మార్పులు చేస్తున్నామని, ఈ మార్పులు వీలైనంత త్వరలో అందుబాటులోకి వస్తాయని చెప్పారు. తహసీల్దార్లు, ఆర్డీఓలు, అదనపు కలెక్టర్లు, కలెక్టర్ల స్థాయిలో ఇచ్చిన లాగిన్‌ల ఆధారంగా వెంటనే దరఖాస్తుల పరిష్కారానికి ఉపక్రమించాలని కోరారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో నిర్వహిస్తున్న 'ప్రజావాణి'లో వచ్చే భూ సంబంధిత సమస్యలను కూడా కలెక్టర్లకు బదిలీ చేస్తామని, వీటిని అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని సూచించారు. భూ విలువల పెంపు ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నందున అన్ని జిల్లాల్లోని భూముల మార్కెట్ విలువ, ప్రస్తుత రిజిస్ట్రేషన్ వివరాలతో కూడిన నివేదిక పంపాలని సూచించారు. జిల్లాల్లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయా లకు శాశ్వత భవనాలను నిర్మించడానికి అనువైన భూమి కేటాయించే ప్రతిపాదనలను కూడా కలెక్టర్లు వీలున్నంత త్వరగా పంపాలని సీసీఎల్ఏ నవీన్ మిత్తల్ కోరారు.



కనపడే కష్టం అమ్మ చేస్తుంది.
కనపడనివ్వని శ్రమ నాన్న చేస్తాడు.
చూపులకు చిక్కే ప్రేమ అమ్మది.
గుండెల్లో దాగి ఉండే మమకారం నాన్నది.
నాన్న ఉద్యోగం చేస్తాడు.
షాపులో కూచుంటాడు.
పనిముట్టు పట్టి శ్రమ చేస్తాడు.
పంటచేలో మంచె ఎరగని ఎండ కాస్తాడు.
తింటాడో లేదో. ఖర్చెంతో జమ ఎంతో.
కాని పిల్లలు అడిగింది అందించాలనే
ఆర్తితో ఉంటాడు.
ఎప్పుడూ చిర్నవ్వు...
అప్పుడప్పుడూ కోపం
ఆలోచనల పరధ్యానం.
ఏమీ చెప్పుకోని నాన్నకు
మనసారా కృతజ్ఞతలు
చెప్పాల్సిన రోజు ఇది.

రేపు ఫాదర్స్ డే

ఓ నాన్నా... నీ మనసే వెన్న...

ఒక తండ్రి తన కొడుకును తీసుకొని పొరుగూరి నుంచి తన ఊరికి నడుస్తున్నాడు. ఐదారు మైళ్ల దూరం. తండ్రి వయసు 40 ఉంటుంది. కొడుకు వయసు 15 ఉంటుంది. దారిలో వాన మొదలైంది. క్షణాల్లో పెరిగింది. వడగండ్లుగా మారింది. పెద్ద వడగండ్లు. రాళ్ల వంటి వడగండ్లు. గుండ్ల వంటి వడగండ్లు. దారిలో ఎక్కడా చెట్టు లేదు. తల దాచుకోవడానికి చిన్నపాటి నీడ లేదు. పరిగెత్తి ఎక్కడికీ పారిపోవడానికి లేదు. కేవలం పొలాలు ఉన్నాయి. వడగండ్ల దెబ్బకు పిల్లాడు అల్లాడి పోతున్నాడు. తండ్రి నెత్తి చిట్లిపోయేలా ఉంది. అయినా ఆ తండ్రి భయపడలేదు. కొడుకును పొట్ట కిందకు తీసుకున్నాడు. చటుక్కున బోర్లా పడుకున్నాడు. తండ్రి శరీరం కింద పిల్లాడు సురక్షితం అయ్యాడు. తండ్రి తన దేహాన్ని ఉక్కుఛత్రంలా మార్చి కొడుక్కు అడ్డుపెట్టాడు. వడగండ్లు కురిసి కురిసి అలసిపోయాయి. తండ్రి కొడుకును సుక్షితంగా ఇల్లు చేర్చి ఆ గాయాలతో మరికొన్నాళ్లకు చనిపోయాడు. నాన్న శౌర్యమంటే అది. కుటుంబం కోసం నాన్న చేయగలిగే అంతిమ త్యాగం అది. ఈ కథలోని తండ్రి అమితాబ్ బచ్చన్ ముత్తాత. ఈ ఉదంతాన్ని అమితాబ్ తండ్రి హరివంశరాయ్ బచ్చన్ తన ఆత్మకథలో రాశాడు.

మరో ఉదంతంలో ... తండ్రికి గవర్నమెంట్ ఉద్యోగం లేదు. అసలు ఏ ఉద్యోగమూ లేదు. బాధ్యతలు ఎక్కువున్నాయి. బరువులు మోయలేనన్ని. చదువుకున్నది అంతంత మాత్రమే. ట్యూషన్లు మొదలెట్టాడు. అతడు జీనియస్. ఏ సబ్జెక్ట్ అయినా ఇట్టే నేర్చుకుని చెప్పగలడు. లెక్కలు, ఇంగ్లిషు, సైన్సు, ఎకనమిక్సు, కామర్సు.... నేర్చుకోవడం... పిల్లలకు చెప్పడం... ఆ వచ్చే జీతం ఇంటికి... తనపై ఆధారపడ్డ బంధువులకు... ఖర్చులు పెరిగే కొద్దీ క్లాసులు పెరిగాయి. ఉదయం ఐదు నుంచి రాత్రి పది వరకు... చెప్పి చెప్పి చెప్పి... సరైన తిండి లేదు.. విశ్రాంతి లేదు... విహారం లేదు... వినోదం లేదు.... బాధ్యత... బాధ్యత బాధ్యత.... పిల్లలు ఎదిగొస్తుంటే చూడటం ఒక్కటే ఊరడింపు... కాని చేయాల్సింది చాలా ఉంది. ఈలోపు ఆ శ్రమకు దేహం అలసిపోయింది. మధ్య వయసులోనే ఓడిపోయింది. ఆ తండ్రి దూరమైనా ఆ త్యాగం పిల్లలు ఏనాడూ మర్చిపోలేదు. ఇది సిరివెన్నెల సీతారామశాస్త్రి తన తండ్రి గురించి చెప్పిన కథ.

> ఒకనాడు పులిలా ఉండే నాన్న ఇవాళ తన గాంభీర్యం తగ్గించుకున్నాడు. నేటి నాన్న ఇంటి పని చేస్తాడు. అమ్మను అదిలించకుండా స్నేహంగా ఉంటాడు. పిల్లలను ఎత్తుకుంటాడు. ఆడిస్తాడు. వారితో సరదా కబుర్లు చెబుతాడు. కొట్టని, తిట్టని నాన్నలే ఇప్పుడు ఎక్కడ చూసినా. అంత మాత్రాన పిల్లలు తేలిగ్గా తీసుకుంటే తన సత్తా చూపే శక్తి నాన్నకు ఉంటుంది.

కుటుంబానికి ఆపద వస్తే నాన్న పులి. తిండి సమకూర్చే వేళ ఎద్దు. రక్షణకు కాపు కాచే గద్ద. నాలుగు గింజల కోసం ఎంతదూరమైనా వెళ్లే వలస పక్షి.

నాన్న అతి నిరాడంబరుడు. రెండు జతల బట్టలు, రోజూ ఉదయం చదవడానికి న్యూస్ పేపర్, వినేందుకు రేడియో, అడిగినప్పుడు దొరికే కాఫీ. ఇవి ఉంటే చాలు. కొందరు నాన్నలు వీలైతే పడక్కుర్చీ పొందేవారు. అదే సింహాసనంలా భావించేవారు. మంత్రులు, ముఖ్యమంత్రులు ఉదయం పూట ప్రజా దర్బార్ నడుపుతారు. కాని నాన్న దర్బార్ ఎప్పుడూ రాత్రి భోజనాలయ్యాకే. విన్నపాలన్నీ అమ్మ నుంచే వచ్చేవి. ఇంటికి కావలసినవి, పిల్లలకు కావలసినవి, అత్తమామలకు కావలసినవి, ఆడపడుచులకు అమర్చవలసినవి అన్నీ ఏకరువు పెట్టేది. రూపాయి రాక, రూపాయి పోకలో నాన్న వాటా ఏమీ ఉండేది కాదు. అమ్మ కూడా పెద్దగా అడిగేది కాదు. అమ్మను మంత్రిగా పెట్టుకుని నాన్న మధ్యతరగతి రాజ్యాన్ని నెట్టుకొచ్చేవాడు.

దేశంలో డబ్బు లేని రోజులవి. నిస్సహాయ రోజులు. నాన్న ఎంత కష్టపడేవాడో. ఒకోసారి ఎంత కోప్పడేవాడో. ఆ పైన ఎంత బాధ పడేవాడో. పుస్తకాలు కొనిస్తానని, బూట్లు కొనిస్తానని, కొత్త బట్టలు కొనిస్తానని తీర్చలేని హామీలు ఇవ్వడానికి నాన్న ఎంత బాధ పడేవాడో. అరడజను అరటి పండ్లు తెచ్చి ఏడుగురు సభ్యుల ఇంటిలో ఎవరూ గొడవ పడకుండా పంచే గొప్ప మేథమెటీషియన్ నాన్నే. కొత్త సినిమా ఊళ్లోకొస్తే దాని ఊసు ఇంట్లో రాకుండా జాగ్రత్త పడేవాడు. 'సినిమాకెళ్దాం నాన్నా' అనంటే కేకలేసేవాడు. కాని ఏదో ఒక వీలు దొరికి కాసిన్ని డబ్బులు చేతికొస్తే తనే అందరినీ వెంటబెట్టుకొని తీసుకెళ్లి సంతోషపడేవాడు.

లోకం పెద్దది. జీతం ఇచ్చే చోట, పని చేసే చోట ఎన్నో అవస్థలు. ఎందరో శత్రువులు. నాన్న ఆ పోరాటం అంతా చేసి ఇంటికి ఏమీ ఎరగనట్టుగా వచ్చేవాడు. మరుసటి రోజు అవమానం ఎదురుకానుందని తెలిసినా పిల్లల కోసం తప్పక వెళ్లేవాడు. తాను అవమానపడి పిల్లలకు అన్నం పెట్టేవాడే కదా నాన్న.

ఆరోగ్యం పట్టించుకోడు. అప్పుకు వెరవడు. కుటుంబానికి మాట రాకుండా తనను తాను నిలబెట్టుకుంటూ పరువు కోసం పాకులాడతాడు. తన జ్ఞానం, కామన్‌సెన్స్ పిల్లలకు అందిస్తాడు. ఇలా వెళ్తే గమ్యం వస్తుందని సద్బుద్ధిని, సన్మార్గాన్ని చూపిస్తాడు. తన కోసం ఏదీ వెనకేసుకోడు. సంపాదించిందంతా పిల్లలకే ఇవ్వాలని తాపత్రయ పడతాడు.

తన యవ్వనాన్ని పిల్లలకు ధారబోసిన నాన్నకు వయసైపోయాక పిల్లలు ఏం చేస్తున్నారు? ఎప్పుడో ఒకసారి మాట్లాడుతున్నారు. ఎప్పుడో ఒకసారి కనపడుతున్నారు. ఏది అడిగినా నీదంతా చాదస్తం అంటున్నారు. తమకు పుట్టిన సంతానాన్ని వారి ఒడిలో కూచోబెట్టలేనంత దూరం ఉంటున్నారు. అన్నీ ఉన్నా నాన్నకు తలనొప్పులు తెచ్చి పెట్టే పిల్లలను ఏమనాలి? కొత్త టెన్షన్స్ తెచ్చి పెడుతూ ఏడిపించే పిల్లలు పిల్లలేనా? నాన్న కన్నీరు భూమి మీద రాలితే అది ఆ పిల్లలకు శుభం చేస్తుందా?

భర్తలుగా, కోడళ్లుగా మారిన పిల్లలూ... మీ నాన్న గురించి ఆలోచించండి. ఆయన సంతోషంగా ఉన్నాడా లేదా గుర్తించండి. మీ బాల్యంలో యవ్వనంలో మీ కోసం ఏమేమి చేశాడో గుర్తు చేసుకోండి. ఈ ఫాదర్స్ డేకి మీ నాన్నతో గడుపుతూ ఆయన మనసు మాట వినండి.



తండ్రి కళ్లలో కోటి వెలుగులు తెచ్చింది

ఎన్విరాన్‌మెంటల్ ఎకనామిక్స్‌లో గ్రాడ్యుయేట్ అయిన మాన్సీ జైన్‌కు రాజేష్ జైన్ తండ్రి మాత్రమే కాదు ఆప్త మిత్రుడు. దారి చూపే గురువు. తన తండ్రితో కలిసి గురుగ్రామ్ కేంద్రంగా 'డిజిటల్ పానీ' అనే స్టార్టప్‌ను మొదలుపెట్టింది. పరిశ్రమలు, నివాస ప్రాంతాలలో మురుగు జలాలను తక్కువ ఖర్చుతో శుద్ధి చేయడానికి ఉపకరించే కంపెనీ ఇది. తండ్రి మార్గదర్శకత్వంలో ఎంటర్‌ప్రెన్యూర్‌గా విజయం సాధించిన మాన్సీ జైన్ గురించి...

స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీ నుంచి ఎన్విరాన్‌మెంటల్ ఎకనామిక్స్‌లో పట్టా పుచ్చుకున్న తరువాత ఇండియాకు తిరిగి వచ్చిన మాన్సీ జైన్‌లో స్టార్టప్ కలలు మొదలయ్యాయి. తన ఆలోచనలను తండ్రి రాజేష్‌తో పంచుకుంది.

'నువ్వు సాధించగలవు. అందులో సందేహమే లేదు' కొండంత ధైర్యం ఇచ్చాడు తండ్రి.

మాన్సీ తండ్రి రాజేష్ జైన్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఢిల్లీలో కెమికల్ ఇంజినీరింగ్‌లో గ్రాడ్యుయేషన్ చేశాడు. వాటర్ అండ్ ఎనర్జీ ఇండస్ట్రీలో ఇంజినీర్‌గా పాతిక సంవత్సరాలు పనిచేశాడు.

వేస్ట్‌వాటర్ ట్రీట్‌మెంట్ ఫెసిలిటీస్ విషయంలో ఆయనకు అపారమైన అనుభవం ఉంది. తండ్రి నుంచి చందమామ కథలు విన్నదో లేదు తెలియదుగానీ నీటికి సంబంధించిన ఎన్నో విలువైన విషయాలను కథలు కథలుగా విన్నది మాన్సీ. పర్యావరణ అంశాలపై ఆసక్తి పెంచుకోవడానికి, ఎన్విరాన్‌మెంటల్ ఎకనామిక్స్ చదవడానికి తాను విన్న విషయాలు కారణం అయ్యాయి.



తండ్రి రాజేష్ జైన్‌తో మాన్సీ జైన్

'మన దేశంలో తొంభైవేల మురుగునీటి శుద్ధి ప్లాంట్లు ఉన్నాయి. 95 శాతం పని మాన్యువల్‌గానే జరుగుతోంది. ప్రతి ప్లాంట్‌లో ఆపరేటర్‌లను నియమించారు. లోపాలను ఆలస్యంగా గుర్తించడం ఒక కోణం అయితే చాలామంది ఆపరేటర్‌లకు సమస్యలను పరిష్కరించే నైపుణ్యం లేకపోవడం మరో అంశం. ఈ నేపథ్యంలోనే సరియైన పరిష్కార మార్గాల గురించి ఆలోచన మొదలైంది' గతాన్ని గుర్తు తెచ్చుకుంది మాన్సీ.

మురుగునీటి శుద్ధి ప్లాంట్లలో తలెత్తుతున్న సాంకేతిక సమస్యల గురించి తండ్రితో ఎన్నో రోజుల పాటు చర్చించింది మాన్సీ.

ఆ మేథోమథనంలో నుంచి పుట్టిందే... 'డిజిటల్ పానీ' స్టార్టప్.

నివాస ప్రాంతాలు, పరిశ్రమలలో నీటి వృథాను అరికట్టేలా, తక్కువ ఖర్చుతో మురుగునీటిని శుద్ధి చేసేలా 'డిజిటల్ పానీ'కి రూపకల్పన చేశారు.

ఎక్విప్‌మెంట్ ఆటోమేషన్, వాట్సాప్ అప్‌డేట్స్, 24/7 మేనేజ్‌మెంట్..., మొదలైన వాటితో వాటర్ మేనేజ్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌గా 'డిజిటల్ పానీ' మంచి గుర్తింపు తెచ్చుకుంది.

'నీటి మౌలిక సదుపాయాలకు సంబంధించి మా ప్లాట్‌ఫామ్‌ని వైద్యుడిగా భావించాలి. ఎక్కడ సమస్య ఉందో గుర్తించి దాని నివారణకు తగిన మందును ఇస్తుంది. సాంకేతిక నిపుణులకు దిశానిర్దేశం చేస్తుంది. ఎన్నో రకాలుగా క్లయింట్స్ డబ్బు ఆదా చేయగలుగుతుంది' అంటుంది మాన్సీ.

టాటా పవర్, ఢిల్లీ జల్ బోర్డ్, లీలా హాస్పిటల్స్‌తో సహా 40 పెద్ద పరిశ్రమలు 'డిజిటల్ పానీ' సాంకేతికతను ఉపయోగించుకుంటున్నాయి. 'డిజిటల్ పానీ' ప్రస్తుతం పద్నాలుగు రాష్ట్రాలలో పనిచేస్తోంది. 'ఎకో రివర్' క్యాపిటల్‌లాంటి గ్లోబల్ ఇన్వెస్టర్‌ల నుంచి కంపెనీకి అవసరమైన నిధులను సేకరించారు.

నాన్న హృదయం ఆనందమయం

పిల్లలు విజయం సాధిస్తే ఎంత సంతోషం కలుగుతుందో, వారితో కలిసి విజయం సాధిస్తే అంత కంటే ఎక్కువ సంతోషం కలుగుతుంది. మాన్సీ తండ్రిగా ప్రస్తుతం అలాంటి ఆనందంలోనే ఉన్నాడు రాజేష్ జైన్. స్టార్టప్ పనితీరు గురించి పక్కా ప్రణాళిక రూపొందించడం నుంచి అది పది లక్షల మంది పేరు తెచ్చుకోవడం వరకు కూతురికి అండగా నిలబడ్డాడు. దిశానిర్దేశం చేశారు. బిజినెస్ రియాలిటీ టెలివిజన్ సిరీస్ 'షార్క్ ట్యాంక్'లో కుమార్తె మాన్సీతో కలిసి పాల్గొన్న రాజేష్ జైన్‌లో సాంకేతిక నిపుణుడు, సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్ కంటే చల్లని మనసు ఉన్న తండ్రి కనిపించాడు. కుమార్తెతో కలిసి సాధించిన విజయానికి ఉప్పొంగి పోతున్న తండ్రి కనిపించాడు.

'వాళ్ల సమర్థమైన పనితీరుకు ఈ ప్లాట్‌ఫామ్ అద్దం పడుతుంది' అంటున్నారు 'డిజిటల్ పానీ'లో పెట్టుబడి పెట్టాలని నిర్ణయం తీసుకున్న 'ఏంజియా వెంచర్స్'కు చెందిన కరుణ జైన్, శివమ్ జిందాల్.

'డిజిటల్ పానీ'కి ముందు కాలంలో...

ఎన్నో స్టార్టప్‌ల అపురూప విజయాల గురించి ఆసక్తిగా చర్చించుకునేవారు తండ్రీ, కూతుళ్లు. ఆ స్టార్టప్‌ల విజయాల గురించి లోతుగా విశ్లేషించేవారు. ఈ విశ్లేషణ ఊరకే పోలేదు. తమ స్టార్టప్ ఘన విజయం సాధించడానికి అవసరమైన పునాదిని ఏర్పాటు చేసుకోవడానికి కారణం అయింది.

'షార్క్ ట్యాంక్ ఇండియా' టీవీ ప్రోగ్రామ్‌లో తండ్రి రాజేష్‌తో కలిసి పాల్గొంది మాన్సీ.

తాగునీటి సమస్య, నీటి కాలుష్యం... మొదలైన వాటి గురించి సాధికారికంగా మాట్లాడింది.

జడ్జీలు అడిగే క్లిష్టమైన ప్రశ్నలకు తడుముకోకుండా జవాబు చెప్పింది.

'మీరు చాలా తెలివైనవారు' అని జడ్జి ప్రశంసించేలా మాట్లాడింది.

ఆ సమయంలో తండ్రి రాజేష్ జైన్ కళ్లలో ఆనంద వెలుగులు కనిపించాయి. కుమార్తెతో కలిసి సాధించిన విజయం తాలూకు సంతృప్తి ఆయన కళ్లలో మెరిసింది.

సముద్రం ఘోషిస్తోంది



ఉమామణి

మొదట్లో అసమంజసంగా అనిపించింది. అనేక పరిశోధకుల డాక్యుమెంటరీలను చూసిన అనుభవంతోనే కదా చిత్రించాను. నేను స్వయంగా చూస్తే కొత్తగా కనిపించేది ఏముంటుంది... అని కూడా అనుకున్నాను. ఇంత సందిగ్ధం ఎందుకు... ఒకసారి సముద్ర గర్భంలోకి వెళ్లి చూద్దాం అని కూడా అనుకున్నాను. అప్పుడు మా అబ్బాయి మా పాతికేళ్ల వివాహ వార్షికోత్సవం బహుమతిగా నన్ను స్క్యూబా డైవింగ్ కోర్సులో చేర్చాడు. డైవింగ్ కంటే ముందు ఈత రావాలి కదా అని చెన్నైకి వచ్చి రెండు వారాల స్విమ్మింగ్ కోర్సులో చేరాను. తిరిగి మాల్దీవులకెళ్లి స్క్యూబా డైవింగ్ ప్రాక్టీస్ మొదలుపెట్టాను. తొలి రోజు అంతా అగమ్యంగా అనిపించింది. రెండవ రోజు కూడా అదే పరిస్థితి. మానేద్దామనే నిర్ణయానికి వచ్చేశాను. కోచ్ నా మాటలు పట్టించుకోలేదు. ప్రయత్నాన్ని కొనసాగించమని మాత్రం చెప్పారు. నాకు నేను నెల రోజుల గడువు పెట్టుకున్నాను. ఆ నెలలో నావల్ల కాకపోతే మానేద్దామని నా ఆలోచన. ఆ నెల రోజుల్లో డైవింగ్‌కి అనుగుణంగా మానసికంగా ట్యూన్ అయిపోయాను.

సముద్రం నిత్యం ఘోషిస్తూ ఉంటుంది. ఆ ఘోషకు భావకవులు రకరకాల అర్థాలు చెప్తుంటారు. కానీ సముద్రం లోపల ఏముంది? సముద్రం లోపల మరో ప్రపంచం ఉంది. పగడపు దీవులమయమైన ఆ అందమైన ప్రపంచాన్ని చందమామ కథల్లో చదివాం. మన ఊహల్లో అద్భుతమైన దృశ్యాన్ని ఊహించుకున్నాం. ఇప్పటికీ అదే ఊహలో ఉన్నాం. కానీ ఆ ఊహలో నుంచి వాస్తవంలోకి రమ్మని చెబుతున్నారు ఉమామణి. ఒకప్పుడు అందమైన పగడపు దీవులను చిత్రించిన ఆమె కుంచె ఇప్పుడు అంతరించిపోయిన పగడపు దీవులకు అద్దం పడుతోంది.

బొమ్మలేయని బాల్యం

"మాది తమిళనాడులోని దిండిగల్. నాకు బొమ్మలేయడం చాలా ఇష్టం. చిన్నప్పుడు ఎప్పుడు చూసినా రంగు పెన్సిళ్లతో బొమ్మలు గీస్తూ కనిపించేదాన్ని. అది చూసి నానమ్మ 'పిచ్చి బొమ్మల కోసం కాగితాలన్నీ వృథా చేస్తున్నావు. చక్కగా చదువుకోవచ్చు కదా' అనేది. అలా ఆగిపోయిన నా చిత్రలేఖనం తిరిగి నలభై దాటిన తర్వాత మొదలైంది. ఈ మధ్యలో నాకు ఓ డాక్టర్‌తో పెళ్లి, వారి ఉద్యోగరీత్యా మాల్దీవులకు వెళ్లడం, ఓ కొడుకు పుట్టడం, ఆ కొడుకుకి కాలేజ్ వయసు రావడం జరిగిపోయాయి. ఇంత కాలం గృహిణిగా ఉన్న నాకు కొడుకు కాలేజ్ కెళ్లిపోయిన తర్వాత ఆ ఖాళీ సమయాన్ని చిన్నప్పుడు తీరని కోరిక కోసం కేటాయించాను. గులాబీల నుంచి టులిప్స్ వరకు రకరకాల పూలబొమ్మలు వేసిన తర్వాత నా చుట్టూ ఉన్న సముద్రం మీదకు దృష్టి మళ్లింది. పగడపు దీవులు నా చిత్రాల్లో ప్రధాన భూమిక అయ్యాయి. తొలి చిత్ర ప్రదర్శన మాల్దీవులలోని మెరైన్ సెంటర్‌లో పెట్టాను. ఆ తర్వాత అనేక ప్రదర్శనల్లో నా చిత్రాలను ప్రదర్శించాను. వివాంత మాల్దీవ్స్ ప్రదర్శన సమయంలో ఒక భారతీయ మహిళ వేసిన ప్రశ్న నా దిశను మార్చింది. 'సముద్ర గర్భం ఎలా ఉంటుందో ఏమేమి ఉంటాయో స్వయంగా చూడకుండా బొమ్మలేయడం ఏమిటి' అన్నదామె. ఆమె వ్యాఖ్య నాకు





సముద్రగర్భాన్ని చిత్రించాను

సముద్రం అడుగున దృశ్యాలు నన్ను వేరేలోకంలోకి తీసుకెళ్లిపోయాయి. పగడపు చెట్లు నిండిన దిబ్బలు, రకరకాల చేపలు, పాములు ఒక మాయా ప్రపంచాన్ని చూశాను. ఆ ప్రపంచాన్ని కాన్వాస్ మీద చిత్రించడం మొదలుపెట్టాను. ఒక చిత్రానికి మరో చిత్రానికి మధ్య మాటల్లో వర్ణించలేనంత వైవిధ్యత వచ్చేసింది. ఆ చిత్రాలన్నింటినీ మాల్దీవుల మెరైన్ సింపోజియమ్ 2016లో ప్రదర్శించాను. ఆ చిత్రాలు ఫస్ట్ హ్యాండ్ ఇన్ఫర్మేషన్‌లా ఓషన్ రీసెర్చర్‌లు, అంతరించిపోతున్న పగడపు దిబ్బల పరిశోధకులకు ఉపయోగపడ్డాయి. కొంతకాలం తర్వాత సముద్రగర్భంలోని సన్నివేశాలను కెమెరాలో బంధించాలనుకున్నాను. ఫొటోగ్రఫీలో అనుభవం లేకపోవడంతో శబ్దరహితంగా పేలవంగా వచ్చింది ఫిల్మ్. అప్పటి నుంచి ఫిల్మ్ మేకింగ్, డాక్యుమెంటరీలు తీసే వారి దగ్గర మెళకువలు నేర్చుకునే ప్రయత్నం చేశాను. చాలామంది స్పందించలేదు. ఫిల్మ్ మేకర్ ప్రియా తువాస్సెరీ మాత్రం నాతో కలిసి ఫిల్మ్ తీయడానికి సిద్ధమయ్యారు. చిత్రీకరణ కోసం 2018లో మన దేశంలోని రామేశ్వరం, రామనాథపురం, టూటికోరన్ తీరాల్లో డైవ్ చేశాను. ఆశ్చర్యంగా సముద్రం అడుగుకి వెళ్లే కొద్దీ పగడపు దిబ్బలు కాదు కదా జలచరాలు కూడా కనిపించలేదు. ప్లాస్టిక్ వ్యర్థాలు దిబ్బలుగా పేరుకుపోయి ఉన్నాయి. రసాయనాలు, పురుగు మందులు, ఎరువుల వ్యర్థాలను సముద్రపు నీటిలోకి వదలడంతో జలచరాలు అంతరించి పోయాయి. సునామీ విలయంలో పగడపు దీవులు అతలాకుతలం అయిపోయాయి. శిథిలమైన ఆనవాళ్లు తప్ప పగడపు చెట్ల సమూహాలు లేవు. చెట్లు చనిపోయిన దిబ్బలనే వీడియో, ఫొటోలు తీశాను. మనిషి తన సౌకర్యం కోసం చేసే ఆరాచకానికి సముద్రం ఎలా తల్లడిల్లిపోతోందో తెలియచేస్తూ ఆ ఫొటోలతో ప్రదర్శన పెట్టాను. మా సొంతూరు తమిళనాడులోని దిండిగల్‌తో మొదలు పెట్టి అనేక స్కూళ్లు, కాలేజీలకు వెళ్లి విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్నాను. సముద్రం ఘోషిస్తోంది. ఆ ఘోషను విందాం. ప్రకృతి సమతుల్యతను కాపాడుకుందాం. ఓషన్ కన్జర్వేషన్, క్లైమేట్ చేంజ్ మీద పరిశోధన చేసే వాళ్లకు నేను తీసిన ఫొటోలు, చిత్రలేఖనాలు ఫస్ట్ హ్యాండ్ ఇన్ఫర్మేషన్‌లా ఉపయోగపడుతున్నాయి.

ఒక సాధారణ గృహిణిగా నేను 43 ఏళ్ల వయసులో కుంచె పట్టి పెయింటింగ్స్ మొదలుపెట్టాను. 49 ఏళ్లకు స్క్యూబా డైవింగ్ నేర్చుకుని సాగర సత్యాలను అన్వేషించాను. సమాజానికి ఉపయోగపడే సమాచారాన్ని సేకరించగలిగాననే సంతృప్తి కలుగుతోంది. మొత్తంగా నేను చెప్పేదేమిటంటే 'వయసు ఒక అంకె మాత్రమే. మన ఆసక్తి మనల్ని ఔదకొక్కెగా నడిపిస్తుంది'. అంటారు ఉమామణి.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాస్



సాక్షి, అమరావతి : టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసును నియమిస్తారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం అధ్యక్షుడిగా ఉన్న అచ్చెన్నాయుడికి మంత్రి పదవి ఇవ్వడంతో ఆయన స్థానంలో పల్లాను నియమించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించినట్లు తెలిసింది. బీసీ వర్గానికి చెందిన పల్లా శ్రీనివాస్ ఈ ఎన్నికల్లో గాజువాక నుంచి గెలుపొందారు.

టీటీడీ ఈవోగా శ్యామలరావు



సాక్షి, అమరావతి : తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కార్యనిర్వాహక అధికారి (ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్)గా సీనియర్ ఐఏఎస్ అధికారి జె.శ్యామలరావును నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఈ పోస్టులో పనిచేసిన ఏవీ ధర్మారెడ్డి సెలవుపై వెళ్లగా, ఆయన స్థానంలో ఉన్నత విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా పని చేస్తున్న శ్యామలరావును నియమించారు.

యథేచ్ఛగా టీడీపీ దాడులు

పలు ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం

జేసీబీతో జగనన్న లేఔట్‌లో విధ్వంసం

శిలాఫలకాలను పగలకొట్టిన టీడీపీ కార్యకర్తలు

రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిన దాష్టీకాలు

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

స్పీకర్‌గా అయ్యన్నపాత్రుడు?

సాక్షి, అమరావతి: టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడికి అసెంబ్లీ స్పీకర్ పదవి ఇవ్వాలని సీఎం చంద్రబాబు నిర్ణయించినట్లు తెలిసింది. పార్టీలో సీనియర్ నాయకుడు అవడంతోపాటు గతంలో పలుసార్లు మంత్రిగా పని చేసిన అయ్యన్నకు మంత్రివర్గంలో కచ్చితంగా చోటు దక్కుతుందని అంతా భావించారు. అయితే సీఎం చంద్రబాబు ఆయనకు పదవి ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో ఆయనకు స్పీకర్ పదవి ఇచ్చేందుకు చంద్రబాబు సుముఖంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. శుక్రవారం ఆయన చంద్రబాబును కలిశారు. ఈ సమయంలో స్పీకర్ పదవి ఇస్తానని చంద్రబాబు ఆయనకు చెప్పినట్లు సమాచారం. ఒకట్రెండు రోజుల్లో ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని చెబుతున్నారు.

టీడీపీ నేతలకు గవర్నర్ పదవులు?

ఎన్డీఏ ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ కీలకంగా ఉండడంతో ఒకటి, రెండు గవర్నర్ పదవులు దక్కే అవకాశం ఉందని సమాచారం. టీడీపీలో సీనియర్ నేతలు అశోక్ గజపతిరాజు, యనమల రామకృష్ణుడి పేర్లను గవర్నర్ పదవుల కోసం చంద్రబాబు పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

విలువలు, విశ్వసనీయతతో ముందడుగు

వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ భేటీలో ఎంపీలకు వైఎస్ జగన్ దిశా నిర్దేశం

- మనం ఎదుర్కొంటున్న పరిస్థితులు తాత్కాలికమే
- మన పాలన – చంద్రబాబు పరిపాలనను ప్రజలు గమనిస్తూనే ఉంటారు
- కచ్చితంగా మనం మళ్లీ ప్రజల విశ్వాసాన్ని పొందుతాం
- ప్రజాహితమే పరమావధిగా పార్లమెంట్‌లో వ్యవహరించాలి
- రాష్ట్రం, దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అంశాల వారీగానే ఎవరికైనా మద్దతు



వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌తో ఆ పార్టీ ఎంపీలు

సాక్షి, అమరావతి: ''రాష్ట్రంలో ఇప్పుడు మనం ఎదుర్కొంటున్న పరిస్థితులు తాత్కాలికమే. మన పరిపాలన – చంద్రబాబు పాలనను ప్రజలు బేరీజు వేసి గమనిస్తూనే ఉంటారు. కచ్చితంగా మనం తిరిగి ప్రజల విశ్వాసాన్ని పొందగలుగుతామనే నమ్మకం, విశ్వాసం ఉన్నాయి. ఈలోగా మనం ధైర్యాన్ని కోల్పోకూడదు. విలువలు, విశ్వసనీయతతో ముందడుగు వేద్దాం'' అని వైఎస్సార్‌సీపీ ఎంపీలకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాహితమే పరమావధిగా పార్లమెంట్‌లో వ్యవహరించాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు, దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అంశాలవారీగానే ఎవరికైనా మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీ విధివిధానాల ప్రకారం అడుగులు వేస్తూ ప్రజల ఎదుట తలెత్తుకునేలా ఎంపీలు ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, వి.విజయసాయిరెడ్డి, వైఎస్ అవినాష్ రెడ్డి, పి.మిథున్‌రెడ్డి, పరిమళ్ నత్వానీ, పిల్లి సుభాష్ చంద్రబోస్.. మోపిదేవి వెంకటరమణ, ఎం.గురుమూర్తి, బీద మస్తాన్‌రావు, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఆర్.కృష్ణయ్య, గొల్ల బాబూరావు, ఎస్.నిరంజన్‌రెడ్డి, మేడా రఘునాథరెడ్డి, డాక్టర్ చెట్టి తనూజరాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఏమన్నారంటే..

నాణ్యమైన విద్యతో పేదరికం శాశ్వతంగా నిర్మూలన..

గత ఐదేళ్ల పాటు ఎప్పుడూ చూడని మంచి పరిపాలన అందించాం. మేనిఫెస్టోలో హామీలు 99 శాతం అమలు చేశాం. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఇలా ఎప్పుడూ ఎవరూ చేయలేదు. చిత్తశుద్ధితో మేనిఫెస్టోను అమలు చేశాం. ఏ నెలలో ఏం ఇవ్వబోతున్నామో క్యాలెండర్ ప్రకటించి మరీ అమలు చేశాం. ప్రపంచాన్ని, ఆర్థిక వ్యవస్థలను దారుణంగా దెబ్బ తీసిన కోవిడ్ లాంటి సంక్షోభాలు ఎదురైనప్పటికీ ఆ సవాళ్లను అధిగమించి ప్రజలకు మంచి చేశాం. విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం తదితర రంగాల్లో ఎప్పుడూ చూడని సంస్కరణలు తీసుకొచ్చాం. ప్రజల ఇంటివద్దకే పరిపాలనను తీసుకెళ్లాం. అవినీతికి చోటులేకుండా, వివక్ష చూపకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు అమలు చేశాం. అర్హులందరికీ ప్రభుత్వ మంచి ప్రయోజనాలు అందించాం. విద్యా రంగంలో సంస్కరణలు తెచ్చి పేదరికం నిర్మూలన దిశగా అడుగులు వేశాం. భవిష్యత్తు తరాలను ప్రపంచ స్థాయిలో నిలబెట్టేందుకు ఇంగ్లిష్ మీడియం, టోఫెల్, ఆరో తరగతి నుంచి ఐఎఫ్‌పీ(ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్) ద్వారా బోధన, ఎనిమిదో తరగతి నుంచి ట్యాబ్‌లు అందచేశాం. ఐబీ సిలబస్ కూడా తెచ్చాం. ప్రఖ్యాత అంతర్జాతీయ వర్సిటీల కోర్సులను విద్యార్థులకు అందించాం. నాణ్యమైన విద్య అందించడం ద్వారా పేదరికాన్ని శాశ్వతంగా నిర్మూలించే దిశగా ఐదేళ్లలో అడుగులు వేశాం.

ప్రజలపై సంపూర్ణ విశ్వాసం..

వైఎస్సార్ సీపీని నమ్ముకుని కొన్ని కోట్ల కుటుంబాలున్నాయి. లక్షల మంది కార్యకర్తలు పార్టీపై ఆధారపడి ఉన్నారు. వేల మంది నాయకులు పార్టీలో ఉన్నారు. అనుకున్న లక్ష్యాల దిశగా పార్టీ ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. ఈ ఎన్నికల్లో మనకు 40 శాతం ఓట్లు వచ్చాయి. గత ఎన్నికలతో పోలిస్తే పది శాతం ఓట్లు తగ్గాయి. రానున్న రోజుల్లో ఈ పది శాతం ప్రజలే మన పాలనకు, ఇప్పటి ప్రభుత్వ పాలనకు తేడాను గుర్తిస్తారనే నమ్మకం, విశ్వాసం ఉన్నాయి. ప్రతి ఇంట్లోనూ మన ప్రభుత్వం చేసిన మంచి కనిపిస్తుంది. ఎట్టి పరిస్థితుల్లో మనలో ధైర్యం, పోరాట పటిమ సన్నగిల్లకూడదు. నా వయసు చిన్నదే. నాలో సత్తువ ఏమాత్రం తగ్గలేదు. 14 నెలలు పాదయాత్ర చేశా. దేవుడి దయ వల్ల అన్ని రకాల పోరాటాలు చేసే శక్తి ఉంది. ప్రజలు మళ్లీ మనల్ని అధికారంలోకి తెస్తారనే సంపూర్ణ విశ్వాసం, నమ్మకం నాకు ఉంది.

శకుని పాచికల్లా ఫలితాలు..

సోషల్ ఇంజనీరింగ్‌లో భాగంగా ఎప్పుడూ చూడని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అవకాశాలు కల్పించాం. ఇన్ని గణనీయమైన మార్పులు తెచ్చినప్పటికీ ఎన్నికల ఫలితాలు ఇలా వచ్చాయంటే చాలా ఆశ్చర్యమేస్తోంది. శకుని పాచికలు మాదిరిగా ఈ ఎన్నికల ఫలితాలు వచ్చాయనిపిస్తోంది. ఏం జరిగిందో దేవుడికే తెలియాలి.

నాడు మద్దతిచ్చి నేడు విషప్రచారం

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తెచ్చింది. దీనికి అనుగుణంగా రాష్ట్రంలో ఆ యాక్ట్ తెచ్చినప్పుడు అసెంబ్లీ సాక్షిగా టీడీపీ కూడా మద్దతు పలికింది. అమెరికా, యూరప్ దేశాల్లో అనుసరిస్తున్న మంచి విధానాలన్నీ ఇందులో ఉన్నాయని సభ సాక్షిగా ప్రశంసలు కురిపించింది. సరిగ్గా ఎన్నికల సమయంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను ఒక భూతంలా చూపించి టీడీపీ, కూటమి పార్టీలు విష ప్రచారం చేశాయి. ఈ చట్టాన్ని తేవడం అంత సులభమైన విషయం కాదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 15 వేలమంది సర్వేయర్లను నియమించింది. భూమి కొనాలన్నా, అమ్మాలన్నా ఎలాంటి మోసాలకు ఆస్కారం లేని పరిస్థితులు ఈ చట్టం వల్ల వస్తాయి. చరిత్రలో తొలిసారిగా భూ పత్రాలకు ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తుంది. పత్రాల విషయంలో తప్పులు జరిగితే సదరు వ్యక్తికి ప్రభుత్వమే పరిహారం చెల్లిస్తుంది. గతంలో తాము మద్దతు పలికిన చట్టాన్ని టీడీపీ వాళ్లు ఇప్పుడు తీసేస్తామంటున్నారు. వారు చేస్తున్న రాజకీయాలు ఎలా ఉంటాయో దీన్ని బట్టే తెలుస్తుంది.

పార్లమెంటరీ పార్టీ నేతగా వైవీ సుబ్బారెడ్డి..

గతంలో మాదిరిగానే రాజ్యసభలో పార్టీ నాయకుడిగా విజయసాయిరెడ్డి కొనసాగుతారు. లోక్‌సభలో మన పార్టీ నాయకుడిగా మిథున్‌రెడ్డి వ్యవహరిస్తారు. పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా వైవీ సుబ్బారెడ్డి బాధ్యతలు నిర్వర్తిస్తారు. అందరికీ నేను అందుబాటులో ఉంటా. ఎంపీలంతా కలసి కూర్చుని చర్చించుకుని ఆ మేరకు అడుగులు ముందుకేయాలి. పార్టీ పరంగా వ్యవహరించాల్సిన అంశాలపై పరస్పరం చర్చించుకుని నిర్ణయాలు తీసుకోండి. ఎంపీలుగా మీరు వేసే ప్రతి అడుగూ పార్టీ ప్రతిష్టను పెంచేదిగా ఉండాలి. మన పార్టీకి ఒక సిద్ధాంతం, గుర్తింపు ఉన్నాయి. పార్టీ కోసం కష్టపడండి. పార్టీ మిమ్మల్ని గుర్తు పెట్టుకుంటుంది.

ఐదేళ్లు ఇట్టే గడిచిపోతాయి..

పార్లమెంట్‌లో మనకు 11 మంది రాజ్యసభ సభ్యులు, నలుగురు లోక్‌సభ సభ్యులున్నారు. మొత్తంగా 15 మంది ఎంపీలు మన పార్టీకి ఉన్నారు. టీడీపీకి 16 మంది ఉన్నారు. అందువల్ల మన పార్టీ చాలా బలమైనదే. మనల్ని ఎవరూ, ఏమీ చేయలేరు. మనం ధైర్యంగా నిలబడి ప్రజల తరఫున పోరాటం చేయాలి. ఐదేళ్లు ఇట్టే గడిచిపోతాయి.

ఆ 20 లక్షల ఈవీఎంలు ఏమయ్యాయి?

వేసిన ఓటు ఎక్కడికి పోతోందోనని ప్రజల్లో అనుమానం: ఉండవల్లి అరుణ్‌కుమార్



సాక్షి, రాజమహేంద్రవరం: దేశవ్యాప్తంగా ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా 20 లక్షల ఈవీఎంలు కనపడకుండా పోయాయంటూ కమ్యూనిస్టులు, ప్రజల నుంచి వస్తున్న ఆరోపణలపై సీఎం చంద్రబాబునాయుడు స్పందించాలని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికల నిమిత్తం 60 లక్షల ఈవీఎంలు దిగుమతి చేసుకుంటే.. వీటిలో 40 లక్షలు వినియోగించారని, మిగిలిన 20 లక్షల ఈవీఎంలు ఎక్కడో ఒకచోట ఉండాలి కదా అని ప్రశ్నించారు. ఈవీఎంల వినియోగం విషయమై సమాచార హక్కు చట్టం ద్వారా ఎన్నికల కమిషన్‌ను కోరితే.. తమకేం తెలీదని.. ప్రభుత్వం తమకు ఇచ్చిన ఈవీఎంలనే ఉపయోగించామని చెప్పడం విడ్డూరంగా ఉందని ఉండవల్లి అన్నారు. రాజమహేంద్రవరంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇదే విషయమై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఎన్నికల కమిషన్‌ను అడగాలంటూ తప్పించుకుంటోందని ఆరోపించారు. ఓ కమ్యూనిస్టు నేత సైతం ఇదే అనుమానం వ్యక్తంచేశారన్నారు. ఈవీఎంల గోల్‌మాల్ అంశాన్ని ఒక కమ్యూనిస్టు నాయకుడు తన దృష్టికి తీసుకొచ్చారని ఉండవల్లి చెప్పారు. గతంలో ఈవీఎంల పనితీరుపై చంద్రబాబు అనుమానాలు వ్యక్తంచేసినందున ఇప్పుడు ఈవీఎంల గోల్‌మాల్‌పై విచారణకు ఆయన డిమాండ్ చేయాలని కోరారు. తాము వేసిన ఓటు ఎవరికి వెళ్లిందోననే అపోహ ప్రస్తుతం నెలకొందని, ప్రజల్లో అటువంటి అనుమానం రావడం మంచిది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. దీనిపై చంద్రబాబు దృష్టిపెట్టాలని ఉండవల్లి సూచించారు. కేంద్రంలో ఎన్డీయే, ఇండియా కూటములకు ఓట్ల తేడా కేవలం 1.9 శాతం మాత్రమేనన్నారు. అహంకారం పెరిగిపోయిందని ప్రధాని మోదీని ఉద్దేశించి ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ అని ఉండవచ్చన్నారు.

జగన్ జైలుకెళ్లే అవకాశం ఉండదు..

అక్రమాస్తుల కేసులో జగన్ మళ్లీ జైలుకెళ్లే అవకాశం ఉండదని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే ఈ కేసులకు సంబంధించి అన్ని చార్జిషీట్లూ పూర్తయ్యాయని చెప్పారు. ఇక కమ్మ, కాపులది డెడ్లీ కాంబినేషన్ అని.. కనీ, పట్టుదల వల్లే చంద్రబాబు మరోసారి అధికారంలోకి వచ్చారని, ఆయనపై జగన్ కక్షసాధింపు చర్యలు చేపట్టారని ప్రజలు నమ్మారని ఉండవల్లి అభిప్రాయపడ్డారు. వైఎస్సార్‌సీపీ ఓటమికి మద్యం పాలసీ కూడా ఒక కారణం కావచ్చునన్నారు. ఆ పార్టీ నేతలు బూతులు మాట్లాడటం మానుకోవాలని హితవు పలికారు. అలాంటి వారివల్లే కొంతమంది వైఎస్సార్‌సీపీకి దూరమయ్యారని చెప్పారు.

వైఎస్సార్‌సీపీకి మళ్లీ మంచి రోజులు..

ఇక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పనైపోయిందనుకోవద్దని.. ఓటమి పాలైన ఆ పార్టీ నాయకులు నిరాశ చెందాల్సిన అవసరంలేదన్నారు. 11 స్థానాలే వచ్చినా ఆ పార్టీ ఓట్ల శాతం బాగుందని.. వారికి మళ్లీ మంచి రోజులు రావచ్చని ఉండవల్లి చెప్పారు. గతంలో ఓటమి చెందిన చంద్రబాబు ప్రస్తుత గెలుపే దీనికి నిదర్శనమన్నారు. ఇదే తరహా పరిస్థితులు తమిళనాడు రాజకీయాల్లో సైతం గతంలో చోటుచేసుకున్నాయని చెప్పారు. తమిళనాడులో 1989లో ఎంజీ రామచంద్రన్ మరణానంతరం జరిగిన ఎన్నికల్లో కరుణానిధి పార్టీకి 169, జయలలిత పార్టీకి 30 సీట్లు వచ్చాయని.. ఆ తర్వాత 1991లో జరిగిన ఎన్నికల్లో జయలలితకు 225, కరుణానిధికి 7 సీట్లు మాత్రమే వచ్చాయని గుర్తుచేశారు. అయినప్పటికీ ప్రతిపక్ష పాత్ర పోషించారని చెప్పారు. అలాగే, 1996లో కరుణానిధి 221 సీట్లు సాధించగా.. జయలలిత నాలుగు స్థానాలకే పరిమితమయ్యారన్నారు. మళ్లీ 2011 ఎన్నికల్లో జయలలిత ఏకంగా 203 సీట్లు సాధించారని చెప్పారు. దీనినిబట్టి చూస్తే రాజకీయాల్లో నిస్సత్తువ ఉండకూడదని ఉండవల్లి అన్నారు. వైఎస్సార్‌సీపీ అసెంబ్లీలో ప్రతిపక్ష పాత్ర సమర్థవంతంగా పోషించాలని సూచించారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసం బాబు పోరాడాలి..

మరోవైపు.. ఎన్డీయే ప్రభుత్వం చంద్రబాబుపై ఆధారపడి ఉందని, ఆయన ఢిల్లీలో తన పలుకుబడి ఉపయోగించి రాష్ట్రాభివృద్ధికి, రాష్ట్రానికి అందాల్సిన నిధుల సాధనకు కృషిచేయాలని ఉండవల్లి సూచించారు. రాష్ట్ర విభజన హామీ మేరకు ఏపీకి రూ.1.42 లక్షల కోట్లలో 50 శాతం ఆస్తులు రావాలని, వాటిని సాధించుకునేందుకు పోరాడాలని సూచించారు. రాష్ట్ర విభజన బిల్లుపై చర్చ సందర్భంగా 2014లో పార్లమెంట్‌లో ఏం జరిగిందో తెలుసుకుని, ఇప్పుడు బాబు చర్చకు డిమాండ్ చేయాలన్నారు. అలాగే, త్వరలో జరగబోయే పార్లమెంట్ సమావేశాల్లో దీనిపై నోటీసు ఇప్పించాలన్నారు. వివాదాస్పద ఎలక్టోరల్ బాండ్లపై సైతం చర్చ జరగాలని ఆకాంక్షించారు. ఇక స్కిల్ డెవలప్‌మెంట్ కేసును చంద్రబాబు ప్రభుత్వమే సీబీఐకి అప్పగించే అవకాశం ఉందని ఉండవల్లి చెప్పారు.



సాక్షి, హైదరాబాద్: ఎన్నికలు పూర్తయ్యాయి. కేంద్రం, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాలు కొలువుదీరాయి. ఇక, రియల్టీ పరుగులే తరువాయి. కాకపోతే, హైదరాబాద్ మార్కెట్ పరిస్థితులు వేరు. రాజకీయ స్థిరత్వం అనేది వినియోగదారులు, పెట్టుబడిదారులకు కీలకం. ఇలాంటి సమయంలో ప్రభుత్వాలు విశ్వాసాన్ని చూరగొనాలంటే వేగవంతంగా విధానపరమైన నిర్ణయాలతో పాటు వాటిని కార్యరూపంలోకి తీసుకురావాలి. అప్పుడే మార్కెట్‌లో సానుకూల వాతావరణం ఏర్పడి, క్రయవిక్రయాలు పెరుగుతాయి.

- మౌలిక సదుపాయాల అభివృద్ధిపై నిరంతరం దృష్టి పెడుతూనే పెట్టుబడిదారులకు మరింత సానుకూల వాతావరణాన్ని ప్రభుత్వం కల్పించాలని స్థిరాస్తి సంఘాలు సూచిస్తున్నాయి. పారిశ్రామిక పాలసీ, రీజనల్ రింగ్ రోడ్డు, మూసీ సుందరీకరణ, ఫార్మా క్లస్టర్లు, సెమీ కండక్టర్ల పాలసీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీ వంటి ఏదైనా ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకొని వాటి అమలుకు చర్యలు చేపట్టాలి. ఈ విషయాన్ని ప్రజలకు చేరవేసి ఒక సానుకూల వాతావరణాన్ని రాష్ట్రంలో తీసుకురావాలి. ఆరోగ్యం, పర్యాటక రంగాలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రోత్సహించాలి. ప్రభుత్వం దార్శనికతతో ప్రణాళికలు రూపొందిస్తే ఎన్నెన్నో అద్భుతాలు సృష్టించవచ్చు. ఇవన్నీ రియల్టీ రంగానికి ఇంధనంగా ఉపయోగపడతాయి.
- హైదరాబాద్‌లోని భౌగోళిక వాతావరణం, వనరులు, మౌలిక సదుపాయాలు, దేశ, విదేశీ సంస్థల కార్యాలయాలు.. ఇలా ఎన్నెన్నో అనుకూల పరిస్థితులు హైదరాబాద్‌కు ఉన్నాయి. ఇతర నగరాలతో పోలిస్తే ఇప్పటికీ హైదరాబాద్‌లో గృహాల ధరలు, అద్దెలు, భూముల రేట్లు అందుబాటులోనే ఉన్నాయి. కాస్మో పాలిటన్ కల్చర్, తక్కువ జీవన వ్యయం వంటివి నగరానికి అదనపు అంశాలు. దీంతో పెట్టుబడులు వస్తూనే ఉంటాయి. ఏమాత్రం అలసత్వం ఉండదు. దీంతో భవిష్యత్తులో హైదరాబాద్ రియల్టీ మార్కెట్‌కు ఢోకా ఉండదు.

మార్కెట్‌లోకి మూడోతరం..

జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వంటి ఖరీదైన ప్రాంతాల్లోని నివాసితుల రెండు, మూడోతరం వారసులు కూడా సిటీకి వస్తున్నారు. వీరికి ఆయా ప్రాంతాల్లో లగ్జరీ ఇండిపెండెంట్ హౌస్‌లు దొరకడం కష్టం. దీంతో హైరైజ్, అల్ట్రాలగ్జరీ అపార్ట్‌మెంట్ల వైపు మొగ్గుచూపక తప్పని పరిస్థితి. అలాగే విదేశాల్లో స్థిరపడిపోయిన ప్రవాసులు తిరిగి స్థానిక ప్రాంతాలకు వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో మార్కెట్‌లోకి కొత్తతరం కస్టమర్లు వస్తున్నారు. వీరికి విదేశాల్లో తరహా ఆధునిక వసతులు, విస్తీర్ణమైన అపార్ట్‌మెంట్లు కావాలి. అందుకే చాలామంది గ్రేడ్-ఏ డెవలపర్లు అల్ట్రా లగ్జరీ అపార్ట్‌మెంట్లను నిర్మిస్తున్నారు.

- కొందరు ఎన్నారైలు ఇప్పటికే స్థానికంగా ఉన్న స్థిరాస్తులను విక్రయించి, లగ్జరీ ప్రాపర్టీలకు అప్‌గ్రేడ్ అవుతున్నారు. అలాగే ఇన్నాళ్లు భార్యా, భర్త ఇద్దరి సంపాదనతో ఇళ్ల కొనుగోలు చేసిన కస్టమర్లు.. ఇప్పుడు వారి పిల్లల సంపాదన కూడా తోడైంది. గత 3–4 ఏళ్లుగా ఈ మూడోతరం సంపాదనతో నగరంలో ప్రాపర్టీలు కొనుగోలు చేసే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇప్పటికే పక్క రాష్ట్రంలో భూముల ధరలు ఆకాశంలో ఉన్నాయి. ఇలాంటి తరుణంలో కొత్తగా స్థలాలు కొనే వారి కంటే ఉన్న భూమిని విక్రయించి, వచ్చిన సొమ్ముతో నగరంలో ప్రాపర్టీ కొనేందుకే ఆసక్తి చూపిస్తారని దీంతో ప్రాపర్టీలకు మరింత డిమాండ్ ఉంటుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

పవన్‌కు 'పంచాయతీ'.. లోకేశ్‌కి విద్య, ఐటీ

మంత్రులకు శాఖలు కేటాయించిన సీఎం చంద్రబాబు

జగన్ బాటలో.. ఎస్సీ మహిళ అనితకు హోంశాఖ



పవన్‌కల్యాణ్



అనిత



లోకేశ్

పయ్యావుల, అనగాని, కొల్లు, నిమ్మల, గొట్టిపాటికి కీలక శాఖలు

నారాయణకు మళ్లీ మున్సిపల్ శాఖే

చంద్రబాబు వద్దే స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు ఈ నెల 12వ తేదీన మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన వారికి శాఖలు కేటాయించిన నేపథ్యంలో ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. జనసేన అధ్యక్షుడు కొణిదెల పవన్ కల్యాణ్‌కు ఉప ముఖ్యమంత్రి హోదాతో పంచాయతీరాజ్ – గ్రామీణాభివృద్ధి, గ్రామీణ తాగునీటి సరఫరా, పర్యావరణం, అడవులు, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలను కేటాయించారు. నారా లోకేష్‌కు విద్యా శాఖ (మానవ వనరుల అభివృద్ధి)తోపాటు ఐటీ శాఖ కేటాయించారు. గతంలోనూ ఆయన ఐటీ శాఖ నిర్వహించారు. కె.అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, పి.నారాయణ, వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్‌కు కీలక శాఖలు లభించాయి.

రాజధాని వ్యవహారాలు మళ్లీ నారాయణకే!

పాయకరావుపేట నుంచి గెలిచిన టీడీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు వంగలపూడి అనితకు ప్రాధాన్యమైన హోంశాఖ దక్కింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రభుత్వంలో తొలిసారిగా దళిత మహిళకు హోంమంత్రి పదవి కట్టబెట్టిన విషయం తెలిసిందే. తొలిసారి మేకతోటి సుచరిత, రెండోసారి తానేటి వనితకు హోంశాఖ ఇచ్చి సామాజిక న్యాయం, మహిళా సాధికారతను చాటుకున్నారు. ఇప్పుడు అదే బాటలో సీఎం చంద్రబాబు దళిత మహిళకు హోంశాఖ ఇచ్చారు. ఇక పీఏసీ చైర్మన్‌గా పని చేసిన పయ్యావుల కేశవ్‌కు ఆర్థిక శాఖ లభించింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చురుగ్గా వ్యవహరించిన నిమ్మల రామానాయుడుకు జలవనరుల శాఖను అప్పగించారు. రేపల్లె నుంచి మూడో సారి గెలిచిన అనగాని సత్యప్రసాద్‌కు రెవెన్యూ శాఖ బాధ్యతలు కేటాయించారు. పొంగూరు నారాయణకు మళ్లీ మున్సిపల్ శాఖ దక్కింది. 2014–19 మధ్య మున్సిపల్ శాఖ మంత్రిగా రాజధాని వ్యవహారాలన్నింటినీ ఆయన చక్కబెట్టారు. ఇప్పుడు మరోసారి అదే శాఖ ఇవ్వడంతో రాజధాని కార్యకలాపాలు నారాయణే నిర్వహిస్తారని స్పష్టమవుతోంది. బీజేపీ తరఫున గెలిచి మంత్రివర్గంలో చేరిన సత్యకుమార్‌కు వైద్య, ఆరోగ్య శాఖ అప్పగించారు. జనసేనకు చెందిన ముఖ్య నేత నాదెండ్ల మనోహర్‌కి పౌరసరఫరాల శాఖ కేటాయించారు.

శాఖల్లో స్వల్ప మార్పులు

కొత్త ప్రభుత్వం కొలువుదీరాక శాఖల్లో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీ, డ్వాక్రా వ్యవహారాలకు సంబంధించి 'సెర్ప్'ను పంచాయతీరాజ్ శాఖ నుంచి విడదీసి చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రి పరిధిలోకి తెచ్చారు. దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ల సంక్షేమ విభాగాలు సాధారణంగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పరిధిలో ఉంటాయి. తాజాగా వాటిని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రికి అప్పగించారు. స్కిల్ డెవలప్‌మెంట్ శాఖను ఎవరికీ కేటాయించకపోవడం గమనార్హం. ఈ శాఖలో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాల వ్యవహారాల్లోనే విచారణలో ఉండగా చంద్రబాబు జైలుకు వెళ్లిన విషయం విదితమే.

సాంఘిక సంక్షేమం పరిధిలో సచివాలయాలు

వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతిష్టాత్మక గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రికి అప్పగించడం చర్చనీయాంశమైంది. ఐదేళ్ల క్రితం కొత్తగా గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఏర్పాటైంది. ప్రతి 2 వేల జనాభాకు ఒక సచివాలయం, 50 నుంచి 70 కుటుంబాలకు ఒక వలంటీర్ చొప్పున నియమించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు ఇంటి వద్దే పౌర సేవలు, పథకాలు అందించడం తెలిసిందే. ఈ వ్యవస్థను ఇప్పుడు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రికి అప్పగించడంతో దానికి అనుబంధంగా నిర్వహిస్తారని చెబుతున్నారు.

శాఖల కేటాయింపు ఇలా..

- నారా చంద్రబాబు నాయుడు, ముఖ్యమంత్రి – సాధారణ పరిపాలన శాఖ, శాంతి భద్రతలు, పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ (మంత్రులకు కేటాయించని ఇతర శాఖలు)
- కొణిదెల పవన్ కల్యాణ్ (ఉప ముఖ్యమంత్రి) – పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామీణ తాగునీటి సరఫరా, పర్యావరణం, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ
- నారా లోకేశ్ – మానవ వనరులు (విద్యా శాఖలన్నీ), ఐటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్‌టీజీ (రియల్ టైమ్ గవర్నెన్స్)
- కింజరాపు అచ్చెన్నాయుడు – వ్యవసాయం, సహకార శాఖ, మార్కెటింగ్, పశు సంవర్థక శాఖ, డెయిరీ డెవలప్‌మెంట్, మత్స్య శాఖ
- కొల్లు రవీంద్ర – గనులు, భూగర్భ శాఖ, ఎక్సైజ్ శాఖ
- పి.నారాయణ – మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి
- నాదెండ్ల మనోహర్ – ఆహారం, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు
- వంగలపూడి అనిత – హోం, విపత్తు నిర్వహణ శాఖ
- సత్యకుమార్ యాదవ్ – వైద్య, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, వైద్య విద్య
- నిమ్మల రామానాయుడు – జలవనరుల శాఖ
- ఎన్.ఎం.డి.ఫరూక్ – మైనార్టీ సంక్షేమం, న్యాయ శాఖ
- ఆనం రామనారాయణరెడ్డి – దేవదాయ శాఖ
- పయ్యావుల కేశవ్ – ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలు
- అనగాని సత్యప్రసాద్ – రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు– స్టాంపులు
- డోలా బాలవీరాంజనేయస్వామి – సాంఘిక సంక్షేమం, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ల సంక్షేమం, సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ
- కొలుసు పార్థసారథి – గృహ నిర్మాణం, సమాచార శాఖ
- గొట్టిపాటి రవికుమార్ – విద్యుత్ శాఖ
- కందుల దుర్గేష్ – పర్యాటక, సాంస్కృతిక శాఖ, సినిమాటోగ్రఫీ
- గుమ్మడి సంధ్యారాణి – గిరిజన, స్త్రీ–శిశు సంక్షేమ శాఖ
- బీసీ జనార్దన్ రెడ్డి – రోడ్లు–భవనాలు, మౌలిక వసతులు, పెట్టుబడులు
- టీజీ భరత్ – పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్
- ఎస్.సవిత – బీసీ సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన తరగతులు, చేనేత, జౌళి
- వాసంశెట్టి సుభాష్ – కార్మిక, ఫ్యాక్టరీస్, బాయిలర్స్, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్
- కొండపల్లి శ్రీనివాస్ – చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్‌ఆర్‌ఐ వ్యవహారాలు
- మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి – రవాణా, యువజన సర్వీసులు, క్రీడలు

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	182	76,993
నిఫ్టీ ▲	67	23,466

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (భారత కాలమాన ప్రకారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	17,677	▲	12
డోజోన్స్	38,514	▽	133
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,147	▽	17
డాక్స్	18,002	▽	264
షాంఘై	3,033	▲	4
నికాయ్	38,815	▲	94

అమెరికా బ్రిటన్ జర్మనీ చైనా జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (24 క్యారట్)	71,866	▲	353
బంగారం (22 క్యారట్)	71,578	▲	351
వెండి (కేజీ)	87,833	▽	14

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటికి	83.09	84.11
£	బ్రిటన్ పౌండ్	ఒకటికి	105.06	107.62
€	యూరో	ఒకటికి	88.82	91.18
¥	జపాన్ ఎన్ (100)	ఒకటికి	52.62	53.78
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటికి	54.11	56.04
S$	సింగపూర్ డాలర్	ఒకటికి	59.40	64.08
SAR	సౌదీ రియాల్	ఒకటికి	21.37	22.93
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటికి	21.85	23.63
¥	చైనా యువాన్	ఒకటికి	10.40	12.47

టోకు ధరల దడ

- మేలో 2.61 శాతం ద్రవ్యోల్బణం
- 15 నెలల గరిష్ఠ స్థాయి
- ఆహార ధరల తీవ్రత



న్యూఢిల్లీ: టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం మేలో 2.61 శాతంగా (2023 ఇదే నెలతో పోల్చి) నమోదయ్యింది. గడచిన 15 నెల్లో ఈ స్థాయిలో టోకు ధరల పెరుగుదల రేటు నమోదుకావడం ఇదే తొలిసారి. తీవ్ర వేసవి ఆహార ధరలను తీవ్రతరం చేసింది. మూడు నెలలుగా టోకు ద్రవ్యోల్బణం పెరుగుతూ వస్తోంది. కీలక అంశాలను పరిశీలిస్తే...

- సమీక్షా నెల్లో ఫుడ్ ఆర్టికల్స్ ద్రవ్యోల్బణం 10 నెలల గరిష్ఠ స్థాయిలో 9.82 శాతంగా నమోదయ్యింది. కూరగాయలు ధరలు ఏకంగా 32.42% పెరిగాయి. ఏప్రిల్ పెరుగుదల రేటు (23.60%)కన్నా ఇది తీవ్రం కావడం గమనార్హం. ఉల్లి ధరలు 58.05% పెరిగితే, ఆలూ ధరలు 64.05% ఎగశాయి. పప్పులకు సంబంధించి ద్రవ్యోల్బణం 21.95 శాతం ఎగసింది.
- సూచీలో మెజారిటీ వాటా కలిగిన తయారీ రంగంలో ఏప్రిల్‌లో ధరలు పెరక్కపోగా (మైనస్ 0.42 %), మేలో 0.78 శాతంగా నమోయ్యింది.
- ఇంధనం, విద్యుత్ బాస్కెట్లో ఏప్రిల్‌లో 1.38 శాతం ద్రవ్యోల్బణం నమోదుకాగా, మేనెల్లో ఈ రేటు స్వల్పంగా 1.35 శాతానికి తగ్గింది.
- రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పాలసీ నిర్ణయాలకు ప్రాతిపదిక అయిన రిటైల్ ద్రవ్యోల్బణం మేలో ఏడాది కనిష్ఠ స్థాయి 4.75 శాతానికి తగ్గినప్పటికీ, ఒక్క ఆహార విభాగంలో ధరల స్పీడ్ ఆందోళన కలిగించే స్థాయిలో 8.69 శాతంగా నమోదయిన సంగతి తెలిసిందే.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)
15-6-2024

విశాఖ	500-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	490-00
విజయవాడ	500-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

ఎకానమీకి వాణిజ్యలోటు పోటు

- మేలో 7 నెలల గరిష్ఠ స్థాయి
- 23.78 బిలియన్ డాలర్లుగా నమోదు
- ఎగుమతులు 9 శాతం వృద్ధితో 38.13 బిలియన్ డాలర్లకు అప్
- దిగుమతులు 7.7 శాతం పెరిగి 61.91 బిలియన్ డాలర్లకు చేరిక



న్యూఢిల్లీ: భారత్ ఎగుమతులు మేలో 9 శాతం (2023 ఇదే నెలతో పోల్చి) పెరిగాయి. విలువలో 38.13 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఇక దిగుమతులుసైతం సమీక్షా నెల్లో 7.7 శాతం పెరిగి 61.91 బిలియన్ డాలర్లకు చేరాయి. వెరసి ఎగుమతులు-దిగుమతుల మధ్య నికర వ్యత్యాసం- వాణిజ్యలోటు భారీగా 7 నెలల గరిష్ఠ స్థాయిలో 23.78 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. ఇంత భారీ వాణిజ్యలోటు ఎకానమీకి ఒకింత ఆందోళన కలిగించే అంశం. తాజా గణాంకాలను పరిశీలిస్తే..

- అంతర్జాతీయ మార్కెట్‌లో అనిశ్చితి పరిస్థితి నెలకొన్నప్పటికీ, ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఫార్మా, జౌళి, ప్లాస్టిక్స్ వంటి రంగాలు మంచి పనితీరును ప్రదర్శించాయి.
- మొత్తం దిగుమతుల్లో చమురు విభాగంలో 28 % పెరుగుదలను నమోదుచేసుకుని విలువలో 20 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది.
- పసిడి దిగుమతులు మాత్రం స్వల్పంగా తగ్గి 3.69 బిలియన్ డాలర్ల నుంచి 3.33 బిలియన్ డాలర్లకు చేరాయి.

ఏప్రిల్– మే నెలల్లో వృద్ధి 5.1 శాతం

ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలలు-ఏప్రిల్, మేలలో ఎగుమతులు 5.1 శాతం పెరిగి 73.12 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. దిగుమతులు 8.89 శాతం పెరిగి 116 బిలియన్ డాలర్లకు ఎగశాయి. వెరసి వాణిజ్యలోటు 42.88 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇక ఈ నెలల్లో ఒక్క చమురు దిగుమతుల విలువ 24.4 శాతం పెరిగి 36.4 బిలియన్ డాలర్లకు చేరింది.

సేవలూ బాగున్నాయ్...

సేవల రంగం ఎగుమతులు మేలో 30.16 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు తొలి అంచనా. 2023 మేలో ఈ విలువ 26.99 బిలియన్ డాలర్లు. దిగుమతుల విలువ ఇదే కాలంలో 15.88 బిలియన్ డాలర్ల నుంచి 17.28 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది.

రత్నాలు, ఆభరణాల ఎగుమతులు డౌన్

మరోవైపు రత్నాలు, ఆభరణాల ఎగుమతుల అభివృద్ధి మండలి ఒక ప్రకటన చేస్తూ, మేనెల్లో రత్నాలు, ఆభరణాల ఎగుమతులు 5 శాతం తగ్గి రూ.20,713.37 కోట్లుగా నమోదయినట్లు పేర్కొంది. 2023 ఇదే నెల్లో ఈ విలువ రూ.21,795.65 కోట్లు (2,647 మిలియన్ డాలర్లు).

చిన్న వ్యాపారులకు రూ.5 కోట్ల వరకు రుణం: ఎస్‌బీఐ



ముంబై: పైలట్ ప్రాజెక్టులో భాగంగా దేశవ్యాప్తంగా 2023 డిసెంబర్ నుంచి 20,000 మంది చిన్న వ్యాపారులకు ఆన్‌లైన్ మాధ్యమం ద్వారా రుణాలను మంజూరు చేసినట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) వెల్లడించింది. రుణగ్రహీతలకు రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు రుణం అందజేసినట్లు తెలిపింది. ఇంటి వద్ద నుంచే కస్టమర్ ఈ రుణాలను అందుకున్నారని, పైలట్ ప్రాజెక్టు ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయని ఎస్‌బీఐ వివరించింది. ఈ నేపథ్యంలో రుణ మొత్తాన్ని రూ.5 కోట్ల వరకు పెంచుతున్నట్లు ఎస్‌బీఐ డిప్యూటీ ఎండీ సురేంద్ర రాణా తెలిపారు. అయిదు రోజుల్లోనే రుణం మంజూరు అవుతుందని చెప్పారు. చిన్న వ్యాపారాలకు రుణాలు ఇవ్వడం వచ్చే అయిదేళ్లలో సంస్థ వృద్ధి, లాభాలకు కేంద్ర బిందువు అవుతుందని ఎస్‌బీఐ ఇప్పటికే ప్రకటించింది. వ్యాపారులను చేరుకోవడానికి ప్రభుత్వం, లాభాపేక్ష లేని సంస్థలు, ఫిన్‌టెక్‌లతో బ్యాంకులు భాగస్వామ్యం కుదుర్చుకుంటున్నాయని రాణా తెలిపారు. రానున్న రోజుల్లో వడ్డీ రేట్లు తగ్గుతాయని అంచనా వేస్తున్న బ్యాంకింగ్ దిగ్గజం దీనితో రుణ వృద్ధి మరింత పురోగమిస్తుందని అంచనా వేస్తోంది.

లక్ష్య సాధనకు పెన్నా డీల్ దోహదం

అంబుజా సిమెంట్స్ సీఈవో అజయ్ కపూర్



న్యూఢిల్లీ: పాత ప్లాంట్ల విస్తరణపై దృష్టి సారించామని.. 140 మిలియన్ టన్నుల వార్షిక తయారీ సామర్థ్యానికి చేరుకోవాలన్న సంస్థ లక్ష్యానికి పెన్నా సిమెంట్ వంటి కొనుగోలు అవకాశాలు సహాయపడతాయని దేశంలోని రెండవ అతిపెద్ద సిమెంట్ తయారీదారు అదానీ గ్రూప్ శుక్రవారం తెలిపింది. అదానీ గ్రూప్ కంపెనీ అయిన అంబుజా సిమెంట్ రూ.10,422 కోట్లకు పెన్నా సిమెంట్‌ను కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. శ్రీలంక మార్కెట్లో తిరిగి ఎంట్రీ ఇచ్చేందుకు తాజా డీల్ దోహదం చేస్తుందని ఇన్వెస్టర్ కాల్ సందర్భంగా అంబుజా సిమెంట్స్ సీఈవో, హోల్ టైమ్ డైరెక్టర్ అజయ్ కపూర్ శుక్రవారం తెలిపారు. అంబుజా ప్లాంట్లలో 40 మిలియన్ టన్నుల సామర్థ్యం జోడిస్తున్నామని చెప్పారు. 14 మిలియన్ టన్నుల సామర్థ్యం కలిగిన పెన్నా చేరికతో ప్రస్తుతం అదానీ సిమెంట్స్ సామర్థ్యం 93 మిలియన్ టన్నులకు చేరిందన్నారు. పెన్నా ప్లాంట్లలో విస్తరణ పూర్తి అయితే సామర్థ్యం 20% పెరుగుతుందని అంబుజా సీఎఫ్‌వో తెలిపారు. తద్వారా దక్షిణాది నుంచి అదానీ సిమెంట్స్ సామర్థ్యం 20 శాతానికి చేరుతుందని వివరించారు. ఈ ఏడాది చివరికి సంస్థ చేతిలో రూ.10,000 కోట్ల నగదు ఉంటుందన్నారు.

కొత్త శిఖరాలపై సూచీలు

ఇంట్రాడేలో నిఫ్టీ జీవితకాల రికార్డు

ముంబై: కేంద్రంలోని కొత్త ప్రభుత్వం మూలధన వ్యయాలకు ప్రాధాన్యత కొనసాగిస్తుందనే ఆశలతో దేశీయ స్టాక్ మార్కెట్ రికార్డుల ర్యాలీ శుక్రవారం కూడా కొనసాగింది. సెన్సెక్స్ 182 పాయింట్లు పెరిగి జీవితకాల గరిష్ఠం 76,993 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 270 పాయింట్లు బలపడి 77,081 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. ట్రేడింగ్‌లో నిఫ్టీ 92 పాయింట్లు పెరిగి 23,490 వద్ద సరికొత్త రికార్డు లిఖించింది. ఆఖరికి 67 పాయింట్లు బలపడి కొత్త రికార్డు స్థాయి 23,466 వద్ద నిలిచింది.

- పెన్నా ఇండస్ట్రీస్‌ను సొంతం చేసుకోవడంతో అదానీ గ్రూప్‌నకు చెందిన అంబుజా సిమెంట్స్ షేరు 2% పెరిగి రూ.677 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 4% ఎగసి రూ.690 వద్ద ఏడాది గరిష్టాన్ని అందుకుంది. కంపెనీ విలువ రూ.3,116 కోట్లు పెరిగి రూ.1.66 లక్షల కోట్లకు చేరింది.




ఐపీవో బాటలో హ్యుందాయ్

ఆటో రంగ దక్షిణ కొరియా దిగ్గజం హ్యుందాయ్ దేశీ విభాగం పబ్లిక్ ఇష్యూ బాట పట్టనుంది. ఇందుకు వీలుగా త్వరలో సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేయనున్నట్లు తెలుస్తోంది. తద్వారా కనీసం 3 బిలియన్ డాలర్లు(రూ. 25,000 కోట్లు) సమీకరించాలని భావిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలియజేశాయి. వెరసి హ్యుందాయ్ ఇండియా దేశీయంగా అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా నిలవనున్నట్లు పేర్కొన్నాయి.

ఇండస్ నుంచి వొడాఫోన్ ఔట్!

టవర్స్ కంపెనీలో వాటా విక్రయానికి రెడీ • 21.5% వాటాకు రూ. 19,100 కోట్లు!

ముంబై: దేశీ మొబైల్ టవర్ల కంపెనీ ఇండస్ టవర్స్‌లో వాటాను విక్రయించేందుకు టెలికం రంగ బ్రిటిష్ దిగ్గజం వొడాఫోన్ గ్రూప్ ప్రణాళికలు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇండస్‌లోగల పూర్తి వాటాను వొడాఫోన్ 2.3 బిలియన్ డాలర్లకు(రూ. 19,100 కోట్లు) విక్రయించే యోచనలో ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. వచ్చే వారం బ్లాక్‌డీల్స్ ద్వారా స్టాక్ మార్కెట్లో ఇండస్ వాటాను మొబైల్ దిగ్గజం విక్రయించే వీలున్నట్లు తెలియజేశాయి. ఇండస్‌లో గ్రూప్‌లోని వివిధ సంస్థల ద్వారా వొడాఫోన్ 21.5 శాతం వాటాను కలిగి ఉంది. బీఎస్‌ఈలో ఇండస్ టవర్స్ శుక్రవారం ముగింపు ధర రూ. 341తో చూస్తే వొడాఫోన్ వాటా విలువ రూ. 19,100 కోట్లుగా విశ్లేషకులు మదింపు చేశారు. నిధులను రుణ చెల్లింపులకు వినియోగించనున్నట్లు తెలుస్తోంది. మరోపక్క ఇటీవల నిధుల సమీకరణ బాటలో సాగుతున్న వొడాఫోన్ ఐడియా షేరు 4 శాతం జంప్‌చేసి రూ. 16.7 వద్ద ముగిసింది. గత కొద్ది రోజులుగా వొడాఫోన్ ఐడియా షేరు ర్యాలీ బాటలో సాగుతోంది.



కాగా.. డిమాండు ఆధారంగా వొడాఫోన్ గ్రూప్.. ఇండస్‌లో వాటా విక్రయాన్ని చేపట్టే వీలున్నట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. వాటా విక్రయాన్ని నిర్వహించేందుకు వీలుగా బ్యాంక్ ఆఫ్ అమెరికా, మోర్గాన్ స్టాన్లీ, బీఎన్‌పీ పారిబాస్‌లను వొడాఫోన్ ఎంపిక చేసినట్లు పేర్కొన్నాయి. అయితే వొడాఫోన్ ఇండియా, బ్రిటిష్ మాతృ సంస్థ ప్రతినిధులు ఈ అంశంపై స్పందించకపోవడం గమనార్హం!

2022లోనూ..

నిజానికి 2022లో వొడాఫోన్.. ఇండస్ టవర్స్‌లోగల 28 శాతం వాటాను విక్రయించేందుకు నిర్ణయించినప్పటికీ స్వల్ప వాటాను మాత్రమే అమ్మగలిగింది. వాటా విక్రయానికి ప్రత్యర్థి టెలికం దిగ్గజాలతో చర్చలు చేపట్టినప్పటికీ ఫలించలేదు. ఇండస్‌లో వాటా విక్రయం ద్వారా 42 బిలియన్ డాలర్లకుపైగా గల నికర రుణాల్లో కొంతమేర తిరిగి చెల్లించేందుకు వొడాఫోన్ ప్రణాళికలు వేసింది. ప్రపంచంలోనే టెలికం టవర్ల దిగ్గజాలలో ఒకటిగా నిలుస్తున్న ఇండస్ టవర్స్ దేశీయంగా రెండో పెద్ద మొబైల్ టవర్ల కంపెనీగా నిలుస్తోంది. సుమారు 2,20,000 టవర్లు కలిగిన కంపెనీలో మరో మొబైల్ టెలికం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్‌కు సైతం వాటా ఉంది.

సాక్షి స్పోర్ట్స్



సెమీస్‌లో సుమిత్

పెరూగియా ఓపెన్ ఏటీపీ-125 చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. ఇటలీలో శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 77వ ర్యాంకర్ సుమిత్ 6-4, 7-5తో మాక్స్ కస్నికోస్కీ (పోలాండ్)పై గెలుపొందాడు. గంటా 55 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశాడు.

యూకీ బాంబ్రీ జోడీ ఓటమి

బాస్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో యూకీ బాంబ్రీ (భారత్)-అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీ సెమీఫైనల్లో ఓడిపోయింది. స్టుట్‌గార్ట్‌లో శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో యూకీ-ఒలివెట్టి ద్వయం 5-7, 4-6తో జూలియన్ క్యాష్ (బ్రిటన్)-రాబర్ట్ గాలోవే (అమెరికా) జంట చేతిలో ఓడిపోయింది. 77 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ ద్వయం 12 ఏస్‌లు సంధించింది. తమ సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయింది.



ప్రణయ్ పరాజయం



సిడ్నీ: ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత క్రీడాకారుల కథ ముగిసింది. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో ప్రపంచ 10వ ర్యాంకర్ ప్రణయ్ 19-21, 13-21తో ఆరో ర్యాంకర్ కొడాయ్ నరోకా (జపాన్) చేతిలో... సమీర్ వర్మ 12-21, 13-21తో లిన్ చున్ యి (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయారు. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ఆకర్షి 17-21, 12-21తో పాయ్ యు పో (చైనీస్ తైపీ) చేతిలో పరాజయం పాలైంది. మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సిక్కి రెడ్డి-సుమీత్ రెడ్డి ద్వయం 12-21, 14-21తో జెన్ బాంగ్ జియాంగ్-యా జిన్ వె (చైనా) చేతిలో ఓటమి చవిచూసింది.

భారత మహిళల ఆర్చరీ జట్టుకు నిరాశ

అంటాల్యా (టర్కీ): టాప్-4లో నిలిచి దర్జాగా పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు అర్హత సాధించాలనుకున్న భారత మహిళల ఆర్చరీ జట్టుకు నిరాశ ఎదురైంది. చివరి క్వాలిఫయింగ్ టోర్నీలో దీపిక కుమారి, అంకిత, భజన్ కౌర్‌లతో కూడిన భారత మహిళల రికర్వ్ జట్టు రెండో రౌండ్‌లోనే వెనుదిరిగింది. భారత జట్టు 3-5 (51-51, 55-52, 53-54, 52-54)తో వెరోనికా, అనస్తాసియా, ఒలాలతో కూడిన ఉక్రెయిన్ జట్టు చేతిలో ఓడిపోయింది. ఈ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరిన చైనా, చైనీస్ తైపీ, మలేసియా, బ్రిటన్ జట్లు ఒలింపిక్స్‌కు అర్హత సాధించాయి. క్వాలిఫయింగ్ టోర్నీలో ఓడినప్పటికీ భారత జట్టుకు వరల్డ్ ర్యాంకింగ్ ద్వారా పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందే చివరి అవకాశం మిగిలి ఉంది. ప్రపంచకప్ స్టేజ్-3 టోర్నీ ముగిశాక ఈనెల 24న ప్రపంచ ర్యాంకింగ్స్ విడుదల చేస్తారు. ఇప్పటికే ఒలింపిక్స్‌కు అర్హత పొందని రెండు ఉత్తమ ర్యాంక్ జట్లకు 'పారిస్' బెర్త్‌లు ఖరారవుతాయి. ఇప్పటి వరకు ఫ్రాన్స్, జర్మనీ, కొరియా, మెక్సికో, నెదర్లాండ్స్, అమెరికా, చైనా, చైనీస్ తైపీ, మలేసియా, బ్రిటన్ జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాయి. చివరి రెండు బెర్త్‌లను వరల్డ్ ర్యాంకింగ్ ద్వారా ఖరారు చేస్తారు.



'సూపర్-8' కోసం సాధన!

నేడు కెనడాతో భారత్ చివరి లీగ్ మ్యాచ్

- జోరు మీదున్న టీమిండియా
- మ్యాచ్‌కు భారీ వర్షం ముప్పు
- రాత్రి 8 గంటల నుంచి నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం

అమెరికా గడ్డపై అడుగు పెట్టినప్పటి నుంచి న్యూయార్క్‌లోనే ప్రాక్టీస్ మ్యాచ్, మూడు లీగ్ మ్యాచ్‌లు ఆడిన భారత బృందం ఇప్పుడు అమెరికాలోనే మరో వేదికపై తమ సత్తాను చాటేందుకు సిద్ధమైంది. వరుసగా మూడు విజయాలతో ఇప్పటికే 'సూపర్-8' దశకు చేరిన జట్టు అప్రధాన్య పోరులో మరో పసి కూనను ఎదుర్కోనుంది. ఫామ్‌లో ఉన్న టీమిండియాకు కెనడా పోటీనివ్వడం కష్టమే అయినా తర్వాతి ప్రధాన మ్యాచ్‌లకు ముందు రోహిత్ బృందానికి మరో ప్రాక్టీస్ మ్యాచ్‌లాంటిదే. అయితే వర్షంతో ఆట జరుగుతుందా అనేది సందేహమే.

లాడర్‌హిల్ (ఫ్లోరిడా): అమెరికాలో గత మూడు మ్యాచ్‌లలో పరుగుల కోసం మొఖం వాచిన భారత జట్టుకు కాస్త తెరిపినిచ్చే మైదానం సిద్ధమైంది. గతంలో పరుగుల వరద పారిన బ్రోవార్డ్ కౌంటీ స్టేడియంలో నేడు జరిగే గ్రూప్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌లో కెనడాతో భారత్ తలపడుతుంది. ఆడిన మూడు మ్యాచ్‌లలో విజయాలు సాధించిన భారత తమ స్థాయిని ప్రదర్శించగా... రెండు ఓటములతో కెనడా ఇప్పటికే ముందుకు వెళ్లే అవకాశాలు కోల్పోయింది.

కోహ్లి చెలరేగితే...

భారత జట్టుకు సంబంధించి ఈ మ్యాచ్‌కు ఎలాంటి ప్రాధాన్యత లేకపోయినా... తుది జట్టులో మార్పులు ఉంటాయా అనేది చూడాలి. ఫామ్‌పరంగా చూస్తే ఎవరినీ తప్పించే పరిస్థితి లేదు. కానీ ఒక అవకాశం ఇవ్వాలని భావిస్తే మాత్రం జడేజాకు బదులుగా కుల్దీప్‌ను ప్రయత్నించవచ్చు. జడేజా గత మ్యాచ్‌లో కనీసం ఒక్క ఓవర్ కూడా బౌలింగ్ చేయలేదు. అమెరికాతో పర్వాలేదనిపించిన దూబే స్థానంలో సామ్సన్‌కు మేనేజ్‌మెంట్ అవకాశం కల్పిస్తే సూపర్-8కు ముందు ప్రాక్టీస్ లభిస్తుంది. ప్రస్తుత స్థితిలో యశస్వి, చహల్‌లు పెవిలియన్‌కే పరిమితం కావాల్సి రావచ్చు. అయితే అన్నింటికి మించి కోహ్లి ఫామ్‌లోకి రావాలని అంతా కోరుకుంటున్నారు. మూడు మ్యాచ్‌లలోనూ అతను సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాడు. బౌలింగ్‌లో ముగ్గురు పేసర్లూ ఆకట్టుకున్నారు. రోహిత్, పంత్, సూర్య దూకుడైన బ్యాటింగ్‌ను నిలువరించడం కెనడాకు అంత సులువు కాదు.


కోహ్లి

పిచ్, వాతావరణం

ఫ్లోరిడాలో శనివారం భారీ వర్ష సూచన ఉంది. శుక్రవారం అమెరికా, ఐర్లాండ్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. మ్యాచ్ జరిగితే భారీ స్కోర్లు ఖాయం. భారత్ ఈ వేదికగా 2016 నుంచి వెస్టిండీస్ ప్రత్యర్థిగానే 8 మ్యాచ్‌లు ఆడింది. వీటిలో ఐదింటిలో గెలిచి, రెండింటిలో ఓడింది. ఒక మ్యాచ్ రద్దయింది.

సమష్టిగా రాణించాలని...

పాక్‌తో మ్యాచ్‌లో ఓడినా కెనడా గట్టి పోటీనిచ్చింది. విడిగా చూస్తే ఎవరికీ పెద్దగా పేరు లేకున్నా సమష్టిగా ఆ జట్టు వరల్డ్‌కప్‌లో తమదైన ముద్ర వేసేందుకు ప్రయత్నిస్తోంది. ఓపెనర్ ఆరోన్ జాన్సన్ దూకుడుగా ఆడగల సమర్థుడు. నికోలస్ కీర్టన్, మొవ్వ శ్రేయస్ కూడా ప్రధాన బ్యాటర్లు. వీరిలో ఏ ఇద్దరైనా రాణిస్తే జట్టుకు మంచి స్కోరు అందించగలరు. కెప్టెన్, ఆల్‌రౌండర్ సాద్ బిన్ జఫర్ మరో ప్రధాన ఆటగాడు కాగా... లెఫ్టార్మ్ పేసర్ కలీమ్ ప్రభావం చూపగల బౌలర్. స్ఫూర్తిదాయక ప్రదర్శనతో ఐర్లాండ్‌ను ఓడించగలిగిన కెనడా... టాప్ టీమ్‌ను ఎలా ఎదుర్కోగలదో చూడాలి.




టి20 ప్రపంచకప్‌లో నేడు

దక్షిణాఫ్రికా X నేపాల్
వేదిక: కింగ్స్‌టౌన్: ఉదయం గం. 5 నుంచి
న్యూజిలాండ్ X ఉగాండా
వేదిక: ట్రినిడాడ్: ఉదయం గం. 6 నుంచి
భారత్ X కెనడా
వేదిక: ఫ్లోరిడా: రాత్రి గం. 8 నుంచి
ఇంగ్లండ్ X నమీబియా
వేదిక: నార్త్‌సౌండ్: రాత్రి గం. 10:30 నుంచి
స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

అమెరికా ముందుకు... పాక్ ఇంటికి

- సూపర్-8కు చేరిన ఆతిథ్య జట్టు
- లీగ్ దశలో నిష్క్రమించిన మాజీ విజేత
- వర్షంతో ఐర్లాండ్, అమెరికా మ్యాచ్ రద్దు



లాడర్‌హిల్ (ఫ్లోరిడా): టి20 ప్రపంచ కప్‌లో అత్యంత కీలక ఫలితం! తొలిసారి ప్రపంచ కప్‌లో పాల్గొన్న ఆతిథ్య అమెరికా జట్టు సూపర్-8 దశకు అర్హత సాధించింది. గ్రూప్ 'ఎ'లో శుక్రవారం అమెరికా, ఐర్లాండ్ మధ్య జరగాల్సిన లీగ్ మ్యాచ్ భారీ వర్షం కారణంగా రద్దయింది. దాంతో ఈ గ్రూప్ నుంచి భారత్ (6 పాయింట్లు), అమెరికా (5 పాయింట్లు) ముందంజ వేశాయి. ఆడిన 3 మ్యాచ్‌లలో ఒకటే గెలిచిన 2009 చాంపియన్ పాకిస్తాన్ లీగ్ దశలోనే నిష్క్రమించింది. గత రెండు టి20ల్లో వరల్డ్ కప్‌లలో వరుసగా సెమీఫైనల్, ఫైనల్ వరకు చేరిన పాక్ ఈసారి పేలవ ప్రదర్శనతో కుప్పకూలింది. భారత్‌తో పాటు అమెరికా చేతిలో ఓడిన ఆ జట్టు కెనడాపై మాత్రం గెలవగలిగింది. ఈ గ్రూప్‌లో బలహీన కెనడాపై నెగ్గిన అమెరికా... పాక్‌పై సంచలన విజయం సాధించి తమ అవకాశాలు మెరుగుపర్చుకుంది. తాజా ఫలితంతో ఆదివారం ఐర్లాండ్‌తో తమ చివరి మ్యాచ్ ఆడకుండానే వరల్డ్ కప్‌లో పాక్ ఆట ముగిసింది. లాడర్‌హిల్‌లో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు శుక్రవారం కూడా తెరిపినివ్వలేదు. నిర్ణీత సమయం నుంచి దాదాపు మూడు గంటల సుదీర్ఘ సమయం పాటు వేచి చూసినా ఫలితం లేకపోయింది. వర్షం తగ్గినా మ్యాచ్ కోసం మైదానాన్ని సిద్ధం చేయడం సాధ్యం కాలేదు. పదే పదే తనిఖీల తర్వాత కనీసం 5 ఓవర్ల ఆట అయినా నిర్వహించాలని ఆశించినా... మళ్లీ చినుకులు మొదలయ్యాయి. దాంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆతిథ్య జట్టు హోదాలో బరిలోకి దిగి సూపర్-8కు చేరడం ద్వారా అమెరికా 2026 టి20 వరల్డ్ కప్‌కు కూడా నేరుగా అర్హత సాధించింది.


ఇంగ్లండ్ రేసులోకొచ్చింది!

48 పరుగుల లక్ష్యం 3.1 ఓవర్లలోనే ఛేదన • 8 వికెట్ల తేడాతో ఒమన్‌పై ఘనవిజయం


ఆర్చర్

ఆంటిగ్వా: స్కాట్లాండ్‌తో మ్యాచ్ రద్దవడం, ఆస్ట్రేలియా చేతిలో ఓడటంతో గ్రూప్ 'బి'లో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ ముందుకెళ్లే ఆశలు సన్నగిల్లాయి. అయితే ఒకే ఒక్క విజయం... 3.1 ఓవర్లలో ముగించేయడం... 101 బంతులు మిగల్చడం... ఇంగ్లండ్‌ను ఒక్కసారిగా ఈ టి20 ప్రపంచకప్ రేసులోకి తీసుకొచ్చింది. శుక్రవారం జరిగిన పోరులో బట్లర్ బృందం 8 వికెట్ల తేడాతో ఒమన్‌ను చిత్తు చేసింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఒమన్ 13.2 ఓవర్లలో 47 పరుగులకే కుప్పకూలింది. షోయబ్ ఖాన్ (23 బంతుల్లో 11; 1 ఫోర్) ఇన్నింగ్స్ టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఆదిల్ రషీద్ 11 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టగా... జోఫ్రా ఆర్చర్, మార్క్ వుడ్ 12 పరుగుల చొప్పున ఇచ్చి చెరో 3 వికెట్లు తీశారు. తర్వాత ఇంగ్లండ్ 3.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 50 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ జోస్ బట్లర్ (8 బంతుల్లో 24 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్), సాల్ట్ (3 బంతుల్లో 12; 2 సిక్స్‌లు) దంచేశారు.

అదరగొట్టిన అఫ్గానిస్తాన్... సూపర్-8కు అర్హత


ఫరూఖీ

తరుబా (ట్రినిడాడ్): టి20 ప్రపంచకప్‌లో అఫ్గానిస్తాన్ గ్రూప్ 'సి'లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి 6 పాయింట్లతో 'సూపర్-8' దశకు అర్హత సంపాదించింది. ఈ గ్రూప్ నుంచి వెస్టిండీస్ కూడా సూపర్-8కు చేరడంతో న్యూజిలాండ్ ఇంకా రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే టోర్నీ నుంచి నిష్క్రమించింది. శుక్రవారం ఉదయం జరిగిన మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ 7 వికెట్ల తేడాతో పాపువా న్యూగినీ జట్టుపై గెలిచింది. ముందుగా న్యూగినీ జట్టు 19.5 ఓవర్లలో 95 పరుగులకే ఆలౌటైంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఫజల్‌హక్ ఫరూఖీ (3/16), నవీనుల్ (2/4) రాణించారు. అనంతరం అఫ్గానిస్తాన్ 15.1 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 101 పరుగులు చేసి గెలిచింది. గుల్బదిన్ (36 బంతుల్లో 49 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఆకట్టుకున్నాడు.

పూర్తి అధ్యయనం తర్వాతే బరాజ్‌లు కట్టారా?

- ఈఎన్సీలు, ఇంజనీర్లను ప్రశ్నించిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్
- గ్రావిటీతో నీళ్లొచ్చే తుమ్మిడిహెట్టిని కాదని కాళేశ్వరం వద్ద ఎందుకు కట్టారు?
- ఆ నిర్ణయానికి ప్రామాణికం ఏమిటని ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణ అనుమతులకు సంబంధించిన అంశాలపై నీటిపారుదల శాఖ ఈఎన్సీలు, ఇంజనీర్లపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ప్రశ్నల వర్షం కురిపించింది. "పూర్తి అధ్యయన నివేదికల ఆధారంగానే బరాజ్‌లు నిర్మించారా? రూ.38,500 కోట్లతో పూర్తయ్యే ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును కాదని రీడిజైన్‌తో కాళేశ్వరం ప్రాజెక్టు ఎందుకు చేపట్టాల్సి వచ్చింది? దీని వ్యయం రూ.1.47 లక్షల కోట్లకు పెరగడానికి గల కారణాలేమిటి?" అని ఆరా తీసింది. జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ శనివారం ఈఎన్సీ (జనరల్), ఈఎన్సీ (ప్రాజెక్టులు, నిర్వహణ)తో పాటు ఆ విభాగాల్లోని ఇంజనీర్లను విచారించింది. "బరాజ్‌ల నిర్మాణ అంచనా వ్యయం ఎంత? ఎన్నిసార్లు సవరించారు? పనులు పూర్తికాకున్నా పూర్తయినట్టు సర్టిఫికెట్లు ఏ విధంగా ఇచ్చారు? వాటిపై కౌంటర్ సంతకాలు ఎవరు చేశారు? ఆర్థిక ఉల్లంఘనలేమిటి?" అని ఈఎన్సీలు, ఇంజనీర్లను ప్రశ్నించింది.

కాళేశ్వరం వద్ద కట్టాలన్నది ఎవరు?

ప్రాణహిత–చేవెళ్లలో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ కడితే గ్రావిటీతో వచ్చే నీళ్లను కాదని.. 100 కిలోమీటర్లు కిందికి వెళ్లి కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కట్టాలని చెప్పిందెవరని ఇంజనీర్లను కమిషన్ ప్రశ్నించింది. ఏ నివేదిక ఆధారంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను డిజైన్ చేసి, కట్టారని.. దానికి ఏమైనా ప్రామాణికం ఉందా అని అడిగింది. తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ కట్టి ఉంటే దాదాపు 71 కిలోమీటర్ల దూరంలోని ఎల్లంపల్లి దాకా నీరు గ్రావిటీతో వచ్చి ఎత్తిపోతలకు అయ్యే కరెంట్ బిల్లు ఖర్చు తగ్గేది కదా అని ప్రశ్నించింది. కాగా.. తుమ్మిడిహెట్టి వద్దే బ్యారేజీ కట్టాలని, మేడిగడ్డ బరాజ్‌లతో ప్రయోజనం ఉండదని 2015లో ఐదుగురు మాజీ ఇంజనీర్లు ఇచ్చిన నివేదికపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ దృష్టి పెట్టింది. శనివారం ఆ మాజీ ఇంజనీర్లతో భేటీ కానుంది.

వచ్చే నెల 7లోగా ఎన్డీఎస్‌ఏ పూర్తి నివేదిక!

ఇంజనీర్లు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు ఈ నెల 27వ తేదీలోగా అఫిడవిట్లు దాఖలు చేయాలని గడువు ఇచ్చిన జస్టిస్ చంద్రఘోష్ కమిషన్.. అఫిడవిట్లలో వారిచ్చే సమాచారం ఆధారంగా, తదుపరి ఎవరెవరికీ నోటీసులు ఇవ్వాలనే నిర్ణయం తీసుకోనుంది. మరోవైపు బరాజ్‌ల విషయంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నుంచి పూర్తిస్థాయి నివేదిక తెప్పించుకోవాలని కమిషన్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల వైఫల్యానికి కారణాలపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ) జూలై 7వ తేదీలోగా పూర్తిస్థాయి నివేదిక సమర్పించే అవకాశాలున్నాయని కమిషన్ భావిస్తోంది. ఆ నివేదిక అందాకే తదుపరి చర్యలకు ఉపక్రమించాలని నిర్ణయించింది.

మేడిగడ్డలో మరో గేటు ఎత్తిన ఇంజనీర్లు

మిగిలింది 20వ గేట్ మాత్రమే



మేడిగడ్డ బ్యారేజీ 7వ బ్లాక్‌లోని 21వ రేడియల్ గేటు ఎత్తిన దృశ్యం

కాళేశ్వరం (జయశంకర్‌భూపాలపల్లి): జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ(లక్ష్మీ)బ్యారేజీలో శుక్రవారం 21వ రేడియల్ గేటును ఇంజనీరింగ్ అధికారులు పైకి ఎత్తారు. బ్యారేజీ మరమ్మతుల క్రమంలో ఎన్డీఎస్‌ఏ సూచించిన మేరకు గత నెల నుంచి ఒక్కో గేటును ఇంజనీరింగ్ అధికారులు పైకి ఎత్తుతున్నారు. 7వ బ్లాక్‌లో మొత్తం 11 గేట్లు ఉండగా 12, 13, 14, 15, 16, 17, 18, 19, 21, 22 గేట్లు మొత్తం 10గేట్లు పైకి ఎత్తారు. 7వ బ్లాక్‌లో 20వ గేటు కింద భారీ బొరియ ఏర్పడటంతో ఆ గేటు పైకి ఎత్తడానికి వీలుగా లేకపోవడంతో విడిభాగాలు కటింగ్ చేస్తున్నారు. ఈ ఒక్క గేటు తొలగిస్తే బ్యారేజీలో కుంగిన 7వ బ్లాక్ మొత్తం తెరిచి ఉంచవచ్చని, వర్షాకాలంలో వరదను దిగువకు తరలించవచ్చని ఇంజనీర్లు పేర్కొంటున్నారు. ఈ 20వ గేటు తొలగించడానికి ఇంకా రెండు మూడు రోజుల సమయం పట్టనున్నట్లు తెలిసింది.

'ఐఎంజీ భారత్'పై కాలయాపన వద్దు

- ఇంకా జాప్యం చేయడం సరికాదు
- బిల్లీరావు పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది
- భూ కేటాయింపు రద్దు చేసిన హైకోర్టు నిర్ణయం సబబేనంది
- 'ఐఎంజీ' కేసులో వాదనలు వినిపించిన మాజీ ఏజీ బీఎస్ ప్రసాద్



సాక్షి, హైదరాబాద్: ఐఎంజీ అకాడమీస్ భారత్ ప్రైవేట్ లిమిటెడ్(ఐఎంజీబీపీఎల్)కు అక్రమంగా భూముల కేటాయింపుపై సీబీఐ దర్యాప్తునకు, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సంసిద్ధత వ్యక్తం చేసిందని, ఇదే విషయాన్ని దర్యాప్తు సంస్థ దాఖలు చేసిన కౌంటర్‌లోనూ వెల్లడించిందని మాజీ ఏజీ బీఎస్.ప్రసాద్ పేర్కొన్నారు. అయినా విచారణకు ఆదేశించడానికి తాత్సారం చేయడం సరికాదన్నారు. దేశంలో 2003లో జరిగిన అతిపెద్ద భూ కుంభకోణం ఇదని, దీనిపై సీబీఐ విచారణ కోరుతూ పిటిషనర్లు వ్యాజ్యాలు దాఖలు చేసి 12 ఏళ్లు గడిచిందని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. రూ.వేల కోట్ల విలువైన (నేటి విలువ ప్రకారం దాదాపు రూ.లక్ష కోట్లు) హైదరాబాద్ పరిధిలో రెండుచోట్ల 850 ఎకరాల ప్రభుత్వ భూములను కారుచౌకగా ఓ బోగస్ కంపెనీకి నాటి చంద్రబాబు ప్రభుత్వం కేటాయించిందని, ఆ కంపెనీకి వందల కోట్ల రాయితీలు ఇవ్వడమే కాకుండా హైదరాబాద్‌లోని స్టేడియాలు అప్పగించారని.. దీని వెనుక నాటి రాజకీయపెద్దలు ఉన్నారని, సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరుతూ సీనియర్ పాత్రికేయుడు ఏబీకే ప్రసాద్, న్యాయవాది శ్రీరంగారావు హైకోర్టులో 2012లో ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. నాటి నుంచి ఈ పిటిషన్లపై విచారణ సాగుతూనే ఉంది. ప్రధానన్యాయమూర్తి జస్టిస్ అలోక్‌అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం శుక్రవారం మరోసారి ఈ వ్యాజ్యాలపై విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున బీఎస్.ప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. 'ఐఎంజీ భారత్‌కు భూకేటాయింపు చట్టవిరుద్ధమని, ఆ కేటాయింపును రద్దు చేస్తున్నామని హైకోర్టు తీర్పునిచ్చింది. దీనిని సవాల్ చేస్తూ ఐఎంజీ భారత్ యజమాని బిల్లీరావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే అత్యున్నత న్యాయస్థానం బిల్లీరావు పిటిషన్‌ను కొట్టివేస్తూ, హైకోర్టు నిర్ణయం సబబేనని తేల్చిచెప్పింది. ఇప్పటికైనా భూకేటాయింపు స్కాంను సీబీఐకి అప్పగించడంపై సత్వరం నిర్ణయం తీసుకోవాలి. ఇప్పటికే పన్నెండేళ్లు గడిచిపోయాయి. ఇంకా తాత్సారం చేయడం సరికాదు' అని పేర్కొన్నారు. కాగా, ఈ కేసులో తన వాదనలు కూడా వినాలంటూ నాటి టీడీపీ ప్రభుత్వంలోని క్రీడాశాఖ మంత్రి పోతుగంటి రాములు పిటిషన్ వేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. రాములు వేసిన పిటిషన్‌ను అనుమతించాలా? వద్దా? అన్నదానిపై నిర్ణయం తీసుకుంటామని చెబుతూ, విచారణను జూలై 2కు వాయిదా వేసింది.

అత్తారింటికి దారేది?

- పొరుగింటి వ్యక్తిని ప్రేమపెళ్లి చేసుకున్న యువతి
- వారి ఇంటికి వెళ్లకుండా రోడ్డుపై గోడకట్టిన తల్లిదండ్రులు
- తల్లిదండ్రులపై పోలీసులకు ఫిర్యాదు చేసిన కూతురు
- కరీంనగర్ జిల్లా ఎరడపల్లి గ్రామంలో సంఘటన



సీసీరోడ్డుపై సిమెంటు ఇటుకలతో గోడకట్టిన దృశ్యం

శంకరపట్నం (మానకొండూర్): పొరుగింటి వ్యక్తిని ప్రేమపెళ్లి చేసుకుందని ఆ తల్లిదండ్రులు తమ కూతురుపై కోపం పెంచుకున్నారు. దీంతో పొరుగింటికి దారి లేకుండా సీసీరోడ్డుపై ఇటుకలతో గోడకట్టారు. దీనిపై గ్రామ పెద్దలతో చెప్పించినా వారు వినకపోవడంతో కూతురు తన తల్లిదండ్రులపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయితే వాళ్లుసైతం తన సమస్యను పట్టించుకోవడం లేదని శుక్రవారం మీడియా ఎదుట గోడు వెళ్లబోసుకుంది. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం ఎరడపల్లి గ్రామానికి చెందిన మమత తమ పొరుగింటి వ్యక్తి అయిన కనకం రత్నాకర్‌ను 2023 ఫిబ్రవరి 16న ప్రేమ వివాహం చేసుకుంది. అయితే ఆ పెళ్లి మమత కుటుంబానికి ఇష్టం లేదు. దీంతో మమత, రత్నాకర్ కేశవపట్నంలో అద్దెకుంటున్నారు. అక్కడే జిరాక్స్ సెంటర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. కాగా, రత్నాకర్ తల్లిదండ్రులు మాత్రం ఎరడపల్లిలోనే నివాసం ఉంటున్నారు. మమత తల్లి ఇంటి ఎదుట నుంచే రత్నాకర్ ఇంటికి వెళ్లాల్సి ఉండగా.. రత్నాకర్ కుటుంబం ఆ దారిగుండా నడవకుండా మమత కుటుంబసభ్యులు ఆరు నెలల క్రితం రోడ్డుపై అడ్డంగా సిమెంట్ ఇటుకలతో గోడ కట్టారు. ఇప్పటి నుంచి దొడ్డిదారి గుండా నడుస్తున్నామని, తన అత్తారింటికి వెళ్లేందుకు దారి లేకుండా చేసి, ఇబ్బందులు పెడుతున్న తన తల్లిదండ్రులపై చర్యలు తీసుకోవాలని మమత నాలుగు రోజుల క్రితం కేశవపట్నం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయితే పోలీసులు ఈ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, తమకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా మమత కోరింది.

జైలు నుంచి విడుదలైన నటి హేమ



జనశంకరి: బెంగళూరులో రేవ్ పార్టీ కేసులో అరెస్టయిన తెలుగు సినీనటి హేమ శుక్రవారం జైలు నుంచి విడుదలయ్యారు. పార్టీలో డ్రగ్స్ తీసుకున్నారనే ఆరోపణలపై ఈనెల 3న ఆమెను పోలీసులు అరెస్ట్ చేసి, రక్తనమూనాలు సేకరించి పరప్పన అగ్రహార జైలుకు తరలించిన విషయం తెలిసిందే. స్థానిక కోర్టు రెండు రోజుల కిందట ఆమెకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. దీంతో శుక్రవారం జైలు నుంచి హేమ విడుదలయ్యారు.

ఫ్లయింగ్ కేడెట్ల పాసింగ్ ఔట్ పరేడ్‌కు వాయుసేన చీఫ్ రాక

సాక్షి, హైదరాబాద్: భారత వాయుసేనకు చెందిన ఫ్లయింగ్ కేడెట్ల పాసింగ్ ఔట్ పరేడ్ కార్యక్రమానికి వాయుసేన చీఫ్, ఎయిర్ చీఫ్ మార్షల్ వీఆర్ చౌదరి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. శనివారం ఉదయం దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో జరగనున్న ఈ కార్యక్రమంలో ఎయిర్ చీఫ్ మార్షల్ చౌదరి పరేడ్ రివ్యూయింగ్ ఆఫీసర్‌గా కేడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించనున్నారు. అలాగే శిక్షణలో ఉత్తమ ప్రతిభ చూపిన కేడెట్లకు ట్రోఫీలు అందజేస్తారు.

ఆరుగురు అసిస్టెంట్ సెక్రటరీలకు పదోన్నతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వంలో అసిస్టెంట్ సెక్రటరీ (ఎస్ఓ. లైన్) హోదాలో పనిచేస్తున్న ఆరుగురు అధికారులకు పదోన్నతి లభించింది. వారికి డిప్యూటీ సెక్రటరీగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన అధికారులకు శాఖలు కూడా కేటాయించారు. పదిహేను రోజుల్లో వారు నిర్దేశించిన శాఖల్లో రిపోర్టు చేయాలని సీఎస్ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.